S & D

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

Happy new year 2018

నూతన సంవత్సర శుభాకాంక్షలు

సోమవారం | 1-1-2018 | పేజీలు: 22 + 16 | వెల: రూ.5.00 | సంపుటి: 14 సంచిక: 172 | శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి ఉ. 11.45 వరకు తదుపరి పౌర్ణమి; నక్షత్రం: మృగశిర మ. 2.53 వరకు తదుపరి ఆరుద్ర; వర్జ్యం: రా. 10.12-11.36; దుర్మహూర్తం: మ. 12.41-1.25, మ. 2.53-3.37; అమృతఘడియలు: ఉ. 7.12-8.36; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 5.49 | నిజామాబాద్ సిటీ*


Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai


కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ ఆస్ట్రేలియాలోని సిడ్నీ ఒపెరా హౌస్, హార్బర్ బ్రిడ్జి వద్ద ఆదివారం బాణసంచా వెలుగులు

2018


రీ యూజబుల్ రాకెట్లతో అంత రిక్షయానం. మళ్లీ వాడదగిన రాకెట్ల తయారీలో ఇలాన్ మస్క్‌కి చెందిన స్పేస్-ఎక్స్ కంపెనీ దూసుకెళ్తోంది

2024


ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మానవాళికి ముప్పుగా మారుతుంది. మనిషికి మర మనిషి సవాల్ విసురుతుంది.

2025

మరికొన్ని సంవత్సరాల్లోనే మనిషి మార్స్‌పై అడుగుపెడతాడు. భూమి నుంచి 2024లో మొదలయ్యే 33.9 మిలియన్ మైళ్ల ప్రయాణం 2025లో పూర్తై..మార్స్ మీద మనుమ్మాస్ అంటాడు



2027

మార్స్ మీద మిలియన్ జనాభా!


మనిషికి మరమనుషుల సవాల్.. ముప్పుగా కృత్రిమ మేధ.. స్టీరింగ్ వీల్స్ కనుమరుగు.. ఇలాన్ మస్క్ భవిష్యవాణి

2017 అయిపోయింది! 2018 వచ్చేసింది!! ఏడాదులు ఇట్టే గడిచిపోతయ్. కానీ.. గడిచిన కాలంలో అభివృద్ధి చెందిన టెక్నాలజీలు మన ప్రగతికి అద్దం పడతాయి. ఉదాహరణకు.. గత పదేళ్లలో సాధించిన ప్రగతినే తీసుకుంటే డబ్బా ఫోన్ దగ్గర్నుంచి స్మార్ట్ ఫోన్‌కి ఎదిగాం! ఒంటి చుట్టూ వైఫై చుట్టుకుని తిరుగుతున్నాం. టెక్నాలజీ రంగంలో విప్లవాత్మకమైన మార్పులను చూశాం. మరి మన భవిష్యత్తు ఎలా ఉండబోతోంది? మానవ జీవితాల్లో ఇంకెన్ని మార్పులు సంభవిస్తాయి? మనిషి ఫ్యూచర్ అంతా స్పేస్‌లోనే ఉందంటున్నాడు టెక్నాలజీ గురూ ఇలాన్ మస్క్! టెస్లా, స్పేస్-ఎక్స్, సోలార్ సిటీ వంటి భవిష్యత్ అవసరాలను తీర్చే కంపెనీలను స్థాపించిన ఈ టెకీ దిగ్గజం..2040 నాటికి మార్స్‌పై మానవ కాలనీలు తథ్యమంటున్నాడు. కారు స్టీరింగ్ దగ్గర్నుంచి సోలార్ పవర్ వరకూ.. ఇలాన్ మస్క్ చెప్పే భవిష్యత్‌ను చూడాలంటే.. టైమ్ మెషీన్ ఎక్కాల్సిందే!

అమెరికాలో మరో పదేళ్లలో సగానికి సగం ఎలక్ట్రిక్ స్వయం చోదక వాహనాలే రోడ్లమీద నడుస్తాయి. ఇప్పటికే సెల్ఫ్ డ్రైవింగ్ కార్ కల నిజమైంది. చట్టపరమైన అనుమతులు లభిస్తే.. అనేక దేశాల్లో సెల్ఫ్ డ్రైవింగ్ కార్ల జోరు మరింత పెరుగుతుంది.




2033



ప్రపంచానికి సౌరశక్తే ఆధారం అవుతుంది. సహజ వాయువుతోసహా ఇప్పుడు అందుబాటులో ఉన్న మార్గాలు మూసుకుపోతాయి. దీన్ని ఊహించిన ఇలాన్ మస్క్, 2013లోనే 'సోలార్ సిటీ' కంపెనీ ప్రారంభించారు.

2037

అటానమస్ వాహనాలు పెరిగే కొద్దీ..భవిష్యత్తులో స్టీరింగ్ వీల్ కనుమరుగవుతుంది.


అరుణ గ్రహంపై జనాభా పెరిగిపోతుంది. 2060నాటికి పదిలక్షల మంది మార్స్ మీద స్థిర నివాసం ఏర్పరుచుకుంటారు.

అంగారకునిపై కాలనీలు ఏర్పడతాయి. అప్పటికల్లా తన స్పేస్-ఎక్స్ కంపెనీ.. మార్స్ మీద వేలాదిమందితో నగరాన్ని నిర్మిస్తుందని మస్క్ ప్రకటించాడు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అన్ని రంగాల్లో మనిషిని మించిపోతుంది. భూమిని రోబోలు శాసిస్తాయి. మనుషుల్ని బొమ్మల్లా ఆడిస్తాయి.

2040

2060

2018.. మోదీకి పరీక్షా కాలం

» పలు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు


(న్యూఢిల్లీ-ఆంధ్రజ్యోతి)



గుజరాత్ ఎన్నికల్లో అతికష్టమ్మీద విజయం సాధించిన బీజేపీకి.. ఈ ఏడాది జరగనున్న పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో విజయం కత్తి మీద సామేనని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. 2018 ఫిబ్రవరిలో త్రిపుర, ఏప్రిల్‌లో కర్ణాటక, డిసెంబరులో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈశాన్యంలోని అసోం, మణిపూర్, నాగాలాండ్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో బీజేపీ ధ్వజం ఇప్పటికే రెపరెపలాడుతున్నప్పటికీ.. త్రిపురలో మాణిక్ సర్కార్ నేతృత్వంలోని వామపక్ష ఫ్రంట్‌ను ఢీకొనడం బీజేపీకి అంత సులభం కాదు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, హిమాచల్‌లో మాదిరి అక్కడ కూడా కాంగ్రెస్‌ను గద్దె దించి తమ ఖాతాలో మరో రాష్ట్రాన్ని వేసుకోవడం సులభమమని బీజేపీ నేతలు భావిస్తున్నారు. కానీ, జీఎస్టీ వ్యతిరేకత నేపథ్యంలో అదంత సులభం కాదని పరిశీలకులు అంటున్నారు. అటు మధ్యప్రదేశ్‌లో బీజేపీ దాదాపు 15 ఏళ్ల నుంచీ అధికారంలో ఉన్నందువల్ల ప్రజా వ్యతిరేకత ఎదుర్కొనే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ.. రైతులకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, పంటలు సరిగా పండకపోవడం వంటివి వ్యతిరేకంగా పరిణమించే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ నేతలు ఒకే దారిలో నడిచి ఒకే నాయకుడిని ముందుకు నెడితే బీజేపీకి గట్టిపోటీ ఇచ్చే అవకాశముంది. ఇక.. రాజస్థాన్‌లో సీఎం వసుంధరా రాజె తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అక్కడ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌ను కాదని.. బీసీ నేత, యువకుడు సచిన్ పైలట్ ను రాహుల్ ప్రోత్సహిస్తున్నారు. గెహ్లాట్‌తో పాటు మరో నేత సీపీ జోషిని కూడా రాహుల్ తప్పించగలిగితే సచిన్ పైలట్ కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకురాగలరని పరిశీలకులు భావిస్తున్నారు. ఇటు ఛత్తీస్‌గఢ్‌లో సీఎం రమణ్‌సింగ్ కూడా గుజరాత్‌లో మోదీ లాగానే దాదాపు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఈసారి మాత్రం కాంగ్రెస్ అక్కడ బీజేపీకి గట్టి పోటీ ఇస్తుందని అంచనా.

ఈ ఏడాది.. మోదీ ప్రజాకర్షక బడ్జెట్?

వచ్చే ఏడాది ఎన్నికలు. అంటే మోదీ సర్కారు చివరిగా ప్రవేశపెట్టే పూర్తిస్థాయి బడ్జెట్ ఈ ఏడాదిదే!! అందుకే మోదీ సర్కారు ఈసారి ప్రజాకర్షక బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉందని.. వ్యవసాయ, గ్రామీణాభివృద్ధికి పెద్ద పీట వేస్తారని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. 2018లో పలు రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ రంగాలపైనే ప్రధానంగా దృష్టిసారించి.. వాటి కేటాయింపులు 20 శాతం మేర పెంచే అవకాశం ఉందని ఆర్థిక శాఖ వర్గాల సమాచారం. అలాగే.. రవాణా, రైల్వే రంగాలకు సైతం కేటాయింపులు 25 శాతం దాకా పెంచుతారని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.



'సోషల్' విషం

2018లో మరింత ప్రభావం!

'సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తోంది సోషల్ మీడియానే..' అని అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇటీవలే అన్నారు! అందునా నాయకత్వ స్థానాల్లో ఉన్నవారు సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించాలని.. లేదంటే విపరిణామాలు ఎదురవుతాయని ఆయన హెచ్చరించిన సంగతీ తెలిసిందే. ట్రంప్ వాచాలతను, విద్వేష ప్రచారాన్ని ఆయన అలా పరోక్షంగా చెప్పారుగానీ.. ఇది ఒక్క అమెరికా పరిస్థితే కాదు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం పరిస్థితి అలాగే ఉంది. వైయక్తిక భావాలకు వేదికగా ఉండాల్సిన సోషల్ మీడియా విషప్రచారాలకు, విద్వేషాలకు, ఆవేశకావేషాలకు వేదికగా మారుతున్న పరిస్థితి. 2018లో ఈ ధోరణి మరింతగా పెరుగుతుందని.. సోషల్ మీడియా వల్ల ప్రపంచవ్యాప్తంగా పలుదేశాల్లో అశాంతి చెలరేగుతుందని విశ్లేషకుల అంచనా. ఛాందసవాద శక్తులు భావోద్వేగాలను రగిలించడం ద్వారా ఈ అశాంతికి కారణమవుతాయని వారు విశ్లేషిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వాలు సైతం జాతీయవాదం పేరుతో భావోద్వేగాలను పెంచుతాయని.. మీడియా, అధికార యంత్రాంగం సైతం ఆ మాయలో పడతాయని హెచ్చరిస్తున్నారు. ఫిలిప్పైన్స్‌లో డ్యుటెరెట్.. అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ తదితరులను ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు. రష్యా, హంగరీ, పోలండ్.. ఇలా అన్ని దేశాల్లోనూ సోషల్ మీడియా దుష్ప్రభావం పెరుగుతోంది. విశ్లేషకులు అంచనా వేస్తున్నట్టు ఈ ట్రెండ్ 2018లో మరింత ముదిరితే కష్టమే!!

కాలనాళిక తెరుస్తారు!

'హీలియం టైమ్ కాలమ్స్ మాన్యుమెంట్'.. టెక్సాస్ (అమెరికా)లోని అమరిల్లోలో ఉన్న నాలుగు స్తంభాల కాలనాళిక ఇది. హీలియం కనిపెట్టి వందేళ్లు అయిన సందర్భంగా 1968లో దీన్ని ఏర్పాటు చేశారు. ఆ రోజుల్లో జీవితం ఎలా ఉండేదో ఈ నాలుగు స్తంభాల్లోనూ పుస్తకాలు, కళాఖండాలు, పత్రాల రూపంలో పొందుపరచారు. ఈ నాలుగుస్తంభాలనూ వరుసగా 25 ఏళ్ల తర్వాత (అంటే 1993లో), 50, 100, 1000 ఏళ్ల తర్వాత తెరిచి చూడాలని అప్పట్లోనే నిర్ణయించారు. ఈ మేరకు 1993లో తొలి స్తంభాన్ని తెరిచి చూశారు. 50వ సంవత్సరమంటే 2018. కాబట్టి ఈ ఏడాది రెండో స్తంభాన్ని తెరిచి చూస్తారన్నమాట. గతాన్ని తరచి చూడడమంటే.. భవిష్యత్తులో మనం ఎంత దూరం ప్రయాణించామో, ఎన్ని ఘనతలు సాధించామో తెలుసుకోవడమే కదా!!



మొదటి ప్రపంచ యుద్ధం ముగిసి వందేళ్లు!


1914 జూలై 28న ప్రారంభమైన మొదటి ప్రపంచ యుద్ధం నాలుగేళ్ల మూడు నెలల రెండు వారాల పాటు సాగి 1918 నవంబరు 11న ముగిసింది. అంటే.. ఈ ఏడాది నవంబరు 11నాటికి.. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసి వందేళ్లు. దాన్ని ఇప్పుడు మనం 'వరల్డ్ వార్ వన్' అంటున్నాంగానీ.. అప్పట్లో అలా అనేవాళ్లు కాదు. సింపుల్‌గా వరల్డ్ వార్ అని.. గ్రేట్ వార్ అని.. పిలిచేవారు. 'ద వార్ టు ఎండ్ వార్', 'ద వార్ టు ఎండ్ ఆల్ వార్స్' అని కూడా వ్యవహరించేవారు.



మాట్లాడే సెక్స్ రోబో.. మార్కెట్లోకి

ఇన్నాళ్లూ పాశ్చాత్య దేశాలకే పరిమితమైన సెక్స్ రోబోలు 2018లో విశ్వవ్యాప్తం కానున్నాయి. దీనికి కారణం.. వాటికి కృత్రిమ మేధ జోడించడమే. కాలిఫోర్నియాకు చెందిన మాట్ మాక్‌ముల్లెన్ గత రెండు దశాబ్దాలుగా 'సిలికాన్ సెక్స్ డాల్స్' తయారుచేస్తున్నాడు. అయితే ఇన్నాళ్లూ అతడు రూపొందించి, విక్రయించిన అందాల ఆడబొమ్మలు కేవలం బొమ్మల్లా ఎలాంటి స్పందనా లేకుండా ఉండేవి. అయితే, 2017లో తొలిసారి అతడు వాటికి కృత్రిమ మేధను జోడించి మాట్లాడే బొమ్మలుగా మార్చాడు. వీటిలో ఉండే మెమొరీ చిప్.. తమను కొన్నవారి ఇష్టాఇష్టాలను గుర్తుపెట్టుకుంటుంది. శృంగార సమయంలో వారి ఇష్టాఇష్టాలకు అనుగుణంగా స్కాటిష్ యాసలో రొమాంటిగ్గా మాట్లాడే ఈ బొమ్మ గురించి మీడియాలో రాగానే ప్రపంచం నలుమూలల నుంచి చాలా మంది దాని గురించి ఆరా తీయడం మొదలుపెట్టారు. జనవరిలో దీని విక్రయాలు మొదలుపెట్టనున్నారు. దీని వెల మన రూపాయల్లో కాస్త ఎక్కువే.. అక్షరాలా రూ.6.5 లక్షలు. ఈ రకంగా సెక్స్ డాల్స్‌ను రూపొందిస్తున్న మాక్‌ముల్లెన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయిగానీ.. వీటి వల్ల అత్యాచారాలు తగ్గుతాయనే వాదనా ఉంది..





పగిలిపోతే.. అతుకుపడతయ్!



'గాయమైతే మాసిపోదు.. పగిలిపోతే అతుకుపడదు..' అని సినీ కవి 'మనసు' గురించి రాశారుగానీ పగిలిపోతే అతుకుపడకపోవడమనేది అద్దాలకూ వర్తిస్తుంది. ఖరీదైన ఫోను ఒకానొక బలహీన క్షణాన చేతిలోంచి జారిపడితే.. గుండె ఝల్లుమంటుంది. భయంభయంగా కిందికి చూసి.. స్క్రీన్ పగలకపోతే హమ్మయ్య అని నిట్టూరుస్తాం. పగిలిందా.. వేల రూపాయల ఖర్చు. అయితే, ఆ బాధకు చెక్‌పెట్టేలా.. పగిలిపోతే తనంతతాను అతుకుపడే గాజును జపాన్ పరిశోధకుడొకరు తయారుచేశారు. ఆయన పనిగట్టుకుని దాన్ని తయారుచేయలేదు. తడిప్రదేశాల్లో కూడా గట్టిగా అతుక్కునే లక్షణం కలిగిన జిగురుపై పరిశోధన చేస్తుండగా ఇది యాదృచ్ఛికంగా ఆవిష్కృతమైంది. ఆ జపాన్ పరిశోధకుడి పేరు యు యనగిసావా. యూనివర్సిటీ ఆఫ్ టోక్యోలో రసాయన శాస్త్ర పరిశోధకుడు. ఆయన ఆవిష్కరణ... సెల్‌ఫోన్ స్క్రీన్లకే కాదు గాజును ఉపయోగించే రకరకాల రంగాల్లో ఎంతగానో ఉపయోగపడనుంది.

టైటానిక్ ట్రిప్పుకు సిద్ధం కండి

మీకు 'టైటానిక్' ఇష్టమా? పిచ్చా? పిచ్చెక్కేంత ఇష్టమా? అయితే మీ కోసం ఈ ఏడాది మే నెల నుంచి టైటానిక్ డైవింగ్ ట్రిప్ అందుబాటులోకి రానుంది. అనగా.. సముద్ర గర్భంలో ఉన్న శిథిల టైటానిక్‌లోకి మిమ్మల్ని తీసుకెళ్తారన్నమాట. కాకపోతే ఖర్చు మాత్రం భారీగానే అవుతుంది. ఎంతంటారా.. అక్షరాలా లక్ష డాలర్లు. మన రూపాయిల్లోకి ఫిరాయిస్తే.. దాదాపు రూ.65 లక్షలు. 'హమ్మో.. అంతా?' అనుకుంటున్నారా? అయితే ఈ ట్రిప్పు నిర్వాహకుల మాట కూడా వినాలి. అదేమంత పెద్ద మొత్తం కాదని.. 1912లో టైటానిక్‌లో ఫస్ట్ క్లాస్‌లో ప్రయాణించేందుకు నాటి ప్రయాణికులు చెల్లించిన సొమ్మును ద్రవ్యోల్బణానికి అనుగుణంగా సవరిస్తే ఇంత అయిందని వారు చెబుతున్నారు.



వీల్స్ కాదు.. ట్వీల్స్

చెక్క చక్రాల నుంచి ట్యూబ్‌లెస్ టైర్ల దాకా వచ్చాం. నెక్స్ట్ ఏంటి? అనే ప్రశ్నకు సమాధానంగా ఫ్రెంచ్ కంపెనీ మిచెలీన్ ఓ సరికొత్త చక్రాల పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. అదే.. ట్వీల్స్. టైర్‌ని వీల్‌ని కలిపి.. ట్వీల్ అని పెట్టారన్నమాట. వీటిలో గాలి నింపాల్సిన అవసరం ఉండదు. కాబట్టి పంక్చరవుతుందనే భయమే ఉండదు. 2018లో ఇవి విస్తృతంగా అందుబాటులోకి వస్తాయని అంచనా.



2018 మహిళలదే!

2017లో మహిళా లోకం కల్లోల పరిస్థితులను ఎదుర్కొంది. అదే సమయంలో ధైర్యంగా వీధుల్లోకి వచ్చి గళమెత్తింది. సామాజిక కార్యకర్త తరానా బుర్కే మొదలుపెట్టిన 'మీ టూ' ఉద్యమం యావత్ మహిళా లోకాన్ని కదిలించింది. సమాజంలోని అన్ని రంగాల్లో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపుల సమస్య తీవ్రతను ప్రపంచానికి చాటింది. లైంగిక హింసకు వ్యతిరేకంగా పోరాడేలా మహిళలను ఏకం చేసింది. ఇది మనదేశంలోని సెలబ్రిటీలనూ కదిలించి వారికి ఎదురైన చేదు అనుభవాలను ప్రపంచానికి తెలిసేలా చేసింది. కొత్త ఏడాదిలో 'మీ టూ' ఉద్యమం మరింత ఊపందుకోబోతోంది. అందుకే టైమ్ మేగజైన్ ఈసారి పర్సన్ ఆఫ్ ద ఇయర్‌గా 'ద సైలెన్స్ బ్రేకర్స్' పేరిట.. తాము ఎదుర్కొన్న లైంగిక వేధింపుల గురించి ధైర్యంగా ప్రపంచానికి చెప్పిన మహిళలను ఎన్నుకొంది. అయితే, మహిళా శక్తిని చాటిన 2017 వట్టి ట్రైలర్ మాత్రమేనని.. 2018లో మహిళా లోకం అనేక విజయాలను అందుకోబోతోందని, ఈ ఏడాది మహిళా సంవత్సరం అవుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

సోమవారం | 1-1-2018 | పేజీలు: 22 + 16 | వెల: రూ. 5.00 | సంపుటి: 14 సంచిక: 172 | Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai | నిజామాబాద్ సిటీ*

కెల్విన్ విడుదల

డ్రగ్స్ కేసులో బెయిల్ మంజూరు 16

నిజాలు బయటకొస్తాయి: కెల్విన్

కొత్త వెలుగు!

వ్యవసాయానికి నిరంతర విద్యుత్తు

అర్ధరాత్రి 12.01 గంటలకు శ్రీకారం

పోతాయిపల్లిలో ప్రారంభం

మోటార్ ఆన్ చేసిన సీఎండీలు ప్రభాకర్ రావు, రఘుమారెడ్డి

నిరంతర కరెంటు ఇస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ చరిత్ర

గృహ, వాణిజ్య, పరిశ్రమలు, సాగు అన్నింటికీ నిరంతరమే

11 వేల మెగావాట్లకు సిద్ధం: సీఎండీ



హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కరెంటు లేక పంటలు ఇక ఎండవు! ఎండిన పంటలను తగులబెట్టుకునే దుస్థితి ఇక ఉండదు! కరెంటు వచ్చిందని అర్ధరాత్రి పొలానికి పరుగులు తీయాల్సిన పని లేదు! అర్ధరాత్రి పొలంలోనే విద్యుత్తు షాకులు, పాముకాట్లతో రైతులు మరణించే పరిస్థితులు ఇక ఉండవు! మొత్తంగా, కరెంటు కోసం అన్నదాతలకు ఎదురు చూపులు ఇక ఉండవు! తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రంగంలో కొత్త వెలుగు ప్రారంభమైంది. ఇళ్లు, పరిశ్రమలకు ఇప్పటికే 24 గంటల విద్యుత్తును అందిస్తున్న

మిగతా 8వ పేజీలో...

దళపతి సై!

రాజకీయాల్లోకి వస్తున్నా

రజనీకాంత్ స్పష్టమైన ప్రకటన

అసెంబ్లీ ఎన్నికల ముందే పార్టీ

తమిళనాడు వ్యాప్తంగా పోటీ

ఏం చేస్తామో ప్రజలకు చెబుతాం

చేయలేకపోతే దిగిపోతాం 14

తేల్చిచెప్పిన తమిళ సూపర్ స్టార్

మాకేం నష్టం లేదు: సీఎం, స్టాలిన్



అర్ధరాత్రి... ఉగ్రదాడి

కశ్మీరులో సీఆర్‌పీఎఫ్ శిబిరంపై కాల్పులు 14

ఐదుగురు జవాన్లు మృతి.. ఇద్దరు ఉగ్రవాదులు హతం

ప్రజలు మెచ్చేలా పోలీసింగ్

8 సిబ్బంది పనితీరు మెరుగుపరిచేందుకు చర్యలు.. సేవలపై థర్డ్ పార్టీ ఆడిట్: డీజీపీ

S & D



నిద్రలో...

1

నిద్రలో ఎక్కడుంటావు నువ్వు

మెలకువలో నీ దేహాన్ని మోసీ మోసీ అలసిపోయాక
దానిని ఎక్కడకు విసిరేసి, ఎటు వెళ్ళిపోతావు

సృష్టికి పూర్వం ఉన్న ఏ శీతల నిశ్శబ్ద ప్రశాంతతలోకి
నిదురించేవేళల రహస్యంగా ప్రవేశిస్తావు

గాయపరిచే ప్రపంచాన్ని చెరిపేసి,
భౌతిక వ్యాకరణానికి లొంగని రంగుల లోకాలని
నీ నిశ్శబ్దసీమలో ఎగురవేస్తూ ఆడుకొంటావు

2

మెలకువ ఉత్త ఉలికిపాటు

చిరంతన శాంతిలో రేగే కలకలం వంటివి దృశ్యాలు, శబ్దాలు
రేగిన అలలన్నీ అలసిపోయి, విశ్రమించేవేళ
ఏ దయాపూర్ణ శూన్యం పొగమంచులా సమస్తాన్నీ కప్పుతుంది

3

మృత్యువు లాంటి గాఢనిద్రకీ,
సుషుప్తి లాంటి మృత్యువుకీ జీవులపై ఎంత దయ

ఊహలాంటి జీవితానుభవంలోంచి విస్మృతిలోకి తీసుకెళ్ళి
విరిగిన నవ్వుల్నీ, కన్నీళ్ళనీ శూన్యంలో ఒంపుతుంది

శీతలరాత్రి తోసుకువచ్చే చీకటి అలలాంటి నిద్రలోకి
వాళ్ళని అమాంతం విసిరేసి లాలనగా నవ్వుతుంది

4

చాలు అన్న పదం చివర ఏముందో ఎప్పుడన్నా చూసావా

చూరునుండి చివరిబిందువు జారిపోయాక
గాలిరాని ఒకటి ఇక ఇక్కడేమీ లేదని చెప్పి వెళ్ళాక
వెక్కి వెక్కి ఏడ్చి, కాలపుతంపై గాఢమైన నిట్టూర్పు
సంతకం చేసాక

నీడైన ఏకాంతం కమ్ముకు... అడవిలోని... ...వెలుగు

చాలు అన్న పదం చివర
పూవులో ఒదిగిన తేనెటీగ లాంటి శాంతి మెరుస్తూ కనిపిస్తుంది

నిద్రలో నీ జీవితం ఎటుపోయిందో
ఈ చివరికి చేరినపుడు, బహుశా, తటాలున తెలుస్తుంది

5

అంతే, ఇక చాలు కదా...

■ బివివి ప్రసాద్
90320 75415

సోమవారం 1 జనవరి 2018
వివిధ
సాహిత్య వేదిక
vividha@andhrajyothy.com

నవలకు పూర్వవైభవం సాధ్యమా?

రెండు శతాబ్దాల పైబడి సాహిత్యాన్ని పరిపాలించిన నవల ప్రక్రియకు ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఏమీ తగ్గలేదు. కానీ తెలుగునాట మాత్రం గత రెండు దశాబ్దాలుగా దాని ప్రాభవం బాగా తగ్గిందనే చెప్పాలి. "తెలుగు నవలా సాహిత్యానికి పునర్వైభవం తీసుకురావాలన్న ఆకాంక్షతో" తానా 1997లో లక్షరూపాయల బహుమతితో నవలా పోటీ ప్రారంభించింది. మధ్యమధ్య విరామంతో ఐదేళ్ళు జరిగిన ఈ పోటీ 2005లో ఆగిపోయింది. మరలా పదేళ్ళ తర్వాత 2017లో రెండు లక్షల రూపాయల బహుమతితో మొదలైంది. ఈసారి పోటీలో మూడు నవలలు బహుమానాన్ని దక్కించుకున్నాయి. ఈ సందర్భంగా 'తానా' నవలల పోటీ న్యాయ నిర్ణేతలు, తానా ప్రచురణల కమిటీ అధ్యక్షుడు, పోటీలో గెలుపొందిన ముగ్గురు రచయితల అభిప్రాయ కదంబం - వివిధ



'తానా నవలల పోటీ- 2017' న్యాయనిర్ణేతలు ఆడెపు లక్ష్మీపతి, సి. మృణాళిని ఈ ప్రశ్నలకు జవాబిచ్చారు:
1) నవలల ఎంపికలో మీ కొలమానాలు ఏమిటి?
2) పోటీకి వచ్చిన నవలల్లో మీరు కామన్‌గా గమనించిన గుణదోషాలు ఏమైనా ఉన్నాయా?

"వస్తువు తాజాదే అయినా దాన్ని మంచి నవలగా మలచడంలో చాలామంది సఫలీకృతులు కాలేకపోయారు."

ఆధునిక యుగంలో మానవుని అనుభవాన్ని, జీవన సంక్లిష్టతను, సందిగ్ధతను విపులంగా చిత్రించేందుకు నవల అనువైన సాహితీ ప్రక్రియ అనేది అందరూ అంగీకరించిన సత్యం. తెలుగులో మొట్టమొదటి నవల 'రాజశేఖర చరిత్రము' (1878) అనుకున్నా, 'రంగరాజ చరిత్రము' (1872) అనుకున్నా గత 140 ఏళ్ళల్లో తెలుగువారి జీవితాన్ని సమగ్రంగా చిత్రించిన నవలలు తక్కువే. ఆధునిక జీవితంలోని సంక్లిష్టతను, వర్తమానంలోని human predicamentsని వినూత్న కోణంలో ఆవిష్కరించిన నవలలు ఇంకా తక్కువ. మనం ఇంకా రియలిజం పరిధులు దాటలేదు. పోస్ట్-మోడర్నిస్టు యుగంలో నవల పొటెన్షియల్‌ని ఉపయోగించుకోలేక పోయాం. సర్రియలిజం, మ్యాజిక్ రియలిజం, యాంటి నావెల్, నాన్ ఫిక్షనల్ నావెల్, డాక్యుమెంటరీ ఫిక్షన్... వంటి కొత్త కథన ధోరణుల వైపు దృష్టిపెట్టలేదు.



తెలుగు పత్రికలు చాలా వరకు వ్యాపార నవలలనే ప్రోత్సహిస్తున్నాయి. ఇంగ్లిషులోలాగ మనకు మంచి సాహిత్యాన్ని వెలువరించే ప్రచురణ సంస్థలు లేవు. రచయితలు సొంత ఖర్చుతోనే నవలలు అచ్చువేయించుకోవాలి. అవి అమ్ముకునేందుకు కష్టపడాలి. ఈ నేపథ్యంలో తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) వారు తెలుగు వారి జీవితాన్ని సర్వదిగ్దర్శకంగా చిత్రించే ఉత్తమ నవల రాయించాలన్న ఉద్దేశ్యంతో గతంలోలాగ ఈ యేడు 'తానా' నవలల పోటీ-2017 నిర్వహించారు. మొత్తం 55 నవలలు రాగా వాటిని వడబోసి 16 నవలల షార్ట్ లిస్టుని (ప్రతుల మీద రచయితల పేర్లు లేకుండా) న్యాయ నిర్ణేతలకు అందించారు. ప్రొఫెసర్ మృణాళిని, నేనూ వాటిని శ్రద్ధగా పరిశీలించాం.

ఒక్కో రచయిత తన నవలకు వస్తువుగా ఒక్కొక్క సామాజిక సమస్య లేదా వర్తమాన జీవిత సంక్షోభాన్ని ఎంచుకొన్నారు. ఈ వైవిధ్యాన్ని బట్టి నేటి రచయిత, సంధికాలంలో మనిషి ఎదుర్కొంటున్న సంకట స్థితినీ, పరిణామ క్రమంలో సమాజంపై పడుతోన్న మంచి చెడులని, వాటి పట్ల మనిషి స్పందిస్తున్న తీరునీ ఎంత నిశితంగా, బాధ్యతాయుతంగా గమనిస్తున్నాడో మనకు అర్థమవుతుంది. క్వారీలు, ప్రాజెక్టుల నిర్మాణాల వల్ల జరిగే ప్రకృతి వనరుల విధ్వంసం; కార్ఖానాల మూసివేతవల్ల కార్మికులకు కలిగే నష్టాలు; భూమి యాజమాన్య హక్కుకు సంబంధించిన చట్టాల్లోని అస్పష్టతవల్ల రైతులోకం పడే అగచాట్లు; ఆధునిక జీవితం మోపిన అనారోగ్యం నుండి బయట పడేందుకు పల్లెసీమల పచ్చదనంలో సేదదీరుతూ ప్రకృతి మూలాల్లోకి వెళ్లాలనుకునే మనిషి తపన; గ్రామీణ, పట్టణ జీవితాల మధ్య అంతరాల గురించి, భావి తరాలకు తెలియజేయాలనుకునే పెద్దవాళ్ల ఆరాటం.... మొదలైన అంశాలు ఈ నవలల్లోని కథా వస్తువులు. సాహిత్య ప్రయోజనం ఎరిగిన రచయితలు చిత్తశుద్ధితో ఎంచుకున్న తాజా కథావస్తువులే ఇవన్నీ. వస్తువు తాజాదే అయినా దాన్ని మంచి నవలగా మలచడంలో చాలామంది రచయితలు సఫలీకృతులు కాలేకపోయారు. చాలా నవలలు కనీసం ఆశించిన స్థాయిలో కూడా లేవు.

ఉత్తమ నవలను ఎంపిక చేసేందుకు మేము ఈ క్రింది ప్రమాణాలు పాటించాము. 1. సమకాలీన సంక్షోభానికి, సమస్యలకు మూలాలను చారిత్రక నేపథ్యం నుండి extra polate చేసే కథా వస్తువు. 2. సరికొత్త దృష్టితో, అత్యంత మౌలికమైన గ్రహింపుతో సామాజికత వాస్తవికత చిత్రణ. 3. సాహిత్య చారిత్రక ప్రయోజనం విస్మరించకుండా, సాహిత్య నియమాలు (literary conventions) పూర్తిగా ధిక్కరించని రీతిలో భావోద్వేగాల విషయంలో సంయమనం. 4. ఆసక్తికరమైన కథనం, ఉత్కంఠ భరితమైన ఇతివృత్త నిర్మాణం. 5. భాష వాడకంలో ఔచిత్యం. 6. రచయిత ప్రస్తావించిన అంశాల/ వివరాల విశ్వసనీయత. 7. రచయిత భావజాలానికి/తాత్వికతకు వాహికగా నిలిచిపోయే పాత్రలు. అన్ని నవలలు జారిపోగా చివరకు 'నీల', 'శప్త భూమి', 'ఒంటరి' నవలలు మిగిలాయి.

- ఆడెపు లక్ష్మీపతి

"నవలంటే కథ చెప్పుకుంటూ, సన్నివేశం మీద సన్నివేశం పేర్చుకుంటూ ఎక్కడో ఒక చోట ముగించే రచన కాదు."

మొదటి నుంచీ కూడా తెలుగులో నవలా రచనను పాఠకులు ఉబుసుపోకగా చదవడమే కాక, రచయితలు కూడ ఉబుసుపోకగానే తీసుకోవడం ఒక పెద్ద లోపంగా నేను భావిస్తాను (కొద్దిమంది మినహా). ఇతర భారతీయ భాషలతో వచ్చిన సంఖ్యలో తెలుగులో గొప్ప నవలలు లేవనే చెప్పాలి. నవలంటే కథ చెప్పుకుంటూ, సన్నివేశం మీద సన్నివేశం పేర్చుకుంటూ ఎక్కడో ఒక చోట ముగించే రచన కాదు. ఒక నిర్దిష్టమైన విషయాన్ని, విశ్లేషణను అందించే పకడ్బందీ అయిన ఇతివృత్తంతో, సజీవపాత్రలతో, జీవితం పట్ల ఏదో ఒక కొత్త అవగాహనను, కనీసం ఆలోచనను లేదా రచయిత తన అనుభవాల నుంచి గుర్తించిన ఒక సత్యాన్ని అందించే విధంగా నవల ఉండాలన్నది నా కొలమానం. నవలా రచన వెనక రచయిత సంవేదనతో పాటు కొంత అధ్యయనం ఉండాలనీ నేననుకున్నాను.

ఇటీవలి కాలంలో ఉత్తమ సాహిత్యం అంటే స్త్రీలకు, దళిత బహుజనులకు (అంటే చరిత్రలో వివక్షకు గురైన వర్గాలకు) సంబంధించిందీ లేదా ప్రపంచీకరణను వ్యతిరేకించేదీ అనే అభిప్రాయం కలిగించే వాతావరణం ఉంది. ఈ నవలా పోటీలకు వచ్చిన నవలల బలం, బలహీనత కూడా అదే. బలహీనత అని కూడా ఎందుకంటున్నానంటే, ఎవరి జీవితం గురించి రాస్తే న్యాయనిర్ణేతల మెప్పు పొందుతామో అని ముందుగానే అనుకుని, దానికి అనుగుణంగా వస్తువును స్వీకరించడం. ఈ వస్తు స్వీకరణ వెనక రచయిత ప్రగాఢమైన అనుభూతి, ఆలోచన కూడా ఉంటే ఆ వస్తువుకు న్యాయం జరుగుతుంది. కానీ ఏది తీసుకుంటే బాగుంటుందో బహుమతి రావచ్చో అని అనుకుని రాస్తే మాత్రం ఆ రచనకు న్యాయం జరగదు. పోటీకి వచ్చిన కొన్ని నవలల్లో ఈ బలహీనత ఉంది. నా దృష్టికి వచ్చిన 16 నవలల్లో కొన్నింటిలో వస్తువు బాగున్నా, వారి రచనా విధానం డాక్యుమెంటరీలాగానో, పత్రికా వ్యాసం లాగానో, మరికొన్ని సినిమా రచనల్లా, మెలో డ్రామాతో నిండి వున్నాయి. అంటే వస్తువు ఎంపికలో పరిణతి లేకపోవడం కొన్నిటిలో లోపమైతే, వస్తువు బాగున్న చోట వాటిలో నవలా లక్షణాలు, సృజనాత్మకత లేకపోవడం లోపంగా కనిపించింది.



బహుమతి పొందిన వాటిలో రెండు నవలల్లో కూడ ఇందాక చెప్పినట్లు స్త్రీలు, దళిత బహుజనులే ఉన్నారు. కానీ ఆ నవలల్లో వస్తువు రచయితల అంతరంతరాలను స్పృశించడం వల్ల వచ్చినట్టుగా ఉంది కానీ, పొలిటికల్లీ కరెక్ట్‌గా ఉండడం కోసం తీసుకున్నట్టు లేదు. ఇక పోతే మూడో నవల ప్రకృతికీ మనిషికి ఉండాల్సిన అనుబంధం గురించి చెప్పేది. భావకవిత్వం రోజుల్నుంచీ ప్రకృతికీ మనిషికీ ఉన్న అనుబంధం సాహిత్య వస్తువే కానీ, ప్రకృతిని సౌందర్య దృష్టితో చూడ్డం అప్పటి పద్ధతైతే, మనిషికి జీవితాన్నిచ్చే పర్యావరణ దృష్టితో చూడ్డం ఇప్పటి దృష్టి. ఆ దృక్పథాన్ని హృద్యంగా, వాస్తవికంగా చిత్రించింది బహుమతి పొందిన మూడో నవల. ఈ మూడు నవలల్లోనూ కేవలం మంచి భాష, కథాసంవిధానం, పాత్ర చిత్రణే కాక, ఒక అధ్యయనం, నిర్దిష్టమైన దృష్టికోణం, తీసుకున్న వస్తువు పట్ల స్పష్టత కనిపిస్తాయి. (వీటిలో లోపాలు లేవని కాదు. కానీ లోపాల కంటే గుణాలే ఎక్కువగా కనిపించాయి). ఈ మూడిటిలో ఒకటి జరుగుతున్న చరిత్ర అయితే (నీల), రెండోది జరిగిపోయినా ఇంకా వెంటాడుతున్న చరిత్ర అయితే (శప్తభూమి) మూడోది జరగాల్సిన చరిత్రను (ఒంటరి) చెప్పేది.

- మృణాళిని

"మన నవలలు ప్రపంచ స్థాయికి ఏ మాత్రం తగ్గవని నమ్మినంత కాలం అవి మారవు."

గెలిచిన మూడు నవలల మీదా స్థూలంగా మీ అభిప్రాయం?

ఒక్కోటీ ఒక్కో genre కి సంబంధించినవి. మూడింటి వెనకా రచయితల అధ్యయనం, పరిశీలనా, కృషీ స్పష్టంగా కనిపిస్తాయి. ఇవి ఆషామాషీగా రాయలేదనీ, రాయవలసిన అవసరం వాళ్లకున్నదనీ తెలుస్తుంది.

తెలుగులో నవలా రచన భవిష్యత్తు గురించి ఏమనుకుంటున్నారు?

భవిష్యత్తు ఆందోళనకరంగానే ఉంది. వాసి సంగతి అటుంచినా రాశిలో కథలకూ, కవితలకూ కొదవ లేదు. నవల బలహీనంగా ఉన్నదని ఒప్పుకోక తప్పదు. చాలా నవలలు వార, మాస పత్రికల్లో సీరియల్స్‌గా వచ్చి నవలా రూపంలో విడుదల అవుతున్నవే. అవి పత్రిక వ్యాపార ప్రయోజనాలకు అనువుగా ఉండక తప్పదు. రచయితకు మోటివేషన్ లేదు. రాయడానికి పట్టే సమయమూ, శ్రమా ఎక్కువ. రచయితలకు స్వేచ్ఛగా రాసే అవకాశం కల్పించడమే ఈ పోటీ నిర్వహించడానికి ఒక కారణం.

ముందు పాఠకుల్ని పెంచుకోకపోతే నవలలు పూర్తిగా కనుమరుగయినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఏకబిగిని ఒక నవల చదివేంత తీరికనీ, ఓపికనీ ఆధునిక జీవితం పాఠకుడికి ఇవ్వడం లేదు. వాళ్లకి కావలసిన వినోదం పొందడానికి వేరే మార్గాలు మరింత ఆకర్షణీయమైనవి ఉన్నాయి. వాళ్లే పాత్రలుగా మారగలిగిన సోషల్ మీడియా ఇంకా ఉత్తేజకరంగా ఉంటూంది. చదివే వాళ్లు ఉన్నారు గానీ, పుస్తకాలను పాఠకుల వద్దకు చేర్చడంలో ప్రచురణరంగం విఫలమవుతూన్నదన్న వాదన వినిపిస్తూంది కానీ, తొమ్మిది కోట్ల తెలుగు వాళ్లుండగా వెయ్యి కాపీలు అమ్మడం కనాకష్టమవుతున్న సంగతి గమనిస్తూ దాన్ని నమ్మలేను.



మన రచయితల నవలలు ప్రపంచ నవలా స్థాయిని చేరాలంటే?

ముందు ఈ ప్రశ్నను పాజిటివ్‌గా తీసుకోగల పరిణతి రావాలి. మన నవలలు ప్రపంచ స్థాయికి ఏ మాత్రం తగ్గవని నమ్మినంత కాలం అవి మారవు. అసంతృప్తి లేనిదే అభివృద్ధి ఉండదు. జీవితాన్నీ, మిగతా భాషల సాహిత్యాన్నీ అధ్యయనం చేయడం గురించి అందరూ చెప్తూనే ఉన్నారు. ఏ స్థాయికి చేరుకోవడానికయినా ముందు పాఠకులు ఉండాలి. ఏ తరగతికి చెందిన పాఠకుల అవసరాలకు తగ్గట్టు ఆ రచనలు, భిన్నమైన అంశాల మీద రాయవలసి ఉంది. పాపులర్ రచనలు చదవకుండా సీరియస్ పాఠకులు తయారుకారు. ఎక్కువగా చదివే, రాసే రోజులు వచ్చినప్పుడు కొత్తగా రాయాలనే తపన మొదలవుతుంది. ప్రపంచస్థాయి నవలలు అవే వస్తాయి.

- చంద్ర కన్నెగంటి, తానా ప్రచురణల కమిటీ అధ్యక్షుడు

అరుణ్ సాగర్ సాహితీ పురస్కారం

గోరటి వెంకన్న ఈ ఏడాది అరుణ్ సాగర్ సాహితీ పురస్కారానికి ఎంపికయ్యారు. జనవరి 2న పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయంలో జరిగే కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకొంటారు. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్, కె. శివారెడ్డి, ప్రసాదమూర్తి, ముచ్చా శ్రీనివాసరావు, కుప్పిలి పద్మలతో కూడిన జ్యూరీ ఈ ఎంపిక చేసింది. ఇదే రోజు సా.6నుంచి అరుణ్ సాగర్ బెస్ట్ జర్నలిస్ట్ అవార్డ్స్-2017 కార్యక్రమం జరుగుతుంది. తన్నీరు హరీష్‌రావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, అల్లం నారాయణ, పాలగుమ్మి సాయినాథ్ తదితరులు పాల్గొంటారు.

- మీడియా అకాడమీ ఆఫ్ తెలంగాణ

ఆదివాసీ 'ఇమ్మతి' కవిత్వం

తెలంగాణ రాష్ట్రంలో ఆదివాసులు, లంబాడాల పోరాటం నేపథ్యంలో ఆదివాసుల పోరాటానికి 'ఇమ్మతి' (మద్దతు)గా 'లిటరరీ ఫోరం' కవిత్వ సంకలనాన్ని తేవాలనుకుంటున్నది. ప్రజాస్వామిక వాదులు, అస్తిత్వ సాహిత్య లోకం తమ కవిత్వాన్ని జనవరి 30లోపు చిరునామా: వేముల ఎల్లయ్య, దేవులపల్లి కోటేశ్, రూమ్ నెం.20, ఎన్.ఆర్.ఎస్ హాస్టల్, ఉస్మానియా యూనివర్శిటీ, హైదరాబాద్-500007కు పంపాలి. ఫోన్: 99896 99405, ఈమెయిల్: devulapallykoti@gmail.com.

- గుఱ్ఱం సీతారాములు

మినీ కథల పోటీ

త్వరలో ప్రారంభం కాబోయే తెలుగు పత్రికలో మినీ కథల పోటీకి కథలను చేతిరాతలో 3 పేజీలకు మించకుండా, యూనికోడ్‌లో వెయ్యి పదాలకు మించకుండా పంపాలి. మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా రూ.3వేలు, రూ.2వేలు, రూ.1000. రచయితలు తమ కథలను చిరునామా: ఎడిటర్, మెట్రో ఇండియా, ప్లాట్ నెం.: 1267/ఎ, రోడ్ నెం.63/ఎ, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-33కు గానీ ఈమెయిల్: saahithi@metroindia.net కు గానీ పంపాలి. ఆఖరు తేదీ: జనవరి 31, 2018. వివరాలకు: 96529 67036.

- శ్రీశాంతి

కవిత్వ విశ్లేషణ కార్యక్రమం

తెలంగాణ సాహిత్య సమాఖ్య వినూత్న కవిత్వ విశ్లేషణ కార్యక్రమం 'ధ్వని' (కవిత్వ లయ) జనవరి 7 ఉ.10.30 ని.లకు స్టేట్ సెంట్రల్ లైబ్రరి, హెరిటేజ్ బిల్డింగ్, అఫ్జల్‌గంజ్ నందు జరుగుతుంది. దీనిలో సిద్ధార్థ, ఏనుగు నరసింహారెడ్డి, శోభాభట్, గుడిపాటి, శివకుమార్, బెల్లంకొండ సంపత్ కుమార్, వేముగంటి మురళీకృష్ణ పాల్గొంటారు.

- ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్


తెలంగాణ సినిమాపై పుస్తకావిష్కరణ

వారాల ఆనంద్ రాసిన 'తెలంగాణ సినిమా దశ దిశ' పుస్తకావిష్కరణ మంత్రి కల్వకుంట్ల రామారావు చేతుల మీదుగా జనవరి 5 ఉ.10.30ని.లకు హైదరాబాద్ సెక్రెటేరియట్ కార్యాలయంలో జరుగుతుంది. తలసాని శ్రీనివాసయాదవ్, దేశపతి శ్రీనివాస్, వజ్జాల శివకుమార్ పాల్గొంటారు.

- వారాల ఆనంద్


తానా నవలల పోటీ-2017 విజేతలైన బండి నారాయణ స్వామి ('శప్తభూమి'), కె.ఎన్. మల్లీశ్వరి ('నీల'), సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి ('ఒంటరి') ఈ మూడు ప్రశ్నలకు జవాబిచ్చారు:
1) మీ నవల దేని గురించి? 2) ఈ నవల రాయటానికి మీ ప్రేరణ? 3) ఈ నవల రచనలో మీ అనుభవాలు? 4) తెలుగులో నవలా రచన తగ్గటంపై మీ స్పందన?

"సీమ కరువుల చరిత్రని ఐతిహాసిక స్థాయిలో చెప్పాలని..."



1) ఈ నవలలోది 18వ శతాబ్దం నాటి అనంతపురం పాలెగార్ల సంస్థానంలో వాన కోసం ప్రయత్నాలుచేసే (మూఢ?) విశ్వాసాల కథ! ఒక మరదలిని ఇద్దరు బావలు ప్రేమించటంతో కథ మొదలు. ఆమె పేరు ఇమ్మడమ్మ. ఆ బావల పేర్లు బిల్లే ఎల్లప్ప; కోడె నీలడు. బిల్లే ఎల్లప్ప గొర్రెలు కాస్తాడు. కోడె నీలడు కంబళ్ళు నేస్తాడు. బిల్లే ఎల్లప్ప కొన్ని ఆశ్చర్యకర పరిస్థితుల్లో రాజోద్యోగిగా మారి ఇమ్మడమ్మను మనువాడతాడు. కోడె నీలడి మీద మనసు చంపుకోలేని ఇమ్మడమ్మ బిల్లే ఎల్లప్పను చేరదు. కోడె నీలడు; ఇమ్మడమ్మను తనకు దక్కకుండా చేసిన బిల్లే ఎల్లప్ప మీద కసి తీర్చుకోవాలనుకుంటాడు. అందుకు గాలి దేవరగా మారిపోతాడు. గాలి దేవర అంటే వాన కోసం ఒక గ్రామంలో జరిగే క్రతువు ఫలాన్ని తన గ్రామానికి ఎత్తుకుపోయేవాడు. ఈ సందర్భంలో బిల్లే ఎల్లప్ప కోడె నీలడిని గుర్రాల మీద వెంటాడి చంపి; తన గ్రామంలోని గాలి దేవర ఫలాన్ని కాపాడుకుంటాడు. ఇది అట్లుండగా, అనంతపురం సంస్థానంలో వర్షాలు పడవు. వర్షాలు పడకపోతే పన్నులు వసూలు కావు. పన్నులు వసూలు కాకపోతే హండే రాజు హైదరాలికి కప్పం కట్టలేడు. కప్పం అందకపోతే హైదరాలి అనంతపురం కోట బీగాల్ని వశంచేసుకుంటాడు. ఈ క్రమంలో; అనంతపురానికి వాన రప్పించడం కోసం శ్రీశైలంలో వీరమంటపం ఎక్కుతాడు బిల్లే ఎల్లప్ప. వీర మంటపం ఎక్కడమంటే; శరీరాన్ని అష్ట ఖండాలుగా తెగ్గొట్టుకుని మల్లికార్జున స్వామికి ఆత్మ బలి ఇవ్వడమే! ఈ కథలో అంతర్భాగంగా అనేక చారిత్రక సందర్భాలు వుంటాయి. బసివిని ఆచారం, దేవదాసి వ్యవస్థ, రైతు ఇల్లాండ్ర లైంగిక దోపిడి, రాయలసీమ కరువు బీభత్సాలు, వీరగల్లు వంటి అనేక సంఘటనలతో, ఉపకథలతో నవల నడుస్తుంది.

2) రాయలసీమ కరువుల చరిత్రని ఐతిహాసిక స్థాయిలో చెప్పాలనే కాంక్ష చాలా కాలంగా ఉండేది. తెలంగాణ పోరాటంలో, తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనం పొందుతున్న దశలో, కోస్తాతో కలిసిన రాయలసీమ అస్తిత్వం ప్రశ్నార్థకమయింది. ఈ క్రమంలో రాయలసీమ చారిత్రక నవల రాయాలనే ప్రేరణ మరింత బలపడింది.




3) ఏ రచయితకైనా చారిత్రక నవల రాయడం ఒక సవాలు. రాజుల కేంద్రం కాకుండా దళిత బహుజనుల కేంద్రంగా రాయడం మరింత గొప్ప సవాలు! వర్తమాన కాలిక రచనలు చేసేటప్పుడు, ఎదురుగా కొందరు సామాజిక వ్యక్తుల్ని మోడల్‌గా పెట్టుకుని పాత్రలను చిత్రించే అవకాశం వుండేది. ఆ సౌకర్యం ఈ చారిత్రక నవలలో లేదు. ఎందుకంటే, ఇందులోని ప్రధాన పాత్రలు చారిత్రక సందర్భాల నుంచి పుట్టించినవి మాత్రమే! పూర్తిగా ఊహించి రాయడం ఈ రచయితకు ఎప్పుడూ అలవాటు లేని మేధో శ్రమ. ఈ మేధోశ్రమలోనే- చరిత్ర పుస్తకాల అధ్యయనం నుండి నోట్సు తయారీకి ఒక సంవత్సరమూ, పాత్రల మధ్య ఇంటరాక్షన్స్ కల్పించుకుంటూ రాయడానికి మరొక సంవత్సరమూ జరిగిపోయినాయి.

4) తెలుగు నవలా రచన మందగించలేదు. సీరియస్ నవలలు మాత్రమే మందగించినాయి. పాఠకులలో విలువలతో కూడిన రసహృదయులు తక్కువ. ఏ విలువలూ లేని వినోదప్రాయులూ, వట్టి ఉపరితలం మనుషులూ ఎక్కువ. ఈ ఎక్కువ మందిని రీచ్ కావడానికే మన పత్రికలు ప్రయత్నిస్తాయి. ఇందువల్ల జీవితాన్ని ప్రతిబింబించే నవలలకు పత్రికల్లో చోటు పోయింది. జయకాంతన్ అస్తిత్వవాద నవల 'కళ్యాణి', మురుగన్ పల్లె సమాజం నవల 'అర్ధనారీశ్వరుడు' వంటి నవలలు చూసినప్పుడు తెలుగు నవలా ప్రక్రియ వాతావరణాన్ని, పత్రికల్నీ ఆ భాషలతో పోల్చలేం అనిపిస్తుంది.

- బండి నారాయణస్వామి

"మూడు దశాబ్దాల చరిత్రతో ఒక మనిషి చేసిన సహజీవనం"



1) ఇది, నీలకథ. ఒక స్త్రీ ప్రయాణ గాథ. మూడు దశాబ్దాల చరిత్రలో, చరిత్రతో ఒక మనిషి చేసిన సహజీవనం. ప్రత్యక్ష భౌతిక సామాజిక సంచనాల నేపథ్యం నుంచి తాత్విక బౌద్ధిక ఆచరణల దాకా ఒక స్త్రీ చేసిన జీవితారోహణం. అత్యంత కఠినమైన జీవితసానువులలో నిస్సహాయ అనాథగా నడక మొదలుపెట్టిన చంద్రకళ కూతురు, మజిలీలు చాలని పరుగులలో స్వతంత్ర స్త్రీ నీలగా వికసిస్తుంది. క్రూరమైన సంఘవిలువలు-అమాయకమైన బలహీనమైన సమూహాలలో వ్యక్తులలో అవి రగిలించే అమానుషత్వాలూ, జీవనభద్రత కోసం, ఆధిపత్యాల కోసం జరిగే హింసలూ-వీటితో బాధితురాలైన ఒక పల్లెటూరి ఆడపిల్ల, ఉధృత పరివర్తన ప్రవాహంతో ఒరుసుకుంటూ జీవించి తననుతాను రక్షించుకుంది, పదును పెట్టుకుంది.

2) సామాజిక చలన సూత్రాల మీద విప్లవాత్మకంగా ఆలోచించగలిగిన శక్తులు కూడా స్త్రీ పురుష సంబంధాల విషయం వచ్చేసరికి యథాతథ స్థితిని, తటస్థతని, మౌనాన్ని పాటించడం గమనించాను. సమాజంలో ప్రతీదీ మారుతూ వస్తున్నపుడు ఈ బంధాలు మాత్రం మారకుండా ఎలా ఉంటాయి? స్త్రీ పురుషుల మధ్య అమానవీయతకి తావు లేని ప్రజాస్వామిక బంధాలు ఉండాలని ఒక ఆకాంక్ష. స్త్రీ పురుష సంబంధాల్లో సార్వకాలికమైన సార్వజనీనమైన విలువలు ఏమీ ఉండవని, అట్లా లేకపోవడాన్ని వ్యక్తిగత రాగద్వేషాలే కాక సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతికరంగాల్లోని మార్పులు కూడా ప్రభావితం చేస్తాయని తెలుసుకున్నాను. ఈ అవగాహనని నాచుట్టూ అనేక వర్గాల జీవితాలకి, వ్యవస్థలకి అన్వయించి చూసే క్రమం, ఈ నవలకు ప్రేరణ.


3) కథ చాలక నవల ఎంచుకున్నది మొదలు అదొక యాతన. క్లుప్త జీవన శకలమైన కథ నుంచి విస్తార మానవజీవన చిత్రణ అయిన నవలకి షిఫ్ట్ అవడానికి యాభైపేజీల రాతని, ఆర్నెల్ల కాలాన్ని పక్కన పెట్టాల్సి వచ్చింది. నాలో నేను ఆలోచించుకుని ఊరుకోకుండా రాస్తున్నానూ అంటే నలుగురికీ చేరాలనే! అయితే రాసేక్రమంలో అది నా వ్యక్తిగత వ్యవహారం. దానికోసం అయిదున్నరేళ్ళ కాలం వెచ్చించడం మీద అసంతృప్తి ఉండేది. అనేకపాత్రల రూపకల్పన, పరిణామం, వాటి గ్రే ఏరియాలు, ముఖ్యంగా పాత్రల్లోకి పరకాయ ప్రవేశం చేసినపుడు పాత్రల భావోద్వేగాల ధాటికి లొంగకుండా పైనుంచి చూడాల్సిన అవసరం, ఘటనలు, సన్నివేశకల్పనలు, నేపథ్యచిత్రణ, ప్రాంత-పాత్రోచిత భాష, పఠనీయత, అవగాహన-సమాచారాలని యథాతథంగా కాక మానవజీవితాల్లోనుంచి చెప్పడం... ఒకటారెండా- అనేక అంశాల కలగలుపు అయిన నవలకి నిర్వహణసామర్థ్యం చాలా అవసరం. రాతని అదే మూడ్‌లో దీర్ఘకాలం కొనసాగించడం, కట్టుతప్పని ఓపిక, మానసిక, శారీరకశక్తులు కూడా ఉండాలి. ఇవేమీ లేకున్నా మనల్ని మనం నలగ్గొట్టుకునైనా సరే జీవితంలో ఒకసారైనా పెద్ద కాన్వాస్ ఉన్న నవల రాసి తీరాలి. అపుడు రచయితలమన్న అహం ఏదన్నాఉంటే అది చిన్న నలుసు స్థాయికి తగ్గిపోతుంది.



4) వాట్సప్‌లో పొట్టికతలు చదువుకుని తక్షణ ఉపశమనం పొందేదశలో ఉన్నాం. పఠనానందం కూడా వేగంగా పొందాలి. నవల ఇచ్చే అనుభవం ఎంత గొప్పదైనా అంత సమయం, ఏకాగ్రత చూపడానికి వీలులేని పరిస్థితులు తరుముతూంటాయి. సాధారణ పాఠకులు తెలీకుండానే సాహిత్యంలోని 'ట్రెండ్స్'కి లొంగిపోతారు. వీటికి భిన్నంగా గొప్ప ప్రక్రియగా నవలను గుర్తించి, వదలకుండా చదివే పాఠకులు కొద్దిమందయినా ఉన్నారు. వారి అవసరాలను తీర్చే నవలలు రావాలి.

- కె.ఎన్. మల్లీశ్వరి


"మనిషి తిరిగి ప్రకృతిలోకి ప్రయాణించే ఒక మహాప్రస్థానం"



1) అంతరించిపోతూ వున్న 'ఆరికలు' అనే తృణధాన్యాల గురించిన అన్వేషణ యీ నవల. జంతువృక్ష సంబంధాలే కాకుండా మానవ సంబంధాల్ని కూడా నిర్లక్ష్యం చేసి కేవలం ఆర్థిక సంబంధాలే పురోగతికి మూలాలుగా భావిస్తూ వున్న మనిషి తను కోల్పోయిందేమిటో తెలిసికొని తిరిగి ప్రకృతిలోకి ప్రయాణించే ఒక మహాప్రస్థానం యీ నవల. ప్రపంచాన్నే కాదు, విశ్వాన్ని కూడా అర్థం చేసికొన్నానని విర్రవీగే మనిషి- మొక్కల స్పర్శనీ, పక్షుల కిలకిలా రవాల్నీ, జంతువుల అరుపుల్నీ ఎదుటి మనిషి హృదయ స్పందనల్నీ అర్థం చేసికొనే అవసరం వచ్చినప్పుడు తడారిపోయిన గుండెలతో గిలగిల్లాడటం నవలంతా కనిపిస్తుంది. తన ప్రాణవాయువుతో పొలాన్ని బుజ్జగించి, సమస్త జీవకోటితో అత్యంత సహజంగా మమేకమైపోయిన మరో అంతరిస్తున్న అచ్చమైన రైతు జాతిని గురించి యీ నవల చెబుతుంది.

2) ఐదు దశాబ్దాల నా జీవనయానంలో నా పరిసరాల్లోంచి ఏ ప్రాకృతిక అనుబంధాన్ని కోల్పోయానో, నా ఇంట్లోంచి ఏ మానవ సంబంధాల దృశ్యాల్ని కోల్పోయానో, నా లోంచి ఏ జీవచైతన్యాన్ని కోల్పోయానో అర్థం చేసికొనే క్రమంలోనే ఈ నవల పుట్టింది. చాలాకాలంగా నాలో నేను రగిలి గాయాలు రేపుకొని వాటిని మాన్పుకొనే క్రమంలో నాకు తెలిసిన ఏకైక ఔషదం సాహిత్యమే కాబట్టి నవల రూపంలో నాకు నేను వైద్యం చేసుకొన్నాను.

3) ఆరిక ధాన్యం కోసం నేను చాలా చోట్ల చాలా యేళ్లుగా వెదికాను. ఎనిమిదేళ్ల క్రితం 'అరకు' వెళ్లినప్పుడు అక్కడి సంతల్లో ఆశగా వెదికాను. 'సోమలు' అనే తృణ ధాన్యాలు దొరికాయి గాని ఆరికలు దొరకలేదు. అంతర్జాలంలో అన్వేషిస్తే తెలంగాణలో ఓ ఔత్సాహిక రైతు పండించినట్లుగా తెలిసి ఆయనకు ఫోన్ చేసాను. ఎంతో ప్రయాస పడి ఐదు బస్తాలు పండించాడట కాని వాటిని పొట్టు వొల్చి బియ్యం చేయటం ఎలాగో తెలీక పక్కన పడేశాడుట. ఎప్పుడో ఐదేళ్ల క్రితపు మాట అది. తిరిగి నా అన్వేషణ మొదలైంది. చివరికి ఆరికలు పండించిన మనిషి దొరికాడు. అతని అనుభవాలు దొరికాయి.



ప్రకృతితో పరిచయం కోసం నల్లమల కొండలన్నీ తిరిగాను. ఇటు జ్యోతి నుంచి అటు అహోబిలం దాకా పర్వతాల్ని ఎక్కి దిగాను. ఆకుల్ని బట్టి, కర్రను బట్టి, పూవుల్ని, కాయల్ని, వాసనను బట్టి మొక్కల్ని గుర్తించేందుకు నా అనుభవమొక్కటే కాకుండా పల్లె ముసలాళ్ల అనుభవం కూడా బాగా తోడయ్యింది. మాకు నీళ్లకుంటలున్నాయి. ప్రతి రోజు ఉదయం సాయంత్రం, ఆ కుంటల్లోని నల్ల తుమ్మ మాన్ల కొమ్మల మీద రకరకాల పక్షుల బతుకు దృశ్యాలూ; కంప పొదల్లోని కుందేలు, ఉడతల్లాంటి చిన్న జంతువుల జీవన శైలి ఒక జీవిత కాలం పాటు గమనించి, పరిశీలించిన అనుభవం యీ నవలా రచనలో నాకు ఉపయోగపడింది. ఆధునిక నాగరికత అనే ఒక ఇనుప కర్పరాన్ని వదుల్చుకొని మెత్తగా మారి ప్రకృతిలోకి పయనించే ఒక అనుభవమే యీ నవల.

4) స్థానిక జీవన చిత్రాన్ని వాస్తవికంగా రాసే నవలల్ని ప్రచురించే పత్రికలు గాని, సంస్థలు గాని బాగా తగ్గటంతో రచనలు కూడా తగ్గాయి. ఒక జీవిత కాలం పాటు సమాజ పోకడల్ని పరిశీలించి దాన్ని నవలా రూపంలోకి తీసుకురావటమే రచయితకు కత్తి మీద సాములాంటిది. తిరిగి దాన్ని స్వంతఖర్చుతో ముద్రించటం, ముద్రించిన వాటిని పాఠకులకు చేర్చటం సాధారణ రచయితకు సాధ్యమయ్యే పని కాదు. సీరియస్ నవల కోసం కొన్ని పేజీల్ని కేటాయించే నిబద్ధత సంపాదకుల్లో వచ్చిన రోజు కేవలం పోటీలు పెట్టినప్పుడే కాకుండా అన్ని వేళలా ఇలాంటి నవలలు వస్తాయి.


- సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి

అయుతం... పరిసమాప్తం



సిరిసిల్లలో శ్రీ అయుత చండీ మహా యాగం దిగ్విజయంగా ముగిసింది. ఆదివారం యాగశాల సందర్శనకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. సిరిసిల్ల శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప దేవాలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో మానేరు తీరంలో ఐదు రోజుల పాటు మహా యాగం, రుద్రహోమాలు నిర్వహించారు. దాదాపు 60 వేల మంది హాజరయ్యారు. చివరి రోజు 20 వేల మంది తరలివచ్చారు. యాగాలను గురుమాదానన్ద పీఠాధీశులు మాధవనాంద సరస్వతి పర్యవేక్షించారు. కరీంనగర్ ఎంపీ వినోద్ కుమార్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, ధర్మపురి ఆలయ చైర్మన్ కృష్ణారెడ్డిలు యాగశాలను సందర్శించారు. వేములవాడ ఆలయ ఈవో రాజేశ్వర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ చండీమాతకు పట్టు వస్త్రాలను సమర్పించుకున్నారు. - సిరిసిల్ల

రాముడిగా యాదాద్రి లక్ష్మీనృసింహుడు



యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో వైభవంగా అధ్యయనోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం మూడో రోజు స్వామి వారిని శ్రీ రామావతారంలో అలంకరించి బాలాలయంలో ఊరేగించారు. జగద్రక్షణ కోసం అవతరించిన శ్రీ మహావిష్ణువు అవతారాలల్లో అత్యంత మనోహరమైన దివ్యమంగళ రూపమే శ్రీరామావతారమని అర్చకులు వివరించారు. ఆలయ మండపంలో హోమ పూజలు, దివ్య ప్రబంధ వేద పఠనం జరిపారు. రాత్రివేళ స్వామిని శ్రీ వేంకటేశ్వర అలంకారంలో బాలాలయంలో ఊరేగించారు. ప్రభాతవేళ తిరుప్పావై పాశురపఠనాలు, ఆండాళ్ అమ్మవారి నీరాట్టోత్సవాలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. సెలవుదినం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. స్వామికి భక్తుల నుంచి వివిధ విభాగాల ద్వారా 13 లక్షల 81 వేల 259 వేల రూపాయల ఆదాయం సమకూరింది. - యాదాద్రి టౌన్

కేసీఆర్ దూరదృష్టి వల్లే నిరంతర విద్యుత్

▸ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు



వరంగల్ అర్బన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కేసీఆర్ దూర దృష్టితో తెలంగాణ ప్రజల కల సాకారమైందని, నూతన సంవత్సర కానుకగా 24 గంటలు నిరంతర విద్యుత్ సరఫరా ప్రారంభించే స్థాయికి రాష్ట్రం ఎదిగిందని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్ రావు అన్నారు. పవర్ పర్చేజ్ అగ్రిమెంట్‌లో ప్రవేశించడం వల్ల ప్రత్యేకంగా రాష్ట్రానికి విద్యుత్ కారిడార్ ఏర్పడిదని, దీని వల్ల తెలంగాణ దక్షిణ భారత దేశం నుంచే కాదు, ఉత్తరాది నుంచి కూడా అవసరమయితే విద్యుత్‌ను తీసుకునే వెసులు బాటు కలిగిందని ఆయన ఆదివారం ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడుతూ చెప్పారు. రైతులకు మేలు చేసేందుకే 24 గంటల విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తుందని, రైతులు తమ వీలునుబట్టి మాత్రమే ఉపయోగించుకుంటారని అన్నారు. ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందం వల్ల మనకు విద్యుత్ కారిడార్ ఏర్పడింది. కారిడార్ అంటే ప్రత్యేకమైన విద్యుత్ లైన్ సౌకర్యం ఏర్పడిందని తెలిపారు. ఆటో స్టార్టర్ల వల్ల ఎలాంటి అనర్థాలు ఉన్నాయో రైతులకు వివరిస్తున్నామని, ఇప్పటికే చాలామంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తొలగించారని అన్నారు. దేశంలో తలసరి విద్యుత్ వినియోగం 1075 యూనిట్లు కాగాతెలంగాణలో 1401, ఆంధ్రప్రదేశ్‌లో 987 యూనిట్లని వివరించారు. ఈ విషయంలో తెలంగాణ ముందుందన్నారు.

వైరాలో 'భగీరథ' ట్రయల్ రన్

ప్రారంభించిన మంత్రి తుమ్మల

వైరా, డిసెంబరు 31: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపట్టిన మిషన్ భగీరథ పథకం ప్రపంచంలోనే వినూత్నమైనదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా వైరా రిజర్వాయర్ వద్ద ఆదివారం మిషన్ భగీరథ ట్రయల్ రన్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం రిజర్వాయర్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రకటించిన సమయం కంటే ఏడాది ముందుగానే ఉగాది నాటికి ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందిస్తామని తెలిపారు. ఎవరెన్ని మాట్లాడినా ఖాతర్ చేయకుండా కేసీఆర్ సాహసోపేతంగా మిషన్ భగీరథ పథక నిర్మాణాన్ని చేపట్టి, భీష్మ ప్రతిజ్ఞ చేశారని కొనియాడారు. కేసీఆర్ ఎంతో ధైర్యంగా, చిత్తశుద్ధితో అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించారని అన్నారు. ఇది తెలంగాణ ప్రజలకు ఆరోగ్య వరప్రదాయని అని వ్యాఖ్యానించారు. 90 శాతం మంది బడుగు, బలహీనవర్గాల ప్రజలున్నారని, వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంచేలా స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు మిషన్ భగీరథ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ పథకంతో వేసవి కాలంలో కూడా తాగునీటి సమస్య ఉండదని చెప్పారు. రాష్ట్రంలో తొలిసారిగా పాలేరు, వైరా ప్రాంతాల్లో మిషన్ భగీరథ ట్రయల్ రన్ విజయవంతమయిందని వెల్లడించారు. త్వరలో గోదావరి నదిపై భగీరథ ట్రయల్ రన్ నిర్వహిస్తామని ప్రకటించారు.



వైరా రిజర్వాయర్ వద్ద మిషన్ భగీరథ ట్రయల్ రన్ చేస్తున్న మంత్రి తుమ్మల

నేడు ఖమ్మంలో టీఆర్ఎస్ భవన్ ప్రారంభం

ఖమ్మం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర సమితి ఖమ్మం జిల్లా శాశ్వత కార్యాలయ భవనాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించనున్నారు. హైదరాబాద్ తర్వాత పార్టీ శాశ్వత పార్టీ కార్యాలయ భవనాన్ని ఖమ్మంలో నిర్మించారు. 2016 ఏప్రిల్ 27న ముఖ్యమంత్రి ఈ భవనానికి శంకుస్థాపన చేశారు. మూడు వేల చదరపు గజాల స్థలంలో అధునాతన వసతులతో నిర్మించారు. మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవ తీసుకుని నిర్మాణాన్ని పూర్తి చేయించారు. పార్టీ శ్రేణులతో సమావేశానికి హాలు, మంత్రి చాంబర్, కంప్యూటర్ గది, సందర్శకుల హాల్, జిల్లా పార్టీ ఇన్‌చార్జ్ గది నిర్మించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లక్ష్మారెడ్డి

కులమతాలకు అతీతంగా ఈబీసీ రిజర్వేషన్లు: లక్ష్మారెడ్డి

షాద్‌నగర్, డిసెంబరు 31 : కుల, మతాలకు అతీతంగా ఆర్థిక పరమైన(ఈబీసీ) రిజర్వేషన్లను తీసుకువస్తేనే సమాజంలోని అసమానతలు దూరమవుతాయని మంత్రి సి.లక్ష్మారెడ్డి అభిప్రాయపడ్డారు. షాద్‌నగర్‌లో నిర్మించిన రెడ్డి సేవా భవన్‌ను ఆదివారం ఎంపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో కలిసి మంత్రి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రెడ్డి సేవాసమితి కులమతాలకు అతీతంగా పేదరిక నిర్మూలన కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో అందరూ రిజర్వేషన్లు కావాలని కోరుతున్న ప్రస్తుత తరుణంలో కుల, మతాలకు అతీతంగా ఆర్థిక పరంగా రిజర్వేషన్లు తీసుకువస్తేనే పేదలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. సీఎం కేసీఆర్ కుల, మతాలకు అతీతంగా పేదలందరూ బాగుపడాలని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, అందులో భాగంగానే కల్యాణలక్ష్మి పథకాన్ని పేదలందరికీ వర్తింజేస్తున్నారని గుర్తు చేశారు. మహబూబ్‌నగర్ ఏపీ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సేవా సమితులు సేవా కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఉద్యోగులకు ప్రభుత్వం మొండి చేయి

▸ ఎమ్మెల్యే చిన్నారెడ్డి

▸ రుణ మాఫీలో సర్కారు విఫలం: మల్లురవి



వనపర్తి టౌన్/ నవాబ్‌పేట, డిసెంబరు 31: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తమ సమస్యలు తీరుతాయని, ఉద్యోగాలు లభిస్తాయని ఎన్నో ఆశలు పెట్టుకున్న రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ ప్రభుత్వం నిరాశ మిగిల్చిందని ఎమ్మెల్యే చిన్నారెడ్డి విమర్శించారు. వనపర్తిలో ఆయన ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగులు కీలక పాత్ర పోషించారని అన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక ఉద్యోగులకు పూర్తి ఫిట్‌మెంట్ ఇస్తామని ఇంత వరకు ఇవ్వలేదన్నారు. 11వ పీఆర్సీ 2017 లోనే ఇవ్వాల్సి ఉండగా, ఇవ్వడం లేదన్నారు. సీపీఎస్ విదానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విశ్రాంత ఉద్యోగులకు 15 శాతం అదనపు పింఛన్ ఇచ్చే వయసును 75 నుంచి 70 ఏళ్లకు తగ్గించాలని డిమాండ్ చేశారు. రైతులకు రుణ మాఫీ చేయడంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతులు తిరగబడే రోజులు వస్తాయని జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మల్లు రవి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేటలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల హామీలు ఇప్పటికీ అమలు కాలేదన్నారు. కేసీఆర్ సామంత రాజులాగా భవనాలకు రూ. 5 కోట్లు, రూ. 10 కోట్లు కేటాయిస్తున్నారని, ఆచరణలో మాత్రం అమలు కావడం లేదన్నారు. మిగులు ఆదాయమున్న రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చారని, కుటుంబంలో నలుగురికే రాజకీయ ఉద్యోగాలు సంపాదించుకున్నందుకు నిలదీసిన కోదండరాంను జైల్లో పెట్టారన్నారు. ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డికి కనీస మర్యాద ఇవ్వకుండా చార్లెస్ శోభారాజుతో పోల్చడం వల్లే మంత్రి లక్ష్మారెడ్డిపై రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారన్నారు.

రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం

▸ భార్య మృతి, భర్త పరిస్థితి విషమం

లక్షెట్టిపేట, డిసెంబర్ 31: మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం చందారంలో పంట నష్టంతో అప్పులపాలైన కౌలు రైతు దంపతులు శనివారం రాత్రి ఆతహత్యాయత్నం చేశారు. లక్షెట్టిపేట ఏఎస్సై ఇస్సాక్ తెలిపిన వివరాల ప్రకారం, చందారం లంబాడి తండాకు చెందిన బాబూలాల్ (34), యమున (30) దంపతులు ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకొని వరి, పత్తి సాగు చేశారు. సాగుకోసం పెట్టిన పెట్టుబడి తిరిగి రాక రూ.5 లక్షల అప్పులు కావడంతో ఇద్దరూ మనస్తాపానికి గురై పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు వారిని లక్షెట్టిపేట ఆసుపత్రికి తరలిస్తుండగా యమున మృతి చెందింది. బాబూలాల్ పరిస్థితి విషమంగా ఉండటంతో మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు.

అనుమానం పెనుభూతమై..

▸ భార్య, కొడుకు గొంతు కోసి చంపిన కిరాతకుడు



బాలమ్మ, నిందితుడు శ్రీనివాస్ (ఫైల్)

నస్పూర్, డిసెంబర్ 31: భార్యపై అనుమానంతో అతడు ఉన్మాదిగా మారాడు. కట్టుకున్న భార్యను, కొడుకును దారుణంగా హత్య చేశాడు. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో ఈ దారుణం జరిగింది. ఈ ఘటనలో సంపంగి బాలమ్మ (25), వివేక్ (ఆరు నెలలు) అక్కడికక్కడే మృతిచెందారు. బాలమ్మకు సంపంగి శ్రీనివాస్‌తో 2016లో పెళ్లయింది. పెళ్లయిన నాటి నుంచి దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. చాలా సార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు కూడా జరిగాయి. అయినా భర్త మారకపోవడంతో బాలమ్మ కొంత కాలంగా తల్లి దగ్గరే ఉంటోంది. ఇటీవల క్రిస్మస్‌కు ముందు శ్రీనివాస్ వచ్చి భార్యను పంపాలని కోరితే పంపలేదు. నస్పూర్‌లోనే భార్యతో కలిసి ఉంటానని చెప్పడంతో బాలమ్మ కుటుంబ సభ్యులు ఒప్పుకున్నారు. శ్రీనివాస్ ఆదివారం ఉదయం మద్యం మత్తులో భార్య బాలమ్మపై దాడి చేసి కత్తితో గొంతు కోశాడు. తర్వాత ఆరు నెలల వయసున్న కొడుకుపై దాడిచేశాడు. లోపలి నుంచి అరుపులు వినిపించడంతో బయట ఉన్న వారంతా గదిలోకి వెళ్లే సరికి రక్తపు మడుగులో తల్లీ కొడుకు కొట్టుమిట్టాడుతున్నారు. మృతురాలి కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో నిందితుడు శ్రీనివాస్ పారిపోయాడు. అప్పటికే బాలమ్మ, ఆమె కుమారుడు వివేక్‌లు మృతి చెందారు. తన బిడ్డను శ్రీనివాస్ అనుమానంతో రోజూ కొట్టే వాడని బాలమ్మ తల్లి పోచమ్మ తెలిపారు. సంఘటన స్థలాన్ని మంచిర్యాల పట్టణ, రూరల్ సీఐలు వేణు చందర్, ప్రమోద్‌రావు, సీసీసీ ఎస్సై ఉమా సాగర్‌లు పరిశీలించి వివరాలను సేకరించారు.



మంటలను అదుపులోకి తెస్తున్న ఫైర్ సిబ్బంది

రూ.40లక్షల పత్తి దగ్ధం

▸ జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం

గద్వాల, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జయలక్ష్మి కాటన్ ఇండస్ట్రీస్‌లో ఆదివారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. మిల్లు ఆరు బయట ఉంచిన జిన్నింగ్ పత్తిలో అనుకోకుండా మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేయడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు శ్రమించి మంటలను అదుపుచేశారు. సుమారు రూ.40 లక్షల జిన్నింగ్ చేసిన పత్తి కాలిపోయి ఉంటుందని యజమాని తెలిపారు.

గొర్రెల పంపిణీలో జగిత్యాల టాప్

▸ లక్ష్యం పూర్తి చేసిన అధికారులు

▸ జిల్లాలో 9,785 యూనిట్ల పంపిణీ



గొర్రె పిల్లను ఎత్తుకొని చూస్తున్న కలెక్టర్ శరత్ (ఫైల్)

జగిత్యాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీలో జగిత్యాల జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. నిర్దేశిత లక్ష్యం మేరకు గొర్రెలు పంపిణీ చేసి అధికారులు రికార్డు సృష్టించారు. జిల్లాలో 18 మండలాలు ఉండగా, 292 గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 25,640 మంది లబ్ధిదారులను గుర్తించారు. తొలి విడత కింద ఈ ఏడాది 10,557 మందికి గొర్రెలను పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం జిల్లా కలెక్టర్ శరత్ ఆరు బృందాలను ఏర్పాటు చేసి, జిల్లా పశు వైద్యాధికారి అశోక్ పర్యవేక్షణలో గొర్రెల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా వినుకొండ, కృష్ణా జిల్లా జగ్గయ్యపేట, నందిగామ, నెల్లూరు జిల్లా ఉదయగిరి, ప్రకాశం జిల్లా పామూరు, కనిగిరి ప్రాంతాల నుంచి గొర్రెలను కొనుగోలు చేశారు. జిల్లాలో 10,557 మందికి ఒక్కొక్కరికి 21 గొర్రెలను అందించాలని నిర్ణయించగా, డిసెంబరు 31నాటికి 9,785 యూనిట్లు పంపిణీ చేశారు. ఇందులో 772 మంది సబ్సిడీ గొర్రెలు తీసుకునేందుకు ముందుకు రాలేదు. దీంతో జగిత్యాల జిల్లాలో మొదటి విడత లక్ష్యం పూర్తయినట్లయింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శరత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే 100 శాతం లక్ష్యం పూర్తి చేసుకున్న మొదటి జిల్లా జగిత్యాల అని అన్నారు. ఇప్పటివరకు పంపిణీ చేసిన గొర్రెలకు 60,400 పిల్లలు పుట్టాయని వివరించారు.

అమ్మ పాదాలకు పుష్పాభిషేకం



తల్లి సుబ్బమ్మ పాదాలకు పుష్పాభిషేకం చేస్తున్న కుమారుడు విష్ణుమోహన్‌రావు, ఆయన భార్య

తల్లాడ, డిసెంబర్ 31: వృద్ధాప్యంలో తల్లిదండ్రులను కనీస కనికరం లేకుండా ఆశ్రమాల్లో వదిలేస్తున్న తరుణంలో ఓ కొడుకు తన మాతృమూర్తికి అత్యంత వైభవంగా పాదపుష్పాభిషేకం నిర్వహించారు. మాతృత్వపు ఔన్నత్యాన్ని చాటిన ఈ వేడుక ఖమ్మం జిల్లా తల్లాడలో ఆదివారం జరిగింది. దారా సుబ్బమ్మకు 95 యేళ్లు. ఆమె కుమారుడు విష్ణుమోహన్‌రావు తల్లికి పాదపుష్పాభిషేకం కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఇందుకోసం 134 రకాల పుష్పాలను సేకరించారు. వాటితో తల్లి సుబ్బమ్మకు పాద పుష్పాభిషేకం నిర్వహించారు. వందలాదిగా తరలివచ్చిన బంధుమిత్రుల సమక్షంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఈ వేడుకను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

60తులాల బంగారం చోరీ

▸ కాగజ్‌నగర్ మీనాక్షి జువెల్లర్స్‌లో ఘటన

కాగజ్‌నగర్, డిసెంబరు 31: కుమ్రం భీం జిల్లా కాగజ్‌నగర్‌లోని మీనాక్షి జువెల్లర్స్‌లో శనివారం అర్ధ రాత్రి భారీ చోరీ జరిగింది. దాదాపు 60 తులాల బంగారు నగలు అపహరణకు గురైనట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. రాత్రి 12.55 గంటలకు అంతర్రాష్ట్ర ముఠాకు సంబంధించిన వ్యక్తులు ఎర్టిగా వాహనంలో కాగజ్‌నగర్‌కు చేరుకొని చోరీకి పాల్పడినట్లు చెబుతున్నారు. పక్కనే ఉన్న మరో బంగారం షాపులో కూడా చోరీకి యత్నించినట్లు పోలీసులు గుర్తించారు. తన బంధువులను తీసుకువచ్చేందుకు రైల్వే స్టేషన్‌కు వెళుతున్న కానిస్టేబుల్ మధు, అనుమానాస్పదంగా కనిపించిన వాహనం వద్దకు వెళ్లి వివరాలను అడిగారు. దీంతో ముఠాకు చెందిన నలుగురు వ్యక్తులు కానిస్టేబుల్‌పై దాడికి యత్నించగా, ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. పోలీసులు అధికారులు అప్రమత్తయ్యేలోపు దుండగులు తప్పించుకొని పరారయ్యారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ సందర్శించారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

▸ హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్



శంకరపట్నం, డిసెంబరు 31: రాష్ట్ర ప్రభుత్వం భూ నిర్వాసితులకు న్యాయం చేసే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుని ఆదుకోవాలని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రకుమార్ అన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్ క్రాస్ హైవే పక్కన రోడ్డు విస్తరణలో భవనాలు, భూములు కోల్పోతున్న బాధితులను ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిషన్ భగరథ పైపులైను నిర్మాణ పనుల కోసం ఒకే వైపు నుంచి రోడ్డు విస్తరణ చేసేందుకు అధికారులు మార్క్ చేయడం విచారకరమన్నారు. భవనాలు, స్థలాలు కోల్పోయే విధంగా ప్రభుత్వం తీసుకునే చర్యలను విరమించుకోవాలని కోరారు. ఏకపక్ష నిర్ణయం తీసుకోకుండా అధికార యంత్రాంగం రోడ్డు వెడల్పులో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. భూ నిర్వాసితులలో అనేక మంది బాధితులు పేదవర్గాల వారే ఉన్నారని తెలిపారు.

వృద్ధుడి సజీవ దహనం

కోరుట్ల రూరల్, డిసెంబర్ 31: జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం వెంకటాపూర్‌లో గుడిసె కాలి ఓ వృద్ధుడు సజీవ దహనమయ్యాడు. గ్రామశివారులోని ఓ గుడిసెలో నూతిపెల్లి పోతలింగయ్య (85) ఉంటున్నాడు. శనివారం రాత్రి పడుకున్న అతడు తెల్లారేసరికి సజీవ దహనమయ్యాడు. గుడిసెలోని దీపంతో మంటలు వచ్చి ఉంటాయని భావిస్తున్నారు.

రైతుల రబీ ఆశలకు గండి

▸ ఎల్లంపల్లి నుంచి నీరు ప్రశ్నార్థకమే

▸ ఆందోళనలో నాలుగు జిల్లాల రైతులు

▸ 50 వేలకు పైగా ఎకరాలకు నీరందని స్థితి?



నందిమేడారం రిజర్వాయర్ కట్టను పరిశీలిస్తున్న సీఈ వెంకటేశ్వర్లు (ఫైల్)

కరీంనగర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా రబీ సాగుకు నీరు విడుదల కావడం ప్రశ్నార్థకంగా మారింది. అధికారుల తప్పిదమో, నాణ్యతా లోపమోకానీ ఇటీవల నంది మేడారం రిజర్వాయర్ కట్ట కుంగిపోవడంతో 72 చెరువులను శ్రీపాదసాగర్ నీటితో నింపే అవకాశం లేకుండా పోయింది. తిరిగి కట్టను నిర్మించే పనులను ఎంత వేగంగా పూర్తిచేసినా మరో నెల రోజులు పట్టే అవకాశం ఉంది. దీంతో రబీ సాగుపై ఆశలు పెంచుకున్న రైతులు దిగాలు పడుతున్నారు. 50 వేలకు పైగా ఎకరాలకు నీరందని పరిస్థితులు నెలకొన్నాయి. ఎల్లంపల్లి నుంచి నంది మేడారం, నారాయణపూర్, పోతారం రిజర్వాయర్లకు నీటిని విడుదల చేసి వాటి ద్వారా 72 చెరువులను నింపి 50 వేల ఎకరాలకు నీరందించాలని నీటి పారుదల శాఖ రబీ ప్రణాళికను సిద్ధం చేసింది. వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలతో శ్రీపాదసాగర్ పూర్తి స్థాయిలో నిండింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రాజెక్టు నుంచి 5 నుంచి 10 టీఎంసీల నీటిని వినియోగించి చెరువులు నింపడం ద్వారా 50 వేల ఎకరాలకు సాగునీరు అందించడంతోపాటు ఆయా గ్రామాల్లో భూగర్భ జలాలు పెంచి తాగునీటి సమస్య లేకుండా చేయాలని భావించారు. అధికారుల నిర్ణయంతో ఈ ఏడాది కూడా నీరు విడుదలవుతుందని భావించి కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల రైతుల ఆయకట్టు పరిధిలో వ్యవసాయ బావుల ఆధారంగా వరి నార్లు పోసుకున్నారు. నీటిని విడుదల చేసిన వెంటనే దుక్కులు దున్ని వరి నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. చెరువులు నింపే ప్రక్రియలో కీలకమైన వాటర్ హబ్‌గా ఉన్న నంది మేడారం చెరువు కట్ట కుంగడంతో రైతుల ఆశలు గల్లంతవుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నంది మేడారం చెరువును రిజర్వాయర్‌గా మార్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని ఇదే రిజర్వాయర్ నుంచి సొరంగ మార్గాల ద్వారా తరలించేలా డిజైన్లు సిద్ధం చేయడంతో ప్రస్తుతం రిజర్వాయర్‌కు ఉన్న నీటి నిల్వ సామర్థ్యం సరిపోదని, దానిని 0.18 టీఎంసీల నుంచి 0.78 టీఎంసీలకు పెంచేందుకు నాలుగు నెలల క్రితం విస్తరణ పనులను చేపట్టారు. రబీకి నీరందించాలని విస్తరణ పనులను శరవేగంగా జరుగుతున్న క్రమంలో చెరువు కట్ట 200 మీటర్ల మేర 5 మీటర్లు కిందికి కుంగిపోయింది. కట్ట లోపలి భాగంలో నిర్మించిన రివిట్‌మెంట్ పనికిరాకుండా పోయింది. కట్ట నిర్మించే సమయంలో మట్టి నమూనాలను పరిశీలించాల్సింది. అదేదీ పట్టించుకోకుండా ఉండడంతోనే కట్ట కుంగిపోయిందనే ఆరోపణలు వస్తున్నాయి. కట్ట అడుగు భాగంలో బుడుగు ఉండడంతో పైపైన దాన్ని తొలగించి మట్టి నింపి పనులు చేపట్టారని ఆరోపిస్తున్నారు. నిర్మాణ పనుల్లో లోపించిన నాణ్యత కూడా కట్ట కుంగడానికి మరో కారణమైందని భావిస్తున్నారు. అధికారులు మాత్రం కట్ట అడుగు భాగంలో నీటి పొరలు ఏర్పడడం వల్ల కట్ట కుంగిందని, నెలరోజులు తిరగకుండా మరమ్మతు పనులు పూర్తి చేస్తామని చెబుతున్నారు. ప్రస్తుతం నందిమేడారం రిజర్వాయర్ నుంచి 72 చెరువులకు నీరందించే ప్రక్రియ నిలిచిపోయింది. కాంగ్రెస్, బీజేపీల నేతలు రిజర్వాయర్ కట్టను సందర్శించి పనులలో నాణ్యత లోపించడంతోనే కట్ట కుంగిపోయిందని ఆరోపించడంతో అధికారులు మట్టి నమూనాలను సేకరించి యుద్ధ ప్రాతిపదికన ల్యాబ్‌కు పంపించారు. నివేదికలు రాగానే నిర్మాణ పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేస్తామని చెబుతున్నారు. నెల రోజులు గడిస్తేగానీ నిర్మాణ పనులు పూర్తయ్యే అవకాశం లేనందున రబీలో ఈ చెరువుల ఆయకట్టుకు నీరందే అవకాశం లేదనే చెప్పవచ్చు.

S & D

కొత్త సంవత్సరంలో.. టాప్ 10 కొలువులు

2018 వచ్చేసింది. తనతోపాటే ఎన్నో ఆశలను మోసుకు వచ్చింది. కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్నప్పుడల్లా మనకు కొంత ప్రేరణ, స్ఫూర్తి లభిస్తుంటాయి. దీన్ని పునాదిగా చేసుకొని నూతన సంవత్సరంలో కెరీర్‌కు బాటలు వేసుకోవాలి. విద్య, ఉద్యోగ రంగాల్లో వేగంగా వస్తోన్న పరిణామాలు కొత్త అవకాశాలకు తెరదీస్తున్నాయి. ఇంజనీరింగ్, సైన్సెస్, కామర్స్, లా... ఇలా అనేక విభాగాల్లో ఆధునిక అవకాశాలు వస్తున్నాయి. సాంప్రదాయ కెరీర్‌లుగా భావించే టీచింగ్, లా, ప్రభుత్వ ఉద్యోగాలు కొత్త హవాను సృష్టిస్తు న్నాయి. ఈ నేపథ్యంలో నూతన సంవత్సరంలో ఉద్యోగార్థులకు మంచి అవకాశాలను అందించనున్న టాప్ 10 రంగాలపై విశ్లేషణ...



కొత్త కెరటం.... డేటా ఎనలిటిక్స్



నూతన సంవత్సరంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంబంధిత రంగంలో ఉన్నత స్థానంలో స్థిరపడాలనుకుంటే మొదట ప్రాధాన్యం ఇవ్వాలిన ఆప్షన్ డేటా అనలిటిక్స్. డిజిటలైజేషన్ వల్ల వివిధ రంగాల్లో లావాదేవీలన్నీ కంప్యూటర్లు, ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌ల వంటి వాటి ద్వారా ఆన్‌లైన్‌లో, ఎలక్ట్రానిక్ పద్ధతిలో జరుగుతున్నాయి. ఈ ప్రక్రియలో నమోదవుతున్న డేటాను సేకరించడం, నిల్వ (స్టోర్) చేయడం, ప్రాసెస్ చేయడం, విశ్లేషించడం వంటి వ్యవహారాలను సమర్థంగా నిర్వహించడానికి ఆయా కంపెనీలకు, వ్యాపార, వాణిజ్య సంస్థలకు నిపుణులు అవసరం. ఈ తరహా నిపుణులను తయారు చేయడానికి ఉద్దేశించిన ప్రక్రియే డేటా అనలిటిక్స్.

- బ్యాంకులు, ఐటీ సేవలు, ఎడ్యుకేషన్, ట్రావెల్ అండ్ హాస్పిటాలిటీ, హెల్త్‌కేర్, రియల్ ఎస్టేట్, సూపర్ మార్కెట్, ఈ-కామర్స్, టెలికం, ఫైనాన్షియల్ సర్వీసెస్, సంస్థలతోపాటు మైక్రోసాఫ్ట్, గూగుల్, జెన్‌ప్యాక్ట్, టీసీఎస్, ఐబీఎం, విప్రో, డెల్ వంటి ఐటీ సంస్థలు డేటా అనలిటిక్స్ నిపుణులను నియమించుకుంటున్నాయి. ఐఐఎం-బెంగళూరు (వెబ్‌సైట్: iimb.ac.in/), ఐఐఎం-కోల్‌కతా (వెబ్‌సైట్: www.iimcal.ac.in/), ఐఐఎం- లక్నో (వెబ్‌సైట్: www.iiml.ac.in), ఐఐఎం- రాంచీ, ఐఐటీ- హైదరాబాద్ (వెబ్‌సైట్: www.iith.ac.in) డేటా అనలిటిక్స్ కోర్సులను అందిస్తున్నాయి.

సర్వీస్ కమిషన్‌ల హవా



కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో కెరీర్ ప్రారంభించడానికి చక్కని అవకాశం కల్పిస్తోంది యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ). ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్, ఇంజనీర్, డాక్టర్, అసిస్టెంట్ కమాండెంట్ వంటి కొలువులతోపాటు, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, త్రివిధ దళాలకు కావల్సిన వేలాది అధికారుల నియామక ప్రక్రియను యూపీఎస్సీ పర్యవేక్షిస్తుంది. ఈ సంస్థ ఉద్యోగుల రిక్రూట్‌మెంట్ కోసం క్యాలెండర్ విధానాన్ని అనుసరిస్తుంది. అందులో పేర్కొన్న విధంగానే నోటిఫికేషన్లు విడుదలవుతాయి.

- నూతన సంవత్సరంలో యూపీఎస్సీ నుంచి తొలి నోటిఫికేషన్ జనవరి 10న (ఎన్‌డీఏ - ఎన్ఏ) నోటిఫికేషన్ వెలువడుతుంది. తరవాత ఫిబ్రవరిలో సివిల్స్, అటుపై ఐఈఎస్ / ఐఎస్ఎస్, ఈఎస్ఈ తదితర నోటిఫికేషన్లు విడుదలవుతాయి. వివరాలను యూపీఎస్సీ వెబ్‌సైట్ నుంచి పొందొచ్చు.
- కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లోని గ్రూప్-బి, గ్రూప్-సి, జూనియర్ ఇంజనీర్, స్టెనోగ్రాఫర్, సైంటిఫిక్ అసిస్టెంట్, జియాలజిస్ట్ కేడర్ ఉద్యోగాలతోపాటు సాయుధ పోలీస్ దళాల్లోని వివిధ ఖాళీల భర్తీకి ఈ ఏడాది స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (http://ssc.nic.in/) నుంచి భారీ ఎత్తున నోటిఫికేషన్లు విడుదలవుతాయి.
- తెలుగు రాష్ట్రాల్లోని పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ద్వారా కూడా వివిధ ఉద్యోగాల ప్రకటనలు విడుదల కావచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్-1 ఇంటర్వ్యూలు జనవరి 22 నుంచి ప్రారంభమవుతాయి. అదేవిధంగా గ్రూప్-2, 3 నియామక ప్రక్రియలు పూర్తి చేసే అవకాశం ఉంది. తెలంగాణలో గ్రూప్-2తో పాటు గురుకులాలు, రూరల్ వాటర్ సప్లయి అండ్ శానిటేషన్, వైద్య ఆరోగ్య, తదితర విభాగాల కోసం చేపట్టిన ఉద్యోగ నియామక ప్రక్రియ పూర్తి కావచ్చు.

కార్పొరేట్ స్థాయికి... లా



దేశంలో అత్యధిక మంది ఎంచుకుంటున్న సంప్రదాయ వృత్తుల్లో.. న్యాయవాద వృత్తి ఒకటి. వాక్చాతుర్యం, సవాళ్లను స్వీకరించే గుణం ఉన్న వారికి సరిపడే వృత్తి ఇది. ప్రపంచీకరణ, అవుట్ సోర్సింగ్ నేపథ్యంలో ప్రస్తుతం కెరీర్ పరంగా 'లా' సంప్రదాయ స్థాయి నుంచి కార్పొరేట్ స్థాయికి చేరింది. ముఖ్యంగా ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూట్స్, బ్యాంకులు, సాఫ్ట్‌వేర్ సంస్థల్లో లీగల్ అడ్వైజర్, డ్రాఫ్ట్ రైటర్‌గా అవకాశాలు లభిస్తున్నాయి.

- ఇటీవల కాలంలో పేటెంట్ హక్కుల పర్యవేక్షణ సంస్థలు, కాపీరైట్ సంస్థలు, పబ్లిషింగ్ సంస్థలు, ఎన్‌జీఓలు కూడా లా గ్రాడ్యుయేట్లకు పెద్దపీట వేస్తున్నాయి. బహుళజాతి సంస్థలు లీగల్ డిపార్ట్‌మెంట్స్‌లో లా గ్రాడ్యుయేట్లకు అవకాశాలు కల్పిస్తున్నాయి. ఫలితంగా విద్యార్థులు రూ. లక్షల్లో వార్షిక వేతనం పొందుతున్నారు. క్లాట్, ఆయా రాష్ట్రాలు నిర్వహించే ప్రవేశ పరీక్షల ద్వారా లా కోర్సుల్లో చేరొచ్చు.

ఎవర్‌గ్రీన్.... టీచింగ్

టీచింగ్ ఎవర్‌గ్రీన్ ప్రొఫెషన్. ప్లే స్కూల్ నుంచి యూనివర్సిటీ వరకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పెద్ద ఎత్తున ఉపాధ్యాయుల అవసరం ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ నియామకాలు ఊపందుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో త్వరలోనే టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్‌టీ)కి నోటిఫికేషన్ వెలువడుతుంది. తెలంగాణలో ఇప్పటికే టీఆర్‌టీ నోటిఫికేషన్ వెలువడింది. రెండు రాష్ట్రాల్లోను యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల నియామక ప్రక్రియ ఇటీవలే ప్రారంభమైంది.

- ఆంధ్రప్రదేశ్‌లో యూనివర్సిటీలు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేయడం ప్రారంభించాయి. ఈసారి రాత పరీక్ష నిర్వహించడం ఈ నియామకాల్లో విశేషం. తెలంగాణలోని యూనివర్సిటీల్లో వందల సంఖ్యలో ఖాళీలున్నాయి. నియామక ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది. అందువల్ల కొత్త సంవత్సరంలో తెలుగు రాష్ట్రాల్లోని యూనివర్సిటీల్లో మరిన్ని టీచింగ్ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. కాబట్టి టెట్ / సీటెట్, యూజీసీ - నెట్ వంటి పరీక్షల్లో అర్హత సాధించి సిద్ధంగా ఉండటం ప్రయోజనకరం.

జీవితాన్ని మార్చే స్టార్టప్స్



స్టార్టప్.. యూత్ సర్కిల్స్‌లో లేటెస్ట్ బజ్. ఒక ఐడియా జీవితాన్నే మార్చేస్తుందనేది స్టార్టప్స్ విషయంలో నిజమవుతుంది. చదువు, వయసుతో నిమిత్తం లేకుండా కాసింత టెక్నికల్ నాలెడ్జ్, మేనేజ్‌మెంట్ స్కిల్స్ ఉంటే చాలు, స్టార్టప్ దిశగా వడివడిగా అడుగులు వేయవచ్చు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వినూత్న ఉత్పత్తులను రూపొందించడానికి వ్యక్తి లేదా వ్యక్తుల సమూహం ఏర్పాటు చేసే సంస్థలనే స్టార్టప్‌గా వ్యవహరిస్తారు. రతన్ టాటా వంటి ప్రముఖులు సైతం స్టార్టప్ బిజినెస్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఉత్సాహం చూపిస్తున్నారు.

- స్టార్టప్‌ను ప్రారంభించాలంటే ఏం కావాలి? ఐడియా (ఆలోచన). ఆలోచనే మనం చేరాల్సిన గమ్యానికి బాటలు వేస్తుంది. అయితే ఆలోచనలు ఏవిధంగా వస్తాయి. సింపుల్‌గా చెప్పాలంటే మన అవసరాలు, జీవితానుభవాలు, చుట్టూ జరుగుతున్న సంఘటనలు, చుట్టూ ఉన్న మనుషులు.... ఇవే ఆలోచనలకు ప్రేరణగా నిలుస్తాయి. వీటిలో ఏదైనా ఒక అంశాన్ని గుర్తించి దాన్ని సాల్వ్ చేయడానికి మనం చేసే ప్రయత్నమే స్టార్టప్ ఏర్పాటుకు దారి తీస్తుంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నాయి. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఎంఐటీ, కోర్స్‌ఎరా, స్టడీడాట్‌కామ్ వంటి సంస్థలు ఆన్‌లైన్‌లో స్టార్టప్‌నకు సంబంధించిన కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి.

చార్టర్డ్ అకౌంటెన్సీకి ఊపు



ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, వ్యాపార, వాణిజ్య రంగాల్లో వేగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా చార్టర్డ్ అకౌంటెన్సీ (సీఏ) నిపుణులకు డిమాండ్ ఏర్పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామికీకరణ, సేవ, ఉత్పత్తి రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుండడంతో సీఏ నిపుణులకూ విస్తృత అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. చిన్న వయసులోనే సమాజంలో హోదా, గౌరవంతోపాటు మంచి వేతనం అందుకోవచ్చు.


- సీఏ కోర్సును ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) నిర్వహిస్తోంది. ఇందులో కామన్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ (సీపీటీ), ఇంటిగ్రేటెడ్ ప్రొఫెషనల్ కాంపిటెన్స్ కోర్సు (ఐపీసీసీ), ఫైనల్ దశలుంటాయి. ఈ కోర్సు మొత్తం పూర్తి చేయడానికి ఇంటర్మీడియెట్ తర్వాత కనీసం 4 ఏళ్లు పడుతుంది. సీఏ అభ్యసించాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరి. ఇంటర్మీడియెట్ తర్వాత విద్యార్థి సీపీటీ పరీక్ష రాయాలి. ఏటా జూన్, డిసెంబర్‌లో దేశవ్యాప్తంగా ఉమ్మడి ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు.
- సీపీటీ పూర్తి చేసిన విద్యార్థులు 9 నెలల తర్వాత ఐపీసీసీ పరీక్ష రాయాలి. డిగ్రీ, పీజీ అర్హతతో సీపీటీ రాయకుండానే నేరుగా ఐపీసీసీలో ప్రవేశించొచ్చు. ఏటా మే, నవంబర్‌లో ఐపీసీసీ పరీక్షలు నిర్వహిస్తారు. ఐపీసీసీ కోర్సులోని గ్రూప్-1 లేదా 2 గ్రూప్స్ పూర్తిచేసిన విద్యార్థులు ప్రొఫెషనల్ చార్టర్డ్ అకౌంటెంట్ వద్ద ఆర్టికల్‌షిప్ పూర్తిచేయాలి. ఈ సమయంలో ప్రతి నెల స్టయిపెండ్ లభిస్తుంది. ఆర్టికల్‌షిప్ పూర్తవడానికి ఆర్నెల్ల ముందు సీఏ ఫైనల్ పరీక్ష రాయాలి. సీఏ చేసినవారికి టెలికం, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, సాఫ్ట్‌వేర్ పరిశ్రమలు, ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగాలతోపాటు విదేశాల్లోనూ అవకాశాలున్నాయి.
- సొంతంగా ప్రాక్టీస్ పెట్టుకునే అవకాశం కూడా ఉంది. ప్రతిభ, అనుభవం ఆధారంగా అధిక వేతనాలు అందుకోవచ్చు. సీపీటీ పాసైన విద్యార్థి ఐపీసీసీలోని గ్రూప్-1 పూర్తిచేసి, ఏడాదిపాటు ఆర్టికల్‌షిప్ చేస్తే అకౌంటింగ్ టెక్నీషియన్ సర్టిఫికెట్ లభిస్తుంది. దాంతో అకౌంటెంట్‌గా చేరి నెలకు కనీసం రూ.30 వేలు సంపాదించొచ్చు. ఉద్యోగం చేస్తూనే 2వ గ్రూపులో ఉత్తీర్ణత సాధించి సీఏ హోదా పొందొచ్చు.

లక్షల ఉద్యోగాలకు 'ఫైనాన్స్'

అత్యధిక మంది ఉపాధి కల్పిస్తోన్న రంగాల్లో బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ విభాగాలు ముందంజలో ఉంటాయి. వివిధ సర్వేల అంచనా ప్రకారం బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ రంగం 2022 నాటికి 16 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా ముందుకు వెళుతోంది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్స్ విభాగంలోనే 7.8 లక్షల ఉద్యోగాలు ఏర్పడనున్నాయి.

- మొత్తం నియామకాల్లో సుమారు 73 శాతం ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే జరగనున్నాయి. ఏటా ఐబీపీఎస్ ద్వారా భర్తీ చేస్తారు. ఇన్సూరెన్స్ కంపెనీలు మేనేజ్‌మెంట్ ట్రైనీ, అసిస్టెంట్, మల్టీ టాస్కింగ్ స్టాఫ్, తదితర ఉద్యోగాల కోసం నోటిఫికేషన్లు విడుదల చేసే అవకాశం ఉంది. ఫైనాన్స్ రంగంలో స్టాక్ మార్కెట్స్, రిస్క్ మేనేజ్‌మెంట్, క్యాపిటల్ మార్కెట్, స్టాక్ ఎక్స్ఛేంజ్, తదితర విభాగాల్లో అవకాశాలు ఉంటాయి.

కంప్యూటేషనల్ బయాలజీ



బయలాజికల్ సిస్టమ్‌ను అవగాహన చేసుకోవడానికి వీలుగా బయలాజికల్ డేటా సహాయంతో అల్గారిథమ్స్, నమూనాలను అభివృద్ధి చేయడమే కంప్యూటేషనల్ బయాలజీ ప్రధాన ఉద్దేశం. ఈ ప్రక్రియలో అనలిటికల్ మెథడ్స్, మ్యాథమెటికల్ మోడలింగ్, సిమ్యులేషన్ వంటి పద్ధతులు ఉంటాయి. కంప్యూటర్ సైన్స్, అప్లయిడ్ మ్యాథమెటిక్స్, యానిమేషన్, బయోకెమిస్ట్రీ, కెమిస్ట్రీ, బయోఫిజిక్స్, మాలిక్యులర్ బయాలజీ, జెనెటిక్స్, జినోమిక్స్, ఎకాలజీ, ఎవల్యూషన్, అనాటమీ, న్యూరోసైన్స్ వంటి అంశాల ప్రాథమిక భావనలు ఉంటాయి.

- ఈ శాస్త్రం పరిశోధనలతో ముడిపడి ఉంటుంది. కాబట్టి పరిశోధనలపై ఆసక్తి ఉన్నవారు ఈ సబ్జెక్ట్‌ను కెరీర్‌గా ఎంచుకోవచ్చు. ఈ కోర్సు చేసినవారు అకడమిక్స్, రీసెర్చ్ సైంటిస్ట్, కంప్యూటేషనల్ బయాలజిస్ట్‌గా స్థిరపడొచ్చు. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ఈ కోర్సును ఆఫర్ చేస్తుంది.

భద్రతకు హామీ... పీఎస్‌యూలు

ప్రభుత్వం రంగ సంస్థలు (పీఎస్‌యూలు) ఆకర్షణీయమైన జీతం, ప్రైవేట్ రంగంతో పోల్చితే సుస్థిరమైన కెరీర్‌కు హామీనిస్తాయి. వ్యాపార నిర్వహణ, విస్తరణ వంటి కారణాలతో పీఎస్‌యూలు ఏటా వేలా సంఖ్యలో ఉద్యోగులను నియమించుకుంటున్నాయి.

- అప్రెంటిస్‌షిప్, మేనేజ్‌మెంట్ ట్రైనీ, కెమిస్ట్, ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ మేనేజర్, జూనియర్ అసిస్టెంట్, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ తదితర ఉద్యోగాలను ఏటా భర్తీ చేస్తాయి. ఈ ఒరవడి ఈ సంవత్సరం కూడా కొనసాగుతుంది. గేట్, యూజీసీ-నెట్ పరీక్షల్లో సాధించిన స్కోర్ ఆధారంగా మేనేజ్‌మెంట్ ట్రైనీ, తదితర ఉద్యోగాలను భర్తీ చేస్తాయి.

సృజనాత్మకం... మెషీన్ లెర్నింగ్

మెషిన్ లెర్నింగ్ అనేది ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లోని సబ్ ఏరియా. ఎలాంటి ప్రోగ్రామింగ్ చేయకుండానే కంప్యూటర్లు స్వీయ అభ్యసన (self-learning) విధానంలోకి మారడానికి మెషీన్ లెర్నింగ్ వీలు కల్పిస్తుంది. కంప్యూటర్ ప్రోగ్రామ్స్‌ను డెవలప్ చేయడంపై మెషీన్ లెర్నింగ్ దృష్టి సారిస్తుంది.

- ఈ విభాగంలో ప్రవేశించడానికి మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, ఆపరేషన్స్ రీసెర్చ్‌పై అవగాహన ఉండాలి. పైథాన్, జావా, బిగ్ డేటా, డేటా వ్రాంగ్లింగ్ అండ్ విజువలైజేషన్ వంటి సామర్థ్యాలపై పట్టు తప్పనిసరి. ఐఐటి -బాంబే, కాన్పూర్ ఈ కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి.



వీక్షణం 2017

కరెంట్ అఫైర్స్ - ఆర్థిక రంగం

పోటీ పరీక్షల ప్రత్యేకం

భారత ఆర్థిక సర్వే 2016-17

ఆర్థిక సర్వే 2016-17ను జనవరి 31న ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. దీని ప్రకారం.. 2016-17లో జీడీపీ వృద్ధిరేటు స్థిర ధరల వద్ద 7.1 శాతంగా ఉంది. 2015-16లో ఇది 7.5 శాతం. 2017-18లో వృద్ధి రేటు 6.75-7.5 శాతంగా నమోదు కాగలదని సర్వే అంచనా వేసింది. 2016 సెప్టెంబర్ నాటికి మొత్తం విదేశీ అప్పు 484.3 బిలియన్ల అమెరికన్ డాలర్లుగా ఉంది. వ్యవసాయ రంగం 2016-17లో 4.1 శాతం వృద్ధి నమోదు చేసుకుంది. పారిశ్రామిక రంగం 5.2 శాతం, సేవల రంగం 8.9 శాతం వృద్ధి నమోదు చేసుకున్నాయి.

భారత వృద్ధి రేటు 7.2 శాతం

2017లో భారత వృద్ధి రేటు 7.2 శాతంగా ఉంటుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) తెలిపింది. పెద్ద నోట్ల రద్దు ప్రభావం వల్ల వృద్ధి రేటు గత అంచనాల కంటే 0.4 శాతం తగ్గి 7.2 శాతానికి పరిమితం అవుతుందని పేర్కొంది.

కొత్త ఆధార సంవత్సరం 2011-12

పారిశ్రామికోత్పత్తి సూచి (ఐఐపీ)ని గణించడానికి ఇప్పటి వరకు ప్రామాణిక సంవత్సరంగా తీసుకుంటున్న 2004-05 స్థానంలో మే 9 నుంచి 2011-12ను ఆధార సంవత్సరంగా తీసుకోనున్నారు.

ఆహార ధాన్యాల రికార్డు దిగుబడి

దేశంలో ఆహార ధాన్యాల దిగుబడి 2016-17 సంవత్సరంలో రికార్డు స్థాయిలో నమోదైంది. 2016-17 మొత్తం 27.56 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి అయినట్లు కేంద్రం ఆగస్టు 16న ప్రకటించింది.

సమ్మిళిత అభివృద్ధి సూచీ

ప్రపంచ ఆర్థిక వేదిక రూపొందించిన సమ్మిళిత అభివృద్ధి సూచీలో భారత్ 60వ స్థానంలో నిలిచింది. కేవలం జీడీపీ లెక్కల్నే కాకుండా వృద్ధి, అభివృద్ధి, సమానత్వం, సుస్థిరత వంటి 12 ప్రామాణికాల ఆధారంగా ఈ సూచీని రూపొందించారు. దీనిలో లిథువేనియా మొదటి స్థానం, అజర్‌బైజాన్ రెండు, హంగేరి మూడు, రష్యా 13, చైనా 15, నేపాల్ 27, బంగ్లాదేశ్ 36వ స్థానంలో ఉన్నాయి.

కేంద్ర బడ్జెట్ 2017-18



ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మొత్తం వ్యయం రూ.21,46,735 కోట్లుగా, ద్రవ్యలోటు 5,46,532 కోట్లుగా బడ్జెట్ అంచనా వేసింది. సాధారణంగా ఫిబ్రవరి మాసాంతంలో బడ్జెట్ ప్రవేశపెట్టడం శతాబ్దాలుగా ఆనవాయితీ. నిర్వహణ సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సారి నెల రోజులు ముందుకు జరిపి ఫిబ్రవరి 1నే ప్రవేశపెట్టారు. 92 ఏళ్లుగా ప్రత్యేకంగా ఉన్న రైల్వే బడ్జెట్‌ను ఈసారి సాధారణ బడ్జెట్‌లో కలిపారు. రైతులకు ఈ ఆర్థిక సంవత్సరంలో 10 లక్షల కోట్ల రూపాయల రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రధాన మంత్రి ఆవాస యోజనకు రూ.23 వేల కోట్లు కేటాయించారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.1,87,223 కోట్లు కేటాయించారు. స్త్రీ శిశు సంక్షేమానికి రూ.1,84,632 కోట్లు, రక్షణ రంగానికి రూ.2,62,390 కోట్లు కేటాయించారు.

భారత్ పెట్రోలియంకి 'మహారత్న'

ప్రభుత్వ రంగ చమురు సంస్థ భారత్ పెట్రోలియం మహారత్న హోదాను దక్కించుకుంది. ఇప్పటి వరకు నవరత్నగా ఉన్న కంపెనీ మహారత్నగా మారనుంది. రూ.25000 కోట్ల టర్నోవర్, రూ.5000 కోట్ల వార్షిక లాభాలు గల కంపెనీలను మహారత్నాలుగా ప్రకటిస్తారు.

జూలై - సెప్టెంబరు ఆర్థిక గణాంకాలు

2017 - 18 ఆర్థిక సంవత్సరంలో రెండో త్రైమాస ఆర్థిక గణాంకాలను సిఎస్ఒ నవంబరు 30న విడుదల చేసింది. గత అయిదు త్రైమాసికాలుగా మందగమనంలో ఉన్న భారత జిడిపి వృద్ధి రేటు జూలై - సెప్టెంబరులో 6.3 శాతానికి చేరింది. మొదటి త్రైమాసికంలో జిడిపి వృద్ధి మూడేళ్ల కనిష్ట స్థాయి 5.7 శాతానికి చేరింది. 2016 - 17 సెప్టెంబరు త్రైమాసికంలో ఇది 7.5 శాతంగా ఉంది. మరోవైపు ద్రవ్యలోటు అక్టోబరు చివరి నాటికే బడ్జెట్ అంచనాలో 96.1 శాతానికి చేరింది. 2017 ఏప్రిల్ నుంచి 2018 అక్టోబరు నాటికి ద్రవ్యలోటు 5.25 వేల కోట్లుగా నమోదయింది.



వి. కరుణ
సీనియర్ ఫ్యాకల్టీ

క్లుప్తంగా

- ఒకే దేశం - ఒకే పన్ను నినాదంతో దేశవ్యాప్తంగా జూలై 1 నుంచి జీఎస్‌టీ (గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్) అమల్లోకి వచ్చింది.
- భారత సార్వభౌమ రేటింగ్‌ను 13 ఏళ్లలో తొలిసారిగా మూడీస్ ఇన్వెస్టర్స్ 'బీఏఏ3 నుంచి బీఏఏ2'కు నవంబరు 17న సవరించింది.
- ఐక్యరాజ్యసమితి భారత జీడీపీ వృద్ధి రేటు 2017-18 సంవత్సరానికి 7.2 శాతంగా, 2018-19లో 7.4 శాతంగా నమోదు అవుతుందని అంచనా వేసింది.
- 2018లో బ్రిటన్, ఫ్రాన్స్‌లను వెనక్కి నెట్టి ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించనుందని సిఇబిఆర్ నివేదిక వెల్లడించింది.
- స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో ఐదు అనుబంధ బ్యాంకులు, భారతీయ మహిళా బ్యాంకు (బీఎమ్‌బీ)ల విలీనం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రపంచంలోని అగ్రగామి -50 బ్యాంకుల్లో ఎస్‌బీఐ ఒకటిగా అవతరించింది. విలీనంతో మొత్తం వినియోగదార్ల సంఖ్య 37 కోట్లకు చేరింది.
- జనవరి - మార్చిలో భారత వృద్ధి రేటు 6.1 శాతంగా నమోదైంది.
- మొండి బకాయిలతో సతమతవుతున్న బ్యాంకింగ్ రంగానికి ఊరటనివ్వడానికి రూ. 2.11 లక్షల కోట్ల ప్యాకేజీని కేంద్ర ప్రభుత్వం అక్టోబరు 23న ప్రకటించింది.



పెరిగిన ఆస్తి పన్ను

- 34 మునిసిపాలిటీల్లో సీన్ మారింది
- దొంగ లెక్కలు పట్టించిన 'శాటిలైట్'
- జీఐఎస్ సర్వేతో పన్నుల సవరణ
- పన్ను చెల్లించని నిర్మాణల గుర్తింపు

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అధికారులను మోసం చేయవచ్చేమో కానీ శాటిలైట్ నుంచి తప్పించుకోలేరు! ఎక్కువ విస్తీర్ణంలో కట్టడాలు నిర్మించి, తక్కువ పన్ను కడుతున్న వారికి ప్రభుత్వం శాటిలైట్ సాంకేతికతతో జియోగ్రాఫికల్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్)తో చెక్ పెడుతోంది. జీఐఎస్ సర్వేలో అనేక అక్రమాలకు అడ్డుకట్ట పడి 34 మునిసిపాలిటీల్లో రూ.40 కోట్లకు పైగా (28.66 శాతం) ఆస్తి పన్ను ఆదాయం పెరిగింది. జీఐఎస్ ద్వారా ఆస్తి పన్నును గణించడాన్ని తెలంగాణ మునిసిపల్ శాఖ ఏడాదిన్నర క్రితమే ప్రారంభించింది. ఇందులో భాగంగా అనేక నిర్మాణాలు పన్ను పరిధిలోకి రాలేదని గుర్తించగా... పన్ను పరిధిలోకి వచ్చిన ఆస్తుల గణనలోనూ తేడాలున్నట్లు తేలింది. శాటిలైట్ సమాచారంతో జీఐఎస్ ద్వారా పట్టణ ప్రాంతాల్లోని ఆస్తులు/నిర్మాణాలు అన్నింటినీ గుర్తించి, ప్రతి నిర్మాణం వద్దకు వెళ్లి మళ్లీ పన్ను గణించారు. రాష్ట్రంలోని అన్ని మునిసిపాలిటీల్లో జీఐఎస్ సమాచారంతో ఆస్తి పన్నును గణించనున్నారు.

34 మునిసిపాలిటీల పరిధిలో...

జీఐఎస్‌కు ముందు పన్ను పరిధిలోని ఆస్తులు	6,42,091
వసూలైన ఆస్తి పన్ను	రూ.139.69 కోట్లు
పన్ను సవరించిన ఆస్తులు	1,95,594
కొత్తగా గుర్తించిన ఆస్తులు	16,355
జీఐఎస్ తదుపరి అదనంగా వచ్చిన పన్ను	రూ.40.02 కోట్లు

శరవేగంగా 'యాదాద్రి'

ఊపందుకున్న ప్రధానాలయ పనులు... గోపుర, ప్రాకార శిల్ప నిర్మాణాలు కూడా..


యాదాద్రి కొండపై నిర్మాణ పనులు

- ప్రసాదాల కాంప్లెక్స్ పనులకు శ్రీకారం
- దక్షిణ రాజగోపుర ఆధార శిల ఏర్పాటు
- సీఎం కేసీఆర్ పర్యటన ఎఫెక్ట్!

యాదాద్రి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధాన ఆలయ పనులు వేగం పుంజుకున్నాయి. గతంలో దసరా నాటికి, తర్వాత రాబోయే బ్రహ్మోత్సవాల కల్లా పూర్తి చేయాలన్న లక్ష్యంతో చేపట్టిన పనులు మందకొడిగా సాగుతున్న నేపథ్యంలో నవంబరు 24న యాదాద్రి పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు సాగుతున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేయడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కనీసం జూన్ చివరినాటికి ఆలయ పనులు పూర్తిచేయాలన్న ప్రణాళికలతో పనులను పరుగులు పెట్టిస్తున్నారు. యాదాద్రి కొండపై ప్రధానాలయం, గోపురాలు, ప్రాకార మండపాలతో పాటు ప్రసాదాల తయారీ కాంప్లెక్స్, నీటి సరఫరా పనులను తొలి ప్రాధాన్యంగా చేపడుతున్నారు. ప్రధాన ఆలయ మండప నిర్మాణానికి పెద్ద శిల్పాలు, రాతిశిలలను నిర్మాణస్థలికి తరలించడానికి ప్రత్యేకంగా క్రేన్‌ను ఏర్పాటు చేశారు. దక్షిణం వైపు రాజగోపుర నిర్మాణానికి ఆధార శిలను స్థాపించి.. గోపుర నిర్మాణాలకు అవసరమైన స్కాఫ్‌హోల్డింగ్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. తూర్పు, ఉత్తర రాజగోపురాలతో పాటు మహారాజగోపుర నిర్మాణ పనుల్లో శిల్పులు వేగాన్ని పెంచారు. ప్రధాన ఆలయ ముఖ మండపంలో ఆళ్వార్ స్తంభాలపై రాతిశిలా బీమ్‌ల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి. వీటిపైన కాకతీయ స్తంభాలను అమర్చి రాతిశిలలతో పైకప్పు ఏర్పాటు చేయడం ద్వారా ప్రధాన ఆలయ మండప పనులు పూర్తవుతాయి. గర్భాలయంపై విమానగోపుర నిర్మాణానికి అవసరమైన పనులూ చేపడుతున్నారు. ఆలయ మండపంలోని క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి సన్నాహాలు పూర్తి చేశారు. కొండపై ప్రధాన ఆలయ నిర్మాణానికి ప్రధాన ప్రతిబంధకమైన దక్షిణ, పడమటి ఆలయ విస్తరణకు చేపట్టిన ఆర్‌సీసీ రక్షణ గోడ నిర్మాణాల్లో ఒక వైపు పూర్తి చేసినప్పటికీ, దక్షిణంవైపు పురోగతి లేక అటువైపు పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొండపై పర్వతవర్ధనీ రామలింగేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి ఆర్‌సీసీ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రసాదాల తయారీకి అత్యాధునిక పరికరాల కోసం అధికారుల బృందం చెన్నై నగరాన్ని సందర్శించింది.


ఆలయ గోపుర నిర్మాణ పనులు

చివరి దశలో టెంపుల్ సిటీ పనులు

ఆలయంతో పాటు పెద్దగుట్టపై టెంపుల్ సిటీ లేఅవుట్ పనులు దాదాపు పూర్తికావచ్చాయి. వసతి కాంప్లెక్స్ నిర్మాణానికి అభివృద్ధి చేసిన ప్లాట్లకు నెంబర్లు వేసి దాతలకు కేటాయించడానికి సిద్ధం చేశారు. టెంపుల్ సిటీ నుంచి పాతగుట్టకు రహదారిని అనుసంధానం చేసే పనులు వేగంగా సాగుతున్నాయి. కొండపై ల్యాండ్‌స్కేప్ గార్డెన్లు, గ్రీనరీ అభివృద్ధిని హెచ్ఎండీఏ చేపడుతోంది. యాదాద్రిని ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక క్షేత్రంగా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టిసారించడంతో పనులను వేగవంతం చేశామని వైటీడీఏ, ఆర్అండ్‌బీ వర్గాలు తెలిపాయి. రాబోయే జూన్‌నాటికి ప్రధాన ఆలయ పనులు పూర్తిచేస్తామని, గర్భాలయంలో భక్తులకు స్వామివారి దర్శనాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని పేర్కొన్నాయి.

ఆశలు సమాధిచేసిన క్యాన్సర్


శ్రీనివాస్‌రెడ్డి ఫైల్

- రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న శ్రీనివాస్‌రెడ్డి
- గ్రూప్2లో డీటీగా ఎంపికైన యువకుడు
- నెలరోజుల కిందటే నిశ్చితార్థం

మిర్యాలగూడ అర్బన్, డిసెంబరు 31: తల్లిదండ్రుల కలలు సాకారం చేసేందుకు కష్టపడ్డాడు.. గ్రూప్-2 పరీక్షలో ప్రతిభచాటిన ముద్దం శ్రీనివాసరెడ్డి డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. నెల రోజుల క్రితం నిశ్చితార్థం జరిగింది. శ్రీనివాసరెడ్డి గతేడాది కాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. దానికి కారణమేంటని తెలుసుకునేందుకు వైద్యపరీక్షలకు వెళ్లాడు. ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు పరీక్షలు పూర్తిచేసి పెద్దపేగుకు క్యాన్సర్ సోకిందని నిర్ధారించారు. వ్యాధి తగ్గుముఖం పట్టేందుకు రెండేళ్ల సమయం పడుతుందని వైదులు సూచించారు. దీంతో పెళ్లి చేసుకొని భార్యను సుఖపెట్టలేనంటూ మనోవేదనకు లోనయ్యాడు. ఈ జీవితం చాలనుకున్నాడేమో.. తనువు చాలించాలనే నిర్ణయానికి వచ్చి మిర్యాలగూడ రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మ చేసుకున్నాడు. నూతన సంవత్సరవేళ ఈ ఘటన విషాదాన్ని మిగిల్చింది. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలానికి చెందిన ముద్దం బస్విరెడ్డి మూడో కుమారుడు శ్రీనివాసరెడ్డి(30) ఇటీవల వెలువడిన గ్రూపు-2 పరీక్ష ఫలితాల్లో డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగానికి ఎంపికై ఇంటర్వ్యూ కోసం ఎదురు చూస్తున్నాడు. కాగా, రైలు పట్టాలపై మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన రైల్వేసిబ్బంది పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి అతడి జేబులో ఉన్న ఐడీ కార్డు ఆధారంగా మేళ్లచెర్వుకు చెందిన శ్రీనివాసరెడ్డిగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు.

సూసైడ్‌నోట్ లభ్యం

శ్రీనివాస్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థలం వద్ద లభించిన సూసైడ్ నోట్‌ను రైల్వేపోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సూసైడ్ నోట్‌లో ఇలా ఉంది... బెస్టాఫ్ లక్ టు ఆల్ న్యూ గ్రూప్-2 ఎంప్లాయిస్... పోలీసులు ఎవరినీ ఎక్వరీ చేయనవసరం లేదు. ఎవరిని ఇబ్బంది పెట్టొద్దు. నా ఆరోగ్యం సరిగా లేకే ఆత్మహత్య చేసుకుంటున్నా.. యూస్నీ లాంటి అమ్మాయిని నేను మోసం చేయలేను. యూస్నీ చాలా ఇన్నోసెంట్.. ఆ అమ్మాయితో లైఫ్‌స్టార్ట్ చేసే అదృష్టం నాకు లేదు... యూస్నీ నీవు మ్యారేజ్ చేసుకొని హ్యాపీగా ఉంటే నేను హ్యాపీగా ఉన్నట్టే... అంటూ సూసైడ్‌నోట్‌లో రాశాడు.

యాక్సిడెంట్లు తగ్గాయ్

ఏడాదిలో 1,256 మరణాలు కూడా.. ఆకస్మిక తనిఖీలు, కౌన్సెలింగ్‌తో సత్ఫలితాలు

2017లో 75 లక్షల మోటార్ వెహికిల్ కేసులు.. పోలీస్ శాఖకు రూ.163 కోట్ల ఆదాయం

హైదరాబాద్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): డ్రంకన్ డ్రైవ్‌పై ఆకస్మిక తనిఖీలు.. తల్లిదండ్రుల సమక్షంలో మందుబాబులకు కౌన్సెలింగ్.. రోడ్డు ప్రమాదాలపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన.. ఇలా రాష్ట్ర పోలీసు శాఖ చేపడుతున్న వినూత్న కార్యక్రమాల వల్ల తెలంగాణలో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడుతున్నాయి. తీవ్ర ప్రమాదాలు తగ్గుతుండటంతో మృతుల సంఖ్య కూడా తగ్గుతోంది. డీజీపీ ఎం.మహేందర్ రెడ్డి శనివారం విడుదల చేసిన వార్షిక నివేదిక ఈ విషయం వెల్లడిస్తోంది. ఆ నివేదిక ప్రకారం. 2017లో మొత్తం 20,378 రోడ్డు ప్రమాదాలు సంభవించగా.. 2016లో 22,811 జరిగాయి. అంటే 2,433 ప్రమాదాలు తగ్గాయి. 2016లో రోడ్డు ప్రమాదాల్లో 7,219 మంది మరణించంగా.. 2017లో 5,963 మంది మృతి చెందారు. తగ్గుదల 9.73 శాతంగా (1,256) ఉంది.

భాగ్యనగరంలోనే సగం ప్రమాదాలు

తెలంగాణలోని మొత్తం ప్రమాదాల్లో సుమారు సగం హైదరాబాద్‌లోనే జరుగుతుండటం గమనార్హం. 2017లో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో అత్యధికంగా 3,274 రోడ్డు ప్రమాద కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాతి స్థానంలో హైదరాబాద్ కమిషనరేట్‌లో 2,568, రాచకొండలో 2,380 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. హైదరాబాద్‌లోని మూడు కమిషనరేట్ల పరిధిలోనే మొత్తం 8,222 ప్రమాదాలు సంభవించడం గమనార్హం. హైదరాబాద్ తర్వాత వరంగల్ కమిషనరేట్‌లో 1,072 రోడ్డు ప్రమాద కేసులు నమోదయ్యాయి. రోడ్డు ప్రమాదాల్లో సైబరాబాద్ 684 మంది, రాచకొండలో 617 మంది, వరంగల్‌లో 357 మంది, నల్లగొండ జిల్లాల్లో 357 మంది మృత్యువాత పడ్డారు. దుర్మరణం చెందిన వారిలో 46 శాతం 18 నుంచి 35 ఏళ్ల వయసు వారు. సాయంత్రం 6-9 గంటల మధ్యలోనే ఎక్కువ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

"సైబరాబాద్ పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారులు ఉండటం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రమాదాలను తగ్గించడానికి కార్యాచరణ రూపొందించాం. 2016తో పోల్చితే 2017లో స్వల్పంగా తగ్గాయి. ఆకస్మిక తనిఖీలను పెంచాం. అనేక మంది మందుబాబులను కటకటాలవెనక్కి నెట్టాం. నూతన సంవత్సరంలో 20 శాతం ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం" అని సైబరాబాద్ సీపీ సందీప్ శాండిల్య 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

ప్రమాదాల గణాంకాలివీ

	2014	2015	2016	2017
ప్రమాదాలు	20,078	21,252	22,811	20,378
మరణాల సంఖ్య	6,906	7,110	7,219	5,963
గాయపడినవారు	21,636	22,948	24,217	21,697

కేసులు... జరిమానాలు

	2014	2015	2016	2017
కేసులు (లక్షల్లో)	49.67	56.28	71.07	75.64
ఆదాయం (కోట్లలో)	95	101	124	163

ప్రమాదరహిత రాష్ట్రంగా తెలంగాణ



ప్రమాద రహిత తెలంగాణ దిశగా అడుగులు వేద్దామని రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. గత ఏడాది రోడ్డు ప్రమాదాలను తగ్గించిన రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపు పొందినట్టు చెప్పారు. అదే స్ఫూర్తితో 2018లో ప్రమాదాలను నివారించాలని పిలుపునిచ్చారు. మునుపటి సంవత్సరంతో పోలిస్తే 22 శాతం ఆదాయం పెరిగిందని తెలిపారు. రవాణా శాఖ ఆన్‌లైన్ విధానం, ఎం-వాలెట్ తదితర స్మార్ట్ విధానాలతో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని ఆయన చెప్పారు.

75 లక్షల కేసులు..!
రూ. 163 కోట్ల ఆదాయం!

ఈ ఏడాది ఉల్లంఘనులపై రాష్ట్ర పోలీస్ శాఖ కొరడా ఝుళిపించింది. మొత్తం 75.65 లక్షల మోటార్ వెహికిల్ కేసులు నమోదు చేసింది. వాటి ద్వారా ఖజానాకు రూ.163 కోట్ల ఆదాయం లభించింది. 2016లో 64.52 లక్షల కేసులు నమోదయ్యాయి. కేసుల పెరుగదల శాతం 17.25గా ఉంది. 2016లో రూ.113 కోట్లు జరిమానా వసూలు చేశారు. ఏడాది వ్యవధిలో ఆదాయం 43 శాతం పెరగడం గమనార్హం. తెలంగాణ గుండా 23 జాతీయ రహదారులు వెళ్తున్నాయి. వాటి విస్తీర్ణం 5,627 కిలో మీటర్లు. రాష్ట్ర రహదారులు 1,576 కిలోమీటర్లు కాగా, 19,634 కిలో మీటర్ల విస్తీర్ణంలో జిల్లా, ఇతర రోడ్లు ఉన్నాయి.



విద్య, వైద్యం.. తొలి ప్రాధాన్యం

- భారీగా ఖర్చు చేస్తున్న రాష్ట్రాలు
- దేశంలోనే ఐదో స్థానంలో తెలంగాణ
- వ్యయాన్ని తగ్గించేసిన ఆంధ్రప్రదేశ్
- కేంద్రానికి నీతిఆయోగ్ నివేదిక

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సామాజిక రంగాలపై రాష్ట్రాలు చేస్తోన్న వ్యయాల్లో గణనీయమైన మార్పు వచ్చిందని కేంద్రానికి నీతి ఆయోగ్ నివేదిక ఇచ్చింది. 2014-15, 2015-16 ఆర్థిక సంవత్సరాల్లో దేశంలోని వివిధ రాష్ట్రాలు సామాజిక రంగాలైన వైద్యం, విద్యపై చేస్తున్న వ్యయ వివరాలను కేంద్రానికి అందించింది. ఇందులో తెలుగు రాష్ట్రాలైన ఏపీ సామాజిక రంగంపై వ్యయాన్ని తగ్గించగా.. తెలంగాణ మాత్రం పెంచినట్లు వెల్లడించింది. దేశ వ్యాప్తంగా మణిపూర్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ మినహా... మిగిలిన రాష్ట్రాలన్నీ సామాజిక రంగాలపై వ్యయాన్ని ఏటా పెంచుతున్నట్టు పేర్కొంది. కాగా, ఆంధ్రప్రదేశ్ తక్కువ నిధులు వెచ్చించడానికి రాష్ట్ర విభజన కూడా ఒక కారణం కావచ్చని నీతిఆయోగ్ అభిప్రాయపడింది. ఇంకా ఈ నివేదికలో 2014-15, 2015-16 ఆర్థిక సంవత్సరాల్లో దేశంలోని 29 రాష్ట్రాలకు కేంద్రం నుంచి వచ్చిన నిధులు.. ఆయా రాష్ట్రాలు సామాజిక రంగాలపై ఎంతెంత వ్యయం చేసిందన్న అంశాలపై వివరాలను పొందుపరిచింది. అంతే కాకుండా 1990 నుంచి గతేడాది దాకా సామాజిక రంగాలపై కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఏ మేరకు నిధులు కేటాయించాయన్న విషయాన్ని పేర్కొంది. జమ్మూకశ్మీరు, అసోం, జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాలు వైద్యంపై ఎక్కువ ఖర్చు చేస్తుండగా... విద్య కోసం జమ్మూకశ్మీర్, నాగాలాండ్, అసోం, బిహార్, గోవా రాష్ట్రాలు అధికంగా నిధులు వెచ్చిస్తున్నాయి. సామాజిక రంగంపై చేసిన వ్యయంలో జమ్మూకశ్మీరు 7.50 శాతంతో అగ్రస్థానంలో ఉండగా... ఆ తరువాత అసోం, నాగాలాండ్ మూడు, నాలుగు స్థానాల్లో ఉండగా... ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలు ఐదో స్థానంలో నిలిచాయని వివరించింది.

సామాజిక రంగంపై కేంద్ర, రాష్ట్రాలు చేసిన వ్యయం (కోట్లలో)

సంవత్సరం	రాష్ట్రాలు	జీడీపీలో శాతం	కేంద్రం	జీడీపీలో శాతం
1990-91	27,199	4.81	6,629	1.13
2000-01	1,01,551	4.68	25,542	1.18
2006-07	1,89,443	4.41	78,768	1.58
2010-11	3,99,537	5.13	1,47,494	1.89
2014-15	6,99,173	5.62	2,01,983	1.62
2015-16	8,99,157	6.58	2,28,846	1.67

తెలుగు రాష్ట్రాలు జీఎస్‌డీపీలో చేసిన వ్యయ శాతం

	వైద్య రంగం		విద్యారంగం	
రాష్ట్రం	2014-2015	తేడా	2014-2015	తేడా
తెలంగాణ	0.49-0.75	0.26	1.34-1.78	0.44
ఆంధ్రప్రదేశ్	1.04-0.80	-0.24	3.16-2.77	-0.39
అన్ని రాష్ట్రాలు	0.77-0.87	0.10	2.71-2.90	0.19

స్థానికాభివృద్ధి నిధుల్లో మనోళ్ల దూకుడు

అత్యధికంగా ఖర్చు చేసింది గుత్తా.. అత్యల్పంగా బీబీ.పాటిల్


సుఖేందర్ రెడ్డి



బీబీ పాటిల్

న్యూఢిల్లీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాంత అభివృద్ధి నిదులు (ఎంపీ ల్యాడ్స్) ఖర్చు చేయడంలో తెలంగాణ లోక్‌సభ సభ్యులు ముందున్నారు. ఎంపీలకు తమ నియోకవర్గ అభివృద్ధి కోసం ఏటా ఇచ్చే రూ.5కోట్ల నిధులు నాలుగేళ్లకు ఒక్కొక్కరికి రూ.20కోట్ల మేర ఖర్చు చేసే అవకాశం ఏర్పడింది. రాష్ట్రంలో మొత్తం 17 మందికి నాలుగేళ్లకు రూ.340 కోట్లు మంజూరు కావాల్సి ఉండగా, రూ.195 కోట్లు విడుదలయ్యాయి. వీటికి వడ్డీ కలుపుకొంటే రూ.241కోట్లు ఉండగా, వాటిలో రూ.181.66 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఇంకా రూ.59.91 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. మొత్తం రూ.20కోట్ల కోటాలో అత్యధికంగా ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి రూ.14.74 కోట్లు ఖర్చు చేయగా, అత్యల్పంగా బీబీ. పాటిల్ రూ.5.18కోట్లు ఖర్చు చేశారు. మిగతా ఎంపీల్లో వరుసగా పసునూరి దయాకర్ రూ. 14.11కోట్లు, సీతారాంనాయక్ రూ. 13.95కోట్లు, నంది ఎల్లయ్య రూ.13.74 కోట్లు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రూ.13.67 కోట్లు, సీహెచ్.మల్లారెడ్డి రూ.12.58 కోట్లు, అసదుద్దీన్‌ఒవైసీ రూ.11.32కోట్లు, దత్తాత్రేయ రూ.10.37కోట్లు, కవిత రూ.9.82కోట్లు, బి.వినోద్‌కుమార్ రూ.9.74కోట్లు, జి.నగేష్ రూ.9.6కోట్లు, ఏపీ.జితేందర్‌రెడ్డి రూ.9.58కోట్లు, కె.ప్రభాకర్‌రెడ్డి రూ.9.28కోట్లు, కొండా విశ్వేశ్వరరెడ్డి రూ.8.39 కోట్లు, బాల్క సుమన్ రూ.8.29 కోట్లు, బూర నర్సయ్యగౌడ్ రూ.7.31కోట్లు ఖర్చు చేశారు. కాగా, వీరిలో జితేందర్‌రెడ్డి, బి.వినోద్‌కుమార్, దత్తాత్రేయ, కవిత, అసదుద్దీన్ ఒవైసీ, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బాల్క సుమన్ వినియోగ సర్టిఫికెట్లు అందజేయలేదు.

మంజూరైనా ఖర్చు చేయని నిధులు ఎక్కువ ఉన్న ఎంపీలు

కవిత	రూ.6.91 కోట్లు
బీబీ.పాటిల్	రూ.5.49 కోట్లు
సీహెచ్.మల్లారెడ్డి	రూ.5.15 కోట్లు

ఎన్ని పనులు మంజూరు చేశారు



S & D



బోధించడానికి వీలుకానిది..



'పద్మం' మనకు గొప్ప సంకేతంగా శాస్త్రాలు పేర్కొన్నాయి. అది ఎప్పుడూ నీటిలోనే ఉంటుంది. కానీ దానికి నీటితో సంబంధం ఉండదు. తామరాకు ఎప్పుడూ నీళ్లలోనే ఉంటుంది. కానీ దానిని బయటకు తీస్తే పైన నీటి స్పర్శ కూడా కన్పించదు. వీటన్నిటి సంకేతాలు ఏమిటంటే.. మనం ప్రపంచంలో ఉంటూనే దాని స్పర్శ తగలకుండా జీవించాలి. లోకంలోని అన్ని విషయాలనూ సాక్షీభూతులుగా గమనిస్తూ ఉండాలి తప్ప ఆ ప్రభావాన్ని మోసుకొని తిరగకూడదు. అలా ప్రతి కల వెంటా తిరిగే వారు ఎప్పటికీ అంతర్ముఖులు కాలేరు. దీనికి సంబంధించి ఉపనిషత్తుల్లో ఒక కథ ఉంది. శ్వేతకేతు అనే విద్యార్థి తన తండ్రి వద్దకు వెళ్లి.. అన్ని విద్యలు నేర్చుకొన్నానని చెప్తాడు. అప్పుడా తండ్రి.. 'దేన్ని తెలుసుకొంటే ఇంకేమీ తెలుసుకోవలసిన అవసరం ఉండదో, దేన్ని గ్రహిస్తే బాధలన్నీ మాయమవుతాయో, ఏది బోధించడానికి వీలుకాదో దాన్ని తెలుసుకో!' అని మళ్లీ గురువు దగ్గరకు పంపిస్తాడు. 'ఇది నీకు నేర్పించాలంటే నీవు మన ఆశ్రమంలోని నాలుగు వందల పశువులు వెయ్యి అయ్యాక తిరిగి రా" అంటూ గురువు శ్వేతకేతును అరణ్యానికి పంపిస్తాడు. అదెంత పని అని బయల్దేరిన శ్వేతకేతు తన జ్ఞానాన్ని పశువుల ముందు ప్రదర్శించాలనుకొంటే అవి అతణ్ణి లక్ష్య పెట్టవు. పక్షులు, మృగాలు, రాళ్ళు, రప్పలూ, నదీనదాలూ, ప్రవాహాలు ఏవీ అతని జ్ఞానాన్ని లక్ష్యపెట్టవు. దీంతో అతని గర్వమంతా మంచులా కరిగిపోయి అంతర్ముఖుడై అంతరంగంలోకి పయనిస్తాడు. ఎప్పుడు తిరిగి ఆశ్రమానికి వెళ్లాలో మరచిపోతాడు. కొన్నాళ్లకు పశువులు వేయి అయ్యాయి. వాటిలో ఓపిక నశించి, అతను తిరిగి తీసుకెళ్లడం లేదని గ్రహించి.. ఆశ్రమానికి వెళ్లాలని శ్వేతకేతుకు గుర్తు చేశాయి. నిగర్విగా, అంతర్ముఖుడుగా శ్వేతకేతు పశువుల వెంట నడుస్తూ ఆశ్రమానికి చేరుకున్నాడు. గురువు ఆహ్వానించడానికి వస్తే "వేయినొక్క పశువులు వస్తున్నాయి చూడండి" అంటూ మిగతా శిష్యులకు చూపించాడు. దీంతో.. "మీ నాన్న ఏది నేర్చుకోమన్నాడో అది నీకు తెలిసిపోయింది" అన్నాడు గురువు. బాహ్య ప్రపంచపు పొరల్లోబడి సత్యశోధన చేయకుండా పైపై ఆడంబరపు ఆధ్యాత్మికతతో జీవించే వ్యక్తులు అంతర్ముఖులు కాలేరు. వారి ఆత్మకు చైతన్యం, ఆధ్యాత్మిక తత్వం కలగాలంటే మనసు పొరల్ని దాటి లోతైన అవలోకనం చేయాల్సిందే.

-డాక్టర్ పి.భాస్కర యోగి

Paramjyothi పరంజ్యోతి



లోకం తీరు

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	05.7	29.0
హైదరాబాద్	12.7	30.8
వరంగల్	13.5	31.0
సంగారెడ్డి	14.0	28.0
ఖమ్మం	17.0	31.0

ఆదిలాబాద్‌లో 5.7 డిగ్రీలు

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగానే నమోదవుతున్నాయి. ఆదిలాబాద్‌లో ఆదివారం 5.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మెదక్‌లో 9.7డిగ్రీలు, ఖమ్మంలో 11డిగ్రీలు, ఖమ్మంలో 6డిగ్రీల మేరకు సాధారణం కంటే తక్కువ రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, సోమవారం అక్కడక్కడా 2 నుంచి 3 డిగ్రీల మేర సాధారణం కంటే తక్కువ రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

ధనవంతురాలైన భార్య నుంచి జీవనభృతి!



విడాకులు పొందాక సంపాదన లేని భర్త.. భార్య మంచి సంపాదనపరురాలుగా లేదా ధనవంతురాలుగా ఉంటే ఆమె నుంచి జీవనభృతి కోరవచ్చు. ప్రస్తుతం పురుషులతో పాటు స్త్రీలకు సమానమైన ఆస్తి హక్కు ఉంది. మహిళలూ అన్ని రంగాల్లోనూ పురుషులకు ధీటుగా రాణిస్తున్నారు. ఉపాధి లేని, పేదరికంతో బాధపడే భర్త ఆమె నుంచి జీవనభృతి కోరవచ్చు.

- జస్టిస్ ఏఆర్ లక్ష్మణన్, సుప్రీంకోర్టు మాజీ జడ్జి

ప్రధాని మోదీవి ఉత్తుత్తి నినాదాలు



ప్రధాని మోదీ ఉత్తుత్తి హామీలు ఇస్తుంటే.. చైనా మాత్రం అభివృద్ధిలో భారత్‌ను దాటి ముందుకుపోతోంది. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు కోసం రూ.9860 కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. ఇందులో కేవలం 7శాతం మాత్రమే ఖర్చు చేసింది. ప్రియమైన మోదీ భక్తులారా.. మీ నాయకుడు ఉత్తుత్తి నినాదాలు ఇస్తున్నారు. భారత్‌లో ఉపాధి కల్పనే ముఖ్యమని మీరైనా ఆయనకు చెప్పండి.

- కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.74.01	పాత ధర 64.71
కొత్త ధర రూ.74.09	కొత్త ధర 64.79
పెరుగుదల: 8 పైసలు	పెరుగుదల: 8 పైసలు

జింక్ లోపంతో శ్వాసకోశ వ్యాధులు



టోక్యో, డిసెంబరు 31: జింక్ లోపం కారణంగా శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఊపిరితిత్తులలోని కణాలకు జింక్ సరిగా సరఫరా కాకపోవడంతో చీమిడి విపరీతంగా ఉత్పత్తి అయ్యి శ్వాసకోశ వ్యాధులు వస్తాయని తమ పరిశోధనల్లో తేలిందని జపాన్‌లోని కుమామోటో యూనివర్సిటీ శాస్త్రవేత్తలు తెలిపారు. జలుబు వల్ల శ్వాసనాళాల్లో సమస్యలు తలెత్తి తగిన గాలి ఊపిరితిత్తులకు అందక దగ్గు సహా పలు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వివరించారు.

జీవ కణజాలంతో 3డీ రూపాలు!



లాస్ ఏంజెలిస్, డిసెంబరు 31: జీవ కణజాలాలతో సంక్లిష్ట 3డీ ఆకృతులను పునఃసృష్టి చేసే అత్యాధునిక సాంకేతిక విధానాన్ని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, యూనివర్సిటీ ఆఫ్ శాన్‌ఫ్రాన్సిస్కో శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. చురుగ్గా ఉన్న ఎలుక కణాలను ప్రోగ్రామింగ్ చేసి అవి గిన్నెలు, కాయిల్స్, డబ్బాల మాదిరిగా మారేలా చేశారు. దానికోసం డీఎన్ఏ- ప్రోగ్రామ్‌డ్ అసెంబ్లీ ఆఫ్ సెల్స్(డీపీఏసీ) అనే పద్ధతిని వాడినట్లు పరిశోధకులు తెలిపారు. ప్రాథమిక జీవశాస్త్రాన్ని మరింత వివరంగా తెలుసుకోవడానికి ఈ విధానం ఉపయోగపడుతుందని వెల్లడించారు.

రూ. 65 కే ఎల్‌ఈడీ బల్బు

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ ఎల్‌ఈడీ వెలుగులు పంచే కార్యక్రమంలో భాగంగా ఫిలిప్స్ ఎల్‌ఈడీ బల్బులను పంపిణీ చేసేందుకు మండలాల వారీగా పంపిణీదారుల నియామకం పూర్తయింది. 9 వోల్టుల సామర్థ్యమున్న ఎల్‌ఈడీ బల్బు వాస్తవ ధర రూ. 120 కాగా, వాటిని రూ. 65 కే అందుబాటులోకి తెస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీఎస్ ఆర్‌ఈడీసీవో) తెలిపింది. ఈ మేరకు టీఎస్‌ఆర్‌ఈడీసీవో ఉపాధ్యక్షుడు ఎ.సుధాకర్‌రావు ఓ ప్రకటనలో వెల్లడించారు.

ప్రభుత్వ కార్యాలయాలకు నేడు సెలవు

హైదరాబాద్, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ప్రభుత్వ కార్యాలయాలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. జనవరి 1న ఇచ్చిన సెలవుకు ప్రతిగా ఫిబ్రవరి నెల రెండో శనివారం పనిదినంగా ప్రకటించారు. ఈ మేరకు ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది.

రాజ్‌భవన్‌లో నేడు ఓపెన్‌హౌజ్

హైదరాబాద్, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో ఓపెన్ హౌజ్ కార్యక్రమం జరుగనుంది. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అందుబాటులో ఉంటారని, ఆయనకు సాధారణ ప్రజలు, పౌరసంస్థల ప్రతినిధులు, నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిజేయవచ్చని అధికారులు పేర్కొన్నారు.

నేటి నుంచి ఎరువులకు ఆధార్!

- ఈ-పీవోఎస్‌ల ద్వారానే అమ్మకం

హైదరాబాద్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఎరువుల సబ్సిడీ అమల్లో నూతన సంవత్సరాది.. కొత్త విధానానికి శ్రీకారం చుట్టనుంది. తెలంగాణ వ్యాప్తంగా సోమవారం నుంచి రిటైల్‌గా ఎరువుల అమ్మకం ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్(ఈ-పీవోఎస్/ఈ-పోస్) మిషన్ల ద్వారానే జరగనుంది. ఎరువులను కొనడానికి దుకాణానికి వెళ్లే ప్రతి రైతూ ఆధార్ కార్డును తప్పనిసరిగా వెంట తీసుకువెళ్లాల్సి ఉంది. అలాగే ఈ-పోస్ మిషన్ల ద్వారా ఎరువుల అమ్మకం జరిగితేనే సంబంధిత ఎరువులకు కేంద్రం ఇచ్చే సబ్సిడీ.. ఆయా ఎరువుల కంపెనీలకు జమవుతుంది. ఎరువుల సబ్సిడీ పక్కదారి పట్టకుండా ఈ పథకంలో డీబీటీ విధానాన్ని అమలు చేయాలని కేంద్రం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ప్రతి ఎరువుల దుకాణంలోనూ ఈ-పోస్ మిషన్‌ను అమర్చి.. ప్రతి ఎరువు బస్తా అమ్మకాన్ని, కొన్న రైతు ఆధార్ నంబరు, ఇతర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్లో ఆయా వివరాలను సరి చూసుకుని ఎరువుల బస్తాకు ఇచ్చే సబ్సిడీని తయారీ సంస్థకు కేంద్రం జమ చేస్తుంది. ఈ విధానాన్ని గతేడాది ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేశారు. జనవరి 1 నుంచి తెలంగాణ వ్యాప్తంగా ఇదే విధానం అమలు కానుంది. ఇందులో భాగంగా సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 6,641 ఎరువుల దుకాణాలకు పీవోఎస్‌లను ప్రభుత్వం పంపిణీ చేసింది. వీటిలో సాంకేతిక కారణాలతో 264 పీవోఎస్‌లు మాత్రమే యాక్టివేట్ కాలేదు. ఎరువుల దుకాణాలకు సకాలంలో పీవోఎస్‌ల పంపిణీ, యాక్టివేషన్‌లో దేశంలోనే రెండో స్థానంలో తెలంగాణ నిలిచింది. తొలి స్థానంలో తమిళనాడు ఉంది. తమిళనాడులో 96.65 శాతం పీవోఎస్‌లు యాక్టివేట్ కాగా.. తెలంగాణలో 96.06 శాతం యాక్టివేట్ అయ్యాయి. పీవోఎస్‌ల యాక్టివేషన్ విషయంలో సాధించిన ప్రగతికిగాను కేంద్ర వ్యవసాయశాఖ అదనపు కార్యదర్శి ధర్మపాల్.. రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథికి ఫోన్ చేసి అభినందనలు తెలిపారు.

పీజీటీకి 425 మంది ఎంపిక

- త్వరలో దివ్యాంగుల కోటా పేర్లు వెల్లడి
- అటవీ వర్సిటీ పోస్టులకు అర్హుల కొరత
- కొన్నింటినే భర్తీ చేస్తూ జాబితా విడుదల

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ) పోస్టులకు 425 మందిని ఎంపిక చేస్తూ టీఎస్‌పీఎస్సీ ఆదివారం ప్రొవిజనల్ జాబితాను విడుదల చేసింది. మొత్తం 513 పోస్టులకు గాను 425 మందిని ఎంపిక చేయగా, మిగతా 88 మందిని దివ్యాంగుల కోటాలో మెడికల్ రిపోర్టుల ఆధారంగా జాబితాను త్వరలో ప్రకటించనున్నారు. ఎంపికైన వారి జాబితాను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు అధికారులు తెలిపారు. పీజీటీలో 126 గణితం పోస్టులకు 114 మందిని, 22 బయాలజికల్ సైన్స్ పోస్టులకు 21 మందిని, 177 సోషల్ సైన్స్ పోస్టులకు 116 మందిని, 188 ఫిజికల్ సైన్స్ పోస్టులకు 174 మందిని ఎంపిక చేశారు. ఇదిలా ఉండగా, ములుగులో కొత్తగా ఏర్పాటు చేయనున్న అటవీ రీసెర్చ్ యూనివర్సిటీ ఖాళీల భర్తీకి సంబంధించి ప్రొవిజనల్ జాబితాను కూడా టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. మొత్తం 19 ప్రొఫెసర్/అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల కోసం(ఇందులో ఒకటి లైబ్రేరియన్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే ఈ పోస్టులకు కేవలం 8 మంది మాత్రమే అర్హులు ఉండడం గమనార్హం. ప్రొఫెసర్ పోస్టుల్లో రెండు సబ్జెక్టులకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానించగా.. ఒక సబ్జెక్టుకు సంబంధించి మాత్రమే దరఖాస్తు అందింది. ఇక నాలుగు సబ్జెక్టులకు సంబంధించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు కనీసం ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. మరో 12 సబ్జెక్టులకు సంబంధించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు గాను 11 సబ్జెక్టులకు సంబంధించిన దరఖాస్తులు రాగా ఇందులో కేవలం 7గురు మాత్రమే అర్హులు ఉన్నారు. ఇక, లైబ్రేరియన్ పోస్టుకు సంబంధించి 5, 6తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ పేర్కొంది.

రికార్డు బద్దలు కొట్టిన సింగరేణి

- 90 శాతం సగటు పీఎల్ఎఫ్
- సీఎండీ శ్రీధర్ హర్షం

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం రికార్డు నెలకొల్పింది. డిసెంబరులో 99.5 ప్లాంట్ ఉత్పాదక సామర్థ్యం (పీఎల్ఎఫ్) సాధించింది. దీంతోపాటు ఈ ఆర్థిక సంవత్సరం 90 శాతం సగటు పీఎల్ఎఫ్‌తో జాతీయ స్థాయిలో నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ విద్యుత్ కేంద్రం వయసు కేవలం 18 నెలలు కావడం గమనార్హం. గడిచిన నాలుగు నెలల్లో ఈ కేంద్రం జాతీయ ర్యాంకింగ్‌లో ఒక్కో మెట్టు ఎగబాకింది. సెప్టెంబరు వరకు 87.54 శాతం పీఎల్ఎఫ్‌తో 8వ స్థానం, నవంబరు వరకు 89.01 శాతం పీఎల్ఎఫ్‌తో 7వ స్థానం, అక్టోబరు వరకు 88.83 శాతంపీఎల్ఎఫ్‌తో 6వ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ఫిబ్రవరి, మే, నవంబరు నెలల్లో 100 శాతం పీఎల్ఎఫ్ సాధించింది. డిసెంబరు మాసాంతానికి ఈ కేంద్రంలోని ఒకటో యూనిట్ 5,977 మిలియన్ యూనిట్లను, రెండో యూనిట్ 5,415 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేశాయి. సింగరేణి ఘనతపై ఆ సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. బంగారు తెలంగాణ నిర్మాణమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల విద్యుత్తు సరఫరాను అమలు చేస్తున్న తరుణంలో సింగరేణి విద్యుత్ కేంద్రం తన వంతుగా బాధ్యత నిర్వర్తిస్తోందన్నారు.

ప్రజలు మెచ్చేలా పోలీసింగ్

సిబ్బంది పనితీరు మెరుగుపరిచేందుకు చర్యలు.. పోలీస్ సేవలపై థర్డ్ పార్టీ ఆడిట్ : డీజీపీ మహేందర్‌రెడ్డి

- కామారెడ్డిలో డీపీఓ పనుల పరిశీలన
- సిద్దిపేట పోలీసు కమిషరేట్ సందర్శన

కామారెడ్డి/సిద్దిపేట, డిసెంబరు 31 : ప్రజలు నచ్చే విధంగా.. మెచ్చే విధంగా పోలీస్ శాఖ పని చేస్తుందని, నూతన సంవత్సరంలో కొత్త సంస్కరణలతో ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తామని డీజీపీ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆదివారం కామారెడ్డి చేరుకున్న డీజీపీ.. పట్టణ శివారులో నూతనంగా నిర్మిస్తున్న జిల్లా పోలీసు భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం తాత్కాలిక డీపీవో కార్యాలయంలో సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్‌ను ప్రారంభించారు. జిల్లా పోలీసు అధికారులతో డీజీపీ సుమారు గంట పాటు సమీక్షించారు. కామారెడ్డిలో డీపీవో భవనాన్ని సీఎం కేసీఆర్ చేతులమీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం శాంతిభద్రతలకు నిలయంగా ఉందన్నారు. అందుకే పారిశ్రామిక వేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో అమలు చేస్తున్న సంస్కరణల కారణంగా 40 శాతం మేర నేరాలు తగ్గాయని, ఇక నుంచి వాటిని అన్ని జిల్లాల్లో అమలు చేస్తామని తెలిపారు. నేరాలను తగ్గించేందుకు పోలీసుశాఖలోని అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తున్నారన్నారు. కామారెడ్డి జిల్లాలో పోలీసు శాఖ పని తీరు బాగుందని, ఇదే ఉత్సాహంతో కొత్త సంవత్సరంలోనూ చురుకుగా పనిచేయాలని సూచించారు. అలాగే, సిద్దిపేట జిల్లాలోని పోలీసు కమిషనరేట్ కార్యాలయాన్ని డీజీపీ సందర్శించారు. అనంతరం సిద్దిపేట శివారులోని ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో కమిషనరేట్ పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీసుల పనితీరును మెరుగుపరిచేందుకు థర్డ్ పార్టీ ఆడిట్(సర్వే) విధానం ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసుల పనితీరు బాగుందని అభినందించారు. పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో నూతన టెక్నాలజీ వినియోగంపై డీజీపీ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమాల్లో తెలంగాణ రీజియన్ ఐజీ స్టీఫెన్ రవీంద్ర, సిద్దిపేట సీపీ శివకుమార్ పాల్గొన్నారు.



కామారెడ్డి డీపీవోలో సిటిజన్ ఫీడ్ బ్యాక్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డీజీపీ

వ్యవసాయానికి 24గంటల

విద్యుత్ చరిత్రాత్మకం

'ఆంధ్రజ్యోతి'తో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): రైతులకు నూతన సంవత్సర కానుకగా వ్యవసాయానికి 24గంటలు ఉచిత విద్యుత్ అందించడం చరిత్రాత్మకమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధానాన్ని అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. నూతన సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో రూ.7 వేల కోట్లతో చేపట్టిన 1080 మెగావాట్ల భద్రాద్రి పవర్‌ప్లాంట్, పాల్వంచలో రూ.5290కోట్లతో చేపట్టిన 800మెగావాట్ల కేటీపీఎస్ ఏడో దశ పనులు ఈ ఏడాది పూర్తవుతాయన్నారు.

విద్యుత్తు మరణాలకు పరిహారం లక్ష పెంపు

- మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు ఇవ్వనున్న టీఎస్ఈఆర్‌సీ
- ఆవులు, బర్రెలకు రూ.40వేల పరిహారం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు శాఖకు సంబంధం లేని వ్యక్తులు విద్యుత్తు ప్రమాదాల్లో చనిపోతే నష్టపరిహారం రూ.5లక్షలు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(టీఎస్ఈఆర్‌సీ) నిర్ణయించింది. విద్యుత్తు ప్రమాద మరణాలపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించడంతో కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటిదాకా శాఖతో సంబంధం లేనివారు మృతిచెందితే రూ.4లక్షల పరిహారం ఇచ్చేవారు. తాజాగా, పరిహారం రూ.5లక్షలు చేస్తూ కమిషన్ అధికారులు ఆదివారం టీఎస్ఈఆర్‌సీ/సెక్రటరీ/64 ఆఫ్ 2017 డీనెం.780 ఉత్తర్వు జారీచేశారు. ఇక, విద్యుత్తు ప్రమాదాల్లో ఆవులు, బర్రెలు చనిపోతే రూ.40వేలుగా ఇవ్వాలని, గొర్రెలు, మేకలకు రూ.7వేలుగా నిర్ణయించారు. కాగా, క్షేత్రస్థాయి విద్యుత్తు సిబ్బంది బాధ్యతారాహిత్యం, అవగాహన లోపం వల్ల విద్యుత్తు ప్రమాదాలు అన్నీ రికార్డుల్లోకి ఎక్కడం లేదు. 2010 నుంచి 2016-17 మధ్య ఎస్పీడీసీఎల్ పరిధిలో మృతి చెందిన వారి సంఖ్య 932(అధికారిక లెక్కల ప్రకారం). వీరిలో 500 మందికి సహాయం అందినట్లు లెక్కలున్నాయి. ఇక ఎన్పీడీసీఎల్ పరిధిలో 2015-16, 2016-17లో 94 మంది చనిపోతే 70మందికి పరిహారం దక్కింది. అయితే, వివిధ కారణాలతో బాధిత కుటుంబాలకు పరిహారం అందించకుండా తిరస్కరిస్తున్నారు. కాగా, సోలార్ విద్యుత్తుపై క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీ ఉండబోదని టీఎస్ఈఆర్‌సీ స్పష్టం చేసింది. గత ఆగస్టులో టారిఫ్ ఉత్తర్వుల్లో సోలార్‌పై స్పష్టత ఇవ్వక పోవడంతో ఆదివారం సవరణ ఉత్తర్వులు జారీ చేసింది.

కొత్త వెలుగు!



ఆదివారం అర్ధరాత్రి 12.01 గంటలకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం పోతాయిపల్లి గ్రామంలోని చింతల వెంకటరెడ్డి పొలంలో ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు, ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి మోటారు ఆన్ చేసి లాంఛనంగా ప్రారంభిస్తున్న దృశ్యం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయానికి నిరంతర విద్యుత్తు సరఫరాను ప్రారంభించింది. రాష్ట్రంలోని 23 లక్షల పంపుసెట్లకు 24 గంటల విద్యుత్తు అందించడానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర రైతాంగానికి నూతన సంవత్సర కానుకగా, ఆదివారం అర్ధరాత్రి 12.01 గంటలకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం పోతాయిపల్లి గ్రామంలోని చింతల వెంకటరెడ్డి పొలంలో ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు, ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి మోటారు ఆన్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. అర్ధరాత్రి ఆ గ్రామానికి వెళ్లి రైతులతో మాట్లాడారు. తద్వారా, దేశంలోనే వ్యవసాయానికి ఉచితంగా 24 గంటలపాటు కరెంటు ఇస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. గుజరాత్ సహా ఇప్పటి వరకూ ఏ రాష్ట్రం ఈ ఘనతను సాధించలేదు. కొన్ని రాష్ట్రాలు 9 గంటలపాటు ఉచిత విద్యుత్ ఇస్తున్నాయి. మరికొన్ని రాష్ట్రాల్లో 24 గంటలు సరఫరా చేస్తున్నా ఉచితంగా ఇవ్వడం లేదు. ఉచితంగా 24 గంటల వ్యవసాయ కరెంటు ఇచ్చే రాష్ట్రం తెలంగాణ మాత్రమే! అంతేనా, రాష్ట్రంలోని అన్ని రంగాలకూ నిరంతర విద్యుత్తు ఇస్తున్న రాష్ట్రంగానూ చరిత్ర సృష్టించింది. వ్యవసాయానికి నిరంతర విద్యుత్తు సరఫరా అందించడానికి 11 వేల మెగావాట్లకుపైగా కరెంటు అవసరమని అంచనా. దాంతో, అందుకు తగిన ఏర్పాట్లను ట్రాన్స్‌కో చేసింది.

7 గంటల నుంచి 24 గంటలకు

రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో రైతులకు విడతలవారీగా రోజుకు 7 గంటలపాటు కరెంట్ సరఫరా జరిగేది. రైతులకు విడతలవారీగా కాకుండా 24 గంటలపాటు నిరంతరాయంగా అందించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ భావించారు. అందుకనుగుణంగానే విద్యుత్ సంస్థలు ఏర్పాట్లు చేశాయి. వ్యవసాయానికి నిరంతర విద్యుత్తు అందించడానికి జెన్‌కో, ట్రాన్స్‌కోలతోపాటు ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ రూ.12,610 కోట్ల వ్యయంతో సంయుక్తంగా ఏర్పాట్లు చేశాయి. గ్రిడ్ సమస్యలు తలెత్తకుండా ఎక్కడికక్కడ అదనపు ఏర్పాట్లు చేశారు. 2014 జూన్ 2కు ముందు రాష్ట్రంలో 5,240 మెగావాట్ల విద్యుత్ సరఫరాకు అవసరమైన ఆరు 400 కేవీ సబ్‌స్టేషన్లు మాత్రమే ఉండేవి. అన్ని రంగాలకు నిరంతర విద్యుత్తు సరఫరాకు దాదాపు 13 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన 400 కేవీ సబ్ స్టేషన్లు అవసరమని అంచనా వేశారు. కొత్తగా 9 సబ్ స్టేషన్ల నిర్మాణానికి పూనుకున్నారు. ఇప్పటికే సూర్యాపేట, నర్సాపూర్, అసుపాక, డిండి, మహేశ్వరంలలో 3,980 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదు 400 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తి చేశారు. జూలూరుపాడు, నిర్మల్, కేతిరెడ్డిపల్లి, జనగామల్లో 3705 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మరో నాలుగు 400 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణం జరుగుతోంది. మొత్తం పదిహేను 400 కేవీ సబ్ స్టేషన్లు, 19 కొత్త 220 కేవీ సబ్‌స్టేషన్లు; 35 కొత్త 132 కేవీ సబ్‌స్టేషను నిర్మించారు. తద్వారా, తెలంగాణ రాకముందు ఈహెచ్‌టీ లైన్ల సామర్థ్యం కలిగిన 233 సబ్ స్టేషన్లు ఉంటే, ఇప్పుడు అవి 292కు చేరాయి. ఇక, 33/11 కేవీ సబ్‌స్టేషన్లు కూడా వందల సంఖ్యలో నిర్మించారు. లో ఓల్టేజీ సమస్యను అధిగమించడానికి వేల సంఖ్యలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు.

28 వేల మెగావాట్ల కోసం ప్రణాళిక

తెలంగాణ ఏర్పడేనాటికి రాష్ట్రంలో స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యం కేవలం 6,574 మెగావాట్లు. చాలినంత కరెంటు లేకపోవడంతో పరిశ్రమలకు వారానికి రెండు రోజులు పవర్ హాలిడే అమల్లో ఉండేది. గ్రామాల్లో 6 నుంచి 8 గంటలు, పట్టణాల్లో 4 నుంచి 6 గంటలు, హైదరాబాద్‌లో 2 నుంచి 4 గంటలు విద్యుత్ కోతలు అమలయ్యేవి. తెలంగాణలో కరెంటు కోతలు ఉండరాదని నిర్ణయించిన ప్రభుత్వం.. అందుకు తగ్గ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రం ఏర్పడిన ఐదు నెలలకే 2014 నవంబరు 20వ తేదీ నుంచి పరిశ్రమలు, గృహాలు, వాణిజ్య సంస్థలకు 24 గంటల విద్యుత్ అందిస్తోంది. గడిచిన మూడున్నరేళ్లలోఅదనంగా 8,271 మెగావాట్ల విద్యుత్‌ను రాష్ట్రం సమకూర్చుకుంది. దీంతో ప్రస్తుతం 14,845 మెగావాట్ల స్థాపిత విద్యుదుత్పత్తి అందుబాటులో ఉంది. భవిష్యత్తులో మరో 13 వేల మెగావాట్ల విద్యుత్ సమకూర్చుకోవడానికి కొత్త ఉత్పత్తి కేంద్రాలు నిర్మిస్తోంది. 2022 నాటికి తెలంగాణలో 28 వేల మెగావాట్ల విద్యుత్‌ను అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో కార్యాచరణ అమలవుతోంది.

9500 మెగావాట్ల డిమాండ్ రావొచ్చు

వ్యవసాయానికి 24 గంటల కరెంట్‌తో జనవరిలో 9500 మెగావాట్ల దాకా డిమాండ్ రావొచ్చు. కానీ, మేం 11 వేల మెగావాట్ల డిమాండ్ వచ్చినాఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. ఫిబ్రవరి, మార్చిల్లో 11 వేల మెగావాట్ల డిమాండ్ ఉండే అవకాశం ఉంది. అయినా, సరఫరా వ్యవస్థ 17 వేల మెగావాట్ల డిమాండ్‌కు తగ్గట్లుగా ఉంది. ఏప్రిల్ నుంచి వ్యవసాయ వినియోగం క్రమంగా తగ్గుతుంది.

– ప్రభాకర్ రావు, సీఎండీ, ట్రాన్స్‌కో

విద్యుత్ సరఫరాలో మైలురాళ్లు

- 2014 నవంబరు 20 నుంచి కరెంట్ కోతలకు ఉద్వాసన. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా. పరిశ్రమలు, గృహాలు, వాణిజ్య సంస్థలకు 24 గంటల విద్యుత్.
- 2017 జూలై నుంచి పాత మెదక్, నల్గొండ, కరీంనగర్ జిల్లాల్లో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా
- 2017 నవంబరు 6 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ పంపుసెట్లకు ప్రయోగాత్మకంగా 24 గంటల పాటు విద్యుత్ సరఫరా
- 2018 జవవరి 1 నుంచి వ్యవసాయానికి 24 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్.



కొత్త వెలుగు

కొత్త సంవత్సరం అంటే ఆశ! బతుకుల్లో కొత్త వెలుగులు నిండాలనే ఆకాంక్ష! అలాంటి ఆశలకూ, ఆకాంక్షలకూ భరోసా ఇస్తోంది యువతరం! నూతన సంవత్సరంలో లక్షలాది మంది జీవితాలను మార్చేసే ఆవిష్కరణలతో ముందుకొచ్చిన నవ యువ సారథులు వీళ్ళు!

ఆశా రథసారథులు!

వినికిడి నేస్తాలు!

నృత్యాన్నీ, సంగీతాన్నీ ఎంతో ఇష్టపడే ఇద్దరు అమ్మాయిలు బధిర నృత్య కళాకారుల జీవితాల్లో నవరాగాల్ని పలికించడానికి నడుంకట్టారు. "కొన్నాళ్ళ కిందట బధిర కళాకారుల నృత్య ప్రదర్శన చూడడానికి వెళ్ళాం. వినికిడి శక్తి లేకపోవడం వల్ల సంగీతం గురించి తెలుసుకోవడానికి దృశ్యపరమైన సంకేతాలకోసం- ముందు వరుసలో కూర్చున్న శిక్షకుడివేపు వాళ్ళు నిరంతరం చూడాల్సి వస్తోంది. దీంతో ఆ కళారూపాన్ని వాళ్ళు ఆస్వాదించలేకపోతున్నారు. ఇది మమ్మల్ని ఆలోచనల్లో పడేసింది" అంటారు జాహ్నవి జోషీ, నూపుర్ కిర్లోస్కర్. జాహ్నవి కథక్ నర్తకి. నూపుర్ గాయని. సినిమాలు, నాటకాలు, నృత్యప్రదర్శనలంటే చెవి కోసుకుంటారు. అప్పుడు వారిద్దరూ పుణేలోని మహారాష్ట్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్ విద్యార్థినులు. ఇండస్ట్రియల్ డిజైన్‌లో పట్టభద్రులు. బధిరులు వినికిడి సమస్యను అధిగమించి, సంగీతాన్ని ఆస్వాదించేలా చేసేందుకు వీరు రూపొందించిన స్మార్ట్ వాచ్.. 'బ్లీవాచ్'. దీని పేరుతోనే బ్లీవాచ్ ఇన్నోవేషన్స్ అనే కంపెనీ ప్రారంభించారు.



"బ్లీవాచ్ ప్రకంపనల ద్వారా సంగీతపు లయను బధిరులకు అర్థమయ్యేలా చేస్తుంది. వారిలో మరింత స్వతంత్ర భావననూ, ఆత్మవిశ్వాసాన్నీ కలిగిస్తుంది" అన్నారు జాహ్నవి. "రాబోయే రెండేళ్ళలో యాభైవేల మంది బధిరులకు సాధికారత కల్పించడం మా లక్ష్యం" అని ఆమె వెల్లడించారు. బ్లీవాచ్ పరికరాన్ని 200 మంది మీద పరీక్షించారు. భారత్, కాలిఫోర్నియాల్లోని ప్రసిద్ధ సంస్థలకు పరిశీలన కోసం పంపారు. పుణే, బెంగళూరు, ముంబైల్లో పైలెట్ ప్రాజెక్ట్, భారత్, అమెరికాల్లో పేటెంట్‌కు యువతులు ప్రణాళికలు వేస్తున్నారు. క్రౌడ్ ఫండింగ్ ద్వారా నిధులు సమకూర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అన్నీ అనుకూలిస్తే 2018 ప్రథమార్థంలో ఈ ఉత్పత్తి మార్కెట్‌లోకి వస్తుంది. "ధరల్ని మరింత తగ్గించే దిశగా ప్రయోగాలు కొనసాగిస్తాం" అని నూపుర్ తెలిపారు.వీరి కృషి ఇక్కడితో ఆగిపోలేదు. బధిరులకు విద్య, వినోదాల్ని అందించే 'బ్లీ టీవీ', వినియోగదారులు ప్రశ్నలు వేయడం కోసం భారతీయ సంకేత భాష (ఐఎస్ఎల్)లో వీడియోల్లో 'ఆస్క్‌బ్లీ' అనే ప్రోగ్రామ్ కూడా వీరి ఆవిష్కరణల్లో ఉన్నాయి. 15 రాష్ట్రాల్లో 2 వేల మంది ఈ వీడియోలను వాట్సాప్ ద్వారా రెగ్యులర్‌గా చూస్తున్నారు. త్వరలోనే 'ఆస్క్‌బ్లీ' ఆండ్రాయిడ్ యాప్ విడుదల చేస్తున్నారు. "రాజకీయాలు, జనరల్ నాలెడ్జి, కరెంట్ అఫైర్స్, ఇంగ్లీష్ భాషకు సంబంధించిన ప్రశ్నలను మా టీమ్‌ను అడుగుతూ ఉంటారు. ఇప్పటివరకూ దాదాపు ఎనిమిదివందల పదాలను వివరించాం" అని జాహ్నవి తెలిపారు. బధిరులకు కావలసింది మరిన్ని అవకాశాలూ, సమాజంలో గౌరవనీయ స్థానం అని అంటున్నారు ఈ అమ్మాయిలు.

▶ బ్లీవాచ్

ఏమిటిది?: వినికిడి శక్తి లేనివారికోసం రూపొందించిన పరికరం. ప్రకంపనల ద్వారా సంగీతపు లయను బధిరులకు తెలియజేస్తుంది.
ప్రత్యేకతలేమిటి?: ఇది ఒక యాప్‌కు కనెక్ట్ అయి ఉంటుంది. పిల్లల ఏడుపు, ఫైర్ అలారం, డోర్‌బెల్ లాంటి శబ్దాలను గుర్తించి, ప్రత్యేకమైన ప్రకంపనల ద్వారా తెలియజేస్తుంది.
కంపెనీ: బ్లీటెక్ ఇన్నోవేషన్స్
ఆవిష్కర్తలు: జాహ్నవి జోషీ, నూపుర్ కిర్లోస్కర్
మార్కెట్లోకి ఎప్పుడొస్తుంది?: 2018 ప్రథమార్థంలో

అంధులకు దారిదీపాలు!



అంధుల అవస్థలను అర్థం చేసుకొనే మనసున్న చూపుతో, వారికి కొత్త దృష్టిని అందించడానికి కృషి చేశారు ఇద్దరు యువకులు. "సాంకేతికత ఎంతో పురోగమిస్తోంది. కానీ, అంధత్వ సమస్యను అధిగమించగలిగే పరికరాలు చాలామందికి అందుబాటులో లేవు" అంటారు శ్రేయస్ ఉపాసనే, రాహుల్ కరుణాకరన్. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) లెక్కల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 2010 నాటికే 28.5 కోట్ల అంధులున్నారు. ఈ సంఖ్య 2020 నాటికి రెట్టింపు ఆవుతుందని అంచనా. ఈ పరిస్థితుల్లో వారికి ఆలంబనగా నిలిచి కొత్త జీవితాన్ని అందించడానికి బెంగళూర్‌లోని ఇంటెల్ ఇండియా మేకర్ ల్యాబ్‌లో 'అయత ఇంటలిజెన్స్' స్టార్టప్ సహ వ్యవస్థాపకులు శ్రేయస్, రాహుల్ కృషి చేశారు. దాని ఫలితమే 'విశృతి'. ఇది ప్రత్యేకంగా తయారుచేసిన కళ్ళద్దాల జత. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సాయంతో ఇది పనిచేస్తుంది. కంటిచూపు లేనివారు ఈ కళ్ళద్దాలను ధరిస్తే ముందున్న రోడ్డు గురించి చెబుతాయి. ఎక్కడ మలుపు తిరగాలో, ఎక్కడ ఆగాలో సూచిస్తాయి. "విశృతి' కరెన్సీ నోట్లనూ, వస్తువులనూ గుర్తుపడుతుంది. చుట్టూ అడ్డుగా ఉన్న వాటిని గుర్తించి ఆడియో సమాచారాన్ని వినిపిస్తుంది" అని శ్రేయస్ తెలిపారు. "నోట్లను లెక్కపెట్టుకోడానికి అంధులు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. వాళ్ళు తరచూ మోసపోతూ ఉంటారు. దీన్ని నివారించడం కోసం ఇండియన్ కరెన్సీని గుర్తుపట్టే విధంగా వీటిని తయారు చేశాం" అని ఈ యువకులు వివరించారు.



ఈ కళ్ళద్దాలు రీఛార్జబుల్ బ్యాటరీతో పని చేస్తాయి. ఒకసారి ఛార్జింగ్ చేస్తే నాలుగు గంటలసేపు ఉపయోగించుకోవచ్చు. "హైదరాబాద్‌లోని దేవనార్ అంధుల పాఠశాల, కర్ణాటకలోని నేషనల్ అసోసియేషన్ ఆఫ్ బ్లైండ్‌నెస్‌లలో ఇప్పటికే డేటాను పరీక్షించాం. ఫలితాలు సానుకూలంగా ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న పరికరాలు పరిమితమైన పనులకే ఉపయోగపడతాయి. అత్యాధునిక సాంకేతికతతో ఏదైనా చెయ్యాలనుకున్నాం. దాని ఫలితమే ఇది" అంటున్నారు ఇరవయ్యేనిమిదేళ్ళ శ్రేయస్, ఇరవైతొమ్మిదేళ్ళ రాహుల్. ఇంగ్లండ్‌లోని ఎస్సెక్స్ యూనివర్సిటీలో రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌లో ఇద్దరూ మాస్టర్స్ డిగ్రీ పొందారు. అది వారి ప్రయోగాలకు ఉపకరించింది. ప్రాథమికంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వీరికి సాయం అందించింది. తరువాత ఇంటెల్ సహకారం తీసుకున్నారు. "అంధత్వం ఉన్నవారు స్వతంత్రంగా జీవించడానికీ, డిజిటల్ సాంకేతికత అనుసంధానమైన జీవితాన్ని గడపడానికీ మా పరికరం సహాయపడుతుంది. ప్రస్తుతం పదివేల రూపాయలకన్నా తక్కువకు దీన్ని అందుబాటులోకి తేవాలనుకుంటున్నాం. భవిష్యత్తులో ధర ఇంకా తగ్గేలా ప్రయత్నాలు చేస్తాం. మరో ఏడెనిమిది నెలల్లో ఇది మార్కెట్లో విడుదల కావచ్చు" అని చెప్పారు శ్రేయస్, రాహుల్. "సమాజానికి ఉపయోగపడేది ఏదైనా చెయ్యాలన్నది మా కోరిక. అందుకే ఈ ఉత్పత్తి కోసం ప్రొవిజనల్ పేటెంట్‌ను దాఖలు చేశాం" అని వారు వివరించారు

▶ విశ్రుతి

ఏమిటిది?: అంధులకోసం స్మార్ట్ కళ్ళజోడు
ప్రత్యేకత: ఈ కళ్ళద్దాలను ధరిస్తే ముందున్న రోడ్డు, మలుపుల గురించి చెబుతాయి. రీఛార్జబుల్ బ్యాటరీతో 4 గంటలు పని చేస్తుంది. కరెన్సీ నోట్లనూ, వస్తువులనూ గుర్తిస్తుంది.
కంపెనీ: అయత ఇంటలిజెన్స్
ఆవిష్కర్తలు: శ్రేయస్ ఉపాసనే, రాహుల్ కరుణాకరన్. త్వరలో మార్కెట్‌లోకి వస్తుంది.

'డ్రోనా'చార్యులు!



ప్రాణాలతో చెలగాటమని తెలిసినా చీడను తొలగించాలంటే చెట్లెక్కడం తప్ప గత్యంతరం లేని రైతన్నల కడగళ్ళు తీర్చడానికి వీలుగా డ్రోన్ సాంకేతికతను మలిచారు వారిద్దరూ! పొలాల్లో ఫరవాలేదు కానీ, కొబ్బరి చెట్లు, పోక చెట్లమీద పురుగుల మందులు చల్లడం రైతులకు ఎప్పుడూ కత్తి మీద సామే. ఈ చెట్లకు ఎక్కువగా డాగు తెగులు పడుతూ ఉంటుంది. చెట్లు ఎక్కడం, ఆ పైన మందులు వెయ్యడం ఒక్కోసారి ప్రాణాంతకం. వీటిని ఎక్కి మందులు చల్లే కూలీలు దొరకడం మరీ కష్టం. వర్షాకాలంలో తడిసి జారుతూ ఉండే చెట్లెక్కడానికి ఎవరూ ముందుకురారు. ఈ సమస్యకు కొత్త ఏడాదిలో ఓ పరిష్కారాన్ని చూపిస్తోంది 'ఐస్పార్గో రోబోటిక్స్' అనే అంకుర సంస్థ. ఈ సంస్థ రూపొందిచిన మైక్రో-ఏరియల్ వెహికిల్ అంటే డ్రోన్... పోక, కొబ్బరి చెట్ల మీద రసాయనాలను సునాయాసంగా పిచికారీ చేసేస్తుంది. ఈ ఆవిష్కరణ వెనుక కంపెనీ సహ వ్యవస్థాపకులు అవినాశ్ రావు (35), కమలేశ్ కుమార్ (33) కృషి ఉంది. చెట్ల పైభాగాల్లో పిచికారీ జరపడం కోసం ఈ డ్రోన్‌కు ఒక హై-ప్రెజర్ పంప్ అమరుస్తారు. రసాయనాల్ని చేతులతో ముట్టుకోనక్కర్లేదు కాబట్టి హాని ఏమీ ఉండదు. ఈ వెహికిల్ ఒక మీటర్ వ్యాసార్థంలో ఉంటుంది. గాలిలోకి లేచాక ముడుచుకుంటుంది. "దీనిలో ఇన్‌బిల్ట్ ఇంటలిజన్స్ ఉంది, గాలిలో ఉన్నప్పుడు తన చేతుల్ని ఈ వాహనం కదపగలదు, కాబట్టి చెట్ల ఆకులు దెబ్బతినవు" అంటారు కమలేశ్. అంతేకాదు, ఈ డ్రోన్ క్షేత్ర స్థాయి విశ్లేషణ చెయ్యగలదు, తద్వారా ఎక్కడ పురుగుల మందులూ, క్రిమిసంహారకాలూ వెయ్యాలన్న వివరాలు తెలియజేస్తుంది. "ప్రస్తుతానికి వ్యవసాయ అవసరాలకు మాత్రమే మా ఆవిష్కరణ పరిమితం. కానీ భవిష్యత్తులో హైటెన్షన్ టవర్ల మరమ్మతులకు, సైనిక కార్యకలాపాలకు అనువుగా రూపొందించవచ్చు" అని కమలేశ్ వివరించారు. ఆయన మణిపాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్.



ప్రయోగాత్మకంగా ఈ డ్రోన్‌ను పరిశీలించడం పూర్తయిందనీ, ఆరు నెలల్లో మార్కెట్లో దీన్ని విడుదల చేస్తామనీ ఆవిష్కర్తలు చెబుతున్నారు. అంటే కొత్త ఏడాది రైతన్నల సమస్యకు కూడా కొంత పరిష్కారం దొరుకుతుందని ఆశాభావం కలుగుతోంది.

▶ మైక్రో ఏరియల్ వెహికిల్

ఏమిటిది?: పోక, కొబ్బరి చెట్ల మీద రసాయనాలను పిచికారీ చేసే పరికరం.
ప్రత్యేకత: క్షేత్ర స్థాయి విశ్లేషణ. ఎక్కడ పురుగుల మందులూ, క్రిమిసంహారకాలూ వెయ్యాలో చెబుతుంది.
కంపెనీ: ఐస్పార్గో రోబోటిక్స్
ఆవిష్కర్తలు: అవినాశ్ రావు, కమలేశ్ కుమార్. ఆరు నెలల్లో మార్కెట్‌లోకి వస్తుంది.

('ది వీక్' సౌజన్యంతో)

ప్రశాంతతకు ఏడు మార్గాలు

కాలపు పేజీలు తిరుగుతూ, మరో కొత్త సంవత్సరం చేరువైన ఈ సమయంలో మీరు మనస్ఫూర్తిగా కోరుకునేదేమిటి? ప్రశాంతతే కదా! అంతరంగంలో ప్రశాంతత లేకపోవడమే ఈ ఇబ్బందులకూ, మన జీవితంలో కష్టాలకూ, సమాజంలో అశాంతికీ మూల కారణం. అంతరంగంలో శాంతిని కనుగొనడానికి ఏడు విధానాలున్నాయి.

విశాల దృక్పథాన్ని పెంపొందించుకోండి!

విశాల దృక్పథంతో చూడడం మొదలుపెట్టిననాడు జీవితంలో బలం, ప్రశాంతత, స్థిరత్వం కలుగుతాయి.దీనికోసం మనం చేయాల్సిందల్లా... మెలకువ తెచ్చుకుని, ఒక కొత్త దృష్టి కోణంలో ఈ సృష్టిని చూడటమే! ఊహించనివి జరగటం, అనుకున్నంత కచ్చితంగా జరగకపోవటం అనేవి ఈ సృష్టిలో భాగాలే. ఈ అనిశ్చితిని అంగీకరించి, స్వీకరించకపోతే, అంతరంగంలోని ప్రశాంతత దెబ్బతింటుంది.



సవాళ్లను అంగీకరించండి!

జీవితంలో వచ్చి వెళ్ళిపోయే తుపానులను ఎదుర్కొని, నిలబడండి. సవాళ్ళు లేకుంటే జీవితం నిస్సారంగా, బలహీనంగా మారుతుంది. కాబట్టి, సవాళ్ళు లేని జీవితం కాకుండా, మనల్ని చుట్టుముట్టే గందరగోళ పరిస్థితులు, సవాళ్లను తట్టుకుని, చిరునవ్వుతో దాటిపోడానికి కావలసిన అంతర్గతమైన శక్తిని కోరుకోవాలి.

మానసిక శిక్షణనివ్వండి!

అంతర్గత ప్రశాంతతను సాధించాలంటే మనసుకు శిక్షణనివ్వడం ముఖ్యం. అంతర్గతమైన శాంతిని పెంపొందించుకోడానికి ధ్యానం, యోగా, ప్రాణాయామం లాంటి అభ్యాసాలు మంచి సాధనాలు. రోజూ ధ్యానం చేయడం ముఖ్యం.

ఒత్తిడిని ఓడించండి!

పెరుగుతున్న ఒత్తిడులు, ప్రపంచంలో అనిశ్చితి ప్రశాంతంగా ఉండడానికి అడ్డుపడుతూ ఉంటాయి. పని తగ్గించుకోవడం, సమయాన్ని పెంచుకోవడం అసాధ్యం. యోగా, ఆరోగ్యకరమైన అలవాట్ల ద్వారా మన శక్తిని పెంచుకోవచ్చు.

ఇతరులకు ఉపయోగపడండి...


అంతర్గత ప్రశాంతతను అనుభవంలోకి తెచ్చుకోవాలంటే ఇరుగుపొరుగు వారికి సహాయంగా ఉండాలి. అందుకే సమాజానికి మంచి చేస్తామనే దీక్ష చేపడదాం.

భిన్నత్వాన్ని అంగీకరించండి

ప్రపంచంలో చాలా మంచి ఉంది. దానిపై నమ్మకం ఉంచడం మనకు బలాన్నీ, మానసిక ప్రశాంతతనూ ఇస్తుంది. మనలోని భిన్నత్వాన్ని సైతం పండుగలా జరుపుకొని, విలువలను పంచుకుంటే ఆనందాన్ని పొందగలం.

మనసును ఉంచుకోండి

సాంకేతికత ద్వారా జీవితంలో ఉత్పాదకత పెరిగింది. అయితే పక్కనే ఉన్నవారితో మాట్లాడటానికి సైతం సాంకేతికతను వాడేస్తున్నాం! ప్రశాంతత కోసం ప్రపంచంలో మెదడుతో కన్నా మానసిక స్థాయిలో కలయిక అవసరం. అంతరంగంలో ప్రశాంతతే బాహ్యంగా ప్రశాంతతను తీసుకురాగలదు. నూతన వత్సర శుభవేళ హృదయాలలో శాంతి దీపాన్ని మళ్ళీ వెలిగిద్దాం!



• శ్రీశ్రీ రవిశంకర్

ముత్యాల ముగ్గులు



గిఫ్ట్ హ్యాంపర్ విజేత



ప్రతిభ
మహబూబ్‌నగర్

18 చుక్కలు
18 వరుసలు



ప్రతిరోజూ విజేతలకు **టాటా-జెమినీ టీ** వారి నుంచి గిఫ్ట్ హ్యాంపర్ అందుతుంది.





15 చుక్కలు
1 వచ్చే వరకు

గుళ్లపల్లి రత్నకుమారి
రేపల్లె

గోనెకర్ శిరీష
నిజామాబాద్

17 చుక్కలు
సరిచుక్క
1 వచ్చే వరకు





మా చిరునామా: నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.
navya@andhrajyothy.com



ఈ ఏడాది... జీవితాన్నే మార్చేస్తుంది!

సరికొత్త ఆశలతో కొత్త సంవత్సరం వచ్చేసింది. టెక్నాలజీ రంగంలో గత ఏడాది చూసిన దాని కన్నా అనేక వినూత్నమైన ఆవిష్కరణలు ఈ ఏడాది పలకరించనున్నాయి. వాటిలో కొన్నింటి గురించి...

ఫోన్లను మడిచేసుకోవచ్చు!

ఫోల్డబుల్ ఫోన్స్: చిన్న ఫోన్లనూ చూశాం, పెద్ద ఫోన్లనూ చూశాం, అంచులు ఉన్నవీ చూశాం, లేనివీ చూశాం.. మరి స్మార్ట్‌ఫోన్లు అంటే ఇంకా ఇవేనా? కొత్తగా ఏ మార్పులూ రావా ? అనే సందేహం మీలో ఉంటే ఈ కొత్త 2018 సంవత్సరం మీరు కోరుకుంటున్న కొత్తదనాన్ని తీసుకురానుంది. మడిచి పెట్టుకోవడానికి వీలుగా స్మార్ట్‌ఫోన్లు వస్తున్నాయి. శామ్‌సంగ్ సంస్థ గెలాక్సీ ఎక్స్ పేరుతో 2018లో ఇలాంటి ఓ ఫోన్‌ను తీసుకువస్తున్నట్లు ఈ పాటికే ప్రకటించింది. మరోవైపు హువాయి సంస్థ కూడా ఇదే పనిలో ఉంది. మైక్రోసాఫ్ట్ కూడా ఓ పుస్తకం మాదిరిగా మడిచి పెట్టుకోవడానికి తగ్గట్లు సర్ఫేస్ ఫోన్‌ను తీసుకు వచ్చే ఆలోచనలో ఉంది. ఈ ప్రయత్నాలన్నీ ఫలిస్తే దాదాపు పదేళ్లుగా మనం చూస్తున్న స్మార్ట్‌ఫోన్ల రూపురేఖలే మారిపోతాయి.

గాలిలోనే టచ్ స్క్రీన్లు

హోలోగ్రాఫిక్ యూజర్ ఇంటర్‌ఫేస్: 'అవతార్' లాంటి అనేక సినిమాల్లో మనం చూసే ఉంటాం... ఆయా నటులు గాలిలోనే స్క్రీన్లను చూస్తూ, వాటిని ఆపరేట్ చేస్తూ ఉంటారు. ఇవి గ్రాఫిక్స్ కాదు, వీటినే హోలోగ్రాఫిక్ యూజర్ ఇంటర్‌ఫేస్ అంటారు. ఓ ఫోన్ ఉంటేనే, లేదా ఓ కంప్యూటర్, టీవీ ఉంటేనే అది స్క్రీన్ క్రింద కాదు. ఇక నుంచి ఓ టేబుల్ మీదైనా, గాలిలో అయినా, ఇంకెక్కడైనా మనకు కావలసినట్లు ఊహాజనితమైన స్క్రీన్లు పొందొచ్చు. వాటిలో కమాండ్లను ఎంపిక చేసుకోవచ్చు. ఇప్పటి వరకూ లేజర్ కిరణాల ద్వారా మాత్రమే సాధ్యపడే హోలోగ్రాఫిక్ దృశ్యాలను ఇప్పుడు యాపిల్ ఐఫోన్ లాంటి మామూలు ఫోన్ సాయంతో ఎక్కడైనా సృష్టించుకునేలా కూడా అందుబాటులోకి వచ్చాయి. హోలోగ్రాఫిక్ యూజర్ ఇంటర్‌ఫేస్ విషయంలో ఈ కొత్త సంవత్సరం వేయనున్న నాంది చాలా మార్పులు తెస్తుంది. సమీప భవిష్యత్తులో ఓ క్యాబ్ బుక్ చేయాలంటే... గాలిలో చేతులు ఆడించి, ఆప్షన్లు ఎంచుకునే దశకు దారి తీస్తుందనడంలో సందేహమే లేదు.

హ్యాకర్లకు సరికొత్త సవాల్

బ్లాక్‌ఛెయిన్ టెక్నాలజీ: ఈ మధ్య ఈ పదం చాలాసార్లు వినే ఉంటారు. బిట్ కాయిన్ వంటి క్రిప్టో కరెన్సీల విషయంలో వాడుతున్న ఈ టెక్నాలజీ మరిన్ని రంగాలకు విస్తరించనుంది. ఏ వ్యవస్థలో అయినా సెక్యూరిటీ బలోపేతం అవ్వాలంటే బ్లాక్‌ఛెయిన్ టెక్నాలజీని అందిపుచ్చుకోవడమే అద్భుతమైన పరిష్కారం. ఇప్పటి వరకూ డెబిట్ కార్డులైనా, క్రెడిట్ కార్డులైనా, నెట్ బ్యాంకింగ్ అయినా, లేదా వివిధ కంపెనీల కీలకమైన సమాచారం అయినా, ఇంకెలాంటి సమాచారం అయినా ఓ సర్వర్‌లోనో, మరో కంప్యూటర్లోనో ఓ డేటాబేస్ రూపంలో భద్రపరిచి ఉండేది. ఆ డేటాబేస్ హ్యాకర్ల బారిన పడితే ఆ సమాచారం మొత్తం రిస్కులో పడేది. బ్లాక్‌ఛెయిన్ అందుకు భిన్నమైనది. దీన్ని పబ్లిక్ లెడ్జర్‌తో పోల్చవచ్చు. రకరకాల కంప్యూటర్లలో సమాచారం పంపిణీ అయి ఉంటుంది. ఒక గొలుసు వ్యవస్థలో మాదిరిగా ఆ ఛెయిన్‌లో ఉన్న సిస్టమ్‌లు అన్నీ ప్రతీ డిజిటల్ లావాదేవీనీ, ఆన్‌లైన్‌లో మార్పులు చెందే ఇతర ప్రతీ సమాచారాన్నీ ఒకదాని తర్వాత ఒకటి ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఇలాంటి పటిష్ఠమైన వ్యవస్థను కొల్లగొట్టడం హ్యాకర్లకు చాలా కష్టం.

మీరేం చేస్తున్నా మెషిన్ చూసేస్తుంది!

మెషీన్ లెర్నింగ్: మన లాంటి మనుషులం పుట్టినప్పటి నుండి అనుభవాల ద్వారా ఎలాగైతే కొత్త విషయాలు నేర్చుకుంటూ జీవితంలో ముందుకు సాగిపోతున్నామో అలాగే మెషీన్‌లు కూడా నేర్చుకోవడం మొదలుపెడితే ఎలా ఉంటుంది? ఈ సరికొత్త కాన్సెప్ట్‌నే 'మెషీన్ లెర్నింగ్' అంటారు. ఈ రోజు ఫోన్లో కీబోర్డ్ మీద టైప్ చేస్తున్నప్పుడు తర్వాత మీరు ఏం టైప్ చేయబోతున్నారో ఊహించి ఆటో సజెషన్లు ఇస్తున్నదీ అలాంటి ఓ మెషీన్ లెర్నింగే! ఈ కొత్త సంవత్సరం నుండి మనిషి జీవితాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చబోతున్నదీ ఆ మెషీన్ లెర్నింగే! ఇంటర్నెట్‌ను బ్రౌజ్ చేస్తున్నా, ఓ ఫుడ్‌ను ఆర్డర్ చేస్తున్నా, టివి చూస్తున్నా, గేమ్ ఆడుతున్నా మీ అలవాట్లు, మీ అవసరాలు అన్నీ మెషీన్ లెర్నింగ్ ద్వారా విశ్లేషణకు గురై, మీకు మెరుగైన ఆప్షన్లు ఇవ్వడానికి ప్రయత్నిస్తాయి. ఇప్పటికే అనేక రంగాల్లో వాడకంలో ఉన్న ఈ మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లు ఈ 2018లో మరింత విస్తృతంగా వాడుకలోకి రానున్నాయి.

> **హోలోగ్రాఫిక్ యూజర్ ఇంటర్‌ఫేస్ విషయంలో ఈ కొత్త సంవత్సరం వేయనున్న నాంది చాలా మార్పులు తెస్తుంది. సమీప భవిష్యత్తులో ఓ క్యాబ్ బుక్ చేయాలంటే... గాలిలో చేతులు ఆడించి, ఆప్షన్లు ఎంచుకునే దశకు దారి తీస్తుందనడంలో సందేహమే లేదు.**

పనులు చేసి పెట్టే పరికరాలు

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్: ఐఓటీ అనే పదం కూడా ఈ మధ్య బాగా వినిపిస్తూనే ఉంది. కంప్యూటర్లు, ఫోన్లు మాత్రమే కాదు... నిరంతరం ఇంటర్నెట్‌కి అనుసంధానమై వివిధ పనులు చేసి పెట్టే అనేక గ్యాడ్జెట్స్ ఈ కొత్త ఏడాదిలో వినియోగంలోకి రానున్నాయి. ఒక మొక్కలో తేమ శాతాన్ని చూపిస్తూ నిరంతరం ఆ డేటాను క్లౌడ్‌లో సింక్ చేయడం దగ్గర్నుండి, ఇంట్లో పెద్దలుంటే... వాళ్లు ఏ ట్యాబ్లెట్లు వేసుకున్నారో, ఇంకేమి వేసుకోవాలో మొత్తం కేవలం ట్యాబ్లెట్ల డబ్బా మూత చెప్పే స్థితికి రానున్నాం. చిన్న పిల్లల బాడీ టెంపరేచర్ దగ్గర నుండి ఎన్నో పారామీటర్లను గ్రహించి, రిపోర్టులు తయారు చేసే డివైజ్‌ల వరకూ... అదీ ఇదీ అని లేదు... సమస్తం సిద్ధమవుతున్నాయి. అన్నీ క్లౌడ్‌కు అనుసంధానం అవుతాయి, తాము సేకరించిన డేటాను ఓ చోట క్రోడీకరిస్తాయి.

మన మాట వింటాయ్!

వాయిస్, బాక్స్: ఇప్పటికే కష్టపడి టైప్ చేసే రోజులు పోయాయి. వాయిస్ టైపింగ్ లాంటివి ఇంగ్లీషుకే కాదు, మన తెలుగు లాంటి భాషలకూ వచ్చేశాయి. కేవలం టైపింగ్ కోసమే కాదు... చివరకు ఓ స్మార్ట్‌ఫోన్ యాప్‌లో వివిధ ఆప్షన్లను ఎంచుకోవాలన్నా కూడా వాయిస్‌ను వాడేయడం ఇక సాధ్యపడుతుంది. గూగుల్ హోమ్, అలెక్సా వంటి వాయిస్ అసిస్టెంట్లు ఇప్పుడు చేస్తున్న పనుల కన్నా శక్తిమంతంగా వాయిస్ ద్వారా ఎన్నో రకాల అద్భుతాలను పరిచయం చెయ్యనున్నాయి. అలాగే వివిధ సంస్థలు తమ కస్టమర్లతో టచ్‌లో ఉండడానికి మనుషుల్ని వాడే రోజులు పోయాయి. ఈ 2018లో ఈ వినియోగం పెరగనుంది.

దొంగలున్నారు జాగ్రత్త!

సెక్యూరిటీ సవాళ్లు: గడచిపోయిన 2017లో యావత్ ప్రపంచాన్ని గడగడలాడించిన వాన్నాక్రై రాన్సమ్‌వేర్ అందరికీ గుర్తుండే ఉంటుంది. వాస్తవానికి రాన్సమ్‌వేర్లు ఇప్పుడు కొత్తవీ కాదు, ఇంతటితో ఆగేవీ కాదు. ఇంతకు ముందు చెప్పుకున్నట్లు బ్లాక్‌ఛెయిన్ టెక్నాలజీ ద్వారా ఇలాంటి సెక్యూరిటీ దాడులకు కొంత వరకూ చరమగీతం పాడే అవకాశం ఉంది. అయినప్పటికీ బ్లాక్‌ఛెయిన్‌లో భాగంగా లేని సర్వర్లు, వ్యక్తిగత కంప్యూటర్లు, ఫోన్లకు అనేక సెక్యూరిటీ రిస్కులు ఈ కొత్త ఏడాదిలో పొంచి ఉన్నాయి. ఇప్పటి వరకూ సెక్యూరిటీ గురించి పెద్దగా ఆలోచించకపోయినా రోజులు గడిచిపోయాయి. కానీ ఇప్పుడు తప్పనిసరిగా ప్రతీ ఒక్కరూ సెక్యూరిటీ గురించి అవగాహన పెంచుకోపోతే చాలా నష్టాలు చవిచూడాల్సి వస్తుంది.

ఊహాలోక విహారం! హద్దులు లేని ప్రపంచం!!

వర్చ్యువల్ రియాలిటీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ: ఫేస్‌బుక్, గూగుల్, మైక్రోసాఫ్ట్ లాంటి టెక్ దిగ్గజాలు వర్చ్యువల్ రియాలిటీ, ఆగ్మెంటెడ్ రియాలటీ టెక్నాలజీల మీద ఎంతగా ఫోకస్ చేస్తున్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. టెక్నాలజీ భవిష్యత్తును అంతా ఈ రెండు టెక్నాలజీలు శాసించనున్నాయి. అందులో సందేహమే లేదు. తలకు ఓ హెడ్‌సెట్ తగిలించుకుని, ఇప్పుడు మనం ఉన్న ప్రపంచాన్ని పూర్తిగా మర్చిపోయి, ఊహా ప్రపంచంలో విహరించడమే వర్చ్యువల్ రియాలిటీ. అలాగే వేరెక్కడో ఉన్న వస్తువుల్నీ, మనుషుల్నీ, ఇతర అన్ని భౌతిక విషయాల్నీ అప్పటికప్పుడు అందుబాటులోకి తెచ్చుకుని వాటితో ఇంటరాక్ట్ అయ్యే విధానమే ఆగ్మెంటెడ్ రియాలిటీ. ఇప్పటి వరకూ మన దృష్టిలో ప్రపంచం అంటే మన చుట్టూ ఉన్న పరిసరాలే! కానీ ఇప్పుడు ఆ సరిహద్దులు తొలగిపోతున్నాయి. మీరెక్కడ ఉన్నా, మీకు ఎంత సుదూరంలో ఉన్న పనులైనా అవలీలగా చేసేయొచ్చు. ఈ 2018లో ఈ రెండు టెక్నాలజీలు మరింతగా జన బాహుళ్యానికి పరిచయం కానున్నాయి. ఈ రంగాల్లో ఎన్నో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకోనున్నాయి.



నల్లమోతు శ్రీధర్
fb.com/nallamothusridhar

టెక్ సందేహాలు

ఒకటికి రెండు సాధ్యమే!

నా ల్యాప్‌టాప్‌లో ఒక ఆపరేటింగ్ సిస్టమ్ ఉండగానే మరొక దాన్ని ఇన్‌స్టాల్ చేసుకోవచ్చా?

- కార్తీక్‌కృష్ణ, ఉయ్యూరు



మీ హార్డ్‌డిస్క్‌లో తగినంత ఖాళీ స్థలం, అలాగే కనీసం 4 జీబీ కన్నా ఎక్కువ ర్యామ్ ఉన్నట్లయితే ఓ ఆపరేటింగ్ సిస్టమ్‌లో ఉండగానే మరో ఓయస్‌ని సులభంగా వాడుకోవచ్చు. దీని కోసం ప్రత్యేకంగా మీరు హార్డ్‌డిస్కులో వేరే పార్టిషన్ సృష్టించుకుని, దానిలో డ్యూయల్ బూటింగ్ పెట్టుకోవలసిన పని లేదు. విండోస్ లోపలే మైక్రోసాఫ్ట్ ఆఫీస్, ఫొటోషాప్ లాంటివి వేరే ప్రోగ్రాములుగా ఎలా రన్ చేసుకోగలుగుతున్నారో సరిగ్గా అలాగే ఇతర ఆపరేటింగ్ సిస్టమ్‌లను కూడా ప్రత్యేకమైన ప్రోగ్రాములుగా వాడుకోవచ్చు. దీని కోసం వర్చ్యువల్ బాక్స్, వియంవేర్ వంటి సాఫ్ట్‌వేర్లను ఇన్‌స్టాల్ చేసుకోవలసి ఉంటుంది. వాటిలో మీరు లైనెక్స్, విండోస్‌లోని ఇతర వెర్షన్లను ఓ ప్రత్యేకమైన వర్చ్యువల్ డిస్కుల రూపంలో ఇన్‌స్టాల్ చేసుకుని, రన్ చేసుకోవచ్చు. మీ దగ్గర ఉన్న విండోస్ వంటి హోస్ట్ ఆపరేటింగ్ సిస్టమ్ నుండి గెస్ట్ ఆపరేటింగ్ సిస్టమ్‌గా ఉన్న ఆ రెండో ఓయస్‌లోకి డేటాను కాపీ చేసుకోనూవచ్చు. సెక్యూరిటీ పరంగా కూడా ఎలాంటి ఇబ్బందులూ ఉండవు.

ఫేస్ అన్‌లాక్‌లో లోపాలున్నాయ్!

ఈ మధ్య వస్తున్న ఫేస్ అన్‌లాక్ లాంటి టెక్నాలజీలను నమ్మొచ్చా? ఇవి సురక్షితంగా ఉంటాయా? తెలుపగలరు.

- చక్రవర్తి, అనంతపురం



ఫోన్‌ను సెక్యూర్డ్‌గా ఉంచుకోవాలంటే పిన్, ప్యాట్రన్లు వాడే స్థాయి నుండి ఇప్పుడు అందరూ ఫింగర్‌ప్రింట్ వాడుతున్నారు. వాటికి అదనంగా ఇటీవల ఫేస్ రికగ్నిషన్, ఐరిస్ స్కానింగ్ లాంటి పద్ధతులు వచ్చాయి. అయితే ఫేస్ రికగ్నిషన్, ఐరిస్ స్కానర్లు ఇప్పటికీ చాలా లోపభూయిష్ఠంగా ఉన్నాయి. ఫోన్‌ను మన కళ్లకు సమాంతరంగా పెట్టాల్సి రావడం, ఏదో అర్జెంటుగా ఫోన్లోకి ప్రవేశించాల్సి వస్తే అథంటికేషన్ దగ్గరే చాలా సమయం తీసుకోవడం లాంటివి చాలామంది యూజర్లకు చిరాకు తెప్పిస్తున్నాయి. అందుకే ఈ సదుపాయాలు ఉన్న గెలాక్సీ ఎస్ ఎయిట్, నోట్ ఎయిట్, వన్ ప్లస్ ఫైవ్ వంటి ఫోన్లలోనూ ఇప్పటికీ ఫింగర్‌ప్రింట్‌నే ప్రధానమైన సెక్యూరిటీగా వాడుతున్నారు. అదీగాక త్రీడి ప్రింటింగ్ చేసిన కొన్ని మాస్కులను వాడితే చాలా సులభంగా వివిధ ఫోన్లని అన్‌లాక్ చేయొచ్చన్న విషయం రుజువు అవుతోంది. ఇలాంటి లోపాలను అధిగమిస్తే ఈ టెక్నాలజీల వల్ల ప్రయోజనం ఉంటుంది.

ఒక ఫోను... ఎన్నో కీబోర్డులు!

వాట్సప్, ఫేస్‌బుక్ లాంటి వాటిలో టైప్ చేసేటప్పుడు ఫోన్లో కీబోర్డ్‌ను స్క్రీన్‌పై భాగానికి మార్చుకోవడం కుదురుతుందా?

- సుధీష్‌బాబు, చీరాల



మీరు ఫోన్ కొన్నప్పుడు ఫోన్‌తో పాటు ఆయా కంపెనీలు ఇచ్చే డీఫాల్ట్ కీబోర్డ్ యాప్స్‌లో ఇలాంటి సదుపాయాలు ఉండే అవకాశం తక్కువ. వాటికి బదులు స్విఫ్ట్ కీ లాంటి థర్డ్‌పార్టీ కీబోర్డ్ యాప్స్‌ని వాడడం ద్వారా మీరు కోరుకున్న ఫలితాన్ని పొందొచ్చు. ఈ యాప్స్‌లో కీబోర్డ్ థీమ్స్‌ని మార్చుకోవడం దగ్గర్నుండి స్క్రీన్‌పై మనకు నచ్చిన ప్రదేశంలోకి కీబోర్డ్‌ని మూవ్ చేసుకోవడం, కీబోర్డ్ సైజ్‌ని మనకు కావలసినట్లు కస్టమైజ్ చేసుకోవడం వంటి అనేక అడ్వాన్స్‌డ్ ఆప్షన్లు ఉంటాయి. అలాగే వేగంగా టైప్ చెయ్యడానికి అనువుగా మెషీన్ లెర్నింగ్ ఆధారంగా వర్డ్ ప్రిడిక్షన్లూ వీటిలో ఉంటాయి. ఒక ఫోన్లో ఒకేసారి ఎన్ని కీబోర్డ్ యాప్స్ అయినా ఇన్‌స్టాల్ చేసుకునే వెసులుబాటు ఉంది. కాబట్టి, భిన్నమైన సదుపాయాలున్న ఇతర యాప్స్‌ని కూడా ప్రయత్నించి, మీకు నచ్చిన వాటిని ఉంచుకుని మిగతావి తొలగించండి.

మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం navya@andhrajyothy.com

టెక్ ప్రియులను ఆకట్టుకున్న 2017

రివైండ్

గత సంవత్సరం విడుదలైన గ్యాడ్జెట్లు, కొత్త ఆవిష్కరణలు టెక్నాలజీ ప్రియులను బాగా ఆకట్టుకున్నాయి. వాటిని ఒకసారి గుర్తు చేసుకుందాం.



ఆకర్షించిన 'అలెక్సా'

పిలిస్తే పలికే డివైజ్‌గా అమెజాన్ 'ఎకో ప్లస్' 2017లో అదరగొట్టింది. పాటలు ప్లే చేయడం, వార్తలు చదవడం, వాతావరణ సమాచారం చెప్పడం, చెప్పిన పుస్తకాన్ని చదివి పెట్టడం.... ఒక్కటేమిటి ఏ పని అడిగినా ఠక్కున చేస్తూ అందరినీ ఆకట్టుకుంది. 'అలెక్సా' ఉదయం 6 గంటలకు నిద్రలేపు అంటే ఠంచనుగా నిద్రలేపుతుంది. ఈ ఏడాది ఎక్కువ మందిని ఆకర్షించిన డివైజ్‌లలో ఇది మొదటి స్థానంలో ఉంది.

అదరగొట్టిన డిజిటల్ వ్యాలెట్లు

పెద్ద నోట్ల రద్దు తరువాత డిజిటల్ వినియోగం గణనీయంగా పెరిగింది. 2017లో వచ్చి అదరగొట్టిన డిజిటల్ వ్యాలెట్‌లే ఇందుకు సాక్ష్యాలు. పేటిఎం వంటి మొబైల్ వ్యాలెట్ జనాల్లోకి బాగా చొచ్చుకెళ్లింది. టీస్టాల్స్ దగ్గర సైతం పేటిఎంతో డబ్బులు చెల్లించారు. 2 కోట్ల మంది వినియోగదారులు పేటిఎం వినియోగిస్తున్నట్లు ఆ సంస్థ తెలిపింది. మొబిక్విక్, ఫోన్‌పె, సామ్‌సంగ్ పే, ఎయిర్‌టెల్ మనీ వంటి వ్యాలెట్లు సైతం ఆకర్షించాయి. గూగుల్ సైతం డిజిటల్ చెల్లింపుల కోసం 'తేజ్' పేరుతో యాప్‌ను విడుదల చేసింది. అతి తక్కువ సమయంలో 12 లక్షల మంది వినియోగదారులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు.

ఆసక్తి రేకెత్తించిన ఐఫోన్ 10

ఐఫోన్ కొత్త వెర్షన్ విడుదలవుతోందంటే ప్రపంచమంతా ఆసక్తే. ఆ అంచనాలకు తగ్గట్టుగా ఐఫోన్ 10 విడుదలయింది. ఎప్పుడూ లేనంతగా రికార్డు స్థాయిలో ఐఫోన్లు అమ్ముడుపోయాయి. 3జిబి ర్యామ్, 64 జిబి, 256జిబి స్టోరేజ్ సామర్థ్యం కలిగిన మోడల్స్ విడుదలయ్యాయి. బ్యాటరీ పనితీరు, కెమెరా నాణ్యత వినియోగదారులను ఆకట్టుకున్నాయి.

వావ్... ఓరియో

నెక్ట్స్ జనరేషన్ ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌గా పిలుస్తోన్న ఆండ్రాయిడ్ 'ఓరియో' 2017లోనే విడుదలయింది. ఆండ్రాయిడ్ నౌగట్ తరువాత మరికొన్ని మార్పులు చేస్తూ, కొత్త ఫీచర్లను జోడిస్తూ తీసుకొచ్చిన ఈ ఓఎస్ ఆకట్టుకుంది. యాప్ పర్‌ఫార్మెన్స్, రీడిజైన్ చేసిన ఎమోజీలు....వంటివి వినియోగదారులను ఆకట్టుకున్నాయి. ఆ తరువాత ఆండ్రాయిడ్ 'ఓరియో గో' పేరుతో అప్‌డేట్ చేసిన ఓఎస్‌ను విడుదల చేసింది.

గూగుల్ అసిస్టెంట్ సూపర్!

2017లో ఆండ్రాయిడ్ వినియోగదారులను బాగా ఆకర్షించింది గూగుల్ అసిస్టెంట్. 'ఓకే గూగుల్' అంటే 'ఐయామ్ లిజనింగ్' అంటూ స్మార్ట్‌ఫోన్ వినియోగదారులకు బాగా దగ్గరయింది. ఫోన్ కాల్ చేయాలన్నా, యూట్యూబ్‌లో వీడియో ఓపెన్ చేయాలన్నా అడిగిందే తడవుగా చిటికెలో చేసి పెట్టి అందరి దృష్టిని ఆకర్షించింది.

యాపిల్ వాచ్ సీరిస్ 3

గతంలో వచ్చిన వాచ్‌లతో పోల్చితే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని ఉపయోగించారు. ఫోన్ కాల్స్ చేసుకునే సదుపాయాన్ని అందించారు. డిజిటల్ అసిస్టెంట్ సిరి ఆకట్టుకుంది. హార్ట్‌రేట్ మానిటరింగ్ ఆకర్షించింది.

డైలీ సుడోకు - 65

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

			8	7	1			
	2	5	9		3			
					5	3	7	
	7					8		
	9	1	3		2	7	5	
		3					1	
	8	9	5					
			2		4	9	3	
			1	9	8			

సుడోకు- 64 సమాధానం

2	6	4	3	7	9	5	8	1
9	5	1	4	8	6	7	3	2
3	7	8	1	5	2	9	4	6
1	3	6	2	9	7	8	5	4
8	4	5	6	3	1	2	9	7
7	9	2	5	4	8	1	6	3
6	8	9	7	2	3	4	1	5
5	1	7	9	6	4	3	2	8
4	2	3	8	1	5	6	7	9

రూ.2,578 కోట్ల రికవరీకి టెల్కోలకు నోటీసు!

న్యూఢిల్లీ : ఐదు టెలికాం సంస్థల నుంచి 2,578 కోట్ల రూపాయలు రికవరీ చేసేందుకు గాను టెలికాం విభాగం (డాట్) నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ కంపెనీలు తమ రాబడులను తక్కువ చేసి చూపినట్టు కాగ్ బయటపెట్టిన నేపథ్యంలో డాట్ [illegible]లోకి ది[illegible]ంది. టాటా టెలీ స[illegible]సెస్, టెలినార్, వీడి[illegible] టెలికా[illegible]డాంట్ (వీడియా[illegible]కాన్ (గ్రూప్ సంస్థ), రిలయన్స్ జియోలు 14,800 కోట్ల రూపాయల రాబడులు తక్కువ చేసి చూపినట్టు కాగ్ తన నివేదికలో స్పష్టం చేసింది.



ఊగిసలాటలున్నా..
బుల్ హల్‌చల్

- స్టాక్ మార్కెట్ సూచీలు మరింత పైకే
- నిఫ్టీ టార్గెట్ 11600-12000

కొత్త ఏడాదిలోనూ దలాల్ స్ట్రీట్‌లో బుల్‌రన్ కొనసాగవచ్చని మార్కెట్ విశ్లేషకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాకపోతే ప్రామాణిక సూచీలు తీవ్ర ఊగిసలాటలకు లోనుకావచ్చని వారు భావిస్తున్నారు. దేశీయంగా, అంతర్జాతీయంగా పలు కీలక పరిణామాలు మార్కెట్లో ఒడిదుడుకులు పెంచవచ్చని హెచ్చరిస్తున్నారు. 2017లో కీలక నిరోధక స్థాయిలను బద్దలుకొడుతూ మిల్కా సింగ్‌లా పరుగెత్తిన స్టాక్ సూచీలు ఈ సంవత్సరంలో మాత్రం వేగాన్ని కొంత తగ్గించవచ్చని వారంటున్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం ప్రవేశపెట్టబోయే బడ్జెట్ నిర్ణయాలు ఈ ఏడాది స్టాక్ మార్కెట్ల గమనాన్ని నిర్దేశించడంలో కీలకపాత్ర పోషించనున్నాయి. అలాగే, ఆరు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు, వర్షపాతం, ఆర్‌బిఐ రెపో రేట్లు, కేంద్రం చేపట్టబోయే సంస్కరణలపై ఇన్వెస్టర్లు ప్రధానంగా దృష్టి సారిస్తారు. అంతర్జాతీయంగా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయం కూడా మన మార్కెట్‌కు కీలకంగా నిలుస్తుంది. మొత్తం మీద కొత్త ఏడాదిలో కూడా బుల్‌రన్ కొనసాగి నిఫ్టీ 12000 పాయింట్ల స్థాయిని తాకే ఆస్కారం ఉన్నదని బొనాంజా పిఎంఎస్ ఫండ్ మేనేజర్ యోగేష్ నగావ్కర్ అంటున్నారు. వచ్చే ఏడాది కూడా బుల్‌రన్ కొనసాగే ఆస్కారం ఉన్నందు వల్ల సూచీలు దిద్దుబాటుకు లోనైనప్పుడల్లా పెట్టుబడికి అవకాశంగా మలుచుకోవాలన్నది ఆయన సూచన. అయితే కోటక్ సెక్యూరిటీస్ మార్కెట్లో బుల్‌రన్ విషయంలో కాస్తంత ఆచితూచి వ్యవహరించింది. నిఫ్టీ ప్రస్తుత స్థాయి నుంచి 11 శాతం పెరిగి 11600 స్థాయికి చేరుకోవచ్చని ఆ సంస్థ అంచనా. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి ప్రభావాలు క్రమంగా తగ్గుముఖం పడుతుండటంతో 2018లో ఆర్థిక వృద్ధి రేటు క్రమంగా మెరుగుపడనున్నట్టు తెలిపింది.

ఏడాది రెండో అర్ధ భాగంలో ప్రభుత్వం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఉత్తేజితం చేయడం లక్ష్యంగా పెట్టుబడులు పెంచవచ్చునని, ప్రైవేట్ పెట్టుబడులు కూడా పుంజుకునే అవకాశం ఉందని పేర్కొంది. మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెట్టుబడులు పెరగనుండటం సానుకూలంగా ఉండనున్నట్లు తెలిపింది.

ఈక్విటీ మార్కెట్ ట్రెండ్‌పై కొందరు విశ్లేషకుల అంచనాలు..

ఈ సంవత్సరంలో ఈక్విటీ సూచీలు తీవ్ర ఊగిసలాటకు లోనుకావచ్చు. గత ఏడాది 28 శాతానికి పైగా రాబడులు పంచిన నిఫ్టీ 2018లో మరో 15 శాతం మేర పుంజుకోవచ్చు. కొన్ని స్టాక్‌లు, సెక్టార్లు ప్రామాణిక సూచీల కంటే మెరుగైన రిటర్నులు పంచే అవకాశం ఉంది. 2018లో యుఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను 0.75 శాతం పెంచవచ్చని అంచనా.
– అజయ్ జైస్వాల్, స్టీవార్ట్ అండ్ మాకెర్టిచ్ వెల్త్ మేనేజ్‌మెంట్ ప్రెసిడెంట్

మెరుగవుతున్న కార్పొరేట్ల ఆర్థిక ఫలితాలతోపాటు దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్ల దన్నుతో మార్కెట్లో ర్యాలీ కొనసాగనుంది. డిసెంబరు 2018కల్లా నిఫ్టీ 11500 స్థాయికి చేరుకోవచ్చని అంచనా. ఈ సంవత్సరం పారిశ్రామికోత్పత్తి, జిఎస్‌టి వసూళ్లు, నిర్మాణం, గ్రామీణ రంగాలతోపాటు ఉద్యోగాల కల్పన పుంజుకోవచ్చు. ఆరు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మౌలిక రంగానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఊతమిచ్చేందుకు మోదీ సర్కారు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంది. ఏడాది రెండో అర్ధభాగంలో ప్రైవేట్ పెట్టుబడుల్లో పునరుద్ధరణ కన్పించవచ్చు.
– వినీత్ బోలింజ్కర్, వెంచురా సెక్యూరిటీస్ హెచ్ఒఆర్

ఈ ఏడాదిలో మార్కెట్లు అంతగా పరుగు తీయకపోవచ్చు. నిఫ్టీ 12-15 శాతం మేర వృద్ధి నమోదు చేసుకునే అవకాశం ఉంది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో పరిస్థితులు క్రమంగా మెరుగవుతున్న నేపథ్యంలో వాణిజ్యావకాశాలు పుంజుకోవచ్చు. ఫలితంగా ఎగుమతి సంస్థలు ఆశాజనక పనితీరును ప్రదర్శించే అవకాశం ఉంది. బ్యాంకుల మొండి బకాయిల సమస్యను పరిష్కరించేందుకు చేపడుతున్న చర్యలతో పాటు వాటికి భారీగా మూలధన నిధులు కేటాయించనుండటం మార్కెట్ ఆదాయ వృద్ధిపై సానుకూల ప్రభావం చూపనుంది.
– గౌరవ్ దువా, షేర్‌ఖాన్ రీసెర్చ్ హెడ్

ఈ ఏడాది సూచీలు తీవ్ర ఊగిసలాటలకు లోనుకానుండటంతో మార్కెట్‌పై ఒత్తిడి పెరగనుందని భావిస్తున్నాం. బడ్జెట్, ఆర్‌బిఐ ద్రవ్య పరపతి సమీక్షలు, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు, అమెరికాలో పన్నుల తగ్గింపు ఈ సంవత్సరంలో మార్కెటకు కీలకం.
– దేవం మోదీ, ఈక్విరియస్ సెక్యూరిటీస్

ఈ ఏడాది దేశీయ సంస్థాగత పెట్టుబడులు ఈక్విటీలకు మద్దతుగా నిలువవచ్చు. కాకపోతే అమెరికాతోపాటు పలు అభివృద్ధి చెందిన దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు వడ్డీ రేట్లను మరింత పెంచే అవకాశం ఉన్నందున విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ప్రవాహం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. డిసెంబరు 2018కల్లా నిఫ్టీ ప్రస్తుత స్థాయి నుంచి 14 శాతం మేర పెరగవచ్చు.
– దినేష్ రోహిరా, 5నాన్స్ డాట్ కామ్ వ్యవస్థాపకులు

బుద్ధిగా పని చేయకుంటే ఉద్యోగం ఊస్ట్!

- సిబ్బందికి ఎయిర్ ఇండియా చీఫ్ వార్నింగ్



ముంబై: ప్రభుత్వ రంగ విమాన సంస్థ ఎయిర్ ఇండియా ఉద్యోగులకు ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి) ప్రదీప్ సింగ్ ఖరోలా గట్టిగా హెచ్చరించారు. అందరు సిబ్బంది కలిసే సంస్థను కష్టాల్లోంచి గట్టెక్కించగలమన్న ఖరోలా.. ఆశించిన పనితీరు కనబర్చకుంటే ఉద్యోగం కోల్పోవాల్సి వస్తుందని వార్నింగ్ ఇచ్చారు. త్వరలో ప్రైవేటీకరించబోతున్న ఎయిర్ ఇండియాకు సిఎండిగా ఖరోలా డిసెంబరు తొలినాళ్లలో బాధ్యతలు చేపట్టారు. మనం ప్రయాణికులకు బాధ్యతాయుతంగా, మెరుగైన సేవలందించే దిశగా కృషిచేయాల్సిన అవసరం ఉంది. సంస్థ పునరుద్ధరణకు అదెంతో కీలకం. మీ కృషి వల్లే ఈ మధ్యకాలంలో కొన్ని అంశాల్లో సంస్థ పనితీరు మెరుగైంది. అయినప్పటికీ, సాధించాల్సింది ఇంకెంతో ఉంది అని ఉద్యోగులకు ఖరోలా కొత్త సంవత్సరం సందర్భంగా సందేశం ఇచ్చారు. కంపెనీని కష్టాల మబ్బుల్లోంచి నుంచి సుస్పష్టమైన గగనతలంవైపు మళ్లించాలన్న ఏకైక లక్ష్యంతో పనిచేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. ఇండస్ట్రీ ప్రమాణాలకు దీటుగా పనిచేసేందుకు మనం పనితీరును మరింత మెరుగుపర్చుకోగలగాలి అని ఆయన పేర్కొన్నారు. ఎయిర్ ఇండియాలో వ్యూహాత్మక వాటా విక్రయానికి జూన్ 28 కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తం

ఆస్ట్రో గైడ్

(జనవరి 1-5 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ : 10531 (+38)

నిఫ్టీ గత వారం 10460-10552 పాయింట్ల మధ్యన పరిమిత పరిధిలో కదలాడి 38 పాయింట్ల లాభంతో వారం గరిష్ఠ స్థాయిలో 10531 వద్ద ముగిసింది. ఇది పాజిటివ్ ధోరణికి సంకేతం.

- డిసెంబరు 26,27 తేదీల్లో చంద్రుడు ఉత్తరాభాద్ర నుంచి రేవతి నక్షత్రాల నడుమ సంచరించిన సమయంలో ఏర్పడిన పరిధి 10478-10552. ఇది రానున్న వారాలకు కీలకం. ఎగువ స్థాయిని బ్రేక్ చేస్తే మరింత బుల్లిష్ అవుతుంది. కనిష్ఠ స్థాయి కన్నా దిగజారితే బేరిష్ అవుతుంది.
- స్వల్పకాలిక ట్రెండ్ చాలా బుల్లిష్‌గా ఉంది. మధ్యకాలిక, దీర్ఘకాలిక దృక్పథాలు రెండింటిలో కూడా నిఫ్టీ బుల్లిష్‌గానే ఉంది. 10350 కన్నా దిగువన ముగిసినప్పుడే బేరిష్ అవుతుంది.

గ్రహగతులివే..

- మిథునంలోని ఆర్ద్ర పాదం 1 నుంచి సింహంలోని మఖ పాదం 3 మధ్యలో చంద్ర సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 2-3 మధ్యలో రవి సంచారం
- వృశ్చికంలోని జ్యేష్ఠ పాదం 3-4 మధ్యలో బుధ సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 1-2 మధ్యలో శుక్ర సంచారం
- తులలోని విశాఖ పాదం 1లో కుజ సంచారం
- ధనుస్సులోని మూల పాదం 3లోమిథున నవాంశలో శని సంచారం
- తులలోని విశాఖ పాదం 1లో మేష నవాంశలో బృహస్పతి సంచారం
- మకరంలో రాహువు, కర్కాటకంలో కేతువు కర్కాటక, మకర నవాంశల్లో సంచారం

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 10328, 10318, 10135, 9810 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- ప్రస్తుతం నిఫ్టీ అన్ని డిఎంఎల కన్నా పైన ట్రేడవుతోంది. నిఫ్టీ 200 డిఎంఎ కన్నా పైన ఉండడం 50 డిఎంఎ 200 డిఎంఎ కన్నా పైకి రావడం (గోల్డెన్ క్రాస్) దీర్ఘకాలిక ట్రెండ్ బుల్లిష్‌గా ఉందనేందుకు సంకేతం.

బ్రేకౌట్ స్థాయి : 10575
బ్రేక్‌డౌన్ స్థాయి : 10350
నిరోధ స్థాయిలు : 10675, 10750 (10600 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు : 10375, 10300 (10450 దిగువన బేరిష్)

ఇన్వెస్టర్లకు సూచన

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

ద్వితీయార్ధం బలహీనం (సోమవారానికి)

తిథి : పుష్య శుక్ల చతుర్దశి
నక్షత్రం : మృగశిర
పుష్యమి, అనూరాధ, ఉత్తరాభాద్ర నక్షత్ర జాతకులు, కర్కాటక, వృశ్చిక రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

ట్రెండ్ మార్పు వేళలు : 9.37, 2.51

ధోరణి : గ్రహగతులను బట్టి నిలకడ/మెరుగ్గా ప్రారంభమై 11.50 వరకు మెరుగ్గా ట్రేడవుతూ 12 గంటల నుంచి 2.50 మధ్యలో నిస్తేజంగా ట్రేడవుతూ చివరి 15 నిముషాలు తిరిగి మెరుగ్గా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 12 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 2.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి.
నిరోధ స్థాయిలు : 10570, 10605
మద్దతు స్థాయిలు : 10490, 10455
గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

సత్తా చాటిన స్మాల్ స్టాక్స్

- బ్లూచిప్ కంపెనీలను మించి రాబడులు

న్యూఢిల్లీ : 'బ్లూచిప్ కంపెనీలతో పోలిస్తే మేం చిన్నోళ్లమే. ఇన్వెస్టర్లకు రాబడులు అందించడంలో మాత్రం కాదు' అంటున్నాయి బిఎస్ఇ స్మాల్ క్యాప్ ఇండెక్స్ కంపెనీలు. గత ఏడాది ఈ ఇండెక్స్ పరుగెత్తిన తీరే ఇందుకు నిదర్శనం. 2017లో 30 బ్లూచిప్ కంపెనీలకు ప్రాధినిధ్యం వహించే సెన్సెక్స్ 27.91 శాతం, మిడ్ క్యాప్ ఇండెక్స్ 48.13 శాతం పెరిగితే, స్మాల్ క్యాప్ ఇండెక్స్ మాత్రం 59.64 శాతం పెరిగి ఇన్వెస్టర్లకు మంచి లాభాలు పంచింది. గత ఏడాది ఆఖరి ట్రేడింగ్ రోజైన డిసెంబరు 29న బిఎస్ఇ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 19,262.44 పాయింట్ల రికార్డ్ స్థాయికి చేరింది. అదే రోజు మిడ్‌క్యాప్ ఇండెక్స్ కూడా 17,851.03 పాయింట్ల లైఫ్ టైమ్ హైకి చేరింది. అంతకు రెండు రోజుల ముందే అంటే డిసెంబర్ 27న సెన్సెక్స్ 34,137.97 పాయింట్ల రికార్డు స్థాయికి చేరింది.

2017లో సూచీల పనితీరు

సూచీ	పెరిగిన పాయింట్లు	వృద్ధి (శాతంలో)	ఏడాది ముగింపు
బిఎస్ఇ స్మాల్‌క్యాప్	7184.59	59.64	19230.72
బిఎస్ఇ మిడ్‌క్యాప్	5791.06	48.13	17822.40
బిఎస్ఇ సెన్సెక్స్	7430.37	27.91	34056.83
ఎన్ఎస్ఇ నిఫ్టీ	2344.90	28.65	10530.70

ఇవే కారణం: 2008లో ప్రపంచాన్ని కుదిపేసిన ఆర్థిక సంక్షోభం తర్వాత అన్ని ఇండెక్స్‌ల బాటలోనే స్మాలక్యాప్ ఇండెక్స్ కూడా కుప్పకూలింది. 2014 నుంచే మిడ్ అండ్ స్మాల్ క్యాప్ కంపెనీల దశ తిరిగింది. కేంద్రంలో మోదీ నాయకత్వాన స్థిరమైన ప్రభుత్వం కొలువు తీరడంతో వ్యాపార వర్గాలతో పాటు ఇన్వెస్టర్లలో నమ్మకం ఇనుమడించింది. దీనికి తోడు అప్పటి నుంచి దేశ, విదేశీ ఇన్వెస్టర్ల నుంచి పెట్టుబడులు పోటెత్తాయి. విదేశీ ఇన్వెస్టర్లు లార్జ్ క్యాప్ షేర్లయిన బ్లూచిప్ కంపెనీల షేర్లలో ఎక్కువగా ఇన్వెస్ట్ చేస్తే, దేశీయ మ్యూచువల్ ఫండ్స్ మాత్రం మంచి ట్రాక్ రికార్డు ఉన్న స్మాల్ అండ్ మిడ్ క్యాప్ కంపెనీల షేర్లలో ఎక్కువగా ఇన్వెస్ట్ చేశాయి. దీనికి తోడు ప్రభుత్వం చేపట్టిన కొన్ని సంస్కరణలు, మౌలిక సదుపాయాల రంగంలో పెరిగిన ప్రభుత్వ పెట్టుబడులూ ఈ కంపెనీలకు కలిసొచ్చాయి. డాలర్‌తో రూపాయి మారకం రేటు బలపడడం, పెద్ద నోట్ల రద్దు కూడా గత ఏడాది ఈక్విటీ మార్కెట్‌కు కలిసొచ్చింది. దీంతో బ్యాంకింగ్‌తో పాటు ఐపిఒ ఇష్యూల్లోకి ఎక్కువ పెట్టుబడులు వచ్చాయి. ఈ సంవత్సరం కూడా స్మాల్ అండ్ మిడ్ క్యాప్ ఇండెక్స్‌లు ఆకర్షణీయమైన లాభాలు పంచే అవకాశం ఉంది. ఈ రాబడులు గత ఏడాది స్థాయిలో ఉండకపోయినా, ఆకర్షణీయమైన స్థాయిలోనే ఉంటాయని మార్కెట్ వర్గాల అంచనా.



రూ.21,319 కోట్లు తగ్గిన మార్కెట్ క్యాప్

సంవత్సరాంతంలో ఇండెక్స్‌లు జీవిత కాల గరిష్ఠ స్థాయిని తాకినా గత వారం కొన్ని పెద్ద కంపెనీలకు నష్టాలు తప్పలేదు. సెన్సెక్స్‌లో అత్యంత విలువైన కంపెనీలుగా పరిగణించే 10 కంపెనీల్లో ఇన్ఫోసిస్, ఎస్‌బిఐ, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐటిసి కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ గత వారం రూ.21,319 కోట్లు పడిపోయింది. ఇదే సమయంలో రిలయన్స్ ఇండస్ట్రీస్, టిసిఎస్, హెచ్‌యుఎల్, మారుతి సుజుకీ, హెచ్‌డిఎఫ్‌సి, ఒఎన్‌జిసి కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.19,739.62 కోట్లు దూసుకు పోయింది. గత వారం ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.11,541.88 కోట్లు, ఎస్‌బిఐ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.8,934.18 కోట్లు పడిపోయింది.

సెబికి ఐటీ సేవలు..
బరిలో టెక్ మహీంద్రా

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబికి ఐటీ సేవలందించేందుకు టెక్ మహీంద్రా, విప్రో, టాటా కమ్యూనికేషన్స్‌తోసహా 15 కంపెనీలు షార్ట్‌లిస్ట్ అయ్యాయి. సెబి రెండు ఐటీ విభాగాల్లో సేవలను కోరుతోంది. ఒకటి నియంత్రణ మండలి ఐఈ వ్యవస్థలో భద్రత లోపాలు గుర్తించడంతోపాటు వాటిని వర్గీకరించడం, రెండోది హ్యాకర్ల దాడి నుంచి రక్షించడం. ఈ సేవలందించేందుకు ఆసక్తి వ్యక్తీకరణ దరఖాస్తులు సమర్పించాలని కోరుతూ సెప్టెంబరులో సెబి నోటిఫికేషన్ జారీ చేసింది. ఐటీ వ్యవస్థ భద్రత లోపాలను గుర్తించే సేవలకు సంబంధించి విప్రో, ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఎల్ఎల్‌పి, ప్రైస్‌వాటర్‌హౌజ్, సుమేరు సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ (ఇండియా) లిమిటెడ్‌తో సహా మొత్తం 7 సంస్థలను సెబి షార్ట్‌లిస్ట్ చేసింది. ఇక నెట్‌వర్క్ అండ్ సెక్యూరిటీ ఆపరేషన్ సెంటర్ ఏర్పాటు, నిర్వహణ కోసం టాటా కమ్యూనికేషన్స్, విప్రో, టెక్ మహీంద్రా, ఐబిఎం ఇండియా, సిఫి టెక్నాలజీస్, ప్రైస్‌వాటర్‌హౌజ్ షార్ట్‌లిస్ట్ అయ్యాయి.

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.05 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	350.00	చిత్తూరు	363.00
వరంగల్	351.00	చెన్నై	370.00
విజయవాడ	365.00	నమక్కల్	365.00
గోదావరి	365.00	బెంగళూరు	360.00
విశాఖపట్నం	370.00	ముంబై	395.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	96.00	విజయవాడ	91.00
కరీంనగర్	97.00	గుంటూరు	91.00
వరంగల్	96.00	ఒంగోలు	93.00
మహబూబ్‌నగర్	96.00	చిత్తూరు	79.00
కర్నూలు	96.00	నెల్లూరు	89.00
విశాఖపట్నం	87.00	అనంతపురం	88.00
గోదావరి	89.00		

'ఆటో' నియామకాల్లో మందగమనం

- కొత్త టెక్నాలజీలు, ఆటోమేషనే కారణం
- కొత్త నైపుణ్యాలు అవసరం
- తాజా నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ : దేశీయ ఆటో మొబైల్ పరిశ్రమలో ఈ ఏడాది నియామకాలు 2-25 శాతానికి తగ్గే అవకాశం ఉందని ఫిక్కీ-నాస్కామ్, ఇవై తాజా నివేదిక పేర్కొంది. కొత్త టెక్నాలజీలు, ఆటోమేషన్ పెరుగుదల వంటి అంశాలు నియామకాల్లో మందగమనానికి దారితీస్తున్నట్టు తెలిపింది. కొత్త టెక్నాలజీల అరంగేట్రం నేపథ్యంలో నైపుణ్యాలను మరింతగా పెంచుకోవాల్సిన అవసరం ఏర్పడుతోందని "భారత్‌లో భావి ఉద్యోగాలు : 2022 దృక్కోణం" అన్న అధ్యయన నివేదికలో పేర్కొంది. 2022 నాటికి దేశీ ఆటో రంగంలో ఉద్యోగిత 1.43 కోట్ల స్థాయికి చేరుకునే అవకాశం ఉందని వెల్లడించింది. 60-65 శాతం ఉద్యోగాల్లో కొత్త నైపుణ్యాల అవసరం ఉంటుందని తెలిపింది. 2017 ఆర్థిక సంవత్సరంలో ఈ రంగం ద్వారా 1.28 కోట్ల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించింది. ఏటా ఆటో పరిశ్రమ ఉద్యోగాల నియామకాల్లో 2-2.5 శాతం వృద్ధికి ఆస్కారం ఉందని, దీంతో ఈ రంగంలో ఉద్యోగాలు 2022 నాటికి 1.43 కోట్లకు చేరుకుంటాయని పేర్కొంది.

ఆటో మొబైల్ రంగంలో రోబోల వినియోగం గణనీయంగా పెరుగుతోందని, వెల్డ్ షాప్స్, ప్రెస్ షాప్స్, కాస్ట్ షాప్స్, పెయింట్ షాప్స్ వంటి విభాగాల్లో రోబోల వాడకం ఉందని తెలిపింది. ఆటోమేషన్ పెంచుతూ తయారీ వ్యయాన్ని తగ్గించుకోవడానికి ఆటోమొబైల్ కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్నట్టు నివేదిక స్పష్టం చేసింది. పెయింటింగ్, వెల్డింగ్ విభాగాల్లో ఒకే రకమైన పనిని పదే పదే చేయాల్సి ఉంటుందని, ఇలాంటి ప్రదేశాల్లో రోబోలనే ఎక్కువగా వాడటం వల్ల ఈ విభాగంలో ఉద్యోగాలు గల్లంతు అవుతున్నాయని ఇవై పార్ట్‌నర్ (పీపుల్ అండ్ ఆర్గనైజేషన్ అడ్వైజరీ సర్వీసెస్) అనురాగ్ మాలిక్ తెలిపారు. ఇదే సమయంలో రోబోటిక్స్ ప్రోగ్రామ్స్, మెయింటెనెన్స్ వంటి వాటిలో నైపుణ్యాలు ఉన్న వారికి మంచి డిమాండ్ ఉందని చెప్పారు. రానున్న కాలంలో నైపుణ్యాలు కలిగిన వారికి అధిక డిమాండ్ ఉంటుందని తెలిపారు. దేశ ఆర్థిక వాతావరణం పురోగమిస్తోందని, మేకిన్ ఇండియాలో భాగస్వాములుగా మారేందుకు ఇన్వెస్టర్లు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నట్టు మాలిక్ చెప్పారు.

ఆటోమేషన్ విషయానికొస్తే ప్లాంట్ స్థాయిలో ఆటోమేషన్ 30 శాతంగా ఉంటే బాడీ షాప్ స్థాయిలో 95 శాతానికి మించి ఉందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సామర్థ్యాలు కలిగిన స్మార్ట్ రోబోలను వినియోగించేందుకు ఆటో కంపెనీలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని చెప్పారు. కనెక్టెడ్ కార్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్ ప్రవేశం నేపథ్యంలో వచ్చే ఐదేళ్ల కాలంలో డిజైన్, ఆపరేషన్, ఇతర ఆటో వాల్యూ చెయిన్ విభాగాల్లో కార్యకలాపాలు నిర్వహించేందుకు నూతన నైపుణ్యాల అవసరం ఉంటుందని నివేదిక స్పష్టం చేసింది.

కొత్త గరిష్ఠ స్థాయిల్లో పరీక్ష

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా



నిఫ్టీ గత వారం ప్రధాన నిరోధం 10500 వద్ద రియాక్షన్ సాధించినా తదుపరి పుంజుకుని వారాంతంలో గరిష్ఠ స్థాయిల్లో క్లోజ్ కావడం ట్రెండ్‌లో సానుకూలత సంకేతం. ముందు వారంలో ఎగువకు పెద్ద బ్రేకౌట్ సాధించినందు వల్ల గత వారం పుల్‌బ్యాక్ రియాక్షన్ సాధించింది. ఈ పుల్‌బ్యాక్ రియాక్షన్‌లో కూడా బలంగా నిలవడం సానుకూలత సంకేతం. ఇప్పుడు ఇండెక్స్ మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించి కొత్త గరిష్ఠ స్థాయిలను తాకవచ్చు. అప్‌ట్రెండ్‌ను కొనసాగించాలంటే ఈ గరిష్ఠ స్థాయిల్లో బలాన్ని ప్రదర్శించడం తప్పనిసరి. మార్కెట్ కొత్త అంచెల్లోకి ప్రవేశిస్తున్నందు వల్ల నిరోధ స్థాయిలంటూ ఏవీ లేవు. అన్నీ మానసిక స్థాయిలే.

బుల్లిష్ స్థాయిలు..

ప్రధాన మానసిక అవధి 10600. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. తదుపరి టార్గెట్లు 10800, 11000.

బేరిష్ స్థాయిలు..

రియాక్షన్‌లో పడితే భద్రత కోసం ప్రధాన మద్దతు స్థాయి 10500 కన్నా పైన తప్పనిసరిగా నిలదొక్కుకోవాలి. అంతకన్నా దిగువన క్లోజయితే స్వల్పకాలిక బలహీనత సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 10400. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక కరెక్షన్‌గా భావించి స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తం కావాలి.

సోమవారం స్థాయిలివే...
నిరోధం: 10555, 10600
మద్దతు: 10500, 10430

బ్యాంక్ నిఫ్టీ : బ్యాంక్ నిఫ్టీకి నిరోధ స్థాయి 25800. కొద్ది రోజుల క్రితం ఏర్పడిన టాప్ ఇదే. అంతకన్నా పైన క్లోజయినప్పుడే మరింత అప్‌ట్రెండ్ సాధిస్తుంది. తదుపరి టార్గెట్ 26000. కరెక్షన్‌లో పడి ప్రధాన మద్దతు స్థాయి 25400 కన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్ ముప్పు ఏర్పడుతుంది.

స్వల్పకాలిక వ్యూహం : స్వల్పకాలిక ట్రేడర్లు 10400 దిగువన గట్టి స్టాప్ లాస్‌తో బై పొజిషన్లు హోల్డ్ చేయవచ్చు.

పాటర్న్ : ఏటవాలుగా ఎగువకు కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్‌లైన్ కన్నా మార్కెట్ చాలా పైన ఉంది. ఇది ట్రెండ్‌లో సానుకూలత సంకేతం. నెలవారీ చార్టుల్లో ఓవర్‌బాట్ స్థితి ఉండడం గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తంగా ఉండాలనే సంకేతం ఇస్తోంది. 10400 వద్ద అడ్డంగా కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్‌లైన్ కన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్‌లో పడుతుంది. అయితే వీక్లీ చార్టుల్లో మాత్రం గత రెండు నెలల కాలంలో ఓవర్‌బాట్ స్థితి సద్దుబాటయింది.

టైమ్ : ఈ సూచిక ప్రకారం తదుపరి స్వల్పకాలిక రివర్సల్స్ సోమ, శుక్రవారాల్లో ఉన్నాయి.

మదర్సన్ సుమి (రూ.380) – కొనుగోలు స్థాయిలకు చేరువలో..

రూ.380 ఎగువన అప్‌ట్రెండ్	మొదటి నిరోధం రూ.400	రెండో నిరోధం రూ.420
రూ.365 దిగువన డౌన్‌ట్రెండ్	మొదటి మద్దతు రూ.345	రెండో మద్దతు రూ.330

స్థూల ఆర్థిక గణాంకాలే కీలకం

మార్కెట్ నాడి



విజయ్ సింఘానియా
డైరెక్టర్, ట్రేడ్‌స్మార్ట్ ఆన్‌లైన్

"అందరి దృష్టి ఈ వారంలో ప్రభుత్వం ప్రకటించనున్న ఆర్థిక గణాంకాల పైకే మళ్లుతుంది. అలాగే నెలవారీ ఆటో అమ్మకల గణాంకాలు ప్రకటించనున్నందు వల్ల ఆటో స్టాక్‌లలో కూడా కదలికలు ఎక్కువగా ఉండవచ్చు."

ప్రస్తుతం మార్కెట్‌ను ముందుకు నడిపించే భారీ ట్రిగ్గర్లేవీ లేవు. ఫ్యూచర్స్ కాంట్రాక్టులు ముగిసిపోయి పాత సంవత్సరానికి ఈక్విటీ మార్కెట్ చక్కని లాభాలతో వీడ్కోలు పలికింది. ఇప్పుడు మార్కెట్‌ను ముందుకు నడపగల ప్రధాన సంకేతాలేవీ లేని వాతావరణంలో అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వెలువడే సంకేతాలు, రూపాయి కదలికలు, క్రూడాయిల్ ధరల పైనే ఇన్వెస్టర్లు దృష్టి సారిస్తారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం అమెరికన్ మార్కెట్‌కు సెలవు.

కీలక గణాంకాలివే..

మార్కెట్ ఎకనామిక్స్ సంస్థ డిసెంబరులో తయారీ రంగం పిఎంఐని మంగళవారం, సేవల రంగం పిఎంఐని గురువారం ప్రకటించనుంది. తయారీ రంగం పిఎంఐ నవంబరులో 52.6 పాయింట్లకు పెరిగినప్పటికీ సేవల రంగం మాత్రం దిగజారి 48.5 పాయింట్లకు పడిపోయింది.

డిసెంబరు నెలకి ఆటో మొబైల్ రంగంలో అమ్మకాల గణాంకాలను ఆ రంగానికి చెందిన కంపెనీలు సోమవారం ప్రకటిస్తాయి.

- విదేశీ పరిణామాల విషయానికి వస్తే ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ డిసెంబరు సమావేశం తీర్మానాలను బుధవారం విడుదల చేస్తుంది. డిసెంబరు 13 నాటి సమావేశంలో అమెరికన్ ఫెడరల్ వడ్డీరేట్లను 0.25 శాతం పెంచింది. 2017 సంవత్సరంలో మూడో పెంపు ఇది.
- మరోపక్క ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు శీతాకాల సమావేశాలు శుక్రవారం ముగియనున్నాయి. పార్లమెంటు సమావేశాల ధోరణిని కూడా ట్రేడర్లు నిశితంగా గమనిస్తారు.

టెక్నికల్స్ ఇవే...

డెయిలీ చార్టుల్లో నిఫ్టీ బుల్లిష్ కాండిల్ స్టిక్ పాటర్న్ ఏర్పరచుకుంది. స్వల్ప కాల పరిధిలో పరిశీలించినట్టయితే నిఫ్టీ మూడు రోజుల కన్సాలిడేషన్ దశను బ్రేక్ చేసింది. అంటే ఇప్పుడు ఇండెక్స్ 10610 దిశగా ర్యాలీ సాధించవచ్చు. మద్దతు స్థాయి 10450.

- బ్యాంక్ నిఫ్టీ కన్సాలిడేషన్‌ను కొనసాగిస్తుంది. 25400 బలమైన మద్దతు స్థాయి. .నిరోధం 25750.
- డిసెంబరు సిరీస్ రోలోవర్ నిఫ్టీకి 73 శాతం ఉండగా బ్యాంక్ నిఫ్టీకి 75 శాతం ఉంది. ముందు నెలతో గాని, మూడు నెలల సగటుతో గాని పోల్చితే డిసెంబరులో రోలోవర్లు ఎక్కువగా ఉన్నాయి. వర్తమాన సిరీస్‌లో గరిష్ఠ ఓపెన్ ఇంటరెస్ట్ నిఫ్టీకి 11000 సిఇ, 10300 పిఇ ఉండగా బ్యాంక్ నిఫ్టీకి 26000 సిఇ, 25000 పిఇ ఉన్నాయి.

S & D

ఈ ఏడాది ట్రేడింగ్ సెలవులు ఇవే..

హాలీడే	తేదీ	రోజు
రిపబ్లిక్ డే	జనవరి 26	శుక్రవారం
మహాశివరాత్రి	ఫిబ్రవరి 13	మంగళవారం
హోళీ	మార్చి 2	శుక్రవారం
మహావీర్ జయంతి	మార్చి 29	గురువారం
గుడ్ ఫ్రైడే	మార్చి 30	శుక్రవారం
మహారాష్ట్ర డే	మే1	మంగళవారం
స్వాతంత్ర్య దినోత్సవం	ఆగస్టు 15	బుధవారం
బక్రీద్	ఆగస్టు 22	బుధవారం
గణేష్ చతుర్థి	సెప్టెంబరు 13	గురువారం

హాలీడే	తేదీ	రోజు
మొహర్రం	సెప్టెంబరు 20	గురువారం
గాంధీ జయంతి	అక్టోబరు 2	మంగళవారం
దసరా	అక్టోబరు 18	గురువారం
దీపావళి	నవంబరు 7	బుధవారం
దీవాళి బలిప్రదా	నవంబరు 8	గురువారం
గురునానక్ జయంతి	నవంబరు 23	శుక్రవారం
క్రిస్మస్	డిసెంబరు 25	మంగళవారం

సొమ్ము ఎంతన్నది కాదు.. ఎక్కడ ఇన్వెస్ట్ చేశారన్నదే పాయింటు



పంట పండాలంటే పక్కా వ్యూహం ఉండాలి

ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహాలు ప్రతి ఏడాది మారుతుండాలి. ఒక సంవత్సరంలో అద్భుతమైన రాబడులను ఇచ్చిన అసెట్స్ ఆ తర్వాత సంవత్సరంలోనూ అదే దూకుడు ప్రదర్శించాలని లేదు. బూమ్ మళ్లీ ఒక కొత్త అసెట్‌లో ఉంటుంది. బూమ్ ఎందులో ఉంటుందో కచ్చితంగా అంచనా వేయడం కష్టం. అయితే గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కొత్త సంవత్సరం ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహాలకు పదునుపెట్టాలి. తదనుగుణంగా కేటాయింపులను మార్చుకోవాలి. ఇన్వెస్ట్‌మెంట్స్ లక్ష్యం అధిక రాబడి అనడంలో సందేహం లేదు. అయితే దానితోపాటు పన్ను రాయితీ, జీవిత బీమా వంటి ఇతర ప్రయోజనాలు ఉండేలా జాగ్రత్తపడాలి. 2018 వ్యూహం ఎలా ఉండాలంటే...

ఈక్విటీల్లో ఆచితూచి



సందేహం లేదు. గత ఏడాది ఈక్విటీలు ఇరగదీశాయి. అన్నీ సవ్యంగా ఉన్నప్పుడు ఈక్విటీలు ఇచ్చిన రాబడులను మరో అసెట్ క్లాస్‌లో ఊహించడం కూడా కష్టమే. 2017లో షేర్లను నమ్ముకున్నవారు బోలెడు లాభాలు సంపాదించారు. కొత్త సంవత్సరంలో ఈక్విటీల పనితీరుపై మాత్రం భిన్నమైన అంచనాలు వెలువడుతున్నాయి. వాల్యుయేషన్స్ శృతి మించి పెరిగిన కారణంగా కరెక్షన్ భారీగా ఉంటుందని కొందరు విశ్లేషకులు చెబుతున్నారు. వారి ఉద్దేశంలో మార్కెట్ బబుల్ జోన్‌లో ఉంది. అంటే బుడగ ఏ క్షణంలోనైనా ఠప్ మనే అవకాశం ఉంది. అయితే మరికొందరు పండితులు మాత్రం 'మార్కెట్ మహిషము' స్వైరవిహారానికి అడ్డుఅదుపు ఉండదని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వివిధ రంగాల్లో ప్రభుత్వ వ్యయం పెరిగే అవకాశం ఉండటం, అదే సమయంలో ప్రైవేట్ పెట్టుబడుల్లోనూ కదలిక వల్ల కార్పొరేట్ ఎర్నింగ్స్‌లో వృద్ధి ఉంటుందని, వారి అభిప్రాయం. సెన్సెక్స్ కొత్త సంవత్సరంలో కనీసం 14-15 శాతం పెరగవచ్చని అంచనా. అయితే 2017లో ఉన్నట్టుగా మార్కెట్లు కొత్త సంవత్సరంలోనూ ఏకపక్షంగా దూసుకుపోతాయని ఆశలు పెట్టుకోవద్దు. చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. విపరీతంగా పెరిగిన షేర్ల జోలికి వెళ్లకుండా జాగ్రత్తపడాలి. రాబడుల వృద్ధికి అనుగుణంగా పెరుగుతున్న షేర్లను గుర్తించాలి. అదే సమయంలో దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలను నిశితంగా గమనిస్తూ ఉండాలి. ఎంపిక చేసిన షేర్లలో ఇన్వెస్ట్ చేస్తూ పోవాలి. రిస్క్ ఏ మాత్రం వద్దనుకుంటే అందుబాటులో ఉన్న నిధుల్లో 30 శాతానికి మించకుండా ఈక్విటీల్లో ఇన్వెస్ట్‌చేయాల్సిందిగా నిపుణులు సలహా ఇస్తున్నారు.

స్థిరాస్తులు..

ఇందులో పెట్టుబడులకు భారీ మొత్తాలు కావాల్సి ఉంటుంది. అలా కాకుండా రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్స్), ఇన్‌ఫ్రా, లాజిస్టిక్స్, హౌజింగ్ కంపెనీల షేర్లలో స్వల్ప మొత్తాల్లో పెట్టుబడి పెట్టి కూడా రియల్ బూమ్‌లోని లాభాలను అందుకోవచ్చు. డబ్బు ఎక్కువగా ఉంటే పెరుగుదలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఫ్లాట్స్ లేదా ప్లాట్స్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చు.



బీమా.. సరిపోతుందా ?

జీవిత బీమా కవరేజ్‌ను కొత్త పరిస్థితులకు అనుగుణంగా పెంచుకోవడం చాలా అవసరం. కొత్తగా రుణాలు తీసుకున్నా, పిల్లలను విదేశీ విద్య కోసం పంపిస్తున్నా, భార్యాభర్తల్లో ఒకరు ఉద్యోగం మానేస్తున్నా.. బీమా కవరేజ్ పెంచుకోవడం మంచిదన్నది నిపుణుల సలహా. లభిస్తున్న బీమా కవరేజ్‌కు చెల్లిస్తున్న ప్రీమియం మొత్తాన్ని కూడా మదింపు వేసి తక్కువ ప్రీమియం రేట్లతో కవరేజ్ పెంచుకోగల అవకాశాలను పరిశీలించండి. యూనిట్ లింక్‌డ్ స్కీమ్స్‌లో ఇన్వెస్ట్ చేసి ఉంటే వాటి పనితీరును మదింపు వేయండి పోర్ట్‌ఫోలియోను మార్చే ప్రయత్నం చేయండి. జీవిత బీమాతో పాటు అత్యవసరమైన ఆరోగ్య బీమాను కూడా ఇన్వెస్ట్‌మెంట్‌గానే భావించండి. దీనిపై రాబడి రాకపోవచ్చు. అనూహ్యమైన పరిణామాలు ఎదురైనప్పుడు కష్టపడి సంపాదించిన రాబడిని కార్పొరేట్ హాస్పిటల్స్ తుడిచిపెట్టకుండా ఆరోగ్య బీమా రక్షిస్తుంది. ఇంటిల్లిపాదికి సంబంధించి ఆరోగ్య బీమా కోసం బెస్ట్ ఆప్షన్స్‌ను పరిశీలించండి. పనిచేసే చోట గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం ఉంటే ఉపయోగించుకోండి.



బంగారం మంచిదేనా ?



2017లో బంగారం పెట్టుబడుల్లో రాబడి 2.9 శాతం ఉంది. వాస్తవానికి జనవరి-సెప్టెంబరు మధ్య బంగారంలో వృద్ధి 7 శాతం వరకు ఉంది. ఆ తర్వాత కరెక్షన్ చవిచూసింది. కొత్త సంవత్సరంలో ఈక్విటీల్లో కరెక్షన్ ఉంటే బంగారంలో వృద్ధి ఉంటుంది. అయితే ఫిజికల్ బంగారం కంటే ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ముందుకు తెచ్చిన సావరిన్ గోల్డ్ బాండ్స్‌లో ఎంతో కొంత ఇన్వెస్ట్ చేయవచ్చు. మొత్తం ఇన్వెస్ట్‌మెంట్‌లో 10 శాతం వరకు బంగారానికి కేటాయించవచ్చని విశ్లేషకులు అంటున్నారు.

కమోడిటీల్లో ర్యాలీ



కమోడిటీల మార్కెట్లోనూ పెరుగుదల బాగా ఉంది. లోహాలు, ముడి చమురుతో పాటు కొన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తుల ధరలు ఎలా పెరుగుతున్నాయో కమోడిటీల మార్కెట్లను చూస్తే బోధపడుతుంది. సొంత పరిజ్ఞానంతో కాకుండా నిపుణుల సలహాలతో ఈక్విటీలతో పాటు కొంతమొత్తాన్ని కమోడిటీల్లోనూ ఇన్వెస్ట్ చేయవచ్చు.

డెట్ మ్యూచువల్‌ఫండ్స్



దీర్ఘకాలిక డెట్ ఫండ్స్ కంటే స్వల్పకాలిక డెట్ ఫండ్స్ 2017లో బ్రహ్మాండంగా రాణించాయి. ఆఖరు త్రైమాసికంలో 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్‌లో రాబడి 7.22 శాతం వరకు దూసుకుపోయింది. పెరుగుతున్న ముడి చమురు ధరల వల్ల కరెంట్ ఖాతా లోటు విస్తరిస్తుందన్న భయాలు, జిఎస్‌టి రాబడులు తగ్గడంతో ద్రవ్య లోటు నియంత్రణపై సందేహాలు, పశ్చిమ దేశాల సెంట్రల్ బ్యాంకుల చర్యల వల్ల డాలర్ పెట్టుబడులు తరలిపోతాయన్న అంచనాలు.. ఇలాంటి అనేక కారణాలు స్వల్పకాలిక డెట్ ఫండ్స్ రాణించడానికి దోహదం చేశాయి. కాలపరిమితి ఫండ్స్ కంటే కూడా కార్పొరేట్ బాండ్స్ మెరుగైన రాబడులను ఇచ్చాయి. ఎఫ్ఐఐల ఇన్వెస్ట్‌మెంట్స్ వల్ల ఇది సాధ్యమైంది. పరిమితంగానైనా డెట్‌ఫండ్స్‌లో ముఖ్యంగా స్వల్పకాలిక ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు.

స్థిర రాబడుల కోసం

బ్యాంకు ఎఫ్‌డిలు, పోస్టాఫీస్ పథకాలపై వడ్డీ రేట్లు మరింత తగ్గే అవకాశం లేదు. ద్రవ్యోల్బణ భయాలు, ఆర్‌బిఐ పాలసీ విధానాన్ని బట్టి ఇది స్పష్టమవుతోంది. షార్ట్ టర్మ్ డెట్ ఫండ్స్‌తో పాటు ఇన్వెస్టర్లు కొంతమొత్తాన్ని స్మాల్‌సేవింగ్స్ స్కీమ్స్‌లోనూ, టాక్స్ ఫ్రీ బాండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం మంచిది. పన్నుల విషయంలో కూడా లబ్ధి ఉంటుంది. బ్యాంకు ఎఫ్‌డిలు పెద్దగా రాబడులను ఇచ్చేట్టుగా కనిపించడం లేదు.


జైడస్ వెల్‌నెస్



ప్యాకేజ్డ్ హెల్త్ ఫుడ్, న్యూట్రిషన్, స్కిన్‌కేర్ ఉత్పత్తులను తయారు చేస్తున్న సంస్థ ఇది. క్యాడిలా హెల్త్‌కేర్ కంపెనీకి అనుబంధ కంపెనీ కూడా. చక్కెరకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించే స్వీట్‌నర్ (షుగర్ ఫ్రీ), కొలెస్ట్రాల్ లేని ప్రత్యామ్నాయ బట్టర్ (న్యూట్రాలైట్)లతో పాటు న్యూట్రిషనల్ హెల్త్ డ్రింక్‌లను తయారు చేస్తోంది. ఎవర్ యూత్ స్క్రబ్, ఎవర్ యూత్ పీల్ ఆఫ్ మాస్క్, ఫేస్‌వాష్, క్లీన్సర్, టోనర్, తదితర స్కిన్‌కేర్ ఉత్పత్తులను కూడా ఉత్పత్తి చేస్తోంది. సెప్టెంబరు నాటికి అత్యధికంగా అమ్ముడవుతున్న ఉత్పత్తి షుగర్ ఫ్రీ బ్రాండ్‌తో విక్రయిస్తున్న చక్కెరకు ప్రత్యామ్నాయ స్వీట్‌నర్. దేశీయ మార్కెట్లో 94.4 శాతం వాటాను కలిగి ఉంది. స్కిన్‌కేర్ ఉత్పత్తి ఎవర్ యూత్ స్క్రబ్‌కు దేశీయ మార్కెట్లో 32.4 శాతం వాటా ఉంది. కాగా ఎవర్ యూత్ పీల్ ఆఫ్ మాస్క్‌కు 87.7 శాతం వాటా దేశీ మార్కెట్లో ఉంది. ఈ వాటాను మరింతగా పెంచుకునేందుకు గాను మరిన్ని ప్రకటనల ద్వారా వినియోగదారులను ఆకర్షించటానికి ప్రణాళికలను సిద్ధం చేసుకుంది.

సెత్వియా బేస్ట్ ఫార్ములేషన్‌తో ఇటీవలే షుగర్ ఫ్రీ గ్రీన్ అనే ఉత్పత్తిని మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. దీనిపై కంపెనీ చాలా ఆశలను పెట్టుకుంది. కాగా సౌదీ అరేబియా, ఖతార్, ఒమన్, మయన్మార్ తదితర ఆసియా దేశాలకు ఇటీవల ఉత్పత్తులను ఎగుమతి చేయటం ప్రారంభించింది. కనీసం మరో ఐదు దేశాలకు త్వరలో విస్తరించాలని యోచిస్తోంది.

షుగర్ ఫ్రీ, ఎవర్ యూత్ ఉత్పత్తులకు ప్రీమియం ధరలను నిర్ణయించటంతో స్థూల లాభ మార్జిన్లు గరిష్ఠ స్థాయిలో దాదాపు 69 శాతం పైగా ఉన్నాయి. న్యూట్రాలైట్ ఉత్పత్తి మార్జిన్లు ముడి సరుకుల ధరలపైన ఆధారపడి ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుంది. ఎఫ్ఎంసిజి రంగంలోని ఈ విభాగంలో ప్రస్తుతానికి కంపెనీకి పోటీ లేనందున మార్జిన్లపై ఇప్పుడిప్పుడే ప్రభావం పడే అవకాశం లేదు. దేశీయంగా మూడో అతిపెద్ద పరిశ్రమ అయిన ఎఫ్ఎంసిజిలో 31 శాతం మేర హెల్త్‌కేర్ విభాగానిదే. హౌజ్‌హోల్డ్, పర్సనల్ కేర్ ఉత్పత్తులది మరో 50 శాతం మేర ఉంది. మిగిలింది ఫుడ్ అండ్ బెవరేజెస్ విభాగానిది. ఎఫ్ఎంసిజి రంగంలో కన్స్యూమర్ వెల్‌నెస్ విభాగంలో వచ్చే కొన్నేళ్లపాటు భారీగా వృద్ధి రేటును నమోదు చేయనున్నదని అంచనా. దీంతో ఒక బలమైన కంపెనీగా ఎదగటానికి జైడస్ క్యాడిలా ప్రణాళికలను సిద్ధం చేసుకుంది. అన్ని విభాగాల్లో వాల్యూమ్స్ పెంచుకోవటం ద్వారా లాభాలను పెంచుకోవాలని ఆశిస్తోంది.



ఫండమెంటల్స్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ.123.54 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాదితో పోల్చితే ఇది 18 శాతం అధికం. స్థూల లాభ మార్జిన్లు 2.3 శాతం మేర పెరిగి 69.1 శాతానికి చేరుకున్నాయి. ముడి సరుకుల ధరలు తగ్గిన కారణంగా మార్జిన్లు మెరుగుపడ్డాయి. నికర లాభం 13 శాతం పెరిగి 36.22 మేర సాధించింది. రిటర్న్ ఆన్ ఈక్విటీ ప్రస్తుతం 19 శాతంగా ఉంది. గత మూడేళ్ల సగటు ఆర్ఒఇ 24.11 శాతం. కంపెనీకి దాదాపు రుణాలు లేవు. లాభాల్లో 23.11 శాతం మేర డివిడెండ్ రూపేణా ఇన్వెస్టర్లకు పంచుతోంది. పటిష్ఠమైన ఫండమెంటల్స్ కారణంగా ఇటీవల కాలంలో సంస్థాగత ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తోంది. మొత్తం సంస్థాగత ఇన్వెస్టర్ల వాటా 14.39 శాతంగా ఉంది. ఇందులో 7.9 శాతం ఎఫ్ఐఐలది. సెప్టెంబరు త్రైమాసికంలో ఇందులో మదుపు చేసిన ఎఫ్ఐఐల సంఖ్య 5 నుంచి 66కు పెరిగింది. మ్యూచువల్ ఫండ్స్ సంఖ్య కూడా 2 నుంచి 10కి పెరిగింది. గతవారం ఇందులో భారీ వాల్యూమ్స్ నమోదయ్యాయి. 50 వారాల సగటు వాల్యూమ్స్ కన్నా ఎక్కువగా నమోదయ్యాయి.

టెక్నికల్స్

కంపెనీ షేరు రూ.988 స్థాయిలో ఉన్న పైవోట్‌ను స్థాయిని అధిగమించి ముగిసింది. అలాగే గత ఏడాదిన్నరగా ఉన్న కన్సాలిడేషన్ నుంచి బయటపడింది. దీనికి తోడు దాదాపు రెండున్నరేళ్ల అసెండింగ్ ట్రయాంగిల్ బ్రేకౌట్ జరిగింది. స్వల్ప, దీర్ఘకాలిక మూవింగ్ సగటుకు ఎగువన ట్రేడవుతోంది. మూమెంటమ్ ఇండికేటర్లన్నీ బుల్లిష్ ధోరణిని ధ్రువీకరిస్తున్నాయి. ఈ షేరును వచ్చే వారం రూ.1,000 నుంచి రూ.1,050 మధ్య శ్రేణిలో అక్యుములేట్ చేయవచ్చు. టెక్నికల్ స్టాప్‌లాస్ రూ.920. స్వల్పకాలిక లక్ష్యం రూ.1,220. వచ్చే 12 నుంచి 18 నెలల లక్ష్యం రూ.1,515.

టి బ్రహ్మచారి
హెడ్, అసోసియేషన్ ఆఫ్ టెక్నికల్ మార్కెట్ ఎనలిస్ట్, హైదరాబాద్ చాప్టర్
tbchary@gmail.com

గమనిక : ఈ శీర్షికలో అందించే రికమండేషన్ల ఆధారంగా జరిపే లావాదేవీలకు ఇన్వెస్టర్లదే పూర్తి బాధ్యత. వారి లాభనష్టాలకు ఆంధ్రజ్యోతి పత్రిక, కాలమిస్ట్ ఎలాంటి బాధ్యత వహించరు. లావాదేవీలు చేపట్టే ముందు మీ వ్యక్తిగత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ సలహా తీసుకోండి.

ఈ ఏడాది 'బుల్' షేర్లు ఇవే!



గత ఏడాది స్టాక్ మార్కెట్ మదుపరులకు మంచి లాభాలు పంచింది. బిఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఏడాది కాలంలోనే రూ.45 లక్షల కోట్లు పెరిగి రూ.152 లక్షల కోట్లకు చేరింది. కొన్ని కంపెనీల షేర్లు నిరాశ పరిచినా సెన్సెక్స్, నిఫ్టీల్లోని ఎక్కువ కంపెనీల షేర్లు ఇన్వెస్టర్లకు మంచి లాభాలే పంచాయి. మరి ఈ ఏడాది ఏ కంపెనీల షేర్లు పరుగెత్తే అవకాశం ఉంది? బ్రోకరేజ్ సంస్థలు ఏ కంపెనీల షేర్లను సిఫారసు చేస్తున్నాయి? ఆంధ్రజ్యోతి 'బిజినెస్ ప్లస్' పాఠకుల కోసం ఆ వివరాలు..

ఆనంద్ రాఠి ఫైనాన్సియల్ సర్వీసెస్

జమ్నా ఆటో

ప్రస్తుత ధర రూ.80.95 **టార్గెట్ ధర** : రూ.95

దేశంలో అతిపెద్ద లీఫ్ స్ప్రింగ్స్ ఉత్పత్తి కంపెనీ ఇది. ఆటోమొబైల్ రంగంలో వీటికి మంచి గిరాకీ ఉంది. ఆర్థిక వ్యవస్థ గాడిలో పడడంతో భారీ, మధ్య తరహా వాణిజ్య వాహనాల వాహనాల తయారీదారులకు కలిసిరానుంది. దీంతో వచ్చే మూడేళ్లలో ఈ కంపెనీ రాబడి ఏటా 13 శాతం చొప్పున పెరిగే అవకాశం ఉంది.

డాబర్ ఇండియా

ప్రస్తుత ధర రూ.348.60 **టార్గెట్ ధర** రూ.400

ఆయుర్వేదం, మూలికలు, ప్రకృతి సిద్ధమైన ఔషధాలు, ఇతర ఉత్పత్తులు అందించే దేశంలోని అతిపెద్ద కంపెనీల్లో డాబర్ ఇండియా ఒకటి. 2017-20 మధ్య కాలంలోనూ డాబర్ ఇండియా అమ్మకాలు ఏటా 16 శాతం చొప్పున పెరిగే అవకాశం ఉంది.

దీపక్ నైట్రైట్

ప్రస్తుత ధర రూ.231.90 **టార్గెట్ ధర** రూ.264

వినూత్నమైన రసాయన ఉత్పత్తులు తయారు చేసే ప్రపంచంలోని ప్రముఖ కంపెనీల్లో ఇది ఒకటి. రబ్బర్, ఫార్మా, ఆగ్రో కెమికల్స్, పేపర్, టెక్స్‌టైల్, పెట్రోకెమికల్ రంగాల్లో ఈ కంపెనీ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. కంపెనీ ఇటీవలే గుజరాత్‌లోని దహేజ్ దగ్గర రెండు లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో ఫెనాల్ ప్లాంట్ ఏర్పాటు చేసింది.

రెలిగేర్ సెక్యూరిటీస్

ఏషియన్ గ్రానిటో ఇండియా

ప్రస్తుత ధర రూ.576.25 **టార్గెట్ ధర** రూ.642

అన్ని వర్గాలకు తగిన ధరలతో ఈ కంపెనీ రకరకాల టైల్స్‌ను మార్కెట్ చేస్తోంది. మిగతా టైల్స్ కంపెనీలతో పోలిస్తే ఉత్పత్తి సామర్థ్యం వినియోగంలోనూ కంపెనీ ముందుంది. 2017-2020 మధ్య కాలంలోనూ కంపెనీ ఆదాయం ఏటా 16 శాతం చొప్పున, నికర లాభం 32 శాతం చొప్పున పెరిగే అవకాశం ఉందని అంచనా.

నీల్‌కమల్

ప్రస్తుత ధర రూ.1,835.75 **టార్గెట్ ధర** రూ.2,097

మౌల్డెడ్ ప్లాస్టిక్ ఫర్నీచర్ రంగంలో నీల్‌కమల్‌కు మార్కెట్లో మంచి పేరుంది. ముడి చమురు ధర పెరుగుతున్నా బ్రాండ్ ఇమేజ్, మార్కెట్లో ఉన్న నాయకత్వ స్థానం కంపెనీకి కలిసి రానున్నాయి. అప్పుల భారం లేకపోవడం కంపెనీకి కలిసొచ్చే మరో ప్లస్ పాయింట్.

భారత్ ఎలక్ట్రానిక్స్

ప్రస్తుత ధర రూ.182.05 **టార్గెట్ ధర** రూ.217

దేశ రక్షణ బడ్జెట్ ఏటా పెరుగుతోంది. ఆయుధ వ్యవస్థలన్నిటినీ దేశంలోనే తయారు చేయడాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. కంపెనీ వద్ద ఇప్పటికే రూ.40,000 కోట్ల ఆర్డర్లు ఉన్నాయి. మరో రూ.13,000 కోట్ల ఆర్డర్ల కోసం కంపెనీ చర్చలు జరుపుతోంది.

ఎస్ఎంసి ఇన్వెస్ట్‌మెంట్స్ అడ్వైజర్స్

ఎల్ అండ్ టి

ప్రస్తుత ధర రూ.1,256.95 **టార్గెట్ ధర** రూ.1,450

మౌలిక సదుపాయాలకు సంబంధించిన ఇంజినీరింగ్ నిర్మాణ కంపెనీల్లో లార్సన్ అండ్ టూబ్రో (ఎల్ అండ్ టి) దేశంలోనే అతిపెద్ద కంపెనీ. దేశ, విదేశాల్లో ఎల్ అండ్ టి అనేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు నిర్మిస్తోంది.

గతి లిమిటెడ్

ప్రస్తుత ధర రూ.135.55 **టార్గెట్ ధర** రూ.158

ఈ కంపెనీ దేశవ్యాప్తంగా సప్లయ్ చెయిన్‌కు సంబంధించి సమగ్ర సేవలు అందిస్తోంది. కొద్ది సంవత్సరాలుగా మార్కెట్లో స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది.

అహ్లూవాలియా కాంట్రాక్ట్స్

ప్రస్తుత ధర రూ.390.05 **టార్గెట్ ధర** రూ.473

ఈ కాంట్రాక్ట్స్ కంపెనీ వ్యాపారం ఆశాజనకంగా కనిపిస్తోంది. కంపెనీ చేతిలో ఇప్పటికే చెప్పుకోదగ్గ స్థాయిలో ఆర్డర్లు ఉన్నాయి.



2018లోనూ ముందుకు సాగాలి

- కేసీఆర్, గవర్నర్ శుభాకాంక్షలు

హైదరాబాద్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు 2018 సంవత్సరంలోనూ విజయవంతంగా ముందుకు సాగాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2018లో తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో గడపాలని గవర్నర్ నరసింహన్ ఆకాంక్షించారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్ బీజేపీ ఎంపీ దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఆకాంక్షిం టీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తదితరులు రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఆత్మహత్యలు ఆపడానికే 4 వేలు

- రైతు బాగుంటేనే బంగారు తెలంగాణ : ఈటల
- కేసీఆర్ వెళ్లేది ఫామ్‌హౌస్ కాదు.. ఫార్మర్ హౌస్ : హరీశ్
- రైతు లేకపోతే తిండి, బట్ట ఉండదు : పోచారం
- నలుగురికి 'రైతు రత్న' అవార్డుల ప్రదానం

రాజేంద్రనగర్/హైదరాబాద్, డిసెంబరు 31: పెట్టుబడి సాయం కింద రూ.4 వేలు ఇచ్చేది ఓట్ల కోసం కాదని.. రైతుల ఆత్మహత్యలు ఆపడానికేనని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. రాజేంద్రన గర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఆదివారం వ్యవసాయశాఖ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ రైతు పురస్కార ప్రదానం, వ్యవసాయ డైరీ -2018 ఆవిష్కరణ కార్యక్రమాల్లో మంత్రులు హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఈటల పాల్గొన్నారు. రైతు బిడ్డ సీఎంగా ఉన్న రాష్ట్రంలో రైతును రాజుగా చూడాలనే ఆశయంతో ముందుకు సాగుతున్నామన్నారు. వ్యవసాయ అధికారులు సంఘంగా ఎర్పడి ఉత్తమ రైతులను గుర్తించి సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. రైతుల జీవితాలను మార్చేందుకు టీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టులను ఒక యజ్ఞంలా నిర్మిస్తున్నామని తెలిపారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ రైతుల కష్టాలు దూరం చేయడానికే మిషన్ కాకతీయను ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందన్నారు. చెరువులు కల్పతరువులని, అందుకే వర్షపు నీరు అంతా చెరువుల్లో చేరేలా ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతోందన్నారు. రైతులకు ఇక నుంచి 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ ఇవ్వడానికి కృషి చేస్తున్నామన్నారు. కొందరు అప్పుడప్పుడు కేసీఆర్ ఫామ్ హౌస్ వెళ్లారని రాస్తుంటారని.. దానిని ఫార్మర్ హౌస్‌గా పేర్కొనాలని సూచించారు. రూ.17వేల కోట్ల రుణమాఫీ చేశామని, సాదా బైనామా, రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన ద్వారా గ్రామాల్లో నివసించే 95 శాతం ప్రజలకు మేలు జరిగిందని తెలిపారు. వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతు లేక పోతే తిండి, బట్ట రెండూ ఉండవన్నారు. కాగా.. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం పెద్దకొండుకు చెందిన వి.రజిత, నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం పన్సారి గ్రామానికి చెందిన డీఎస్.శివయ్య, వనపర్తికి చెందిన ఆర్‌బీ.ఆంజనేయులు, ఖమ్మం జిల్లాకు చెందిన జి.సత్యనారాయణకు ఈ కార్యక్రమంలో రైతు రత్న అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, వ్యవసాయవర్సిటీ వీసీ వి.ప్రవీణ్‌రావు, ఉద్యాన శాఖ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షుడు కృపాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



సేంద్రియ వ్యవసాయం చేస్తున్న మహిళా రైతు రజితను 'రైతు రత్న' అవార్డుతో సన్మానిస్తున్న మంత్రులు పోచారం, హరీశ్‌రావు

కొత్త ఏడాది.. కొత్త పాస్‌పుస్తకాలు!

- రైతులకు ప్రభుత్వం నూతన సంవత్సర కానుక
- 26న ఎలక్ట్రానిక్ పట్టాదార్ పాస్‌పుస్తకాల పంపిణీ
- ముగింపు దశలో రికార్డుల నవీకరణ, ఆధునికీకరణ

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం.. ఎలక్ట్రానిక్ పట్టాదార్ పాస్‌పుస్తకాలు కమ్ టైటిల్ డీడ్‌ల రూపంలో రైతులకు నూతన సంవత్సర కానుక అందించబోతోంది. దాదాపు 65 లక్షల మంది రైతులకు వీటిని పంపిణీ చేయనుంది. అయితే ఈ పాస్ పుస్తకాల ముద్రణకు టెండర్లు పిలవాలా? లేక నేషనల్ సెక్యూరిటీ ప్రెస్‌కు నామినేషన్ పద్ధతిలో అప్పగించాలా? అనే అంశంపై ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక.. తొలిసారిగా ఇస్తున్న పాస్‌పుస్తకాలను 26 సెక్యూరిటీ ఫీచర్లతో రూపొందిస్తున్నారు. ఇందులో రైతుల సమగ్ర వివరాలతో చిప్‌ను కూడా పెడుతున్నారు. తద్వారా నకిలీలకు తావులేకుండా పకడ్బందీగా వీటిని ముద్రింపజేసేందుకు ప్రభుత్వం చర్యలుతీసుకుంటోంది. మరోవైపు రికార్డుల నవీకరణ, ఆధునికీకరణ కూడా ముగింపు దశకు వచ్చింది. వివాదం లేని భూములను తేల్చడానికిగాను సెప్టెంబరు 15వ తేదీన చేపట్టిన మహా ప్రక్రియ రెండురోజుల్లో ముగియనుంది. దాంతో నూతన సంవత్సరంలో వివాదాల్లేని రికార్డులతోపాటు పట్టాదార్ పాస్‌పుస్తకాలు కమ్ టైటిల్ డీడ్‌లు రైతుల చేతికి అందనున్నాయి. ఇప్పటికే వివాదం లేని భూములన్నింటినీ పార్ట్-ఏ జాబితాలో చేర్చి.. రైతుల వివరాలను సిద్ధంగా ఉంచాలని జిల్లా యంత్రాంగాలను ప్రభుత్వం ఆదేశించింది. దాంతో 65 లక్షల మంది రైతులకు ఈ నెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాస్‌పుస్తకాల పంపిణీకి రంగం సిద్ధమైంది. హైదరాబాద్‌తోపాటు అన్ని జిల్లాల్లోనూ వీటిని పంపిణీ చేయనున్నారు. మరోవైపు రికార్డుల అప్‌డేషన్ కార్యక్రమం కూడా పూర్తికావచ్చింది. మొత్తంగా రాష్ట్రంలోని 568 మండలాల్లో 10,817 రెవెన్యూ గ్రామాలకుగాను 10,804 గ్రామాల్లో 1507 బృందాలతో రికార్డుల అప్‌డేషన్ కార్యక్రమాన్ని చేపట్టగా.. 27 జిల్లాల్లో భూ రికార్డుల నవీకరణ పూర్తయింది. మరో మూడు జిల్లాల్లోని 13 గ్రామాల్లో నవీకరణ మిగిలి ఉంది. ఆదిలాబాద్, మహబూబాబాద్‌లోని చెరో రెండు గ్రామాల్లో, పెద్దపల్లిలోని 9 గ్రామాల్లో రికార్డుల నవీకరణ చేపట్టాల్సి ఉంది. మిగతా జిల్లాల్లో మిగిలి ఉన్న చిన్న చిన్న పనులను అధికారులు పూర్తిచేస్తున్నారు. తొలివిడతలో అభ్యంతరాలు వ్యక్తం చేసినవారి కోసం ఆయా జిల్లాల్లో రెండో విడత గ్రామసభలు నిర్వహించి, వివాదాలు పరిష్కరించే పనిలో యంత్రాంగం ఉంది. వివాదాస్పద భూములు కలిగిన జాబితాలోని వివాదాలను పరిష్కరించడానికి నూతన సంవత్సరంలో స్పెషల్ డ్రైవ్ చేపడతామని అధికార యంత్రాంగం ఇప్పటికే ప్రకటించింది. జనవరి, లేదా ఫిబ్రవరిలో ఈ డ్రైవ్ ఉంటుందని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ తెలిపారు.



తహసీల్దార్ల అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ, చిత్రంలో సంఘం నేతలు

రెవెన్యూ ఉద్యోగులంతా నా కుటుంబసభ్యులే

- డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ ఉద్యోగులంతా తన కుటుంబసభ్యులేనని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ అన్నారు. మంత్రుల క్వార్టర్‌లో తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్(టీజీటీఏ) డైరీ, క్యాలెండర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ప్రభుత్వం చేపట్టిన భూ రికార్డుల నవీకరణలో తహసీల్దార్లు కీలకంగా వ్యవహరించారని.. విధి నిర్వహణలో రెవెన్యూ అధికారులపై కేసుల్లేకుండా చూస్తామని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో లేనివిధంగా తహసీల్దార్లకు పదోన్నతులు వచ్చాయని టీజీటీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు లచ్చిరెడ్డి అన్నారు.

నిధులున్నా.. కదలని పనులు!



గంగాపూర్ వెళ్లే దారిలో వాగు

- అటవీ అనుమతుల్లో తీవ్ర జాప్యం
- నిలిచిపోయిన వంతెనలు, రోడ్ల నిర్మాణాలు
- నిర్మల్ జిల్లాలో గ్రామాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

నిర్మల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : రోడ్లు, వంతెనలు వంటి అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయల నిధులు మంజూరవుతున్నాయి! టెండర్లు పిలుస్తున్నారు.. పనులు ప్రారంభిస్తున్నారు.. కానీ, అర్ధాంతరంగా ఆగిపోతున్నాయి. కారణం ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం. ఇదీ నిర్మల్ జిల్లాలో పరిస్థితి. జిల్లాకు మంజూరవుతున్న కోట్లాది రూపాయల అభివృద్ధి పథకాలకు అటవీ శాఖ అనుమతుల వ్యవహారం శాపంగా మారుతోంది. కేంద్ర, రాష్ట్ర అటవీ శాఖల మధ్య సమన్వయలేమితో పాటు పనులు ప్రతిపాదించే శాఖలు కూడా కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడంతో అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిచిపోతున్నాయి. ఇలా జిల్లాలో అటవీ శాఖ అనుమతులు లేక గత కొన్నేళ్లుగా నిధులు మంజూరైనా ముందుకు సాగని పనులు చాలానే ఉన్నాయి.

- పెంబి మండలంలోని ఇటిక్యాల్ నుంచి కొసగుట్టకు వెళ్లే రోడ్డులో ఉన్న వాగుపై వంతెన నిర్మాణానికి రూ.3.23 కోట్లు, ఇటిక్యాల్ నుంచి దొందరి వెళ్లే రోడ్డుకు రూ.3.17 కోట్లు, ఆర్అండ్‌బీ నుంచి పస్పుల్లా వెళ్లే రోడ్డు రూ.1.49 కోట్లు మంజూరవగా, అనుమతులు రాక పనులు ముందుకు కదలడం లేదు.
- కడెం మండలంలోని అల్లంపెల్లి రోడ్డు పనులకు 4.89 కోట్లు, ఇస్లాంపూర్ వద్ద వంతెన నిర్మాణానికి 1.20 కోట్లు, కవ్వాల్ నుంచి ఇస్లాంపూర్ రోడ్డుకు 3.16 కోట్లు మంజూరైనా అటవీ అనుమతులు లేక ఆగిపోయాయి.
- ఎర్వచింతల్ నుంచి గంగాపూర్ వెళ్లే రోడ్డు నిర్మాణానికి 2013లో రూ.3.89 కోట్లు మంజూరయ్యాయి. 3.28 కిలోమీటర్ల పొడవైన ఈ రోడ్డులో కేవలం 2.2కి.మీ.కే అటవీ శాఖ అనుమతులు ఇచ్చింది. దీంతో మిగతా పనులు నిలిచిపోయాయి. ఈ రోడ్డు విషయంలోనే ఇటీవల పోచంపాడ్‌లో జరిగిన ముఖ్యమంత్రి కేసీఆర్ సభలో ఆ గ్రామ సర్పంచ్ భర్త చంద్రహాస్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో ఉన్న ఖానాపూర్, కడెం, పెంబి, దస్తూరాబాద్ మండలాల్లో రోడ్లు, వంతెనల నిర్మాణాలకు అటవీ అనుమతులు ఇవ్వకపోవడంతో గిరిజనులు, ఆదివాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కనీస వైద్యం అందని పరిస్థితి ఉంది. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో విద్య కూడా అంతంతమాత్రంగానే ఉందని చెబుతున్నారు. టైగర్ జోన్ నిబంధనలు సడలించి మండలంలోని పస్పుల్లా, ఇటిక్యాల్, యాపల్‌గూడ, దొందరి, వస్పల్లి, కొసగుట్ట, రాంపూర్ లాంటి గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని అభ్యర్థిస్తున్నారు.

నిబంధనల ప్రకారం దరఖాస్తు చేస్తే అనుమతులిస్తాం



పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల ద్వారా రోడ్లు, వంతెనల నిర్మాణానికి అనుమతులు కోరుతూ అటవీ శాఖకు పంపిన దరఖాస్తులు నిబంధనల ప్రకారం లేకపోవడంతోనే అనుమతులు రావడం లేదు. నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసిన పలు పనులకు ఇప్పటికే అనుమతులిచ్చాం.

– రవీందర్ రాథోడ్, ఎఫ్‌డీవో, ఖానాపూర్



శ్రీలక్ష్మిని సత్కరిస్తున్న రాష్ట్ర రజక అభివృద్ధి సంస్థ నాయకులు

రజకులను ఎస్సీల్లో చేర్చాలంటూ పాదయాత్ర

7వేల కిలోమీటర్లు నడిచి నగరానికి చేరుకున్న శ్రీలక్ష్మికి సత్కారం

కవాడిగూడ, డిసెంబరు 31: రజకులను ఎస్సీల్లో చేర్చాలంటూ 7వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి హైదరాబాద్ చేరుకున్న రజక ఎస్సీ సాధన సమితి కన్వీనర్ శ్రీలక్ష్మిని తెలంగాణ రజక అభివృద్ధి సంస్థ ఘనంగా సన్మానించింది. గత జూలై 2న భద్రాది కొత్తగూడెం జిల్లా నుంచి పాదయాత్ర ప్రారంభించిన ఆమె 31 జిల్లాల్లో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రజకభవన్ వద్ద అభినందన సభ ఏర్పాటు చేశారు. దేశంలో 18 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో రజకులు ఎస్సీల్లో ఉండగా తెలంగాణలో మాత్రం బీసీ ఏలో కొనసాగుతున్నారని, అందువల్ల తమను ఎస్సీల్లో చేర్చాలని శ్రీలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రజక అభివృద్ధి సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎం.అంజయ్య, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ ఎం.నర్సింహా తదితరులు ఇందులో పాల్గొన్నారు.

వర్గీకరణ ఉద్యమాన్ని అణచివేసే కుట్ర: మందకృష్ణ



ఉస్మానియా యూనివర్సిటీ/హైదరాబాద్, డిసెంబరు 31: ఎమ్మార్పీఎస్ ఉద్యమం, మాదిగల పట్ల సీఎం కేసీఆర్ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని అణచివేసేందుకు కుట్ర చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. ఆయన ఆదివారం నాడిక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు మద్దతివ్వాలని సీఎం కేసీఆర్‌ను కోరినందుకే తనపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారన్నారు. డిప్యూటీ సీఎం కడియం శ్రీహరితో ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని తక్కువ చేసి మాట్లాడిస్తున్నారని, ఆయనను ప్రజల్లో దోషిగా నిలబెడతామని హెచ్చరించారు. వర్గీకరణ కోసం గల్లీలో కాదు.. ఢిల్లీలో దీక్ష చేయాలని కడియం అంటున్నారని, ఢిల్లీలో ఎమ్మార్పీఎస్ నెల రోజులు ధర్నా చేస్తే టీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు మద్దతివ్వలేదని ప్రశ్నించారు. 24 గంటల సమయం ఇస్తున్నామని, ఢిల్లీలో జరిగే ధర్నాకు మద్దతివ్వకుంటే హైదరాబాద్‌లో దీక్ష చేస్తామన్నారు. ఎమ్మార్పీఎస్ విద్యార్థి రాకేశ్‌ను అరెస్టు చేసి పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారని, ఆయనకు ఏదన్నా జరిగితే కేటీఆర్ బాధ్యత వహించాలన్నారు.

కొత్త జిల్లాలతో ఉద్యోగులపై పనిభారం: కారం



కాకతీయ కాలనీ(వరంగల్), డిసెంబరు 31: పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాలు పెంచి ప్రభుత్వ ఉద్యోగులపై పని భారం మోపారని టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందరెడ్డి అన్నారు. ఆదివారం వరంగల్‌లో టీఎన్జీవోస్ వరంగల్ రూరల్ జిల్లా నూతన కార్యవర్గం పరిచయ వేదిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సమాన పనికి సమాన వేతనం కోసం ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులు, ఒప్పంద కార్మికులు పోరాడుతూనే ఉన్నారన్నారు. టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో జనవరిలో హైదరాబాద్‌లో నిజాం కాలేజీ గ్రౌండ్‌లో పెద్ద ఎత్తున బహిరంగ సభ నిర్వహించి ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెస్తామని తెలిపారు. .

'అమ్మఒడి'కి మరో 200 వాహనాలు

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గర్భిణులు, బాలింతల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మఒడి పథకానికి మరో 200 కొత్త వాహనాలు రానున్నాయి. కేసీఆర్ సర్కారు కొత్త సంవత్సర కానుకగా వీటిని అందించనుంది. వారం రోజుల్లో సీఎం కేసీఆర్ వీటిని ప్రారంభించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తొలుత 2016లో ఏజెన్సీ ప్రాంతాల్లో 41 అమ్మఒడి వాహనాలను ప్రారంభించింది. వీటికి అదనంగా ప్రస్తుతం మరో 200 వాహనాలను రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురాబోతోంది. దీంతో రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో రెండు చొప్పున అమ్మఒడి వాహనాలు ఉంటాయని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ వాహనాలను 102 (కేసీఆర్ కిట్ వెహికిల్) పేరుతో కూడా పిలుస్తున్నారు. గర్భిణులు ఉచితంగా ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకునేందుకు ఈ వాహనాలను ఉపయోగించుకోవచ్చు. గర్భస్థపరీక్షలతోపాటు.. ప్రసవానికి ఆస్పత్రికి వెళ్లేందుకు, ప్రసవం తరువాత ఆస్పత్రి నుంచి ఉచితంగా ఇంటికి వచ్చేందుకు కూడా వీటిని వినియోగించుకోవచ్చు. దీంతోపాటు నవజాత శిశువులను బాలింతలు ఆస్పత్రికి తీసుకెళ్లి టీకాలు వేయించే సమయలో కూడా వీటిని ఉపయోగించుకోవచ్చు.

శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి... 50 లక్షల పరిహారమివ్వాలి: నిరుద్యోగ జేఏసీ

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్న గ్రూప్ 2 ఫలితాలు త్వరగా విడుదలయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్ డిమాండ్ చేశారు. గ్రూప్ 2 ఫలితాల విడుదలలో జాప్యం కారణంగా తీవ్ర మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడిన సూర్యాపేట జిల్లా మేళ్ళచెరువుకు చెందిన ముడెం శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి రూ. 50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని, సమస్యల పరిష్కారం కోసం నిరుద్యోగ జేఏసీ పోరాడుతోందని మానవతారాయ్ పేర్కొన్నారు.

బెల్లం బంగారమాయె!

దాడులు, కేసులతో తయారీకి రైతులు, కొనుగోళ్లకు వ్యాపారులు దూరం


- సీజన్ మొదలైనా కానరాని బెల్లం బట్టీలు
- మేడారం జాతరకు కామారెడ్డి బెల్లం లేనట్టే!
- సీఎంను కలిసినా ఆంక్షలపై తేల్చని వైనం

కామారెడ్డి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సమక్క సారక్క జాతరకు కామారెడ్డి బెల్లంతోనే భక్తులు మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. జాతరకు లక్షల సంఖ్యలో పోటెత్తే భక్తులకు ఈసారి కామారెడ్డి బెల్లం దొరుకుతుందా? ఈ సందేహానికి కారణం... ఈ ఏడు కామారెడ్డి బెల్లం తయారీపై ప్రభుత్వం ఆంక్షలు విధించడమే! ఈ ఆంక్షలతో బెల్లం బంగారమైపోయింది. ఏటా నవంబరులో మొదలుపెట్టి ఫిబ్రవరి వరకు రైతులు బెల్లం తయారు చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు! సీజన్ ఎప్పుడో మొదలైనా ఆంక్షల వల్ల బెల్లం తయారీకి రైతులు జంకుతున్నారు. కొందరు ధైర్యం చేసి వండినా వ్యాపారులు కొనడం లేదు. వందేళ్లుగా బెల్లం ఉత్పత్తికి కామారెడ్డి ప్రసిద్ధి చెందింది. మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిసా రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేది. కొన్నేళ్లుగా నల్లబెల్లం పేరిట రైతులపై కేసులు పెడుతున్నారు. నల్ల బెల్లాన్ని సారా, గుడుంబా తయారీకి వినియోగిస్తున్నారన్న నెపంతో దాడులు చేస్తున్నారు. అయితే ఇది నల్ల బెల్లం కాదని రైతులు చెబుతున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను రైతులు, బెల్లం వ్యాపారులు కలిసి సమస్యను వివరించారు. బెల్లం వ్యాపారంపై ఆంక్షలు పెట్టలేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎక్సైజ్ అధికారులు, మంత్రితో సమావేశం ఏర్పాటు చేసి ఆంక్షలు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. అయితే నెల రోజులు గడుస్తున్నా పరిస్థితిలో ఎటువంటి మార్పు లేదు. ఎక్సైజ్ అధికారులు మాత్రం ఆంక్షలు ఉన్నాయనే చెబుతున్నారు. దీంతో ఈ విషయంలో ప్రభుత్వ తీరు అర్థం కావడం లేదని రైతులు, వ్యాపారులు అంటున్నారు. బెల్లాన్ని తెలంగాణలోనూ, పక్క రాష్ట్రాల్లోనూ అమ్ముకునే విధంగా సర్క్యులర్ జారీ చేసి ఇక్కడి రైతులను, వ్యాపారులను ఆదుకోవాలని కామారెడ్డి డివిజనల్ జాగరీ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. "కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, సిద్దిపేట, జహీరాబాద్ రైతుల దగ్గరికి ఎక్సైజ్ అధికారులు వెళ్లి బెల్లం తయారు చేయకూడదని బెదిరిస్తున్నారు. ఎక్కడైనా బెల్లం వండినా, దానిని వ్యాపారులు కొని రవాణా చేసినా కేసులు బనాయిస్తున్నారు" అని సీఎంను కలిసినప్పుడు వివరించినట్టు చెప్పారు. ఆంక్షలు తొలగితేనే సమక్క-సారక్క జాతరకు కామారెడ్డి బెల్లం తరలించే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఇప్పటికే మూడేళ్లుగా కామారెడ్డిలో బెల్లం తయారీ, వ్యాపారం సన్నగిల్లింది. గతంలో 300 మంది బెల్లం వ్యాపారులు కామారెడ్డి మార్కెట్‌లో బెల్లాన్ని కొనుగోలు చేసే వారు. ఇప్పుడు 11 మంది మాత్రమే ఉన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



బెల్లం తయారు చేస్తున్న రైతులు


ఆంక్షలు ఎత్తివేయాలి



బెల్లంపై ఆంక్షలను ఎత్తి వేయాలి. పూర్వం ఏ రకంగా బెల్లం కొన్నారో అదేవిధంగా వ్యాపారులకు అవకాశం కల్పించాలి. ఆంధ్రప్రదేశ్‌లో బెల్లం అమ్మకాలపై ఎటువంటి ఆంక్షలు లేవు.

– తిరుపతి రెడ్డి, రైతు, మర్కల్

ఉత్తర్వు జారీ చేయాలి



ముఖ్యమంత్రికి కామారెడ్డి బెల్లంపై పూర్తి అవగాహన ఉంది. రైతులు, వ్యాపారులకు సీఎం హామీ ఇచ్చిన మేరకు ఆంక్షలు ఎత్తివేస్తూ ఉత్తర్వు జారీ చేస్తే అనుమానాలు నివృత్తి అవుతాయి.

– సాయిరెడ్డి, రైతు, మర్కల్

అన్ని వర్గాల చూపు కాంగ్రెస్ వైపే

రిజర్వేషన్లు పెంచకుంటే ముస్లింలను ఓట్లు అడగొద్దు: ఉత్తమ్

- హామీల అమలులో సర్కారు విఫలం: షబ్బీర్
- దూరదర్శన్ మాజీ జేడీ నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరికలు

హైదరాబాద్, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల చూపు కాంగ్రెస్ వైపే ఉందని, దేశంలో సామాజిక న్యాయం ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. దూరదర్శన్ మాజీ జాయింట్ డైరెక్టర్, ఏపీ పోలీసు మాజీ సీపీఆర్వో సుజాత్ అలీ నేతృత్వంలో వివిధ రంగాలకు చెందిన 40 మంది మేధావులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉత్తమ్ మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో మైనారిటీలపై దాడులు పెరిగాయన్నారు. కాంగ్రెస్ పార్టీ కుల, మతాలకు అతీతంగా అందరికీ సమాన హక్కులు కల్పించిందన్నారు. ముస్లింలకు 12% రిజర్వేషన్లు కల్పిస్తామన్న సీఎం కేసీఆర్ ఈ అంశాన్ని కేంద్రం చేతుల్లో పెట్టి చేతులు దులుపుకున్నారన్నారు. రిజర్వేషన్లు కల్పించకుంటే వచ్చే ఎన్నికల్లో ముస్లింలకు ఓట్లు అడిగే అర్హత కేసీఆర్‌కు ఉండదన్నారు. కేసీఆర్ పాలనపై అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలు కాంగ్రెస్ వైపే చూస్తున్నాయన్నారు. టీడీపీ, టీఆర్ఎస్‌తో సహా అన్ని పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఢిల్లీలోనూ, హైదరాబాద్‌లోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందనడానికి ఈ చేరికలే నిదర్శనమన్నారు. దాసోజు శ్రావణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్, దేశంలో మోదీ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కాగా, హామీలను నెరవేర్చడంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని శాసమండలిలో ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ ఆరోపించారు. హామీలు నెరవేర్చాలంటూ సీఎం కేసీఆర్‌కు లేఖ రాశానన్నారు. వృద్ధులు చలిలో వణుకుతూ క్యూలో నిలుచున్నా పింఛన్ ఇవ్వడం లేదన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం నూతన సంవత్సరం కానుకగా వృద్ధులకు పింఛన్ నిలిపివేసిందన్నారు. 'రిజర్వేషన్ల హామీ నెరవేరలేదు, సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కాలేదు, అవినీతి రాజ్యమేలుతోంది.. అయినా సీఎం కేసీఆర్ ప్రగతి భవన్‌లో కూర్చొని నా పాలన ఇదే అంటున్నారు' అని షబ్బీర్ అలీ ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చినా విద్యార్థుల ఆత్మహత్యలు బాధాకరమన్నారు. కొత్త సంవత్సరంలోనైనా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే పాలన అందించాలని కేసీఆర్‌ను కోరారు.



ఉత్తమ్, శ్రవణ్

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే పిల్లలు బడికి దూరం

- 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' కథనంలో వాస్తవాలు: జీవన్‌రెడ్డి

జగిత్యాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పిల్లలు బడికి దూరమవుతున్నారని సీఎల్పీ ఉపనేత టి.జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం జగిత్యాలలో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర సర్కారుకు విద్యా విధానంపై ఇప్పటికీ స్పష్టత లేదన్నారు. 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంలో వాస్తవాలు ఉన్నాయన్నారు. పాఠశాలల్లో సరైన సదుపాయాలు లేవని, అందుకే మూడేళ్లలో 10లక్షల మంది పిల్లలు డ్రాపవుట్ అయ్యారన్నారు. ఉపాధ్యాయ నియామకాల్లో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు.

S & D

దళపతి సై!



రాజకీయాల్లోకి వస్తున్నాం.. రజనీకాంత్ స్పష్టమైన ప్రకటన

చెన్నై, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రజనీకాంత్ అభిమానులారా! మీరు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ప్రకటన వచ్చింది. రెండు దశాబ్దాల అనిశ్చితి వీడిపోయింది. పైవాడు ఆదేశించాడు! రజనీ రాజకీయాల్లోకి వచ్చేశాడు! డిసెంబరు 31న నిర్ణయం ప్రకటిస్తానన్న దళపతి... ఆదివారం ఉదయమే తన మనసులో మాట చెప్పేశారు. "నేను రాజకీయాల్లోకి రావడం తథ్యం" అని అభిమానుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. "అవసరమైన సన్నాహాలన్నీ పూర్తి చేశాను. ఇక బాణం వదలడమే మిగిలింది. సొంతంగా పార్టీ పెడుతున్నాం. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమిళనాడులోని 234 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెడతా. న్యాయంగా, ధర్మంగా సాగే ఆధ్యాత్మిక రాజకీయమే నా లక్ష్యం" అని రజనీ ఉద్ఘాటించారు. చెన్నై కోడంబాక్కంలోని రాఘవేంద్ర కల్యాణ మండపంలో ఆరో రోజు అభిమానుల ఫొటో సెషన్ సందర్భంగా ఈ ప్రకటన చేశారు. 'రావడం తథ్యం' అని రజనీ చెప్పగానే ఒక్కసారిగా కల్యాణమండపం దద్దరిల్లిపోయింది. అభిమానులకు 'బాబా' సంకేతం చూపి రజనీ మరింత ఉత్సాహపరిచారు. "అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు వస్తాయో... అంతకంటే ముందు సరైన సమయంలో పార్టీని ప్రారంభిస్తాం. ప్రజలకు ఏం చేస్తామో చెబుదాం. అధికారంలోకి వచ్చాక ఆ హామీలు నెరవేర్చకపోతే మూడేళ్లలో మనమే రాజీనామా చేద్దాం. ఇదే చెప్పి ప్రజల్లోకి వెళ్దాం. మన తారక మంత్రం... మంచే ఆలోచిద్దాం - మంచే మాట్లాడుదాం - మంచే చేద్దాం - మంచే జరుగుతుంది! రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మన దళమూ ఉంటుంది. దేవుడు ఉన్నాడు. జైహింద్..!' అని రజనీకాంత్ అన్నారు.

రాజకీయాల్లోకి ఎందుకంటే...

'నీ బాధ్యత నిర్వర్తించు. మిగతాది నేను చూసుకుంటాను అని కృష్ణుడు అర్జునుడికి ఉపదేశించాడు. యుద్ధం చెయ్.. గెలిస్తే దేశాన్ని పాలిస్తావు. మరణిస్తే వీరస్వర్గం పొందుతావు. యుద్ధం చేయనని వెళ్లిపోతే పిరికివాడని గేలిచేస్తారు. ఇప్పటికే నేను అంతా పూర్తి చేసేశాను. అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు స్థానిక ఎన్నికలు వస్తున్నాయి. సమయం చాలా తక్కువ ఉన్న కారణంగా ఆ ఎన్నికల్లో పోటీచేయడం లేదు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీపై... అప్పుడు సరైన నిర్ణయం తీసుకుంటాను. డబ్బు కోసమో, పేరు కోసమో, పదవి కోసమో నేను రాజకీయాల్లోకి రావడం లేదు. నేను కలలో కూడా ఊహించలేనంత స్థాయిలో డబ్బు, పేరు మీరు ఇచ్చేశారు. ఇక... పదవి! దానిపై నాకు ఆశ లేదు. 1996లోనే అది నన్ను వెతుక్కుంటూ వచ్చింది. కానీ, వద్దని పక్కకు పెట్టా. 45ఏళ్ల వయసులోనే నాకు పదవి ఆశ లేదు. అలాంటిది 68 వయసులో వస్తుందా? అలా ఆశ ఉండి ఉంటే నేను పిచ్చివాడికిందే లెక్క! ఆధ్యాత్మికవాదినని చెప్పుకోవడానికి అర్హుడిని కాను. మరి ఎందుకు రాజకీయాల్లోకి వస్తున్నానంటే... రాజకీయాలు చాలా భ్రష్టుపట్టిపోయాయి. ప్రజాస్వామ్యం చెడిపోయింది. గడచిన ఏడాదిగా తమిళనాడులో జరిగిన కొన్ని రాజకీయ పరిణామాలు ప్రతి తమిళుడు తలదించుకునేలా చేశాయి. అన్ని రాష్ట్రాల ప్రజలు మనల్ని చూసి నవ్వుకుంటున్నారు. నన్ను బతికిస్తున్న తమిళ ప్రజలకు మంచి చేయడానికి ప్రజాస్వామ్య పద్ధతిలో నేను ఒక ప్రయత్నం కూడా చేయలేదన్న భావన నేను చనిపోయేదాకా వెంటాడుతూనే ఉంటుంది. అంతా మార్చాలి. అదే నా ఉద్దేశ్యం.' అన్నారు. కాగా, రజనీ రాజకీయ ప్రవేశాన్ని అధికార అన్నాడీఎంకే, ప్రతిపక్షం డీఎంకే, కాంగ్రెస్ సహా అన్ని ప్రధాన పార్టీల నేతలూ స్వాగతించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రజనీకాంత్ రాజకీయాల్లోకి రావడం వల్ల అన్నాడీఎంకే పార్టీకి ఎటువంటి నష్టమూ ఉండదని సీఎం పళనిస్వామి పేర్కొనగా, డీఎంకేకు వచ్చిన ప్రమాదమూ ఏమీ లేదని ఆ పార్టీ కార్యాచరణ అధ్యక్షుడు స్టాలిన్ అన్నారు. అదే సమయంలో నామ్ తమిళర్ పార్టీ అధ్యక్షుడు సీమాన్ 'మరాఠీ రజనీకాంత్ తమిళనాడును పరిపాలించాలనుకుంటే అంగీకరించం' అని విమర్శించారు. రజనీకాంత్‌కు సహ నటుడు కమల్ హాసన్, బిగ్‌బి అమితాబ్ బచ్చన్ ట్విట్టర్‌లో శుభాకాంక్షలు తెలియజేశారు.

రజనీకాంత్ నిరక్షరాస్యుడు!
సుబ్రమణ్య స్వామి

చెన్నై, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాల్లోకి వస్తానని ప్రకటించిన తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ పై బీజేపీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు సుబ్రమణ్యస్వామి ట్విట్టర్‌లో తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రజనీకాంత్ నిరక్షరాస్యుడని, ఆయనకు తమిళ ప్రజల మద్దతు లభించడం అసాధ్యమేనని పేర్కొన్నారు. రజనీ రాజకీయ ప్రవేశం చేస్తానని మాత్రమే ప్రకటించారని, పార్టీ పేరు, లక్ష్యాలు ప్రకటించలేదని, అతనిని తమిళ ప్రజలు అంగీకరించరని తెలిపారు. రజనీకాంత్ బీజేపీకి మద్దతు ప్రకటిస్తే, తాను పార్టీ నుంచి వైదొలగుతానని హెచ్చరించారు.

నాకు రక్షకులు కావాలి..

రాజకీయం మహాసముద్రం లాంటిది. అందులో మనం ఈదాలి. మనం ఇంకా దిగలేదు. దిగిన తరువాత ఈదుదాం. ఆలోపు రక్షక దళాన్ని తయారుచేద్దాం! ఒక రాజకీయ పార్టీ ప్రారంభించి, ఎన్నికల్లో గెలవడం సాధారణమైన విషయం కాదని నాకు తెలుసు. ఇది నడిసముద్రంలో మునిగి ముత్యాన్ని బయటకు తీసుకురావడంలాంటిదే. దేవుడి ఆశీస్సులు, ప్రజల విశ్వాసం, అభిమానం, ప్రేమ, సహకారం ఉంటేనే మనం ఇది సాధించగలం. దేవుడి ఆశీస్సులు, ప్రజల ఆదరణ రెండూ నాకు దొరుకుతాయని సంపూర్ణ నమ్మకం ఉంది. ఒక పార్టీకి సర్వం కార్యకర్తే. నాకు కార్యకర్తలు కాదు, రక్షకులు కావాలి. వారి కష్టంతో అధికారంలోకి వస్తే... ప్రజలకు అందాల్సిన పథకాలు, రాయితీలు, లబ్ధి అందకుండా అడ్డుకొనేలా ఎవరు తప్పుచేసినా ప్రశ్నించే రక్షకులే నాకు కావాలి. మన పార్టీలో ఎవరు తప్పుచేసినా, అధికారులు, మంత్రులే తప్పు చేసినా నిలబెట్టి ప్రశ్నించే రక్షకులు కావాలి. అలాంటి వారికి ప్రతినిధి నేను. అధికారులు సరిగ్గా పనిచేస్తున్నారా, లేదా అని నిఘాపెట్టే ప్రజల ప్రతినిధినే నేను. ఇందుకు రక్షణ దళం కావాలి. అది మనం సృష్టించాలి. గ్రామాల నుంచి నగరాల వరకు మన పార్టీ సంఘాలు ఉన్నాయి. రిజిస్టర్ కానివి రెండింతలుగా ఉన్నాయి. వాటిని రిజిస్టర్ చేసి, మళ్లీ రెన్యువల్ చేసి అందర్నీ సమన్వయపరచండి. ఇది సినిమా కాదు. రాజకీయం! మనం రక్షకులుగా మారబోతున్నాం. ఇందుకు మనం మాత్రమే సరిపోము. ప్రతి గ్రామం నుంచి నగరం వరకు ప్రతి వీధిలో మన వాళ్లుండాలి. ఇదే నేను మీకు (అభిమానులకు) ఇస్తున్న తొలి పని. ఏం చేసినా క్రమశిక్షణ అవసరం. ప్రజాస్వామ్య విధానంలో ఎన్నికల్లో ఎలా పోటీచేయాలన్నది నిర్ణయిద్దాం. అప్పటి వరకు మనం రాజకీయాలు మాట్లాడవద్దు. నాతో సహా! రాజకీయ నాయకులను తిట్టవద్దు. ప్రకటనలూ, పోరాటాలూ వద్దు.

మీడియా అంటేనే భయం..

చాలా బిల్డప్ అయిపోయింది (తనదైన శైలిలో నవ్వుతూ)! ఇది నేను ఇచ్చిన బిల్డప్ కాదు. దానికదే అయిపోయింది. నాకు రాజకీయాల్లోకి రావడానికి భయం లేదు. మీడియాను చూస్తేనే భయం. పెద్ద పెద్ద దిగ్గజాలే మీడియాని చూసి భయపడుతున్నారు. నేను ఇంకా పసివాడినే. ఏదో ఒకటి అడుగుతారు! మనం ఏదో ఒకటి చెబితే వెంటనే చర్చా కార్యక్రమాలు మొదలవుతాయి. అందులోనూ పత్రికా దిగ్గజం చో రామస్వామి నన్ను ముందే భయపెట్టేశారు. మీడియా విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఈ సమయంలో ఆయన ఉండి ఉంటే నాకు పది ఏనుగుల బలం ఉండేది. ఆయన ఆత్మ ఎప్పుడూ నాతోనే ఉంటుంది. - రజనీ

రెచ్చగొడితే రాజకీయాల్లోకి వస్తా: ప్రకాశ్ రాజ్



ప్రకాశ్‌రాజ్‌ను సన్మానిస్తున్న పీసీబీ

బెంగళూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రాజకీయాలంటే ఆసక్తి లేదు... అయినా పదేపదే రెచ్చగొడితే రాజకీయాల్లోకి వచ్చేందుకు వెనుకాడను అని దక్షిణ భారత ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ సవాల్ విసిరారు. బెంగళూరులో ఆదివారం ప్రెస్‌క్లబ్ ఆఫ్ బెంగళూరు(పీసీబీ) నుంచి ఈ ఏడాది 'ఉత్తమ వ్యక్తి' పురస్కారం పొందిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయాలనేవి కష్టమైనవని, కానీ పదేపదే రెచ్చగొడితే రాజకీయాల్లోకి వస్తానన్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరుకు బెందకాళూరు అనే పర్యాయ పదం ఉందని, శాంతికి భంగం కలిగించాలనుకునేవారి ఆటలు ఇక్కడ సాగకుండా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

శ్మశానంలో భారీ పేలుడు

అంత్యక్రియలకు హాజరైన 18 మంది బలి


కాబూల్, డిసెంబరు 31: శ్మశానంలో సంభవించిన పేలుడులో ఓ అధికారి అంత్యక్రియలకు హాజరైన 18 మంది బలయ్యారు. మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రావిన్షియల్ రాజధాని అయిన జలాలాబాద్‌లో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. జిల్లా మాజీ గవర్నరు వృద్ధాప్యంతో మరణించారు. బంధువులు ఆయన అంతిమ సంస్కారం నిర్వహిస్తుండగా దాడి జరిగింది. పేలుడు పదార్థాలతో ఉన్న రిక్షా వారిపైకి దూసుకొచ్చింది. అధికారులు తొలుత ఆత్మాహుతి దాడిగా భావించారు. రిమోట్ సహాయంతో పేలుడుకు పాల్పడ్డారని తర్వాత నిర్ధారించారు. ఇది తాలిబన్ లేదా ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదుల దుశ్చర్యేనని అధికారులు అనుమానిస్తున్నారు. శనివారం రాత్రి మజర్-ఐ-షరీఫ్ నగరంలో సంభవించిన పేలుడులో 12 మంది గాయపడ్డారు.



మిలిటెంట్ల దాడిలో మృతి చెందిన జవాను అంతిమయాత్ర

అర్ధరాత్రి.. ఉగ్రదాడి

- సీఆర్‌పీఎఫ్ శిబిరంపై మిలిటెంట్ల కాల్పులు
- కశ్మీర్‌లో ఐదుగురు జవాన్ల మృతి
- ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదుల హతం





మృతిచెందిన జవాన్లు

పుల్వామా, డిసెంబరు 31: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి తెగబడ్డారు. పుల్వామా జిల్లాలోని సీఆర్‌పీఎఫ్ శిబిరంపై శనివారం అర్ధరాత్రి 2:10 గంటలకు దాడికి దిగారు. అవంతిపోరా ప్రాంతంలోని లెత్‌పోరాలో ఉన్న 185వ శిబిరంలోకి ప్రవేశించిన ముగ్గురు ఉగ్రవాదులు... నిద్రపోతున్న జవాన్లపైకి అండర్-బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లు, ఆటోమేటిక్ ఆయుధాలతో దాడి చేశారు. ఈ ఘటనలో ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. నలుగురు తూటాల వల్ల, ఒకరు కాల్పుల సమయంలో గుండెపోటుతో మరణించారు. ముగ్గురు గాయపడ్డారు. ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. వీరు కశ్మీర్‌వాసులు కావడం, వీరిలో ఒకరి తండ్రి పోలీస్ కావడం గమనార్హం. మూడో ఉగ్రవాదీ మరణించాడని, అతడిని గుర్తించాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఆదివారం సాయంత్రం వరకూ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ దాడికి తామే బాధ్యులమని జైషే మహమ్మద్ ప్రకటించింది. ఇదిలావుండగా, మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానం వైఫల్యం వల్లే ఈ దాడి జరిగిందని కాంగ్రెస్ ఆరోపించింది. మరోవైపు, పాక్ బలగాలు కాల్పుల విరమణ ఒప్పందానికి విరుద్ధంగా రాజౌరీ జిల్లాలో కాల్పులు జరపడంతో ఓ జవాను చనిపోయాడు.



మైసూరులో మరో లవ్‌జిహాదీ!

మతం మారాలని, మాంసం తినాలని ఒత్తిడి

తిరిగి తల్లిదండ్రుల చెంతకు చేరిన యువతి

బెంగళూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన యువతిని ప్రేమించి వివాహం చేసుకున్న ఓ ముస్లిం యువకుడు అనంతరం ఆమెను మతం మారాల్సిందిగా వేధించిన ఉదంతం మైసూరు నగరంలో పెను దుమారం రేపింది. మైసూరులోని జయపురలో నివసించే ఫైజల్ అహ్మద్ అనే యువకుడు గుజరాత్ రాష్ట్రం ద్వారక జిల్లా దేవభూమి ప్రాంతం అశ్విన్‌భాయ్ కుమార్తె న్యాన్సీ జోషిని మూడేళ్ల క్రితం ఫేస్‌బుక్ ద్వారా పరిచయం చేసుకున్నాడు. ఆ పరిచయం ప్రేమగా మారింది. ఆరు నెలలక్రితం గుజరాత్ నుంచి న్యాన్సీ జోషి మైసూరుకు వచ్చేయగా ఫైజల్ అహ్మద్ వివాహం చేసుకున్నాడు. ఇటీవల రెండు మూడు నెలలుగా భర్త ఫైజల్ అహ్మద్, అత్త ముస్లిం సంప్రదాయాన్ని పాటించాలని, అరబిక్ భాష నేర్చుకోవాలని, మాంసం తినాలని ఒత్తిడి చేస్తున్నారంటూ తండ్రికి ఫోన్‌లో న్యాన్సీ వివరించింది. దీంతో ఆమె సోదరుడు మైసూరుదక్షిణ గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. న్యాన్సీని తిరిగి పంపేందుకు ఫైజల్ కుటుంబీకులు ఒప్పుకోలేదు. ఉన్నతాధికారులకు సమాచారం తెలియడంతో న్యాన్సీని గుజరాత్‌కు సురక్షితంగా పంపారు. అయితే ఫైజల్ మాత్రం ముస్లిం మత నిబంధనలు పాటిస్తానని ఒప్పుకున్నందునే వివాహం చేసుకున్నానని అంటున్నారు.

'హజ్' బంధనాలకు చెల్లు!

యాత్రకు ముస్లిం మహిళలు ఒక్కరే వెళ్లవచ్చు.. 'సంరక్షకుడు తప్పనిసరి' నిబంధన రద్దు

కేంద్ర ప్రభుత్వం మరో చరిత్రాత్మక నిర్ణయం.. 'మన్‌కీ బాత్'లో వెల్లడించిన మోదీ

న్యూఢిల్లీ, డిసెంబరు 31: ముస్లిం మహిళలు హజ్ యాత్ర చేయాలంటే వారి వెంట 'మెహరమ్' (సంరక్షకుడు) ఉండటం తప్పనిసరి. సంరక్షకుడు ఉంటేనే యాత్రకు అనుమతి. ఇప్పటి వరకు ఒంటరిగా హజ్ యాత్రకు వెళ్లాలనుకునే ముస్లిం మహిళలకు ప్రతిబంధకంగా ఉన్న ఈ నిబంధనను కేంద్రం తొలగించింది. ఇకపై సంరక్షకుడితో పనిలేకుండానే ముస్లిం మహిళలు ఒంటరిగానే హజ్ యాత్ర చేయవచ్చని ప్రకటించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ విషయాన్ని వెల్లడించారు. 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో ఆదివారం ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏళ్ల తర్వాత కూడా మహిళలపై ఇలాంటి వివక్ష కొనసాగడం దారుణం. అందుకే ఈ నిబంధనను తొలగించాలని నిర్ణయించాం' అని పేర్కొన్నారు. కొన్ని దశాబ్దాలుగా ముస్లిం మహిళలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నా, దానిపై దేశంలో ఎలాంటి చర్చ జరగకపోవడం దారుణమన్నారు. చాలా ముస్లిం దేశాల్లో ఇలాంటి ఆంక్షలు లేవని, మరి మన దేశంలో ఎందుకని ప్రశ్నించారు. ఇకపై సంరక్షకుడు లేకపోయినా ముస్లిం మహిళలు హజ్ యాత్రకు వెళ్లవచ్చని ఉద్ఘాటించారు. ఈసారి 1300 మంది ముస్లిం మహిళలు ఒంటరిగా హజ్ యాత్రకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నారని, వారందరినీ యాత్రకు అనుమతించాలని మైనారిటీ వ్యవహారాల శాఖను ప్రధాని ఆదేశించారు. 'సాధారణంగా హజ్ యాత్రకు వెళ్లేవారిని ఎంపిక చేసేందుకు లాటరీ విధానం అమలు చేస్తారు. అయితే ఒంటరిగా హజ్ యాత్ర చేయాలనుకునే మహిళలను లాటరీ నుంచి మినహాయించి, ప్రత్యేక కేటగిరీ కింద వారందరినీ హజ్ యాత్రకు అనుమతి ఇవ్వాలని నిర్ణయించాం.' అని మోదీ వ్యాఖ్యానించారు. మహిళల శక్తిసామర్థ్యాలపైనే దేశ పురోగతి ఆధారపడి ఉందని మోదీ పేర్కొన్నారు. మహిళలందరికీ పురుషులతో సమానంగా హక్కులు కల్పించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మన్‌కీబాత్ అనంతరం ప్రధాని కేరళలోని శివగిరి మఠం 85వ వార్షికోత్సవంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్షణ తలాక్ అంశాన్ని ప్రస్తావించారు. లోక్‌సభలో ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదం పొందిన తర్వాత ప్రధాని ఆ అంశంపై మాట్లాడటం ఇదే తొలిసారి. 'కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్న బాధల నుంచి విముక్తి పొందేందుకు ముస్లిం మహిళలు అంతిమంగా ట్రిపుల్ తలాక్ రద్దు మార్గాన్ని ఎంచుకుని విజయం సాధించారు' అని వ్యాఖ్యానించారు. మహిళల హక్కుల కోసం జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి, రాజా రామ్మోహన్ రాయ్, ఈశ్వర్ చంద్ విద్యాసాగర్ వంటి వారెందరో కృషి చేశారని అన్నారు. కులమతాలకతీతంగా అందరి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని దేశ ప్రజలకు ప్రధాని పిలుపునిచ్చారు.

4 నుంచి స్వచ్ఛ సర్వే: ప్రధాని



న్యూఢిల్లీ, డిసెంబరు 31: దేశవ్యాప్తంగా 2014 నుంచి అమలు చేస్తున్న 'స్వచ్ఛ భారత్' కార్యక్రమం ఫలితాలను పరిశీలించేందుకు ప్రపంచంలోనే అతిపెద్ద సర్వేకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఆదివారం మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈ విషయాన్ని వెల్లడించారు. జనవరి 4 నుంచి మార్చి 10 వరకు దేశవ్యాప్తంగా 'పరిశుభ్రత సర్వే-2018'ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 4 వేల పట్టణాల్లో 40 కోట్లకు పైగా జనాభాను కవర్ చేస్తూ ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేరళలోని శబరిమలలో జరుగుతున్న స్వచ్ఛతా కార్యక్రమాన్ని మోదీ తన ప్రసంగంలో ప్రస్తావించారు. 'పి.విజయన్ అనే పోలీసు అధికారి 'పుణ్యం పూనకావనం' పేరుతో చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమం కొన్ని లక్షల మంది వచ్చే శబరిమల క్షేత్రాన్ని పరిశుభ్రంగా ఉంచుతోంది అన్నారు. భారతదేశాన్ని ఆశావహ దృక్పథం నుంచి అభివృద్ధి దిశగా నడిపించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. 2000 సంవత్సరంలో జన్మించిన వారంతా 2018 జనవరి 1 నుంచి ఓటర్లుగా రూపాంతరం చెందుతారని, వారందరికి ప్రజాస్వామ్య భారతం సాదరంగా ఆహ్వానిస్తోందని మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై దేశ యువతకు గౌరవభావాన్ని పెంపొందించేందుకు ప్రతియేటా ఆగస్టు 15న ఢిల్లీలో మాక్ పార్లమెంటును నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి 26న జరిగే గణతంత్ర వేడుకల్లో ఆసియాన్‌కు 10 మంది దేశాధినేతలు ఈసారి గణతంత్ర వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారని వెల్లడించారు.

త్వరలో దినకరన్ 'పేరవై'



- అన్నాడీఎంకే ఎమ్మెల్యేలకు వల

చెన్నై, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే అసమ్మతి వర్గం నాయకుడు టీటీవీ దినకరన్ త్వరలో పేరవై(సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహించే సంస్థ) ఏర్పాటు చేసే సూచనలు కన్పిస్తున్నాయి. మద్దతుదారులు, అనుచరులతో సంప్రదింపులు జరిపి సంక్రాంతి తర్వాత పేరవైని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆర్‌కే నగర్ నియోజకవర్గంలో ఘన విజయం సాధించిన దినకరన్‌కు అన్నాడీఎంకే నుంచి పలువురు రహస్యంగా మద్దతు పలుకుతున్నారు. తనకు తొలి నుంచి అండగా నిలిచిన, అధికార పక్షం నుంచి తనవర్గంలో చేరటానికి సిద్ధంగా ఎమ్మెల్యేలు, నాయకులను కలుపుకుని పేరవై ఏర్పాటు చేసి, వారికి పదవులు ఇవ్వాలని దినకరన్ నిర్ణయించారు.

నితిన్ పటేల్‌కు అమిత్ షా బుజ్జగింపు

అహ్మదాబాద్, డిసెంబరు 31: సీనియర్‌నైన తనకు కీలక శాఖలు ఇవ్వనందుకు అలకబూనిన గుజరాత్ ఉపముఖ్యమంత్రి నితిన్ పటేల్ శాంతించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఆదివారం ఉదయం తనకు ఫోన్ చేశారని, కేబినెట్‌లో నంబర్ టూ అయిన తన స్థాయికి తగిన ముఖ్యమైన శాఖలు కచ్చితంగా దక్కుతాయని హామీ ఇచ్చారు. దాంతో పటేల్ ఆదివారం తన శాఖల బాధ్యతలు స్వీకరించారు.

వరుడి ప్రాణం తీసిన బరాత్ బందూక్

చండీగఢ్, డిసెంబరు 31: పెళ్లి వేడుకలో బంధువుల సంబరం.. పెళ్లికొడుకునే బలి తీసుకుంది. తమ ఆనందాన్ని చాటేందుకు పేల్చిన తుపాకీ తూటా.. వరుడి గుండెల్లోకి దూసుకెళ్లి ప్రాణాలు విడిచాడు. హరియాణాలోని కైథాల్ జిల్లా గుల్హా పట్టణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్విట్జర్లాండ్‌లో నివసించే ఎన్నారై విక్రమ్ (30) వివాహం శనివారం జరగగా.. రాత్రి పెళ్లివేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంతా ఫుల్‌జోష్‌లో డ్యాన్సుల్లో మునిగిపోగా.. బంధువుల్లో ఒకరు తుపాకీని గాల్లోకి పదే పదే పేల్చి సంబరాన్ని చాటుతున్నాడు. ఈ క్రమంలో మరొకరు అతనికి తగలడంతో తుపాకీ అదుపుతప్పి.. తూటా పెళ్లికొడుకువైపు దూసుకెళ్లింది. వెంటనే అతణ్ని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారని పోలీసులు తెలిపారు.

గోవాలో రాహుల్ న్యూ ఇయర్

మార్‌గావ్, డిసెంబరు 31: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆకస్మికంగా గోవా వచ్చారు. దక్షిణ గోవాలోని బీచ్ రిసార్టులో విశ్రాంతి తీసుకుంటున్న తన తల్లిని కలుసుకున్నారు. కుటుంబ సభ్యులంతా కొత్త సంవత్సర వేడుకలు అక్కడే చేసుకోనున్నారు. పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించాక ఆయన ఇక్కడకు రావడం ఇదే మొదటిసారి. తన రాక గురించి పార్టీ రాష్ట్ర శాఖకు తెలియజేయలేదు. వ్యక్తిగత పర్యటనకు వచ్చినందున తామెవరం వారిని కలవలేదని పీసీసీ అధ్యక్షుడు శాంతారాం నాయక్ తెలిపారు.

అటల్ పెన్షనర్లకు కొత్త ఆధార్ లింకింగ్ ఫారం

న్యూఢిల్లీ, డిసెంబరు 31: అటల్ పెన్షన్ యోజన(ఏపీవై) పరిధిలోని పెన్షనర్లు ఆధార్ లింకింగ్‌కు సంబంధించి కొత్త ఫారం పూర్తిచేసి ఇవ్వాల్సి ఉంటుంది. వారి అనుమతితోనే ఆధార్ లింకింగ్, ధ్రువీకరణ చేపట్టాలని ఈ పథకం సర్వీసు ప్రొవైడర్లకు పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ-డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌ఆర్‌డీఏ) ఆదేశాలు జారీచేసింది. సోమవారం నుంచి ఈ కొత్త ఫారాలు తీసుకోవాలని సూచించింది.

వేలాది అఫ్ఘాన్ వాసులకు ఇదే పుట్టిన రోజు

కాబూల్, డిసెంబరు 31: సమాద్ అల్వీ పుట్టినరోజు జనవరి 1. అతడి భార్య పుట్టినరోజు కూడా అదే తారీఖు. ఇదేమంత ప్రత్యేకం కాకపోయినా... వీరి ఇద్దరు పిల్లలూ జనవరి 1నే పుట్టడం మాత్రం విశేషమే. ఇక అల్వీ 32మంది స్నేహితుల బర్త్‌డేలు కూడా నూతన సంవత్సరం మొదటిరోజే కావడం మరింత ఆశ్చర్యం కలిగించే విషయం! తాము ఎప్పుడు పుట్టామో తెలియని వేలాది అఫ్ఘాన్ వాసులు ఇప్పుడు తమ పుట్టినరోజుగా జనవరి 1ని 'ఎంచుకుంటున్నారు'! తమవద్ద జనన ధ్రువీకరణ పత్రాలు గానీ మరే ఇతర అధికారిక పత్రాలు గానీ లేకపోవడంతో అందరికీ తేలికగా గుర్తుండే రోజయితే బాగుంటుందని ఇలా చేస్తున్నామని చెబుతున్నారు.

రగులుతున్న ఇరాన్

- ఆర్థిక కష్టాలపై ప్రజాందోళనలు.. నిరసనలు హింసాత్మకం
- పోలీస్ కాల్పుల్లో ఇద్దరు మృతి.. టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ బ్లాక్

టెహ్రాన్, డిసెంబరు 31: ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలతో ఇరాన్ అట్టుడుకుతోంది. జీవన వ్యయం, నిత్యావసరాల ధరలు పెరగడం వంటి ఆర్థిక కష్టాలకు వ్యతిరేకంగా గురువారం మష్హద్ నగరంలో ప్రారంభమైన నిరసనలు దేశమంతటా వ్యాపించాయి. దేశంలో ఆర్థిక సంస్కరణలు కోరుతూ 2009లో జరిగిన ఆందోళనల తర్వాత.. మళ్లీ ఆ స్థాయిలో నిరసన జ్వాలలు ఎగసడిపడుతున్నాయి. శనివారం డొరోద్ పట్టణంలో పోలీసుల కాల్పుల్లో ఇద్దరు మృతి చెందినట్లు సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ కావడంతో ఆందోళనలు మరింత తీవ్రమయ్యాయి. ఆదివారం పలు చోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆందోళనకారులు దేశాధ్యక్షుడు హసన్ రోసాని ఫొటోలను దగ్ధం చేశారు. హింసాత్మక ఘటనల నేపథ్యంలో టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను ఇరాన్ ప్రభుత్వం బ్లాక్ చేసింది. చాలా చోట్ల మొబైల్, ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపివేశారు. కాగా, "ఇరాన్ ప్రభుత్వం ప్రజల సొమ్మును దోచుకొని, ఉగ్రవాద కార్యకలాపాలకు వినియోగిస్తోందన్న విషయాన్ని ప్రజలు ఇప్పటికైనా తెలుసుకున్నారు." అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్వీట్ చేశారు.



ఆంధ్రజ్యోతి

స్పోర్ట్స్

హైదరాబాద్ • సోమవారం 1 జనవరి 2018

ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్
బెంగళూరు టాప్‌గన్స్ x ముంబై రాకెట్స్
రా. 7.30 నుంచి
స్టార్‌స్పోర్ట్స్ 1 లో...

బిగ్‌బాష్ లీగ్
సిడ్నీ థండర్స్ x హోబర్ట్ హరికేన్స్
మధ్యాహ్నం 12.40 నుంచి సోనీ సిక్స్‌లో..
పెర్త్ స్కాచర్స్ x సిడ్నీ సిగ్గర్స్
మధ్యాహ్నం 3.55 నుంచి సోనీ సిక్స్‌లో..

న్యూజిలాండ్ x వెస్టిండీస్
రెండో టీ-20
ఉ. 11.30 నుంచి
స్టార్‌స్పోర్ట్స్ సెలెక్ట్-1లో...

S & D

భారత క్రికెట్ జట్టు అజేయ జైత్రయాత్ర.. షట్లర్లు కిడాంబి శ్రీకాంత్, పీవీ సింధు అద్భుత ప్రదర్శన.. చాంపియన్స్ ట్రోఫీ తళుకులు.. మహిళల ప్రపంచకప్ మెరుపులు.. కన్నీళ్లు తెప్పించిన స్ప్రింట్ స్టార్ ఉసేన్ బోల్ట్ ఆఖరి పరుగు.. ఇలా అనేక జ్ఞాపకాలు మిగిల్చిన 2017 సెలవు తీసుకుంది..! ఇప్పుడు క్రీడాభిమానులకు విందు భోజనం వడ్డించేందుకు 2018 ఆటల సంవత్సరం వచ్చేసింది..! ఫుట్‌బాల్ ప్రేమికులకు కిక్కిచ్చేందుకు ఫిఫా వరల్డ్ కప్ సిద్ధంగా ఉన్నది..! భారత క్రీడాకారులు పతకాల పంట పండించే కామన్వెల్త్ క్రీడలు.. ఆసియా క్రీడలు ఎదురుచూస్తున్నాయి..! క్రికెట్‌లో.. భావి స్టార్లను వెలికితీసే అండర్-19 వరల్డ్ కప్ తొలి నెలలోనే అలరించనుంది..! నిరుడు స్వదేశంలో అదరగొట్టిన కోహ్లీసేనకు ఈ సారి విదేశీ పర్యటనలు సవాల్ విసురుతున్నాయి.! మహిళల టీ-20 వరల్డ్ కప్ కూడా ఈ ఏడాదే జరగనుంది..! బ్యాడ్మింటన్ స్టార్లకు కొత్త షెడ్యూల్‌లో అనేక టోర్నీలు ముందున్నాయి..! అలాగే, ఏడాది చివర్లో హాకీ వరల్డ్ కప్‌నకు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది..! ఈ నేపథ్యంలో 2018లో జరిగే ప్రధాన క్రీడలకు సంబంధించి 'ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం' అందిస్తున్న ప్రత్యేక క్యాలెండర్...

స్పోర్ట్స్ క్యాలెండర్ 2018



క్రికెట్

జనవరి 5-28: భారత్-దక్షిణాఫ్రికా 3 టెస్టుల సిరీస్
జనవరి 13-ఫిబ్రవరి 3: ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ (న్యూజిలాండ్‌లో)
ఫిబ్రవరి 1-16: భారత్-దక్షిణాఫ్రికా ఆరు వన్డేల సిరీస్
ఫిబ్రవరి 5-24: దక్షిణాఫ్రికాలో భారత మహిళల జట్టు పర్యటన (మూడు వన్డేలు, ఐదు టీ-20లు)
ఫిబ్రవరి 18-24: భారత్-దక్షిణాఫ్రికా మూడు టీ-20ల సిరీస్
మార్చి 8-20: భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్ టీ-20 ట్రై సిరీస్ (శ్రీలంకలో)
మార్చి 22-ఏప్రిల్ 3: భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మహిళా జట్ల ట్రై సిరీస్ (ముంబైలో)
ఏప్రిల్ 4-మే 31: ఐపీఎల్ పదకొండో సీజన్
ఏప్రిల్ 8-14: భారత్‌లో ఇంగ్లండ్ మహిళల పర్యటన (మూడు వన్డేలు)
జూలై 3-8: భారత్-ఇంగ్లండ్ మూడు టీ-20ల సిరీస్ (ఇంగ్లండ్‌లో)
జూలై 12-17: భారత్-ఇంగ్లండ్ మూడు వన్డేల సిరీస్ (ఇంగ్లండ్‌లో)
ఆగస్టు 1-సెప్టెంబర్ 11: భారత్-ఇంగ్లండ్ 5 టెస్టుల సిరీస్ (ఇంగ్లండ్‌లో)
సెప్టెంబర్ 15-30: ఆసియా కప్ (భారత్‌లో)
అక్టోబర్: భారత్‌లో వెస్టిండీస్ పర్యటన (3 టెస్టులు, 5 వన్డేలు, 1 టీ-20)
నవంబర్: ఆస్ట్రేలియాలో భారత్ పర్యటన (4 టెస్టులు)
నవంబర్ 3-24: మహిళల టీ-20 వరల్డ్ కప్ (వెస్టిండీస్‌లో)

హాకీ

మే 13-20: మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ (డోంగే సిటీ, కొరియా)
జూన్ 23-జూలై 1: చాంపియన్స్ ట్రోఫీ (బ్రెడా, నెదర్లాండ్స్)
జూలై 21-ఆగస్టు 5: మహిళల వరల్డ్‌కప్ (లండన్)
అక్టోబర్ 1-15: పురుషుల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ
నవంబర్ 28-డిసెంబర్ 16: పురుషుల వరల్డ్ కప్ (భువనేశ్వర్)

చెస్

మార్చి 10-28: క్యాండిడేట్స్ టోర్నమెంట్ (బెర్లిన్)
ఏప్రిల్ 20-29: వరల్డ్ స్కూల్ చాంపియన్‌షిప్స్ (అల్బేనియా)
ఏప్రిల్ 21-30: వరల్డ్ అమెచ్యూర్ చాంపియన్‌షిప్ (ఇటలీ)
ఏప్రిల్ 1-10: ఆసియా యూత్ చాంపియన్‌షిప్ (థాయ్‌లాండ్)
మే 25-జూన్ 3: ఆసియా జూ. బాలికల చాంపియన్‌షిప్ (మంగోలియా)
జూలై 7-25: వరల్డ్ టీమ్ చెస్ (జర్మనీ)
సెప్టెంబర్ 4-16: వరల్డ్ జూ. బాలికల చాంపియన్‌షిప్ (టర్కీ)
సెప్టెంబర్ 23-అక్టోబర్ 6: చెస్ ఒలింపియాడ్ (జార్జియా)
అక్టోబర్ 19-నవంబర్ 1: వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్స్ (గ్రీస్)
నవంబర్ 9-28: వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ మ్యాచ్ (లండన్)
నవంబర్ 17-30: వరల్డ్ సీనియర్ చెస్ చాంపియన్‌షిప్ (స్లొవేనియా)
నవంబర్: మహిళల వరల్డ్ చాంపియన్‌షిప్ (రష్యా)
నవంబర్ 2-12: ఆసియా సీనియర్స్ చాంపియన్‌షిప్ (ఫిలిప్పీన్స్)

ఆర్చరీ

ఫిబ్రవరి 14-19: వరల్డ్ ఇండోర్ ఆర్చరీ (అమెరికా)
ఏప్రిల్ 23-29: ప్రపంచకప్ స్టేజ్ 1 (షాంఘై)
మే 21-26: ప్రపంచకప్ స్టేజ్ 2 (అంటాల్యా, టర్కీ)
జూన్ 19-24: ప్రపంచకప్ స్టేజ్ 3 (సాల్ట్‌లేక్ సిటీ, అమెరికా)
జూలై 17-22: ప్రపంచకప్ ఫైనల్ (బెర్లిన్)
ఆగస్టు 13-19: వరల్డ్ ఆర్చరీ మాస్టర్స్ చాంపియన్‌షిప్ (స్విట్జర్లాండ్)
సెప్టెంబర్ 4-9: వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్ (ఇటలీ)

వెయిట్ లిఫ్టింగ్

ఏప్రిల్ 20-30: ఆసియా యూత్, జూ. చాంపియన్‌షిప్ (ఉజ్బెకిస్థాన్)
జూలై 6-14: వరల్డ్ జూ. చాంపియన్‌షిప్ (ఉజ్బెకిస్థాన్)
సెప్టెంబర్ 20-23: వరల్డ్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్ (పోలెండ్)
నవంబరు: వరల్డ్ చాంపియన్‌షిప్ (తుర్క్‌మెనిస్థాన్)

రెజ్లింగ్

ఫిబ్రవరి 28-మార్చి 4: ఆసియా రెజ్లింగ్ (కిర్గిస్థాన్)
మార్చి 17-18: మహిళల ఫ్రీ స్టయిల్ వరల్డ్ కప్ (జపాన్)
ఏప్రిల్ 7-8: పురుషుల ఫ్రీ స్టయిల్ వరల్డ్‌కప్ (అమెరికా)
జూలై 3-8: వరల్డ్ క్యాడెట్ రెజ్లింగ్ (క్రొయేషియా)
సెప్టెంబర్ 5-9: వరల్డ్ యూనివర్సిటీ రెజ్లింగ్ (బ్రెజిల్)
సెప్టెంబర్ 18-23: వరల్డ్ జూ. చాంపియన్‌షిప్ (స్లొవేకియా)
అక్టోబర్ 2-7: వరల్డ్ వెటరన్స్ రెజ్లింగ్ (రష్యా)
అక్టోబర్ 22-28: వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ (హంగేరి)
డిసెంబర్ 1-2: పురుషుల గ్రీకో-రోమన్ వరల్డ్‌కప్ (ఇరాన్)

బ్యాడ్మింటన్

జనవరి 30-ఫిబ్రవరి 4: ఇండియా ఓపెన్
ఫిబ్రవరి 6-11: ఆసియా టీమ్ చాంపియన్‌షిప్
ఫిబ్రవరి 20-25: స్విస్ ఓపెన్
మార్చి 7-11: బ్రెజిల్ ఇంటర్నేషనల్
మార్చి 14-18: ఆల్ ఇంగ్లండ్ ఓపెన్
ఏప్రిల్ 10-15: ఇండోనేసియా ఇంటర్నేషనల్ సిరీస్
ఏప్రిల్ 17-22: మలేసియా ఇంటర్నేషనల్ చాలెంజ్
ఏప్రిల్ 24-29: ఆసియా బ్యాడ్మింటన్ (చైనా)
మే 8-13: ఆస్ట్రేలియన్ ఓపెన్
మే 20-27: థామస్-ఉబెర్ ఫైనల్స్ (బ్యాంకాక్)
జూన్ 19-24: కెనడా ఓపెన్
జూన్ 26-జూలై 1: మలేసియా ఓపెన్
జూలై 3-8: ఇండోనేసియా ఓపెన్
జూలై 10-15: థాయ్‌లాండ్ ఓపెన్
జూలై 14-18: ఆసియా జూ. టీమ్ టోర్నీ
జూలై 17-22: సింగపూర్ ఓపెన్
జూలై 19-22: ఆసియా జూ. చాంపియన్‌షిప్స్
జూలై 24-29: జపాన్ మాస్టర్స్
జూలై 24-29: రష్యా ఓపెన్
జూలై 30-ఆగస్టు 5: వరల్డ్ చాంపియన్‌షిప్స్ (చైనా)
ఆగస్టు 7-12: వియత్నాం ఓపెన్
ఆగస్టు 28-సెప్టెంబర్ 2: స్పానిష్ ఓపెన్
సెప్టెంబర్ 4-9: హైదరాబాద్ ఓపెన్
సెప్టెంబర్ 11-16: జపాన్ ఓపెన్
సెప్టెంబర్ 12-15: బెల్జియన్ ఇంటర్నేషనల్
సెప్టెంబర్ 18-23: చైనా ఓపెన్
సెప్టెంబర్ 25-30: కొరియా ఓపెన్
అక్టోబర్ 2-7: చైనీస్ తైపీ ఓపెన్
అక్టోబర్ 9-14: డచ్ ఓపెన్
అక్టోబర్ 16-21: డెన్మార్క్ ఓపెన్
అక్టోబర్ 23-28: ఫ్రెంచ్ ఓపెన్
అక్టోబర్ 23-28: ఇండోనేసియా చాలెంజ్
అక్టోబర్ 30-నవంబరు 4: మకావు ఓపెన్
నవంబరు 5-18: వరల్డ్ జూ. చాంపియన్‌షిప్ (కెనడా)
నవంబరు 6-11: చైనా మాస్టర్స్
నవంబరు 6-11: మలేసియా ఇంటర్నేషనల్ సిరీస్
నవంబరు 13-18: హాంకాంగ్ ఓపెన్
నవంబరు 20-25: సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్
నవంబరు 27-డిసెంబరు 2: కొరియా మాస్టర్స్



అథ్లెటిక్స్

ఫిబ్రవరి 1-3: ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ (టెహ్రాన్, ఇరాన్)
మార్చి 2-4: వరల్డ్ ఇండోర్ చాంపియన్‌షిప్ (బర్మింగ్‌హామ్)
ఏప్రిల్ 5-6: సౌత్ ఈస్ట్ ఆసియా యూత్ అథ్లెటిక్స్ (బ్యాంకాక్)
ఏప్రిల్ 7: వరల్డ్ యూనివర్సిటీ క్రాస్ కంట్రీ (స్విట్జర్లాండ్)
మే 5,6: వరల్డ్ రేస్ వాకింగ్ టీమ్ చాంపియన్‌షిప్ (చైనా)
జూన్ 7-10: ఆసియా జూనియర్ అథ్లెటిక్స్ (గిఫు, జపాన్)
జూలై 10-15: వరల్డ్ అండర్-20 చాంపియన్‌షిప్ (ఫిన్లాండ్)

టెన్నిస్

జనవరి 1-6: ఖతార్ ఓపెన్
జనవరి 1-జనవరి 7: మహారాష్ట్ర ఓపెన్
జనవరి 1-8: బ్రిస్బేన్ ఇంటర్నేషనల్
జనవరి 7-13: సిడ్నీ ఇంటర్నేషనల్
జనవరి 15-18: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్
ఫిబ్రవరి 26-మార్చి 4: బ్రెజిల్ ఓపెన్
మార్చి 5-18: ఇండియన్ వేల్స్ ఓపెన్
మార్చి 19-31: మియామి ఓపెన్
ఏప్రిల్ 6-7: డేవిస్‌కప్‌లో భారత్ రెండోరౌండ్ మ్యాచ్
ఏప్రిల్ 6-8: డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్ క్వార్టర్‌ఫైనల్
ఏప్రిల్ 15-22: మోంటెకార్లో మాస్టర్స్
మే 5-12: మాడ్రిడ్ ఓపెన్
మే 13-20: రోమ్ ఇంటర్నేషనల్
మే 27-జూన్ 10: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్
జూలై 2-15: వింబుల్డన్ చాంపియన్‌షిప్
ఆగస్టు 6-12: రోజర్స్ కప్
ఆగస్టు 12-19: సిన్సినాటి ఓపెన్
ఆగస్టు 27-సెప్టెంబర్ 9: యూఎస్ ఓపెన్
సెప్టెంబర్ 14-16: డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్ సెమీస్
అక్టోబర్ 1-7: చైనా ఓపెన్
అక్టోబర్ 7-14: షాంఘై మాస్టర్స్
అక్టోబర్ 29-నవంబర్ 4: పారిస్ మాస్టర్స్
నవంబర్ 11-18: ఏటీపీ వరల్డ్ టూర్ ఫైనల్స్
నవంబర్ 23-25: డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్ ఫైనల్

ఫార్ములా వన్



మార్చి 25: ఆస్ట్రేలియా గ్రాండ్ ప్రీ
ఏప్రిల్ 8: బహ్రెయిన్ గ్రాండ్ ప్రీ
ఏప్రిల్ 15: చైనా గ్రాండ్ ప్రీ
ఏప్రిల్ 29: అజర్‌బైజాన్ గ్రాండ్ ప్రీ
మే 13: స్పెయిన్ గ్రాండ్ ప్రీ
మే 27: మొనాకో గ్రాండ్ ప్రీ
జూన్ 10: కెనడా గ్రాండ్ ప్రీ
జూన్ 24: ఫ్రెంచ్ గ్రాండ్ ప్రీ
జూలై 1: ఆస్ట్రియా గ్రాండ్ ప్రీ
జూలై 8: బ్రిటిష్ గ్రాండ్ ప్రీ
జూలై 22: జర్మనీ గ్రాండ్ ప్రీ
జూలై 29: హంగేరి గ్రాండ్ ప్రీ
ఆగస్టు 26: బెల్జియం గ్రాండ్ ప్రీ
సెప్టెంబర్ 2: ఇటలీ గ్రాండ్ ప్రీ
సెప్టెంబర్ 16: సింగపూర్ గ్రాండ్ ప్రీ
సెప్టెంబర్ 30: రష్యా గ్రాండ్ ప్రీ
అక్టోబర్ 7: జపాన్ గ్రాండ్ ప్రీ
అక్టోబర్ 21: యూఎస్ గ్రాండ్ ప్రీ
అక్టోబర్ 28: మెక్సికో గ్రాండ్ ప్రీ
నవంబర్ 11: బ్రెజిల్ గ్రాండ్ ప్రీ
నవంబర్ 25: అబుదాబి గ్రాండ్ ప్రీ

మెగా ఈవెంట్స్

ఏప్రిల్ 4-15: కామన్వెల్త్ క్రీడలు (గోల్డ్‌కోస్ట్, ఆస్ట్రేలియా)
జూన్ 14-జూలై 15: ఫిఫా వరల్డ్ కప్ (రష్యా)
ఆగస్టు 18-సెప్టెంబర్ 2: ఆసియా క్రీడలు (జకర్తా, ఇండోనేసియా)
అక్టోబర్ 6-18: యూత్ ఒలింపిక్స్ (బ్యూనస్ ఎయిర్స్, అర్జెంటీనా)



ఫుట్‌బాల్

ఫిబ్రవరి 1-11: ఏఎఫ్‌సీ ఫుట్‌సాల్ చాంపియన్‌షిప్ (చైనీస్ తైపీ)
జూన్ 14-జూలై 15: ఫిఫా వరల్డ్ కప్ (రష్యా)
ఆగస్టు 5-24: ఫిఫా అండర్-20 మహిళల వరల్డ్ కప్ (ఫ్రాన్స్)
నవంబర్ 13-డిసెంబర్ 1: ఫిఫా అండర్-17 మహిళల వరల్డ్ కప్ (ఉరుగ్వే)
డిసెంబర్ 12-22: ఫిఫా క్లబ్ వరల్డ్ కప్ (యూఏఈ)

బాక్సింగ్

ఏప్రిల్-జూన్: ఆసియా యూత్ కాన్ఫెడరేషన్ బాక్సింగ్ (థాయ్‌లాండ్)
సెప్టెంబర్ 2-7: వరల్డ్ యూనివర్సిటీ బాక్సింగ్ (రష్యా)
ఆగస్టు: వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్
నవంబర్: మహిళల వరల్డ్ చాంపియన్‌షిప్ (న్యూఢిల్లీ)

టేబుల్ టెన్నిస్

ఫిబ్రవరి 2-4: వరల్డ్ జూ. సర్క్యూట్ ఫైనల్స్ (లక్సెంబర్గ్)
ఫిబ్రవరి 22-25: టీటీ టీమ్ వరల్డ్ కప్ (లండన్)
ఏప్రిల్ 6-8: ఆసియా కప్ (జపాన్)
ఏప్రిల్ 29-మే 6: వరల్డ్ టీమ్ చాంపియన్‌షిప్ (స్వీడన్)
సెప్టెంబర్ 28-30: మహిళల వరల్డ్ కప్ (చైనా)
అక్టోబర్ 19-21: పురుషుల వరల్డ్ కప్ (పారిస్)
అక్టోబర్ 23-31: వరల్డ్ క్యాడెట్ చాలెంజ్ (జపాన్)
డిసెంబరు 2-9: వరల్డ్ జూ.చాంపియన్‌షిప్ (ఆస్ట్రేలియా)

షూటింగ్

మార్చి 1-12: వరల్డ్‌కప్ రైఫిల్, పిస్టల్, షాట్‌గన్ టోర్నీ (మెక్సికో)
మార్చి 14-18: వరల్డ్ యూనివర్సిటీ షూటింగ్ (కౌలాలంపూర్)
మార్చి 19-29: జూ. వరల్డ్‌కప్ రైఫిల్, పిస్టల్, షాట్‌గన్ టోర్నీ (సిడ్నీ)
ఏప్రిల్ 20-30: వరల్డ్‌కప్ రైఫిల్, పిస్టల్, షాట్‌గన్ టోర్నీ (ద. కొరియా)
మే 22-29: వరల్డ్ కప్ రైఫిల్, పిస్టల్ టోర్నీ(జర్మనీ)
జూన్ 5-16: వరల్డ్‌కప్ షాట్‌గన్ టోర్నీ (మాల్టా)
జూన్ 23-29: జూ. వరల్డ్ కప్ రైఫిల్, పిస్టల్, షాట్‌గన్, (జర్మనీ)
జూలై 9-19: వరల్డ్‌కప్ షాట్‌గన్ టోర్నీ (అమెరికా)
ఆగస్టు 31-సెప్టెంబర్ 15: వరల్డ్ షూటింగ్ చాంపియన్‌షిప్ (దక్షిణ కొరియా)
డిసెంబర్ 7-2: ఎయిర్ గన్ గ్రాండ్ ప్రీ (బెల్గ్రేడ్)

రెండో ర్యాంకులోనే కోహ్లీ

దుబాయ్: అంతర్జాతీయ టెస్టు బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో ఈ ఏడాదిని భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ రెండో స్థానంతో ముగించాడు. ఆదివారం ఐసీసీ తాజా టెస్టు ర్యాంకింగ్స్‌ను ప్రకటించింది. బ్యాట్స్‌మెన్ జాబితాలో ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ అగ్రస్థానం కూడా మారలేదు. అయితే యాషెస్‌లో డబుల్ సెంచరీతో ఫామ్ చాటుకున్న ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్ (ఇంగ్లండ్) మాత్రం తొమ్మిది స్థానాలు ఎగబాకి ఎనిమిదో ర్యాంకు సాధించడం విశేషం. పుజారా మూడు, ఇంగ్లండ్ కెప్టెన్ జో రూట్, న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ ఆ తర్వాత స్థానాల్లో ఉన్నారు. ఇక బౌలింగ్ విభాగంలో పేసర్ జేమ్స్ అండర్సన్ అగ్రస్థానం పదిలంగానే ఉండగా.. భారత స్పిన్నర్లు జడేజా మూడు, అశ్విన్ నాలుగో ర్యాంకులు దక్కించుకున్నారు.

శివ్‌కు 'రాయల్ కప్'



పట్టాయా: భారత గోల్ఫర్ శివ్ కపూర్ 2017ను అద్భుతంగా ముగించాడు. ఇప్పటికే రెండు ఆసియా టూర్ టైటిళ్లు కొల్లగొట్టిన శివ్.. గతేడాది చివరిరోజు మూడో టైటిల్‌ను ఖాతాలో వేసుకున్నాడు. ఆదివారం జరిగిన రాయల్ గోల్ఫ్ కప్ టోర్నమెంట్‌లో శివ్ చాంపియన్‌గా నిలిచాడు. గత 11 ఏళ్లలో ఒకే ఒక్క టైటిల్ గెలిచిన 35 ఏళ్ల శివ్.. 2017 ఏప్రిల్ తర్వాత ఏకంగా మూడు టైటిళ్లు ఖాతాలో వేసుకోవడం విశేషం.

పట్టు బిగించిన విదర్భ

● అక్షయ్ వాడ్కర్ అజేయ శతకం ● తొలి ఇన్నింగ్స్ 528/7 ● ఢిల్లీపై భారీ ఆధిక్యం

ఉ. 9 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్ 1లో

ఇండోర్: తొలిసారిగా రంజీ ట్రోఫీని అందుకునేందుకు తహతహలాడుతున్న విదర్భ జట్టు ఆల్‌రౌండ్ షోతో అదరగొడుతోంది. బౌలింగ్‌లో గుర్బానీ చెలరేగి ఢిల్లీని కట్టడి చేయగా, ఇప్పుడిక బ్యాటింగ్‌లోనూ తమ సత్తా చూపిస్తోంది. ఆదివారం మూడో రోజు ఆటలో వికెట్ కీపర్ అక్షయ్ వాడ్కర్ (243 బంతుల్లో 16 ఫోర్లు, 1 సిక్స్‌తో 133 బ్యాటింగ్) అజేయ శతకంతో జట్టును పటిష్ట స్థితిలో నిలిపాడు. దీంతో విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లకు 528 పరుగులు చేసింది. ఢిల్లీపై ఇప్పటికే 233 పరుగుల స్పష్టమైన ఆధిక్యంతో కొనసాగుతోంది. వసీం జాఫర్ (150 బంతుల్లో 11 ఫోర్లతో 78), ఆదిత్య సర్వాతే (154 బంతుల్లో 11 ఫోర్లతో 79) అర్ధ సెంచరీలతో చెలరేగారు. ఇక ఈ సీజన్‌లో అరంగేట్రం చేసిన అక్షయ్ తన ఐదో మ్యాచ్‌లో తొలి ఫస్ట్ క్లాస్ సెంచరీ సాధించాడు. క్రీజులో ప్రస్తుతం అక్షయ్‌తో కలిసి సిద్దేశ్ నేరల్ (92 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 56 బ్యాటింగ్) ఉన్నాడు. వీరిద్దరి మధ్య ఎనిమిదో వికెట్‌కు అజేయంగా 113 పరుగుల భాగస్వామ్యం నెలకొంది. ఢిల్లీ తొలి ఇన్నింగ్స్‌లో 295 పరుగులకే ఆలౌట్ అయ్యింది. అంతకుముందు 206/4 ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు ఆరంభించిన విదర్భ.. జాఫర్ వికెట్ త్వరగానే కోల్పోయింది. అయితే ఢిల్లీ పేలవ ఫీల్డింగ్‌కు తోడు పలు క్యాచ్‌లు కూడా వదిలేసి మూల్యం చెల్లించుకుంది. అటు అక్షయ్, ఆదిత్య జోడి నిలకడైన బ్యాటింగ్‌తో ఢిల్లీ బౌలర్లకు చుక్కలు చూపించింది. వీరిద్దరి మధ్య ఏడో వికెట్‌కు 169 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొంది. నవదీప్ సైనీకి మూడు, ఆకాశ్ సుడాన్‌కు రెండు వికెట్లు దక్కాయి.



అక్షయ్ వాడ్కర్ (133 బ్యాటింగ్)



హైదరాబాద్‌లో ఆదివారం జాతీయ సీనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ ప్రారంభం సందర్భంగా తెలంగాణ క్రీడాకారుల సంబరం

ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ కోచ్‌గా సిమ్మన్స్

కాబూల్: వెస్టిండీస్ మాజీ క్రికెటర్ ఫిల్ సిమ్మన్స్ ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ జట్టు ప్రధాన కోచ్‌గా నియమితుడయ్యాడు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే ఆఫ్ఘన్ జాతీయ జట్టు కన్సల్టింగ్ కోచ్‌గా పనిచేస్తున్న సిమ్మన్స్.. ఇకనుంచి ప్రధాన కోచ్‌గా వ్యవహరిస్తాడని ఆ దేశ క్రికెట్ బోర్డు ఆదివారం ప్రకటించింది. ఐసీసీ నుంచి ఇటీవలే టెస్టు హోదా దేశంగా గుర్తింపు పొందిన ఆఫ్ఘన్ జట్టు.. 2019లో భారత్‌తో తన తొలి టెస్టు ఆడనుంది. ఈ నేపథ్యంలో సిమ్మన్స్.. ఆఫ్ఘన్ జట్టును మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుతాడన్న విశ్వాసాన్ని బోర్డు వ్యక్తం చేసింది. ఇప్పుడిప్పుడే అంతర్జాతీయంగా తన ఉనికిని చాటుకుంటున్న ఆఫ్ఘన్ జట్టు ప్రస్తుత లక్ష్యం.. 2019 ప్రపంచకప్‌నకు అర్హత సాధించడమేనని సిమ్మన్స్ చెప్పాడు.

భారత్ ప్రాక్టీస్‌కు వర్షం అడ్డంకి



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో తొలి టెస్టుకు సిద్ధమవుతున్న భారత జట్టు ప్రాక్టీస్‌కు వర్షం అడ్డంకిగా మారింది. దీంతో న్యూలాండ్స్ క్రికెట్ మైదానంలో నెట్ ప్రాక్టీస్ చేయాల్సిన జట్టు ఇండోర్‌కే పరిమితమైంది. 'వర్షంతో మేమంతా ఇండోర్‌లోనే ట్రైనింగ్ సెషన్ పూర్తిచేశాం' అని భారత జట్టు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసింది. వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా ఫుట్‌బాల్ ఆడుతూ కనిపించాడు. నెట్స్‌లో ఓపెనర్ మురళీ విజయ్ పాల్గొన్నాడు. ఆటగాళ్లంతా నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తుంటే పుజారా మాత్రం వర్షంలో తడుస్తూ ఫొటో దిగాడు.

హంటర్స్‌కు మరో షాక్

న్యూఢిల్లీ: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో టైటిల్ ఫేవరెట్ హైదరాబాద్ హంటర్స్‌కు మరో షాక్. గత మ్యాచ్‌లో అహ్మదాబాద్ చేతిలో కంగుతిన్న హంటర్స్.. వరుసగా రెండో పరాజయాన్ని చవిచూసింది. ఆదివారం జరిగిన పోరులో ఢిల్లీ డాషర్స్ 3-0తో హంటర్స్‌పై విజయం సాధించింది. తొలుత పురుషుల డబుల్స్‌లో నెగ్గిన ఢిల్లీ జట్టుకు తొలి పురుషుల సింగిల్స్‌లో విన్సెంట్ 13-15, 15-11, 15-4తో లీ హ్యూన్‌ను ఓడించాడు. ఇది హంటర్స్‌కు ట్రంప్ మ్యాచ్ కావడంతో ఢిల్లీ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. హంటర్స్ ఓ పాయింట్ కోల్పోయి -1కు పడిపోయింది. ఆ తర్వాత మహిళల సింగిల్స్‌లో హంటర్స్ సారథి, ఒలింపిక్ విజేత కరోలినా మారిన్ 15-10, 15-12తో సంగ్ జీ హ్యూన్‌పై గెలిచినా ఫలితం లేకపోయింది. అప్పటికే ఢిల్లీ జట్టు 3-0 ఆధిక్యంతో విజయం ఖరారు చేసుకుంది.

సచిన్, యువీ '2018' పార్టీ



న్యూఢిల్లీ: 2017 వెళ్లిపోయింది.. 2018 వచ్చేసింది. అందరూ సంబరాల్లో మునిగి తేలుతున్నారు. అయితే, సచిన్ టెండూల్కర్ మాత్రం న్యూ ఇయర్ వేడుకలను ఓరోజు ముందుగానే జరుపుకున్నాడు. యువరాజ్ సింగ్, మాజీ క్రికెటర్ అజిత్ అగార్కర్‌లతో కలిసి సచిన్ పార్టీ చేసుకున్నాడు. ఈ పార్టీ వేడుకల ఫొటోలను యువరాజ్ సింగ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. 'లవ్లీ నైట్..గ్రేట్ ఫన్.. థ్యాంక్స్ సచిన్' అని యువీ ఆ ఫొటోల కింద కామెంట్ చేశాడు.

భళా.. సూక్ష్మ కళ!



పెన్సిల్ ముల్లుపై '2018' (ఇన్‌సెట్‌లో) శిల్పి గట్టెం వెంకటేష్

నక్కపల్లి మండలం చిన దొడ్డిగల్లుకు చెందిన కళాకారుడు గట్టెం వెంకటేష్ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పెన్సిల్ ముల్లుపై 12 మి.మీ. పొడవు., 3 మి.మీ. వెడల్పుతో '2018' అంకెలను విడిపడకుండా చెక్కి అబ్బురపరిచాడు. వెంకటేష్ ప్రస్తుతం గీతం యూనివర్సిటీ ఆర్కెటిక్ చదువుతున్నాడు.

-నక్కపల్లి(విశాఖ జిల్లా)

'హగ్' ఇచ్చిన పూరి



హైదరాబాద్, డిసెంబరు 31: బ్లాక్ బస్టర్ హిట్ చిత్రాల దర్శకుడు పూరి జగన్నాథ్ తీసిన తొలి షార్ట్ ఫిలిం 'హగ్' సంచలనం సృష్టించింది. ఒక చెట్టును కౌగిలించుకున్న నగ్నయువతి పోస్టర్‌ను విడుదలచేసి కొద్దిరోజులుగా అభిమానులను ఊరిస్తున్న పూరి.. ఆదివారంనాడు ఆ షార్ట్‌ఫిలింను యూట్యూబ్‌లో విడుదల చేశారు. 'మీరు గాలి పీలుస్తున్నారా? అయితే చెట్టుకు కృతజ్ఞతలు తెలపండి' అంటూ నేపథ్య స్వరంతో మొదలయ్యే ఈ షార్ట్‌ఫిలింలో కొందరు చెట్లను కౌగిలించుకుంటూ ఉంటారు. చెట్ల వల్ల మనిషికి ఎంత ఉపయోగమో వాయిస్ ఓవర్ ద్వారానే చెబుతారు. 'చెట్లు వైఫై ప్రసారం చేస్తే మీరు మరిన్ని చెట్లు నాటుతారు. కానీ, అవి మనం పీల్చే ఆక్సిజన్‌ను మాత్రమే వెలువరిస్తాయి" అంటూ మూడున్నర నిమిషాలపాటు మనసుకు హత్తుకుంటుంది షార్ట్‌ఫిలిం.. పూరి విడుదల చేసిన పోస్టర్‌లోని నగ్నయువతి స్టిల్‌తో ముగుస్తుంది.



వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల కేంద్రంలో మీ సేవాకేంద్రాన్ని నిర్వహిస్తున్న ముస్లిం వ్యక్తి సులేమాన్ ఆదివారం స్థానిక హనుమాన్ మందిర్‌లో అయ్యప్ప స్వాములకు భిక్ష పెట్టి మతసామరస్యానికి ప్రతీకగా నిలిచాడు. -బషీరాబాద్

బెయిల్‌పై కెల్విన్ విడుదల



హైదరాబాద్, ఏఎస్‌రావునగర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన డ్రగ్ కేసులో ప్రధాన నిందితుడు కెల్విన్ మాస్కరెన్హాస్ 5నెలల తర్వాత బెయిల్‌పై విడుదలయ్యాడు. అనారోగ్యం, కుటుంబ సమస్యను కారణంగా చూపిన కెల్విన్ శనివారం బెయిల్‌కు దరఖాస్తు చేసుకోగా, నాంపల్లి కోర్టు అతనికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ పత్రాలు చర్లపల్లి జైలు అధికారులకు అందడంలో ఆలస్యమవ్వడంతో, ఆదివారం తెల్లవారుజామున విడుదలయాడు. గోవా నుంచి, ఇంటర్నెట్‌లో డార్క్‌వెబ్ ద్వారా అతను నగరానికి డ్రగ్స్ తెప్పించేవాడని కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ చెబుతోంది. అయితే తనకు ఈ కేసుతో ఎలాంటి సంబంధం లేదని, తనను కొందరు ఉద్దేశపూర్వకంగా ఇరికించారనేది కెల్విన్ వివరణ. జైలు నుంచి విడుదలయ్యాక మీడియాతో మాట్లాడిన కెల్విన్, వాస్తవాలు త్వరలో బయటకు వస్తాయని, తాను ఇకపై సాధారణ జీవితం గడుపుతానని చెప్పాడు.

293 మంది పోలీసులకు సేవాపతకాలు!

- నలుగురికి ముఖ్యమంత్రి సర్వోన్నత సేవాపతకాలు

హైదరాబాద్, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): అంకిత భావం, ధైర్య సాహసాలతో విధులు నిర్వహించిన 293 మంది పోలీసులకు నూతన సంవత్సరం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం సేవా పతకాలను ప్రకటించింది. తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ మొదటి బెటాలియన్ కమాండెంట్ వై. శ్రీనివాస్ రావు, ఇంటలిజెన్స్ అండ్ సెక్యూరిటీ వింగ్ డీఎస్పీ కిరణ్ రాయ్, హైదరాబాద్ కమిషనరేట్ అఫ్జల్‌గంజ్ అదనపు ఇన్‌స్పెక్టర్ ఎం. ప్రవీణ్ కుమార్, సైబరాబాద్ కమిషనరేట్ శంషాబాద్ సీసీఎస్ ఎస్సై కె. బాలరాజులకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సర్వోన్నత పోలీస్ పతకాలు దక్కాయి. ఈ మేరకు హోంశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి సర్వోన్నత సేవా పతకం పొందిన వారికి ప్రభుత్వం రూ. 5 లక్షల రివార్డు అందజేస్తుంది. ఇక శౌర్య పతకం 17 మందికి, మహోన్నత సేవా పతకం ముగ్గురికి, ఉత్తమ సేవాపతకం 44 మందికి, కఠిన సేవాపతకం 21 మందికి, సేవాపతకం 208 మందికి ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం వీరికి త్వరలోనే పతకాలను ఇవ్వనుంది.

కాంగ్రెస్‌కు 'పెద్ద' కష్టం!

రాజ్యసభ సీటుకు సరిపోని బలం.. తెలుగు రాష్ట్రాల్లో విచిత్ర పరిస్థితి

- తెలంగాణలో మూడూ టీఆర్ఎస్‌కే
- రాజ్యసభతో బంధం ఇక కొన్ని రోజులే
- తెలుగు రాష్ట్రాల కాంగ్రెస్ ఎంపీల దిగులు



న్యూఢిల్లీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పాపం రాజ్యసభ సభ్యులు! ఈసారి కాంగ్రెస్ నుంచి ముగ్గురి పదవీ కాలం ముగుస్తోంది. నాలుగు ఖాళీలు ఏర్పడుతున్నాయి. అయినా, రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ పార్టీ ఒక్కటంటే ఒక్క సీటును తిరిగి గెలుచుకునే పరిస్థితి లేదు. గతంలోలా, రాజ్యసభ సీటును మళ్లీ మళ్లీ పొందే అవకాశం ఎవరికీ లేదు కూడా! కొత్త వాళ్లు రాజ్యసభ సీటు కోసం ఆశ పెట్టుకునే పరిస్థితి లేదు! ఇప్పుడు మాత్రమే కాదు.. సమీప భవిష్యత్తులోనూ రాజ్యసభలో అడుగు పెడతామన్న ఆశ కనుచూపు మేరలో కనిపించడం లేదని ఆ పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. దాంతో, పదవీ కాలం ముగియనున్న రాజ్యసభ సభ్యుల్లో దిగులు ఆవరించింది. తెలుగు రాష్ట్రాల్లోని ఆరుగురు ఎంపీల పదవీ కాలం వచ్చే ఏడాది ఏప్రిల్ 2న ముగుస్తుంది. ఫిబ్రవరిలో ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాలకు మార్చిలో మధ్యంతర విరామం ప్రకటించనున్న నేపథ్యంలో మరో 30-40 రోజులు మాత్రమే వారు సమావేశాల్లో పాల్గొనగలరు. ఇక, కొత్త రాజ్యసభ సభ్యుల ఎంపికకు ఫిబ్రవరిలోనే నోటిఫికేషన్ జారీ అవుతుంది. ఉమ్మడి ఏపీలో 2012లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి నలుగురు ఎంపికయ్యారు. వారిలో పాల్వాయి గోవర్ధన్ రెడ్డి గత జూన్‌లో దివంగతులయ్యారు. మిగతా ముగ్గురిలో చిరంజీవి, రేణుకా చౌదరి, ఆనంద భాస్కర్ పదవీ కాలం ఏప్రిల్ 2న ముగియనుంది. టీడీపీ రాజ్యసభ సభ్యులు సీఎం రమేశ్, దేవేందర్ గౌడ్ కూడా వైదొలగనున్నారు. వీరిలో ముగ్గురు తెలంగాణ నుంచి, ముగ్గురు ఏపీ నుంచి ఎంపిక కావాల్సి ఉంది. తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్‌కు ఉన్న సభ్యులు 19 మంది మాత్రమే! దాంతో, ఆ పార్టీకి ఒక్క సీటు కూడా వచ్చే అవకాశం లేదు. ఇక, ఏపీలో కనీసం ఆలోచించే పరిస్థితే లేదు. తెలంగాణలో మూడూ టీఆర్ఎస్‌కు, ఏపీలో మూడూ టీడీపీకి వశమయ్యే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో తాము మరి కొద్ది రోజులే పార్లమెంట్ సభ్యులుగా ఉంటామన్న భావనతో పదవీ విరమణ చేయబోయే కాంగ్రెస్ సభ్యుల్లో నిరాసక్తత నెలకొంది. పార్టీ నుంచి మళ్లీ ఎప్పుడు తిరిగి వస్తామో చెప్పలేని పరిస్థితుల్లో ఉన్నారు.

17కు చేరనున్న టీఆర్ఎస్ ఎంపీల సంఖ్య

శాసనసభలో ప్రస్తుతం పార్టీల బలాబలాలను పరిగణనలోకి తీసుకుంటే.. ఏప్రిల్ 2న ఖాళీ అయ్యే మూడు రాజ్యసభ స్థానాలను టీఆర్ఎస్ సునాయాసంగా గెలుచుకునే వీలుంది. ఇక, వీటిలో ఒకటి యాదవులకు కేటాయిస్తామని కేసీఆర్ ప్రకటించారు. మిగిలిన రెండు స్థానాలు పార్టీలో ఎవరిని వరిస్తాయోననే ఉత్కంఠ నెలకొంది. అయితే, అభ్యర్థుల ఎంపికపై టీఆర్ఎస్ అధిష్ఠానం ఇప్పుడే దృష్టిసారించే సూచనలు కనిపించటంలేదు. ఈ మూడూ గెలిస్తే టీఆర్ఎస్ పార్లమెంటు సభ్యుల సంఖ్య 17కు పెరగనుంది.

పెరగనున్న బీజేపీ బలం

ఈసారి జరగనున్న రాజ్యసభ ఎన్నికల తర్వాత పెద్దల సభలో బీజేపీ బలం కూడా పెరగనుంది. రాజ్యసభలో ఇప్పుడు బీజేపీ, కాంగ్రెస్‌లకు చెరి సమానంగా 57 సీట్లు ఉన్నాయి. 2018లో జరిగే రాజ్యసభ ఎన్నికలతో బీజేపీ సంఖ్యాబలం గణనీయంగా పెరిగి మెజారిటీ పార్టీగా అవతరించనుంది. కాంగ్రెసేతర పార్టీలైన టీడీపీ, టీఆర్ఎస్ సంఖ్యా బలం పెరగడం కూడా బీజేపీకి అనుకూల పరిణామమేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.



జనసేన సభ్యత్వ నమోదును ప్రారంభించిన పవన్

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ సభ్యత్వ నమోదును ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రారంభించారు. ఆదివారం హైదరాబాద్‌లోని జనసేన కార్యాలయంలో పార్టీ తొలి సభ్యత్వాన్ని పవన్ తీసుకున్నారు. పార్టీలోని ముఖ్యులకు సభ్యత్వ నమోదు పత్రాలను అందజేశారు. త్వరలోనే రెండు తెలుగు రాష్ట్రాల్లో సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించనున్నట్లు చెప్పారు. సభ్యత్వ నమోదు కోసం ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ పనితీరుపై సంతృప్తి వ్యక్తంచేశారు. కాగా, ముందు నుంచి తనను అనుసరిస్తోన్న నేతలతో.. పార్టీ చేపట్టాల్సిన పలు అంశాలపై మూడు రోజులుగా పవన్‌కల్యాణ్ చర్చలు జరిపారు.

గల్ఫ్‌లో తొలిసారి వ్యాట్!

- సౌదీ అరేబియా, యూఏఈలో నేటి నుంచే అమలు
- లక్షలాది మంది తెలుగువారిపై ఆర్థిక భారం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

గల్ఫ్ దేశాల్లో తొలిసారి విలువ ఆధారిత పన్ను(వ్యాట్) అమల్లోకి రానుంది. కొత్త సంవత్సరం తొలి రోజైన సోమవారం నుంచి ఇది అమలు కానుంది. ఇప్పటి వరకు ఎలాంటి పన్ను పోటు లేకుండా హాయిగా ఉన్న గల్ఫ్ వాసులు ఇకపై 5 శాతం వ్యాట్ చెల్లించాల్సిందే. ఈ పన్నుతో గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న లక్షలాది మంది విదేశీ ఉద్యోగులు, కార్మికుల జేబులకు చిల్లు పడనుంది. ఇటీవలికాలంలో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు భారీగా పతనమవడంతో గల్ఫ్ దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో కేవలం చమురుపైనే ఆధారపడకుండా ఇతర మార్గాల ద్వారా కూడా ఆదాయాన్ని రాబట్టుకోవాలనే ప్రయత్నంలో గల్ఫ్‌లోని రెండు పెద్ద దేశాలైన సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లు వ్యాట్‌ను ప్రవేశపెట్టాయి. ఈ రెండు దేశాల్లో 5 శాతం వ్యాట్‌ను వసూలు చేయడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. వ్యాట్‌కు తోడుగా యూఏఈలో భారతీయులను తగ్గించడానికి ఉద్దేశించిన 'విభిన్న సంస్కృతి, నైపుణ్య కార్మికుల ఎంపిక' అనే రెండు కీలక విధానాలు దుబాయిలో ప్రవాస భారతీయులపై ప్రతికూల ప్రభావం చూపనున్నాయి. దుబాయితో పాటు ఇతర ఎమిరేట్లలో 28 లక్షల మంది భారతీయులు ఉన్నారు. ఇది స్థానికులు, ఇతర జాతీయుల కంటే ఎక్కువ. సౌదీ అరేబియా కూడా ప్రతి సంస్థ ఒక్కో విదేశీ ఉద్యోగిపై నెలకు 300 రియాళ్ల పన్ను చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే నెలకు 200 రియాళ్ల చొప్పున పన్ను చెల్లిస్తుండగా ఈ 300 రియాళ్లు అదనం. మొత్తం మీద సకాలంలో జీతాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న భారతీయులు, ఇతర విదేశీ ఉద్యోగ, కార్మికులకు నూతన పన్ను ఆర్థికంగా పెను భారం కానుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

S & D



చిరునవ్వు వెనుక.. చెమట చుక్క

- రాశీ ఖన్నా

“విజయానికి దగ్గరి దారులు ఉండవు. స్వేదం చిందించకుండా, సుఖంగా సుఖపడాలంటే కుదరదు. అసలు అలాంటి సౌఖ్యాన్ని నేను కోరుకోను” అని అంటున్నారు రాశీ ఖన్నా. ‘ఊహలు గుసగుసలాడే’ చిత్రంలో ముద్దుగా, మరింత బొద్దుగా కనిపించిన రాశీ ఖన్నా ఆ తర్వాత చాలా మారారు. బరువు బాగా తగ్గి నాజూగ్గా తయారయ్యారు. అంత మాత్రాన ఆమె వ్యాయామానికి సెలవు చీటీ రాసిచ్చేయలేదు. ఇప్పటికీ జిమ్‌లో ట్రైనర్ ఆధ్వర్యంలో కొన్ని గంటల పాటు కష్టపడుతూనే ఉన్నారు. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఆ విషయాన్నే పంచుకున్నారు. ‘నో పెయిన్, నో గెయిన్..’ అని ఒక ఫొటోకు క్యాప్షన్ పెట్టి, తను కష్టపడుతుంటే.. ట్రైనర్ నవ్వుతున్నారనే విషయాన్ని ‘శాడిస్టిక్ నవ్వు’ అని వర్ణించారు. వెయిట్ లాస్ గురించి రాశీ ఖన్నా మాట్లాడుతూ “బరువు ఎలా తగ్గారు? ఆ టిప్స్ చెప్పండి.. అని నన్ను చాలా మంది అడుగుతుంటారు. వాళ్ల అమాయకత్వానికి నాకు నవ్వొస్తుంటుంది. బరువు తగ్గడానికి కావాల్సింది టిప్స్ కాదు. తగ్గాలన్న ఆకాంక్ష, కష్టపడే గుణం. అవి రెండూ ఉంటే ఇంకే టిప్స్ అవసరం లేదు. అయినా ఒక్కొక్కరి శరీరతత్వం ఒక్కోలా ఉంటుంది. ఒకరి విషయంలో సత్ఫలితాలను ఇచ్చిన చిట్కాలు, మరొకరి విషయంలో పనిచేయకపోవచ్చు. అందుకే బద్ధకానికి గుడ్‌బై చెప్పి చలాకీగా వ్యాయామాలు చేసేయాలి” అని తెలిపారు.

వారసత్వానికి తేడా లేదు

- మంచు విష్ణు



అరియానా, విష్ణు, వివియానా

“వారసత్వానికి అమ్మాయి, అబ్బాయి అనే తేడా లేదు” అని అంటున్నారు మంచు విష్ణు. తన భార్య విరోనికా త్వరలో పండంటి శిశువుకు జన్మనివ్వబోతున్నారని, శిశువు రాక కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నానని ఇటీవల మంచు విష్ణు ట్వీట్ చేశారు. అందుకు ఆయన అభిమానులు పలువురు స్పందించారు. వారసుడు పుట్టాలని, అతను జూనియర్ మోహన్‌బాబు కావాలని చాలా మంది ఆకాంక్షించారు. ఆ ట్వీట్లను చదివిన విష్ణు తన మనసులోని మాటలను బయటపెట్టారు. “నాకు కొడుకు పుట్టాలని చాలా మంది అంటున్నారు. కొడుకు పుడితే వారసుడు ఉంటారని అందరూ చెబుతున్నారు. కానీ నాకు ఇప్పటికే అరియానా, వివియానా రూపంలో ఇద్దరు వారసురాళ్లున్నారు. ఇంకో అమ్మాయి పుడితే ఇంకో వారసురాలు అవుతుంది. అబ్బాయి పుడితే వారసుడు అవుతాడు. నా దృష్టిలో వారసత్వానికి అమ్మాయి, అబ్బాయి అనే తేడాలేదు” అని తెలిపారు.

ఎమోషన్స్‌కి హార్మోన్స్ బ్రిడ్జ్

“హ్యూమన్ రిలేషన్స్‌కి మా చిత్రకథ బ్రిడ్జ్‌గా ఉంటుంది. ఈ చిత్రంలో మరో బ్రిడ్జ్ కూడా ఉంటుంది. అదేంటి? సినిమాకు ‘హార్మోన్స్ బ్రిడ్జి’ అనే పేరు ఎందుకు పెట్టాం? అనేది ఆసక్తికరం” అని అంటున్నారు రాహుల్ రవీంద్రన్. ఆయన హీరోగా నటించిన చిత్రం ‘హార్మోన్స్ బ్రిడ్జ్’. చాందినీ చౌదరి, మనాలీ రాథోడ్ నాయికలు. రేవన్ యాదు దర్శకత్వం వహిస్తున్నారు. ఈఎమ్‌విఈ స్టూడియోస్ పతాకంపై రూపొందుతోంది. వడ్డేపల్లి సత్యనారాయణ ఆశీస్సులు అందిస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ “‘బూచమ్మ బూచోడు’ తర్వాత నేను చేస్తున్న సినిమా ఇది. రాహుల్ చాలా మంచి పెర్ఫార్మర్. వైవిధ్యమైన స్క్రీన్‌ప్లేతో సాగుతుంది. ప్రతి పాత్రకూ ప్రాముఖ్యత ఉన్న సినిమా ఇది. శేఖర్‌చంద్ర మంచి సంగీతాన్నిచ్చారు. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ నెల్లోనే పాటలను, చిత్రాన్ని విడుదల చేస్తాం” అని చెప్పారు. రావు రమేశ్, అజయ్, అలీ, పోసాని కృష్ణమురళి, ప్రభాస్ శీను, విద్యుల్లేఖ, జబర్దస్త్ రాకింగ్ రాకేష్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: శేఖర్ చంద్ర, కెమెరా: విజయ్ మిశ్రా, ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వరరావు.


చాందిని చౌదరి, రాహుల్ రవీంద్రన్


పవన్ కల్యాణ్

పులికి పంజాలో బలం ఉంటుంది. అతడి (పవన్ కల్యాణ్) బలం అనుబంధం, ఆప్యాయతల్లో ఉంది. వేటాడేటప్పుడు పులి పంజాను పక్కన పెడితే? కష్టమే కదూ! అలాగే... అనుబంధం, ఆప్యాయతలను పక్కన

అజ్ఞాతాన్ని వదిలే... ఆయుధమై ఎగసే!

పెట్టి అజ్ఞాతంలో ఉంటూ దుష్టులపై యుద్ధం చేయడమూ కష్టమే! దాంతో అజ్ఞాతాన్ని వదిలిన ఓ యువకుడు ఆయుధంలా మారితే ఎలా ఉంటుంది? ‘అజ్ఞాతవాసి’ చిత్రకథలా ఉంటుందని టాక్. పవన్ కల్యాణ్ హీరోగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో హారికా అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమా జనవరి 10న ప్రేక్షకుల ముందుకొస్తోంది. కీర్తి సురేశ్, అనూ ఇమ్మాన్యుయేల్ కథానాయికలుగా నటించిన ఈ సినిమాలో ఖుష్బూ కీలక పాత్ర చేశారు. వరసకు తల్లీకొడుకులయ్యే ఇద్దరి మధ్య అనుబంధాలు కథాంశంగా ‘అజ్ఞాతవాసి’ తెరకెక్కిందని సమాచారం. ఇటీవల విడుదలైన పాటలకు శ్రోతల నుంచి అద్భుత స్పందన లభిస్తోందని చిత్ర బృందం తెలిపింది. ఇందులో పవన్ కల్యాణ్ పాడిన ‘కొడకా...కోటేశ్వరరావు’ పాటను ఆదివారం సాయంత్రం విడుదల చేశారు. సినిమాలోని పవన్ కల్యాణ్ తాజా స్టిల్స్ చూసిన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ “నేను గత జన్మలో కూడా ఇటువంటి యాటిట్యూడ్ ఉన్న వ్యక్తిని చూడలేదు. పవన్ ముందు రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ కూడా ఎందుకూ పనికి రారు” అని ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు.

చిత్రమైన ప్రేమికుడు


సుధీర్‌బాబు

అతనో చిత్రకారుడు! చిన్నారుల పుస్తకాల్లో బొమ్మలు గీస్తుంటాడు. అదేనండీ... చిల్డ్రన్ బుక్ ఇల్లస్ట్రేటర్ అన్నమాట! ఈ చిత్రకారుడు ఓ అమ్మాయిని ప్రేమించాడు. బొమ్మలు గీసే అతడికి అమ్మాయి ఎలా పరిచయమైంది? ఎప్పుడు ప్రేమలో పడ్డాడు? అనేవి తెలియాలంటే సుధీర్‌బాబు హీరోగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమా విడుదలయ్యే వరకూ ఎదురుచూడాల్సిందే. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా సెకండ్ షెడ్యూల్ సోమవారం నుంచి మొదలవుతుంది. “ఇదొక రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్. అన్యూహమైన కథతో ఆద్యంతం వినోదాత్మకంగా నడిచే కొత్త తరహా ప్రేమ కథా చిత్రమిది. కళా దర్శకుడు రవీందర్ వేసిన స్పెషల్ హౌస్ సెట్‌లో ఫస్ట్ షెడ్యూల్ చేశాం. రెండోదీ హైదరాబాద్‌లోనే ఉంటుంది. సంక్రాంతి తర్వాత టైటిల్ ప్రకటించి, మేలో సినిమాని విడుదల చేస్తాం” అన్నారు నిర్మాత. అదితీరావు హైదరీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్.

S & D


SVCC
SRI VENKATESWARA CINE CHITRA LLP
Happy New Year 2018
తొలిప్రేమ
Journey of love
BVSN PRASAD VENKY ATLURI
THAMAN S GEORGE C WILLIAMS NAVIN NOOLI KIRAN


స్వాతి మూవీస్
Happy New Year 2018
అమ్మమ్మగారిల్లు
Relations Never END
నిర్మాత రాజేష్
సహనిర్మాత కె.ఆర్
కథ కథనం మాటలు దర్శకత్వం సుందర్ సూర్య


SHRIKANT MOHTA & MAHENDRA SONI PRESENT
AMAZON
అడ్వెంచర్
A FILM BY KAMALESWAR MUKHERJEE
HAPPY NEW YEAR 2018
RELEASING ON JAN 5TH
ALSO RELEASING IN HINDI | ASSAMESE | ORIYA | TAMIL | BENGALI
AN SVF ENTERTAINMENT PRODUCTION
E4E THROUGH KFC ENTERTAINMENTS RELEASE



ఈ వారమే విడుదల
నూతన సంవత్సర శుభాకాంక్షలు
MAA TULJA BHAVANI
ఇగో


MAHALAKSHMI ARTS
నూతన సంవత్సర శుభాకాంక్షలు
ఆనందంగా ఆదరిస్తున్న ప్రేక్షక మహాశయులకు శుభాభివందనాలు
SUPER HIT
2 కంట్రీస్
www.nshankar.com


INSIDIOUS
THE LAST KEY
అరిచి
భయాన్ని
అధిగమించండి
ఇన్సీడియస్
భయానికీ... భయం... ఆఖరి ద్వారం...
IN CINEMAS
JANUARY 5
MOVIE DYNAMIX RELEASE CONTACT FOR ANDHRA & CEEDED : 9885862211 / 9849717862


LAKSHMI NARASIMHA ENTERTAINMENTS
SANKAR CHIGURUPATI PRESENTS
HAPPY NEW YEAR 2018
ALLU SIRISH IN
ఒక్క క్షణం
STORY, SCREENPLAY, DIRECTION VI ANAND
PRODUCER CHAKRI CHIGURUPATI
LOVE VS DESTINY
THRILLING HIT


HAPPY NEW YEAR
25TH DAY
మళ్ళీరావా..
PRODUCER RAHUL YADAV NAKKA
Written & Directed by GOWTAM TINNANURI
SUPER HIT
madhura audio


HNY 2018
జనవరి 18న
A FILM BY KRISHNA KARTHIK
HBD
HACKED BY DEVIL
PRODUCER UDAY BHASKAR Y EXECUTIVE PRODUCER VINAY GOUD Y
DOP KANNA KOTI MUSIC MAHI MADAN MM EDITOR KR SWAMY
CO-DIRECTOR RAMESH POLE DIALOGUES ABHAY SRIJAY, CHETAN
దేవుడు నిజం అయితే
దెయ్యం నిజమే
FOR BUSINESS: 79931 20020
/HBDTHEMOVIE
mango music


UNIVERSAL HIT
happy New Year
ANNAPURNA STUDIOS & MANAM ENTERPRISES PRESENT
హలో!
A VIKRAM K KUMAR FILM
P.S. VINOD, ANUP RUBENS, PRAWIN PUDI, RAJEEVAN, BOB BROWN
PRODUCED BY
AKKINENI NAGARJUNA
TO CHECK SHOW TIMINGS & BOOK MOVIE TICKETS SCAN THIS QR CODE IN YOUR Paytm APP USE CODE: "HELLO50" & GET UPTO Rs 100* CASHBACK


UV creations PRESENTS
HAPPY NEW YEAR 2018
studio green
K.E.GNANAVELRAJA PRODUCTIONS
SURIYA'S
గ్యాంగ్
WRITTEN AND DIRECTED BY VIGNESH SHIVN MUSIC BY ANIRUDH
DOP DINESH KRISHNAN B EDITOR SREEKAR PRASAD ART drk KIRAN STUNTS DILIP SUBBARAYAN
CHOREOGRAPHERS BRINDHA / DINESH / BABA BHASKAR LYRICS VIGNESH SHIVN / MANI AMUDHAVAN COSTUMES POORNIMA RAMASAMY
SENTHIL KUMAR KESAVAN / KS MAYIL VAGANAN / Pa. SURENDAR / D MOHAN DHAMODHARAN / V MURUGAN
SOUND DESIGN SUREN G / S ALAGIAKOOTHAN VFX WALA / LORVEN STUDIOS / KNACK STUDIOS
DTS MIX UDAY KUMAR SONG MIX VINAY KUMAR STILLS MURUGAN PUBLICITY DESIGNS 24AM - KABILAN



SMT. ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
HAPPY NEW YEAR 2018
A 'DIL' RAJU PRODUCTION
MCA
మిడిల్ క్లాస్ అబ్బాయ్
MASS
CLASS
ALL CENTRES
BLOCKBUSTER
RAJU - SHIRISH - LAXMAN SRIRAM VENU DEVI SRI PRASAD
HARSHITH REDDY SAMEER REDDY
PRAWIN PUDI THIRU SRIKANTH VENKAT RAMANJANEYULU
ADITYA MUSIC
U/A
TO PARTICIPATE IN MCA MOVIE CONTEST.
SCAN THIS QR CODE IN Paytm APP
& WIN UPTO RS 1 LAKH PAYTM CASH.


SATISH JAI FILMS
2018
HAPPY NEW YEAR
అంతకు మించి
Producer SATISH Co-Producers BHANU PRAKASH TELLA, KANNA .T Director JHONY
Music SUNEEL KASHYAP Cinematography BALREDDY Editor KRANTHI (RK) Art NAGU Stunts RAM SUNKARA VFX SRIDHAR PRO B. VEERABABU
TRAILER SOON
eshan design

S & D


SMT.MAMATHA PRESENTS
HAARIKA & HASSINE
CREATIONS
నూతన సంవత్సర శుభాకాంక్షలు
అజ్ఞాతవాసి
PRINCE IN EXILE
TRIVIKRAM
S RADHA KRISHNA
(CHINABABU)
ANIRUDH V MANIKANDAN A S PRAKASH
KOTAGIRI VENKATESWARA RAO PDV PRASAD RAVI VARMA
జనవరి 10 న విడుదల
/AgnyaathavaasiFilm
ADITYA MUSIC

విజయవంతమైన 2వ వారం



సుదర్శన్ 35 ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.15,5.45,9.15

Enjoy 4k Digital Projection & Dolby Atmos Sound System

SVC - కొత్తపేట 11.00,2.00,6.00,9.00
PRASADS 10.00,12.45,3.30,4.45,8.30,11.00
PVR 10.00,1.05,4.10,7.15,10.20
PVR - 10.00,1.10,4.30,7.45,11.00
PVR 10.05,1.25,4.20,7.55,10.50
PVR 10.05,11.05,1.10,4.50,7.55,10.30,11.00
INOX 10.00,1.45,4.15,7.20,10.40
INOX 10.00,1.40,4.15,7.20,10.40
Cinemax Ameerpet 11.30,1.30,7.45,10.45
Cinemax 10.00,4.15,7.30,10.30
Cine Planet 10.30,1.20,4.20,10.10

SVC అత్తాపూర్ 11.00,2.00,6.00,9.00
Cinépolis 10.30,1.20,4.20,7.20,10.10
Cinépolis 9.45,1.10,3.55,7.55,10.15
Cinépolis 10.20,1.20,4.10,7.50,10.00
TIVOLI సికింద్రాబాద్ 1.50,7.50,10.40
దిల్‌సుఖ్‌నగర్- 1.30,4.30,7.30,11.00
ఎ/సి - 11.00,6.00,9.15
ASIAN 10.30,1.40,4.20,7.30,10.20
ASIAN కూకట్‌పల్లి - 10.30,4.30,7.20
మూసాపేట - 11.30,2.30,6.30,9.30

SVC - ఆర్.సి.పురం 11.00,2.00,6.00,9.00
ASIAN 10.45,1.40,4.20,7.35,10.10
ASIAN RADHIKA 10.45,1.40,7.35,10.15
ASIAN SHIVA GANGA ఎ/సి - 11.15,2.00,6.00
Cinetown సినీటౌన్ - 11.00,6.00,9.15
ASIAN Shiva Bhavani చింతల్ - 2.15,9.15
ASIAN శ్రీదేవి మాల్ - హన్మకొండ
GEETHA ASIAN ఉషాప్రసాద్ - నిజామాబాద్
ఎస్2 సినిమాస్ - వరంగల్

మంజు ఎ/సి - సికింద్రాబాద్ 11.00,2.00,6.00,9.00
విశ్వనాథ్ ఎ/సి - కూకట్‌పల్లి 11.45,2.45,6.45,9.45
భ్రమరాంబ - కూకట్‌పల్లి 11.00,2.00,6.00,9.00
మెగా - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00
శ్రీరాములు - మూసాపేట్ 11.30,2.30,6.30,9.30
శ్రీసాయిరాం - మల్కాజ్‌గిరి 11.00,2.00,6.00,9.00
పద్మావతి - కాచిగూడ 11.00,2.00,6.00,9.00
SVR శివశక్తి - కాప్రా 11.00,2.00,6.00,9.00
భుజంగ - జీడిమెట్ల 11.00,2.00,6.00,9.00
గోకుల్ - ఎర్రగడ్డ 11.15,2.15,6.15,9.15
శ్రీలక్ష్మి - కర్మన్‌ఘాట్ 12.00,3.00,7.00,10.00
శ్రీలత - ఆర్.సి.పురం 11.00,2.00,6.00,9.00
శ్రీకృష్ణ - ఉప్పల్ 11.15,2.15,6.15,9.15
శ్రీలక్ష్మి కళామందిర్ - అల్వాల్ 11.30,2.30,6.30,9.30
సెన్సేషన్ సెన్సేషన్ - ఖైరతాబాద్ 11.00,2.00,6.00,9.00
శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట్ 11.15,2.15,6.15,9.15

సుష్మ - వనస్థలిపురం 11.00,2.00,6.00,9.00
గెలాక్సీ - టోలిచౌకి 11.00,2.00,6.00,9.00
సాయిరంగ - మియాపూర్ 11.00,2.00,6.00,9.00
BR హైటెక్ - మాదాపూర్ 11.00,2.00,6.00,9.00
SVసినీపార్క్ - పటాన్‌చెరు 11.00,2.00,6.00,9.00
స్వప్న కాంప్లెక్స్ ఎ/సి - కాటేదాన్ 11.15,6.00
సంతోష్ - ఇబ్రహీంపట్నం 11.00,2.00,6.00,9.00
జగదాంబ - ఘట్‌కేసర్ 11.00,2.00,6.00,9.00
గణేష్ - శంషాబాద్ 11.15,2.15,6.15,9.15
వెంకటేశ్వర - మేడ్చల్ 11.00,2.00,6.00,9.00
వైజయంతి - నాచారం 11.00,2.00,6.00,9.00
కృష్ణ సినిమా - నాగారం 11.00,2.00,6.00,9.00
శివరంజిని - ఇస్నాపూర్ 11.00,2.00,6.00,9.00
జ్యోతి - ఐడిఎ బొల్లారం 11.00,2.00,6.00,9.00
కృష్ణ సినిమా - ఆలియాబాద్ 11.00,2.00,6.00,9.00

SVC ప్రతిమ ఎ/సి - కరీంనగర్
SVC దేవి ఎ/సి - జనగాం
SVC రామకృష్ణ - షాద్‌నగర్
SVC నటరాజ్ - నల్గొండ

వరంగల్
రాధిక ఎ/సి - వరంగల్
అశోక - హన్మకొండ
సన్ సినిమా - కమలాపురం
ప్రారంభ చిత్రం
లక్ష్మీ - మహబూబాబాద్
భవాని - ఖాజీపేట్
జయశ్రీ - నర్సంపేట్
ఊర్వశి - భూపాల్‌పల్లి
జయ డీలక్స్ - పరకాల
రామకృష్ణ - తొర్రూర్
లక్ష్మి - మర్రిపెడ
శ్రీలక్ష్మి - డోర్నకల్
మహాలక్ష్మి - స్టేషన్‌ఘన్‌పూర్
తిరుమల - ములుగు
బాలాజీ - చేర్యాల
వెంకటేశ్వర - ఏటూరునాగారం
సూర్య కెఎం - నెక్కొండ
తిరుమల - పాలకుర్తి
మోహన్ - కేసముద్రం
నారాయణ - హసన్‌పర్తి
లక్ష్మీశ్రీనివాస - ములుగుఘన్‌పూర్

ఖమ్మం
వినోద - ఖమ్మం
దుర్గా - కొత్తగూడెం
ఉదయ్‌భాస్కర్ - భద్రాచలం
సాయి బాలాజీ - సత్తుపల్లి
వెంకటేశ్వర - పాల్వంచ
సీతారామా - మణుగూరు
కళాంజలి - ఇల్లందు
శాంతి - మధిర
సాయిసుమన్ - అశ్వారావుపేట
రఘు పిక్చర్‌ప్యాలెస్ - చర్ల
వాసవి - వైరా
సాయిబాలాజీ - నేలకొండపల్లి
జగదాంబ - ఇచ్చోడ
శివం ఎ/సి - సారపాక
శ్రీదుర్గ ఎ/సి - బోనకల్
జగదాంబ - వెంకటాపురం

కరీంనగర్
తిరందాజ్ - కరీంనగర్
న్యూఅశోక - గోదావరిఖని
బాలాజీ - జగిత్యాల
విమల్ - సిరిసిల్లా
శ్రీనివాస - పెద్దపల్లి
లక్ష్మి - మెట్‌పల్లి
లక్ష్మి ఎ/సి - కోరుట్ల
అన్నపూర్ణ - హుజూరాబాద్
మురళి డీలక్స్ - జమ్మికుంట
శ్రీరాజ రాజేశ్వర - వేములవాడ
మహేశ్వరి - రాయకల్
శారదా పిక్చర్ ప్యాలెస్ - కమలాపూర్
అన్నపూర్ణ - ముల్కనూర్
వెంకటేశ్వర - హుస్నాబాద్
శ్రీనివాస - చొప్పదండి
వెంకటేశ్వర - కమాన్‌పూర్

నిజామాబాద్
విజయ - నిజామాబాద్
ప్రియా - కామారెడ్డి
వెంకటేశ్వర - బోధన్
మహేశ్వరి - బాన్సువాడ
వెంకటేశ్వర - ఆర్మూర్
వెంకటేశ్వర - పిట్లం
లక్ష్మి ఎ/సి - ఎల్లారెడ్డి
వెంకటేశ్వర - దర్పల్లి
సుదర్శన్ - భీంగల్
కృష్ణ ఎ/సి - నందిపేట
మహేశ్వరి - బాన్సువాడ
పరమేశ్వర - బిచ్‌కుంద

మహబూబ్‌నగర్
తిరుమల - మహబూబ్‌నగర్
శ్రీనివాస - వనపర్తి
శ్రీనివాస - గద్వాల్
బాబా - నారాయణ్‌పేట్
శ్రీనివాస ఎ/సి - జడ్చర్ల
శ్రీసాయిరాం - అచ్చంపేట్
రవి - నాగర్‌కర్నూల్
పరమేశ్వరి - కొత్తకోట
నేషనల్ - కల్వకుర్తి
శివసాయి - ఐజా
వెంకటేశ్వర - కొల్లాపూర్
వెంకటరమణ - మక్తాల్
లక్ష్మి ఎ/సి - కోస్గి
హైటెక్ ఎ/సి - ఆత్మకూర్
రాఘవేంద్ర - దేవరకద్ర
వెంకటేశ్వర - పెబ్బేరు

నల్గొండ
వెంకటేశ్వర - మిర్యాలగూడ
2K Projectionతో ప్రారంభం
కిషోర్ - సూర్యాపేట్
వెంకటేశ్వర - కోదాడ
భద్రాద్రి - భువనగిరి
వెంకటేశ్వర - నకిరేకల్
శ్రీనివాస - హుజూర్‌నగర్
మనోజ్ - దేవరకొండ
శ్రీనివాస - చౌటుప్పల్
సుజనా - చిట్యాల
లక్ష్మి ఎ/సి - మాల్
అచ్చిరెడ్డి - హాలియా
మల్లీశ్వరి - తిరుమలగిరి
వెంకటేశ్వర - వలిగొండ
లక్ష్మి - యాదగిరిగుట్ట
వెంకటరమణ - నేరేడుచెర్ల
తారా సినిమా - మోట్కూరు

ఆదిలాబాద్
మహేశ్వరి - ఆదిలాబాద్
శ్రీనివాస - మంచిర్యాల
నారాయణ - నిర్మల్
బాలాజీ - బెల్లంపల్లి
వెంకటరమణ - కాగజ్‌నగర్
లక్ష్మి ఎ/సి - ఖానాపూర్
తిరుమల - సిసి నస్పూర్
కమల ఎ/సి - భైంసా

మెదక్
సినీమ్యాక్స్ - మెదక్
సీతారామా - సిద్దిపేట
రుక్మిణి - సంగారెడ్డి
జ్యోతి - సదాశివపేట్
మల్లేశ్వరి -జహీరాబాద్
సంతోష్ - గజ్వేల్
వెంకటేశ్వర - జోగిపేట
సాయి డీలక్స్ - నర్సాపూర్
సాయిరాం - రామాయంపేట్
సువర్ణ - నారాయణ్‌ఖేడ్
వెంకటేశ్వర - తూప్రాన్
లక్ష్మి - శంకరంపేట
పావని - వెల్దుర్తి
శ్రీనివాస - దుబ్బాక

రంగారెడ్డి
సినిమ్యాక్స్ - వికారాబాద్
చంద్ర ఎ/సి - తాండూర్
శారదా ఎ/సి - పరిగి
సాయిబాబా - శంకర్‌పల్లి
వెంకటేశ్వర - చేవెళ్ళ

రాయచూర్
పద్మనాభ - రాయచూర్
కనకదుర్గా - గంగావతి
కూడలిసంఘమేశ్వర - సింధనూర్
సవిత - దేశాయ్ క్యాంప్
అపర్ణ 70 ఎ/సి - మాన్వి
ఆనంద్ ఎ/సి - దేవదర్గ్



దేవి 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.15,5.45,9.15

వెంకటాద్రి 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
ASIAN LAXMIKALA CINEPRIDE - మూసాపేట్ 11.30,2.30
PVR - కూకట్‌పల్లి 11.00 AM
T 11.00,2.00,6.00,9.00
ASIAN - ఉప్పల్ 10.30AM
వెంకటరామ - వరంగల్
సుందర్ మ్యాక్స్ - ఖమ్మం
శివ - కరీంనగర్
తిరుమల (విఆర్‌డిఆర్)
70 ఎంఎం ఎ/సి - సూర్యాపేట
శకుంతల - కోదాడ

SBK FILM CORPORATION 9550819036 / 9866177475



ASIAN LAXMIKALA CINEPRIDE లక్ష్మీకళ సినిప్రైడ్ ఎ/సి - మూసాపేట్
MULTIPLEX BVK BVK విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
MIRAJ మీరజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
అంజలి 70 ఎంఎం ఎ/సి - సికింద్రాబాద్
మరియు మీ అభిమాన థియేటర్లలో SARTHAK MOVIES

THRILLING HIT... నేడే చూడండి



సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 1.15,2.15,6.00,9.00

ASIAN 10.40,1.45,4.30,7.40,10.30
ASIAN కూకట్‌పల్లి - 10.40,1.30,7.30
ASIAN 10.30,4.40,7.30,10.30
ASIAN RADHIKA కాప్రా - 10.35,4.35,10.30
ASIAN దిల్‌సుఖ్‌నగర్ - 2.15 PM
ASIAN చింతల్ - 11.30,6.30
PVR 11.00,4.30,11.00
PVR బంజారాహిల్స్ 11.00,7.25
PVR 11.30,5.15,11.00
PVR 1000,1.15,4.30,7.45,11.00
PRASADS ఎన్టీఆర్ గార్డెన్స్ - 8.45,11.30, 2.15,5.30,8.15,10.45
INOX 11.00,2.30,6.00,9.30
INOX 10.00,3.10,10.10,
Cinemax అమీర్‌పేట - 10.15,1.00,7.20
Cinemax శామీర్‌పేట - 11.00,4.40
Cinépolis కూకట్‌పల్లి - 10.30,6.45,9.30
Cinépolis సిసిపిఎల్ - 10.00,6.40,10.10
Cinépolis 10.30,1.20,7.30,10.45
TIVOLI - 11.00,1.40,7.40,10.20
Cine Planet 10.35,1.20,7.35,10.20
దిల్‌సుఖ్‌నగర్ - 11.45,7.00
T 11.15,2.15,9.15
Cinetown మియాపూర్ - 11.15,6.15,9.15
MULTIPLEX ఎల్.బి.నగర్ 11.00,4.30
ASIAN హన్మకొండ - 11.00,4.40,1015
GEETHA ASIAN నిజామాబాద్ - 10.30,4.30,10.30
SVC ప్రతిమ ఎ/సి - కరీంనగర్
ఎస్2 సినిమాస్ - వరంగల్

ASIAN LAXMIKALA CINEPRIDE లక్ష్మీకళ - మూసాపేట్ 11.0,2.30,6.00,9.30
మల్లిఖార్జున 70 - కూకట్‌పల్లి 11.15,2.30,6.15,9.30
రాజధాని కాంప్లెక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.00,9.00
వెంకటాద్రి 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
నర్తకి 70 ఎంఎం ఎ/సి - అల్వాల్ 11.30,2.30,6.30,9.30
ఏషియన్ స్వప్న 70 ఎంఎం ఎ/సి కాటేదాన్ 2.15 PM
రాఘవేంద్ర కాంప్లెక్స్ ఎ/సి - మల్కాజ్‌గిరి 11.15,2.15,6.15,9.15
విజేత 70 ఎంఎం ఎ/సి - బోరబండ 11.00,2.00,6.00,9.00
శ్రీరమణ కాంప్లెక్స్ ఎ/సి - అంబర్‌పేట 6.15,9.15
ఇంద్ర 70 ఎంఎం ఎ/సి - కర్మన్‌ఘాట్ 12.00,3.00,7.00,10.00
ఆరాధన 70 ఎంఎం ఎ/సి - తార్నాక 11.00,2.00,6.00,9.00
విమల్ 70 ఎంఎం ఎ/సి - బాలానగర్ 11.00,2.00,6.00,9.00
రుక్మిణి 70 ఎంఎం ఎ/సి - పటాన్‌చెరు 11.00,2.00,6.00,9.00
సప్న కాంప్లెక్స్ ఎ/సి - ఆబిడ్స్ 11.30,2.30,6.00,9.00
సూపర్ 70 ఎంఎం ఎ/సి - బాలాపూర్ 6.00,9.00
శారద 70 ఎంఎం ఎ/సి - కాప్రా 11.00,2.00,6.00,9.00
సెన్సేషన్ కాంప్లెక్స్ ఎ/సి - ఖైరతాబాద్ 11.00,2.00

దేవి 70 - వరంగల్
అమృత - హన్మకొండ
ఆదిత్య ఎ/సి - ఖమ్మం
వెంకటేశ్వర - కరీంనగర్
వెంకటాద్రి - మహబూబ్‌నగర్
దేవి - నిజామాబాద్
పివిఎన్ - నల్గొండ
లక్ష్మి ఎ/సి - మంచిర్యాల
వెంకటేశ్వర - నిర్మల్
శ్రీనివాస - జగిత్యాల
శ్రీనివాస - గోదావరిఖని
పరమేశ్వరి - కొత్తగూడెం
వేణుగోపాల్ - పాల్వంచ
శ్రీనివాస - సత్తుపల్లి
సాయిబాబా - షాద్‌నగర్
వెంకటేశ్వర - వనపర్తి
దేవి ఎ/సి - జడ్చర్ల
పార్థసారథి - కల్వకుర్తి
సత్యలక్ష్మి - అచ్చంపేట
భవాని 70 - కొత్తకోట
ఓంకార్ - భువనగిరి
రంగ ఎ/సి - కోదాడ
తేజ మ్యాక్స్ - సూర్యాపేట
లక్ష్మి 70 - తాండూర్
వెంకట్రామ - మహబూబాబాద్

ASIAN ENTERPRISES RELEASE

S & D



తొలి తవాళ్ల కోసం...



ఎ.ఆర్.రెహమాన్

"తమిళనాడు ప్రజలు నాకు ఎప్పుడూ స్పెషలే. నా సొంతవాళ్ల దగ్గర నేను ప్రదర్శన ఇవ్వబోతున్నానని అనుకుంటుంటే ఆనందంగా ఉంది" అని ప్రముఖ సంగీత దర్శకుడు ఎ.ఆర్. రెహమాన్ అన్నారు. ఆయన పరిశ్రమలో అడుగుపెట్టి పాతికేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆయన చెన్నైలో జనవరి 22న ప్రదర్శన ఇవ్వనున్నారు. రెహమాన్ మాట్లాడుతూ "నా జీవితంలో ఈ పాతికేళ్లు చాలా అందంగా గడిచాయి. మర్చిపోలేని ప్రయాణమిది. తమిళులు నాకెప్పుడూ ప్రత్యేకమే. నేను పుట్టిపెరిగిన చెన్నైలో ప్రదర్శన ఇవ్వబోతున్నానని తలచుకుంటే ఉద్వేగంగా ఉంది" అని తెలిపారు.

ప్రయోగాలకు రెడీ

- కృతి సనన్

కృతి సనన్.. గుర్తున్నారుగా! తెలుగులో మహేశ్ సరసన '1 నేనొక్కడినే'లో నటించారు. చిత్ర పరిశ్రమలో తన ప్రస్థానాన్ని, తనకు ఎదురైన విషయాలను ఇటీవల చెప్పుకొచ్చారు కృతి. ఆమె మాట్లాడుతూ "ముంబైలో అడుగుపెట్టినప్పుడు నాకు ఆ నగరంలో ఒక్కరంటే ఒక్కరు కూడా తెలియదు. అసలు చదువుకునే రోజుల్లో సిల్వర్‌స్క్రీన్ గురించి ఏ రోజూ కలగనలేదు. అలాంటిది ఇవాళ ఈ రంగంలో నాకంటూ ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఎవరూ లేకపోయినా, ఒంటరి మహిళగా నేను స్థిరపడగలిగాను. మనో నిబ్బరంతో ముందడుగు వేశాను. నా తప్పుల నుంచి నేర్చుకుంటూ వచ్చాను. ప్రతి రోజూ, ప్రతి షూటింగ్, ప్రతి షాటూ ఓ పెద్దబాలశిక్షే. సినిమా హిట్లూ, ఫ్లాప్‌లతో సంబంధం లేకుండా ఎన్నో విషయాలను అవగతం చేసుకున్నాను. సానుకూల దృక్పథంతో ముందడుగు వేస్తే, ఓటమి నుంచి కూడా చాలా నేర్చుకోవచ్చని అర్థమైంది. కాలం గడిచేకొద్దీ నాలోనూ చాలా మార్పులొచ్చాయి. వ్యక్తిగానూ, నటిగానూ ఎంతో ఎదిగాను. ఎవరైనా ప్రశంసించిన ప్రతిసారీ ఆత్మవిశ్వాసం రెట్టింపు కావడాన్ని గమనించాను. అందుకే ఇంతకు ముందు ఎవరూ చేయని విషయాలను చేయాలని అనుకుంటున్నాను. నటిగా పలు ప్రయోగాలు చేయాలని ఉంది" అని అన్నారు.

ఆద్యంతం శ్వేతవర్ణం!



రామ్‌చరణ్, సానియామీర్జా, ఉపాసన

శ్వేత వర్ణంలో ఏమేం ఉంటాయి? చక్కెర, ఉప్పు, దూది, మంచు ముద్దలు.. ఇంకా... ఇంకా.. ఇంకేం ఉంటాయో రామ్‌చరణ్ దంపతులు, సానియా మీర్జా చెప్పాలి. ఎందుకంటే ఓ తెల్లటి పదార్థాన్ని గాల్లోకి విసిరి, మరలా పట్టుకుంటూ.. ఆడుకుంటూ వాళ్లు ఓ వీడియోలో కనిపించారు కనుక. ఈ వీడియోలో రామ్‌చరణ్ సతీమణి ఉపాసన, సానియా మీర్జా.. ఇద్దరూ తమ చేతుల్లో ఉన్న తెలుపు పదార్థాన్ని వెదజల్లుతూ, పట్టుకుంటూ ఆడుకుంటుండగా, చరణ్ మాత్రం దోసిలిలో ఉంచుకుని వారిని చూస్తూ నిలుచున్నారు. ఉపాసన ఈ వీడియో పోస్ట్ చేసి 'వైట్ క్రిస్మస్.. వైట్ న్యూఇయర్' అని రాశారు. రామ్‌చరణ్ అనే హ్యాష్‌ట్యాగ్ కూడా జతచేశారు. ఈ ముగ్గురు కలవడం ఇదే ప్రథమమని అనుకుంటే పొరపాటు. ఇంతకుముందు కూడా పలుమార్లు వీళ్లు కలిసిన ఫొటోలు ఇంటర్నెట్‌లో చాలానే ఉన్నాయి.